www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

18,495 పదోన్నతులు.. 12,472 బదిలీలు!



విద్యాశాఖలో నేటి నుంచి

23 రోజుల పాటు నిర్వహణ

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

పారదర్శకంగా చేపట్టాలి

సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): గత తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ నేటి నుంచి చేపట్టనున్నారు. నిరుడు సెప్టెంబరు-3న వీటిని చేపట్టాలని గత ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినప్పటికీ.. పలు అంశాలపై అభ్యంతరాలు వ్యక్తం కావడం, విషయం కోర్టుకు వెళ్లడంతో వాయిదాపడింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగియడంతో దీనిని వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర

మిగతా 13వ పేజీలో...

శనివారం | 8-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 70

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: విదియ మ. 3.56 తదుపరి తదియ; నక్షత్రం: ఆర్ద్ర రా. 7.42 తదుపరి పునర్వసు; వర్జ్యం: లేదు; దుర్ముహూర్తం: ఉ.5.43-7.27; అమృతఘడియలు: ఉ.9.42-11.18; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 5.43; సూర్యాస్తమయం: 6.44

వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



ఢిల్లీలో సీఎం రేవంత్‌ను కలిసిన ఎంపీలు బలరాంనాయక్, మల్లురవి

టీపీసీసీ కొత్త చీఫ్ ఎవరో..?

- పార్టీ అధ్యక్ష పదవి బరిలో ముఖ్య నేతలు
- కీలకంగా మారనున్న సామాజిక సమీకరణాలు
- బీసీలకు పదవి కేటాయించే అవకాశం
- రేసులో పొన్నం, మధుయాష్కీ సురేష్ షెట్కార్
- పరిశీలనలో సీతక్క, బలరాంనాయక్ పేర్లు
- 'మాదిగ' కోటాలో సంపత్‌కుమార్ యత్నాలు
- పీసీసీ చీఫ్‌పై నిర్ణయం తర్వాతే మంత్రివర్గ విస్తరణ

హైదరాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి కొత్త సారథి నియామకానికి కసరత్తు జరుగుతోంది. లోక్‌సభ ఎన్నికలు ముగియడం, ప్రస్తుతం టీపీసీసీ అధ్యక్షునిగా ఉన్న రేవంత్ రెడ్డి పదవీ కాలం కొద్దిరోజుల్లో ముగియనుండడంతో టీపీసీసీ నూతన చీఫ్ నియామకంపై పార్టీ అధిష్ఠానం దృష్టి పెట్టింది. ఈ నెల చివరి వారంలోగా కొత్త సారథిని నియమించాలని భావిస్తోంది. సీడబ్ల్యూసీ సమావేశాల కోసం శుక్రవారం ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి కొత్త చీఫ్ నియామకంపై అధిష్ఠానంతో చర్చించే అవకాశం ఉందని ఆ పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. అయితే, అధ్యక్ష పదవి రేసులో చాలా మంది నేతలు ఉండగా సామాజిక వర్గ సమీకరణాలు కీలకం కానున్నాయి. అధ్యక్ష పదవిని బీసీ సామాజిక వర్గానికి కేటాయించడం అధిష్ఠానం ఆలోచనగా తెలుస్తోంది. రాష్ట్రంలో ప్రత్యామ్నాయ రాజకీయశక్తిగా ఎదిగేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీ బీసీ కార్డును వాడుతుండటమే

మిగతా 13వ పేజీలో...

ఇక సమష్టి నిర్ణయాలు

ఎన్డీయే స్ఫూర్తికి అనుగుణంగా పనిచేస్తా.. జీవన నాణ్యతపైన దృష్టి సారిస్తాం

సామాన్యుల జీవితాల్లో ప్రభుత్వ జోక్యం తగ్గిస్తాం

ఎన్డీయే ఎంపీలకు 24/7 అందుబాటులో ఉంటా

ఏపీ విజయం అభివృద్ధి ఆకాంక్షల ప్రతిబింబం

చంద్రబాబుకు పేదల సంక్షేమమే ముఖ్యం

పవన్ కేవలం పవన్ కాదు ఒక తుఫాను

కాంగ్రెస్ వచ్చే పదేళ్లలో కూడా వంద దాటదు

తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు విఫలమైంది

అందుకే మాకు రెట్టింపు సీట్లు: ప్రధాని మోదీ

ఎన్డీయే పక్ష నేతగా మోదీ ఏకగ్రీవ ఎన్నిక

చంద్రబాబు, నితీశ్, పవన్, తదితరుల మద్దతు



ఎన్డీయే నేతల సమావేశంలో నరేంద్ర మోదీకి జ్ఞాపిక బహూకరిస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్

న్యూఢిల్లీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పాలనకు సంబంధించి ఇక అన్ని నిర్ణయాలూ ఏకాభిప్రాయంతోనే తీసుకునేందుకు కృషి చేస్తానని ప్రధాని నరేంద్రమోదీ ప్రకటించారు. అన్నింటికన్నా దేశం ముఖ్యం అన్న సూత్రానికి కట్టుబడి ఎన్‌డీఏ కూటమి పని చేస్తుందని చెప్పారు. శుక్రవారం ఉదయం పాత పార్లమెంట్ భవనంలోని సెంట్రల్ హాలులో ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ నేతగా ఏకగ్రీవంగా ఎన్నికైన తర్వాత కూటమి ఎంపీలను ఉద్దేశించి ప్రసంగించారు. తాను ఎన్‌డీఏ స్ఫూర్తికి అనుగుణంగా పని చేస్తానని ప్రకటించారు. వాజ్‌పేయి, ప్రకాశ్ సింగ్ బాదల్, జార్జి ఫెర్నాండెజ్, శరద్ యాదవ్, బాల్ ఠాక్రేలు వేసిన కూటమి బీజాలు ఇవాళ బలమైన వృక్షంగా మారాయని, ప్రజలు దానికి దోహదం చేశారని ఆయన చెప్పారు. ఆ మహానుభావుల వారసత్వం తనకు లభించినందుకు గర్వంగా ఉందన్నారు. తన పక్కన ఉన్న ఎన్డీయే నేతలందరిలోనూ ఒక సమాన లక్షణం కనపడుతోందని, అదే సుపరిపాలన అని మోదీ చెప్పారు. తాను గుజరాత్‌లో ఉన్నా, చంద్రబాబు ఏపీలో ఉన్నా తమందరి పాలనలో కేంద్ర బిందువు పేదల సంక్షేమమే

2

మిగతా 2వ పేజీలో...

రేపు మోదీ ప్రమాణం

రాత్రి 7.15 గంటలకు..

రాష్ట్రపతిని కలిసిన ఎన్డీయే నేతలు

మోదీని పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నుకున్నట్టు రాష్ట్రపతికి లేఖ

టీడీపీకి 2 కేబినెట్, 2 సహాయ మంత్రి పదవులు?

జనసేనకు 'స్వతంత్ర హోదా' పదవి?

సరైన టైంలో సరైన నేత!

2

మోదీపై చంద్రబాబు ప్రశంసల జల్లు

ఎన్నికల్లో రాత్రింబవళ్లు కష్టపడ్డారు

మోదీకి సంపూర్ణ మద్దతు: బాబు

మోదీ జాతికి స్ఫూర్తి

ఆయన సారథ్యం ఉన్నంతవరకు దేశం ఎవరికీ తలవంచదు: పవన్

నెహ్రూ సరసన మోదీ!

వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా ఎన్నిక!


కాంగ్రెసేతర పక్షాల నుంచి తొలి వ్యక్తిగా ఘనత

తెలంగాణకు 2 కేంద్ర మంత్రి పదవులు?

పరిశీలనలో బండి, ఈటల, కిషన్‌రెడ్డి, డీకే

2

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేతగా రాహుల్?.. నేడు సీడబ్ల్యూసీ భేటీలో నిర్ణయం



రామోజీరావుకు వెంటిలేటర్‌పై చికిత్స

బీపీ పెరిగి తీవ్ర అస్వస్థతకు గురైన ఈనాడు సంస్థల చీఫ్

నానక్‌రాంగూడ స్టార్ ఆస్పత్రిలో చికిత్స 14

గుండెకు స్టెంట్

ఇతర సమస్యలు తలెత్తడంతో వెంటిలేటర్ మీద ఉంచాలని నిర్ణయం

కొలిక్కి వచ్చిన స్థానికత!

13

ఒకటి, రెండు రోజుల్లో జీవో

ఎంబీబీఎస్ అడ్మిషన్లపై వైద్యశాఖ కసరత్తు

విభజన చట్టంలోని పదేళ్ల గడువు ముగియడంతో 15% అన్‌రిజర్వ్‌డ్ కోటాకు కత్తెర

280 వైద్య విద్య సీట్లు.. తెలంగాణ విద్యార్థులకే

సాగునీరు, జల వనరుల ప్రభుత్వ సలహాదారుగా

ఆదిత్యనాథ్ దాస్

గతంలో ఏపీ సీఎస్‌గా 13

పనిచేసి పదవీ విరమణ

నీట్‌పై నీలినీడలు

పరీక్ష నిర్వహణ, ఫలితాలపై తీవ్ర ఆరోపణలు



ప్రశ్నాపత్రం లీకేజీ, మార్కుల్లో అవకతవకలు

ఎన్నడూ లేని విధంగా 67 మందికి ఫస్ట్ ర్యాంక్

వారిలో 8 మందిది ఒకే పరీక్షా కేంద్రం

కొందరు విద్యార్థులకు అదనపు మార్కులు

పది రోజుల ముందే ఎన్నికల ఫలితాల నాడు రిజల్ట్

పరీక్ష మళ్లీ నిర్వహించాలంటున్న తల్లిదండ్రులు

సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరిపించాలి: ఖర్గే

నీట్ రద్దుకు అందరం కలిసి ఉద్యమిద్దాం: స్టాలిన్

ఎన్‌టీఏకి ఢిల్లీ హైకోర్టు నోటీసులు

(సెంట్రల్ డెస్క్)

24 లక్షల మంది విద్యార్థుల భవితవ్యంతో ముడివడిన నీట్-2024 పరీక్ష నిర్వహణ, వెల్లడైన ఫలితాలు తీవ్ర వివాదం సృష్టిస్తున్నాయి. అనేక మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పరీక్షను మళ్లీ జరపాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై న్యాయస్థానాలను కూడా ఆశ్రయిస్తున్నారు. నీట్‌ఫ్రాడ్, నీట్‌పేపర్‌లీక్, నీట్‌స్కామ్, నీట్‌రీకండక్ట్ వంటి హ్యాష్‌ట్యాగ్‌లు సోషల్ మీడియాలో హోరెత్తుతున్నాయి. ప్రశ్నాపత్రాల లీకేజీలతో విద్యార్థుల జీవితాలతో మోదీ సర్కార్ ఆడుకుంటోందని విపక్ష కాంగ్రెస్ పార్టీ ఆరోపిస్తుంది. మే 5న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నీట్ యూజీ-2024 పరీక్షను నిర్వహించింది. 24 లక్షల మందికిపైగా విద్యార్థులు పరీక్ష రాశారు. అయితే, పరీక్ష నిర్వహణకు కేవలం రెండు రోజుల ముందే ఓ స్కామ్ బయటపడింది. పరశురామ్‌రాయ్ అనే ఓ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ యజమాని, తుషార్‌భట్ అనే ఓ టీచర్ కలిసి గుజరాత్‌కు చెందిన 16 మంది విద్యార్థులను నీట్‌లో అక్రమంగా పాస్ చేయించటానికి ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షలు వసూలు చేశారని ఆరోపణలు వచ్చాయి. ఇక పరీక్ష జరిగిన రోజున

మిగతా 12వ పేజీలో...



ఏపీ సీఐడీ నుంచి సంజయ్ అవుట్

విజిలెన్స్ నుంచి కొల్లి రఘురామిరెడ్డి తొలగింపు.. కొత్త సీఎస్ నీరబ్‌కుమార్ ఉత్తర్వులు

ఫైబర్‌నెట్ ఎండీ మధుసూదన్, మైన్స్ డైరెక్టర్ వెంకటరెడ్డికీ ఉద్వాసన.. జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశం

'కిక్కు' దించుతున్నారు!

ఏపీ బేవరేజెస్ మాజీ ఎండీపై కేసు

ఫైళ్లు 'ఎత్తుకెళుతూ' దొరికిన వాసుదేవరెడ్డి

సామాన్యుడి ఫిర్యాదుతో సీఐడీ కేసు 12

హైదరాబాద్‌లోని నివాసంలో సోదాలు

కీలక సమాచారం లభ్యం

అమరావతి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఏపీలో అడ్డగోలుగా వైసీపీ చట్టాలను అమలుచేసి, అక్రమ అరెస్టులతో రెచ్చిపోయిన పోలీసు అధికారులపై వేటు పడింది. కొత్త ప్రభుత్వం ఏర్పడకముందే ప్రక్షాళనకు శ్రీకారం చుట్టిన కొత్త సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్.. శుక్రవారం పలువురు ఐపీఎస్, ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీచేశారు. టీడీపీ అధినేత చంద్రబాబును టార్గెట్ చేసి స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టుచేసి.. హైదరాబాద్, ఢిల్లీల్లో విలేకరుల సమావేశాలు పెట్టి మరీ ఆయనపై దుష్ప్రచారం సాగించిన సీఐడీ ఏడీజీ ఎన్.సంజయ్‌ను సాగనంపారు. ఇప్పటికే సెలవు కోసం ఆయన పెట్టుకున్న వినతిని రద్దు చేశారు. తాజాగా సీఐడీ నుంచీ తప్పించారు. డీజీపీ కార్యాలయంలో

మిగతా 12వ పేజీలో...

కేసరపల్లిలో ప్రమాణం!

గన్నవరం మైదానంపై నేతల మొగ్గు

12న ఉదయం 11.27 గంటలకు చంద్రబాబు ప్రమాణ స్వీకారం

ఏపీ సీఎస్‌గా నీరబ్ కుమార్ 12

ఏపీ సీఎంవోలో ప్రక్షాళన

పూనం, రేవు, భరత్ గుప్తాలకు బదిలీ

జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశం

27 వరకు జవహర్ సెలవుకు ఓకే

తప్పుకోవాలని నామినేటెడ్ పదవుల్లోని వారికీ సంకేతాలు



అన్నారం సరస్వతీ బ్యారేజీ వద్ద పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

28లోగా పనులు పూర్తవ్వాలి!

మరమ్మతులు ఆలస్యమైతే కఠిన చర్యలు

రేయింబవళ్లు పనులు చేయండి

బ్యారేజీల పరిశీలనలో అధికారులను ఆదేశించిన మంత్రి ఉత్తమ్ 3

నివేదికలు అందాక బాధ్యులపై చర్యలు!

తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీని నిర్మిస్తాం

లక్ష్మి పంప్‌హౌస్‌లో 11 మోటార్లకు మరమ్మతులు చేయిస్తామని వెల్లడి

వరి సాగులో దేశంలోనే అగ్రగామిగా తెలంగాణ

ఇక్కడి ధాన్యానికి ఇతర దేశాల్లో మంచి డిమాండ్

14 సన్నాలు సాగుచేసే రైతులకు రూ.500 బోనస్

గ్లోబల్ రైస్ సమ్మిట్‌లో వ్యవసాయ మంత్రి తుమ్మల

సీఎంఆర్ఎఫ్.. ప్రక్షాళన!

ప్రజాప్రతినిధులందరికీ లాగిన్ ఐడీలు

కమీషన్లు అడిగిన వారిపై క్రిమినల్ చర్యలు

అన్నీ ఆన్‌లైన్‌లోనే.. అంతటా పారదర్శకత

సీఎంఆర్ఎఫ్, ఎల్‌వోసీ.. ఆరోగ్యశ్రీకి అటాచ్

ప్రత్యేకంగా దృష్టి సారించిన సీఎం రేవంత్

అర్హులైన పేదలకే సాయం అందేలా చర్యలు

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద లబ్ధిదారులకు అందించే ప్రతి రూపాయికి ఇక నుంచి పక్కాగా లెక్క ఉండనుంది. చెక్కు తీసుకున్న లబ్ధిదారు ఎక్కడి వారు? ఏ జిల్లా? ఆరోగ్య సమస్య ఏంటి? ఆస్పత్రి బిల్లు ఎంతైంది? వంటి వివరాలన్నీ స్పష్టంగా ఆన్‌లైన్‌లోనే తెలియనున్నాయి. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్ విభాగాన్ని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ మేరకు సీఎంఆర్ఎఫ్ వ్యవస్థను కంప్యూటరీకరించే ప్రక్రియ పట్టాలెక్కి.. వేగంగా కొనసాగుతోంది. సీఎంఆర్ఎఫ్ బిల్లులను ఆన్‌లైన్ చేసేందుకు ఇప్పటిదాకా

మిగతా 13వ పేజీలో...



కౌంటింగ్ హాల్ బయట విజయ సంకేతం చూపుతున్న కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న

పట్టభద్రుల ఎమ్మెల్సీగా మల్లన్న

కాంగ్రెస్ అభ్యర్థిని వరించిన విజయం

నల్లగొండ-ఖమ్మం-వరంగల్ నియోజకవర్గ ఉప ఎన్నిక ఓట్ల లెక్కింపులో వీడిన ఉత్కంఠ

ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు తర్వాత కూడా మల్లన్నకే ఆధిక్యం

సీఈవో అనుమతితో విజేతగా ప్రకటించిన ఆర్వో.. సిటింగ్ సీటును కోల్పోయిన బీఆర్ఎస్

నల్లగొండ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఎమ్మెల్సీ పట్టభద్రుల స్థానానికి జరిగిన ఉప ఎన్నికలోనూ బీఆర్ఎస్‌కు భంగపాటు తప్పలేదు. సిటింగ్ ఎమ్మెల్సీ స్థానాన్ని సైతం ఆ పార్టీ నిలబెట్టుకోలేకపోయింది. శాసనమండలి నల్లగొండ- ఖమ్మం- వరంగల్ పట్టభద్రుల నియోజకవర్గ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ కుమార్ విజయం సాధించారు. ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు అనంతరం కూడా ప్రధాన ప్రత్యర్థి బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేశ్‌రెడ్డి కంటే భారీ ఆధిక్యంలో ఉండడంతో మల్లన్నను విజేతగా ప్రకటించారు. స్వతంత్ర అభ్యర్థులతోపాటు బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్ రెడ్డి ఎలిమినేషన్ తర్వాత కూడా మల్లన్న దాదాపు 18 వేల ఓట్ల ఆధిక్యంలో ఉన్నారు. కానీ, కోటా ఓటు లభించకపోవడంతో ఈసీ ఉన్నతాధికారుల అనుమతి తీసుకున్న తర్వాత ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరిచందన.. మల్లన్నను విజేతగా

మిగతా 14వ పేజీలో...



నెహ్రూ సరసన మోదీ!

» వరుసగా మూడోసారి ప్రధానమంత్రిగా ఎన్నిక!

» కాంగ్రెసేతర పక్షాల నుంచి తొలి వ్యక్తిగా ఘనత

న్యూఢిల్లీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వరుసగా మూడుసార్లు ప్రధానిగా పనిచేసిన నెహ్రూ రికార్డును మోదీ సమం చేశారు. కాంగ్రెసేతర పక్షాల నుంచి ప్రధానిగా వరుసగా మూడోసారి బాధ్యతలు చేపట్టనున్న తొలి వ్యక్తి మోదీనే. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత 1952లో తొలిసారి లోక్‌సభ ఎన్నికలు జరిగాయి. ఫలితాల తర్వాత నెహ్రూ ప్రధానిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 1957, 62 సార్వత్రిక ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌ను ఆయన విజయపథాన నడిపించి ప్రధాని అయ్యారు. నెహ్రూ కుమార్తె ఇందిరకు కూడా ఈ రికార్డు సాధ్యం కాలేదు. ఇందిర నాలుగు పర్యాయాలు ప్రధానిగా పనిచేసినా వరుసగా సార్వత్రిక ఎన్నికలలో గెలవలేదు. దేశంలో కాంగ్రెసేతర పక్షాలు బలంగా లేకపోవడంతో నెహ్రూ రికార్డును ఎవరూ అందుకోలేకపోయారు. బీజేపీ వరుసగా 2014, 2019, 2024 సార్వత్రిక ఎన్నికల్లో గెలవడం.. మూడోసారి కూడా మోదీనే ప్రధాని బాధ్యతలు చేపట్టనుండటంతో నెహ్రూ సరసన నిలవనున్నారు. అయితే 1952లో సార్వత్రిక ఎన్నికలు జరిగినప్పటి నుంచి ఇప్పటిదాకా అత్యధిక కాలం ప్రధానిగా చేసిన రికార్డు మాత్రం ఇందిరా గాంధీ పేరిటే ఉంది. ఆమె 15 ఏళ్ల 350 రోజులు ప్రధాని పదవిలో ఉన్నారు. ఇందిర రికార్డును మోదీ సాధించాలంటే ఈ పదవీ కాలం పూర్తిచేసుకొని, మరోసారి బాధ్యతలు చేపట్టాల్సి ఉంటుంది. గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో ఎలాంటి రాజకీయ నేపథ్యం లేని మధ్యతరగతి కుటుంబంలో 1950లో మోదీ జన్మించారు. హీరాబెన్, దామోదర్ దాస్ మోదీ దంపతులకు ఆయన మూడో సంతానం. విద్యార్థి దశలోనే ఆర్‌ఎస్‌ఎస్‌లో చేరి స్వయంసేవక్‌గా పనిచేశారు. ఆ సమయంలోనే రాజకీయాల పట్ల ఆకర్షితులయ్యారు. అతికొద్దికాలంలోనే బీజేపీ అగ్రనాయకత్వం దృష్టిని ఆకర్షించారు. మోదీని ఎల్‌కే ఆడ్వాణీ ప్రోత్సహించారు. 1990లో ఆడ్వాణీ రథయాత్రలో మోదీ పాల్గొన్నారు. 1992లో మురళీ మనోహర్ జోషి చేపట్టిన కన్యాకుమారి-కశ్మీర్ ఏక్తా యాత్రకు మోదీ జాతీయ ఇన్‌చార్జిగా పనిచేశారు. 2001లో గుజరాత్ సీఎం అయ్యారు. గోద్రా అల్లర్ల సమయంలో మోదీ తీరుపై తీవ్రవిమర్శలొచ్చాయి. సీఎం పదవికి రాజీనామా చేయాలనే డిమాండ్లు ఎన్డీయే మిత్రపక్షాల నుంచి సైతం వచ్చాయి. అయినప్పటికీ 2014 మేలో భారత ప్రధానిగా బాధ్యతలు చేపట్టే వరకు గుజరాత్ సీఎంగా పనిచేశారు. తన హయాంలో వరుసగా మూడుసార్లు అసెంబ్లీ ఎన్నికలలో పార్టీని మోదీ గెలిపించారు.

నెహ్రూతో మోదీకి పోలికా?!: చిదంబరం

చెన్నై, జూన్ 7: నెహ్రూ మాదిరిగా తాను కూడా మూడోసారి వరుసగా ప్రధాన మంత్రి పీఠంలో కూర్చుంటున్నానన్న మోదీ వాదనను కాంగ్రెస్ ఖండించింది. నెహ్రూకు మోదీతో పోలిక ఏంటని ఆ పార్టీ సీనియర్ నేత చిదంబరం వ్యాఖ్యానించారు. "బీజేపీకి 2014లో 282 సీట్లు, 2019లో 303 సీట్లు వచ్చాయి. ఈసారి ఆ పార్టీ 240 సీట్లకే పరిమితమైంది. కానీ, నెహ్రూ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీకి ఇలా ఎప్పుడూ జరగలేదన్నారు. తొలుత 361, తర్వాత 374, మూడో సారి వరుసగా 364 సీట్లు వచ్చాయి. మూడుసార్లు సొంతబలంతో ఆయన ప్రధాని అయ్యారు" అని చిదంబరం వివరించారు. ఇదిలా ఉండగా, ఈవీఎంలను కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ తిరస్కరించలేదని చిదంబరం అన్నారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్‌లను మరింత మెరుగు పరచాలని మాత్రమే కోరినట్టు తెలిపారు.

ఇక సమష్టి నిర్ణయాలు

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. ఎన్‌డీఏ కూటమి భారతదేశ స్ఫూర్తిని ప్రతిబింబిస్తుందని ప్రధాని మోదీ అన్నారు. రాజ్యాంగ విలువలను కాపాడేందుకు అంకిత భావంతో పని చేస్తామని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. విపక్ష నేతలు చెబుతున్నట్లుగా తమనెవరూ ఓడించలేదని మోదీ అన్నారు. అదే సమయంలో ఓడిపోయిన వారిని అపహాస్యం చేయబోమని చెప్పారు. తాజా ఎన్నికల తీర్పు దేశం ఎన్‌డీఏ కూటమినే విశ్వసిస్తోందనే విషయాన్ని స్పష్టం చేసిందని మోదీ వ్యాఖ్యానించారు. గత పదేళ్ల పాలన ట్రెయిలర్ మాత్రమేనని తాను గతంలో చేసిన వ్యాఖ్యలు కేవలం ఎన్నికల ప్రసంగం కాదని, తన నిశ్చితాభిప్రాయమని మోదీ చెపారు. పార్లమెంటులోని అన్ని పార్టీలు తమకు సమానమేనన్నారు. తన ప్రసంగంలో మోదీ ప్రతిపక్షాలపై సహజ శైలిలో చెణుకులు విసిరారు. ఇండియా కూటమి 2024 ఎన్నికలకే పరిమితమని భాగస్వామ్య పార్టీలు చెప్పడంలోనే వాటి అధికార దాహం స్పష్టమవుతోందని విమర్శించారు. ఎన్నికలు జరుగుతుండగానే విపక్షం ఈవీఎంలపై దుష్ప్రచారం కొనసాగించిందని, సుప్రీంకోర్టు దాకా వెళ్లారని, ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత వారి నోళ్లు మూత పడ్డాయని మోదీ అన్నారు. ఈవీఎంలను ప్రశ్నించే ప్రతిపక్షాలు ఈ శతాబ్దానికి చెందిన వారు కాదని తనకు అనిపిస్తోందని వ్యాఖ్యానించారు. ఫలానా వారికి మంత్రిపదవులు వస్తున్నాయని మీడియాలో వచ్చే తప్పుడు వార్తలను ఎంపీలు పట్టించుకోవద్దని మోదీ పిలుపునిచ్చారు. ఇవన్నీ తప్పుడు వార్తల్లో ఆరితేరిన ఇండీ కూటమి సృష్టేనని చెప్పారు. పది సంవత్సరాలు ప్రతిపక్షంలో ఉన్న తర్వాత కూడా దేశంలో అతి పురాతన పార్టీ అయిన కాంగ్రెస్ వంద సీట్లు కూడా సాధించలేకపోయిందని మోదీ వ్యాఖ్యానించారు. వచ్చే పదేళ్లలో కూడా ఆ పార్టీ సీట్ల సంఖ్య వంద దాటబోదన్నారు. గత మూడు ఎన్నికల్లో కలిపి వారికి వచ్చిన సీట్ల కన్నా ఎక్కువ సీట్లు ఈ ఎన్నికల్లో తమకు లభించాయని గుర్తు చేశారు. ఈ సారైనా ప్రతిపక్షాలు దేశ నిర్మాణానికి దోహదం చేస్తాయని, పార్లమెంట్ చర్చల్లో పాల్గొంటాయని మోదీ ఆశాభావం వ్యక్తం చేశారు.

అందరికీ అందుబాటులో ఉంటా

రానున్న పదేళ్లలో సుపరిపాలన, అభివృద్ధి, జీవన నాణ్యతపై దృష్టి కేంద్రీకరిస్తుందని, సామాన్య ప్రజల జీవితాల్లో కనీస జోక్యం ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు. తాను పూర్తిగా దేశానికి కట్టుబడి ఉంటానని, 24 గంటలూ ఎన్‌డీఏ ఎంపీలకు అందరికీ అందుబాటులో ఉంటానని అన్నారు. దేశం కోసం కలిసికట్టుగా పని చేద్దామని చెప్పారు. పోటీ స్ఫూర్తితో కూడిన సహకార సమాఖ్య విధానాన్ని ఎన్డీఏ ప్రభుత్వం విశ్వసిస్తుందని తెలిపారు. పేదలు, మధ్య తరగతికి సాధికారికత కల్పించడం తమ ప్రాధాన్యత అని మోదీ ప్రకటించారు. ఎన్‌డీఏ అంటే "న్యూ, డెవలప్‌డ్, యాస్పిరేషనల్" ఇండియా అన్నారు.



ఎన్డీయే పార్లమెంటరీ పార్టీ సమావేశంలో మోదీకి పాదాభివందనం చేయడానికి నితీశ్ ప్రయత్నం

మోదీ పేరును ప్రతిపాదించిన రాజ్‌నాథ్

సీనియర్ బీజేపీ నేత రాజ్‌నాథ్ సింగ్ ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ నేతగా మోదీ పేరును ప్రతిపాదించారు. అమిత్ షా, నితిన్ గడ్కరీ బలపరిచారు. ఆనంతరం ఇతర ఎన్‌డీఏ నేతలు కుమారస్వామి, చంద్రబాబు, నితీశ్, ఏక్‌నాథ్ షిండే, చిరాగ్ పశ్వాన్, జతిన్‌రాం మాంఝీ, పవన్ కల్యాణ్‌లు మోదీని ప్రశంసిస్తూ ఆయన నాయకత్వాన్ని సమర్థించారు. కాగా, లోక్‌సభ ఎన్నికల్లో మహారాష్ట్రలో బీజేపీకి వచ్చిన దారుణ ఫలితాలకు తానే బాధ్యత వహిస్తూ డిప్యూటీ సీఎం పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించిన ఫడ్నవీస్‌ను అమిత్ షా వారించినట్లు సమాచారం.

ఆడ్వాణీ, జోషిని కలిసిన మోదీ

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో నరేంద్ర మోదీ శుక్రవారం భేటీ అయ్యారు. రామ్‌నాథ్ నివాసానికి వెళ్లి ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు. కోవిండ్ కుటుంబసభ్యులతో మోదీ కొద్దిసేపు ముచ్చటించారు. అంతకుముందు ఎన్డీయే పక్షనేతగా ఎన్నికైన అనంతరం నేరుగా బీజేపీ కురువృద్ధుడు ఆడ్వాణీ ఇంటికి వెళ్లి ఆశీస్సులు తీసుకున్నారు. ఆ తర్వాత సీనియర్ నేత మురళీ మనోహర్ జోషిని కలిశారు.



18వ లోక్‌సభ తొలి సమావేశం 15న!

న్యూఢిల్లీ, జూన్ 7: 18వ లోక్‌సభ తొలి సమావేశాలు జూన్ 15 నుంచి 22వ తేదీ వరకు జరిగే అవకాశం ఉందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. కొత్తగా ఎన్నికైన పార్లమెంట్ సభ్యుల ప్రమాణ స్వీకారాలతో ఈ నెల మూడో వారంలో సమావేశాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నాయి. ప్రమాణ స్వీకారాలు రెండ్రోజుల పాటు జరిగే అవకాశం ఉందని, అనంతరం స్పీకర్ ఎన్నిక ఉంటుందని తెలిపాయి. ఆ తర్వాతి రోజు రాష్ట్రపతి ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారని చెప్పాయి. సమావేశాలు జరుగుతుండగానే తొలి సెషన్ ముగింపుపై కొత్తగా ఎంపికైన మంత్రివర్గం నిర్ణయం తీసుకుంటుందని వెల్లడించాయి. ఈ సమావేశాల్లో భాగంగా ప్రధాని మంత్రి తన కేబినెట్‌ను ఉభయసభలకు పరిచయం చేస్తారని తెలిపాయి.

పవన్ తుఫాను

దక్షిణ భారతదేశంలో తమ కూటమి కొత్త చరిత్రను సృష్టించిందని మోదీ వ్యాఖ్యానించారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలోనే అతి పెద్ద విజయం లభించిందని చంద్రబాబుతో అన్నానన్నారు. జనసేన అధినేత పవన్ పవనం కాదని, తుఫాను అని మోదీ ప్రశంసించారు. ఆంధ్రప్రదేశ్‌లో లభించిన భారీ విజయం అభివృద్ధి పట్ల సామాన్య మానవుడి ఆకాంక్షలకు ప్రతిబింబం అని వ్యాఖ్యానించారు. తెలంగాణలో ఇటీవలే ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం అనతికాలంలోనే ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందని మోదీ అన్నారు. అందుకే ఎన్‌డీఏ సీట్లు రెట్టింపు అయ్యాయని వ్యాఖ్యానించారు. కర్ణాటకలోనూ అదే పరిస్థితి ఉందన్నారు. తమిళనాడులో సీట్లు రాకపోయినా ఓట్ల శాతం బాగా పెరిగిందని చెప్పారు. కేరళలో తరతరాలుగా వేల మంది కార్యకర్తలు బలిదానం చేశారని, ఇవాళ పార్లమెంట్‌లో తమ ప్రతినిధి ప్రవేశించారని ఆయన అన్నారు. సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్, పుదుచ్చేరి, ఒడిసా విజయాలనూ ఆయన ప్రస్తావించారు. ఒడిసాలో జగన్నాథుడు పేదల దేవుడని, రాష్ట్రం రానున్న రోజుల్లో అభివృద్ధికి చోదక శక్తిగా మారుతుందని చెప్పారు.

లోకం తీరు



రేపు మోదీ ప్రమాణం

» రాత్రి 7-15 గంటలకు ముహూర్తం

న్యూఢిల్లీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మూడోసారి ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకార ముహూర్తం ఖరారైంది. ఆదివారం రాత్రి 7-15 గంటలకు ప్రధానమంత్రి, ఇతర మంత్రి మండలి సభ్యులతో రాష్ట్రపతి ప్రమాణ స్వీకారం చేయిస్తారని రాష్ట్రపతి భవన్ నుంచి శుక్రవారం రాత్రి అధికారిక ప్రకటన వెలువడింది. అంతకు ముందు మోదీని ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ నేతగా ఎన్నుకున్నామని, ఆయనను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలని కోరుతూ కూటమికి చెందిన నేతలందరూ రాష్ట్రపతి ముర్మును కలిసి సంయుక్త లేఖను సమర్పించారు. ఎన్‌డీఏ భాగస్వామ్య పార్టీలన్నీ మోదీని ప్రధానిగా సమర్థిస్తూ వేర్వేరు లేఖలను కూడా రాష్ట్రపతికి అందజేశాయి. ఇదిలా ఉండగా, రాష్ట్రపతి అభ్యర్థన మేరకు ప్రధాని మోదీ తన మంత్రివర్గ ప్రమాణ స్వీకారానికి తేదీ సమయాన్ని సూచించారు. ప్రమాణ స్వీకారం నేపథ్యంలో ఢిల్లీని 9, 10 తేదీల్లో నో ఫ్లయింగ్ జోన్‌గా ప్రకటించారు. రాష్ట్రపతితో భేటీ తర్వాత బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డా తన నివాసంలో మిత్రపక్షాల నేతలతో వేర్వేరుగా చర్చలు జరిపారు.చంద్రబాబు, నితీశ్ కుమార్, ఏక్‌నాథ్ షిండే, పవన్ కల్యాణ్, చిరాగ్ పశ్వాన్, జయంత్ చౌదరి, అనుప్రియ పాటిల్, అజిత్ పవార్‌లు నడ్డాతో చర్చలు జరిపారు. ఈ సమావేశంలో అమిత్‌షా, రాజ్‌నాథ్ సింగ్ కూడా పాల్గొన్నారు. తెలుగుదేశం, జనతాదళ్(యు)లకు రెండు కేబినెట్, రెండు సహాయ మంత్రి పదవులు ఇచ్చేందుకు బీజేపీ సుముఖంగా ఉన్నట్లు సమాచారం. శివసేన, లోక్ జనశక్తిలకు ఒక కేబినెట్, ఒక సహాయ మంత్రి పదవి చొప్పున ఇచ్చే అవకాశాలున్నాయి. జనతాదళ్(ఎస్), జనసేన, ఆర్‌ఎల్‌డీలకు ఒక కేబినెట్ కానీ, స్వతంత్ర హోదాలో ఒక సహాయమంత్రి పదవి కానీ కేటాయించవచ్చు. అప్నాదళ్‌లకు ఒక సహాయ మంత్రి కేటాయించే అవకాశాలున్నాయి.

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేతగా రాహుల్ గాంధీ!



పార్టీలో అంతర్గతంగా పెరుగుతున్న ఒత్తిడి

» నేడు వర్కింగ్ కమిటీ భేటీలో నిర్ణయం

న్యూఢిల్లీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేతగా రాహుల్‌గాంధీని ఎన్నుకొనే అవకాశం ఎక్కువగా కనబడుతోంది. గత రెండు దఫాలుగా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేతగా సోనియాగాంధీ వ్యవహరించారు. ఆమె ప్రత్యక్ష రాజకీయాల నుంచి విరమించుకోవడం పదేళ్లుగా నామమాత్రంగా ఉన్న కాంగ్రెస్ పార్టీ రాహుల్‌గాంధీ నాయకత్వంలో తిరిగి జాతీయ స్రవంతిలో పుంజుకొని సాధారణ ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షంగా అవతరించడంతో ఆయన్నే పార్లమెంటరీ పార్టీ నాయకుడిగా ఎన్నుకోవాలని డిమాండ్లు ఊపందుకున్నాయి. ఇటీవలి వరకు పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతూ వచ్చిన తిరువనంతపురం ఎంపీ శశిథరూర్ కూడా రాహుల్ పార్లమెంటరీ పార్టీ బాధ్యతలు చేపట్టాల్సిన తరుణం వచ్చిందని 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. సాధారణంగా పార్లమెంటరీ పార్టీ లీడరే కాంగ్రెస్ ప్రధాని అభ్యర్థి అవుతారు. మోదీ సర్కారు ఏడాది లోపు పడిపోతుందని గట్టిగా విశ్వసిస్తున్న కాంగ్రెస్.. ఇండీకూటమికి తన ప్రధాని అభ్యర్థిగా రాహుల్‌ని ఇప్పటి నుంచే ప్రొజెక్టు చేయాలని భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) శనివారం ఢిల్లీలో సమావేశంకానుంది. అశోకా హోటల్‌లో ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ భేటీలో రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్ సీఎంలు, వర్కింగ్ కమిటీ సభ్యులు పాల్గొంటారు. ఈ భేటీలో కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ(సీపీపీ) నేతగా రాహుల్‌ను ప్రతిపాదిస్తూ తీర్మానం చేయడం ఖాయంగా కనిపిస్తోంది. దాన్ని అనుసరించి, సాయంత్రం పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో కొత్తగా ఎన్నికైన లోక్‌సభ ఎంపీలు, రాజ్యసభ ఎంపీలతో సీపీపీ సమావేశంకానుంది. ఈ భేటీలో రాహుల్‌ను లాంఛనప్రాయంగా సీపీపీ నేతగా ఎన్నుకుంటారని భావిస్తున్నారు. రాత్రి 7గంటలకు అశోకా హోటల్‌లో సీడబ్ల్యూసీ సభ్యులు, ఎంపీలకు విందు ఏర్పాటు చేశారు. వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం రాత్రి విమానంలో ఢిల్లీకి వచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్రం నుం చి ఎంపీలుగా గెలిచిన మల్లు రవి, బలరాంనాయక్‌లు రేవంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

ప్రతిపక్ష నేతగా రాహులే కరెక్ట్

లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి మెరుగైన ఫలితాలు సాధించడంలో రాహుల్ అత్యంత కీలక పాత్ర పోషించారని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ శ్లాఘించారు. రాహుల్‌ను 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా అభివర్ణించిన ఆయన... లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడి పగ్గాలు రాహుల్ చేతికివ్వడమే సరైనదని అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్‌కు పునరుజ్జీవనం తెచ్చిన ఘనత రాహుల్‌దేనన్నారు. పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో భాగంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పు... బీజేపీ అహంకారానికి చెంపపెట్టు లాంటిదన్నారు. ఈ సందర్భంగా తన రాజకీయ భవిష్యత్తుపై శశిథరూర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇటీవల నాలుగోసారి ఎంపీగా ఎన్నికైన తాను వచ్చే ఎన్నికల్లో పోటీ చేయకపోవచ్చన్నారు.

లోక్‌సభలో బలమైన ప్రతిపక్షం

మూడోసారి అధికారంలోకి వస్తున్న మోదీ సర్కారు ఈసారి బలమైన ప్రతిపక్షాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ప్రతిపక్ష ఇండియా కూటమికి 233 సీట్లు కట్టబెట్టారు. దీంతో 18వ లోక్‌సభలో కొత్తగా మోదీ నాయకత్వంలో ఏర్పడే ప్రభుత్వం తప్పటడుగు వేస్తే ఇండియా కూటమి పార్టీలు విమర్శలతో విరుచుకుపడడం ఖాయమని విశ్లేషకులు భావిస్తున్నారు.

పరువునష్టం కేసులో రాహుల్‌కు బెయిల్

కర్ణాటక బీజేపీ శాఖ దాఖలు చేసిన పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌కు బెంగళూరులోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. బీజేపీ ప్రభుత్వ హయాంలో 40% కమీషన్లు వసూలు చేస్తున్నారంటూ గతేడాది శాసనసభ ఎన్నికల సమయంలో ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. దీనిపై కర్ణాటక బీజేపీ శాఖ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

సరైన టైంలో సరైన నేత!

ప్రధాని మోదీపై చంద్రబాబు ప్రశంసల జల్లు



న్యూఢిల్లీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నరేంద్ర మోదీ సరైన సమయంలో భారత దేశానికి లభించిన సరైన నాయకుడని టీడీపీ అధినేత చంద్రబాబు కొనియాడారు. తన విధానాలను సమర్థంగా అమలు చేయడంలో ఆయన్ను మించిన వారు లేరని.. విజన్ ఉన్న ఆయన హయాంలో ఏది అనుకుంటే అది సాధించగలమని ప్రశంసించారు. శుక్రవారమిక్కడ పార్లమెంటు సెంట్రల్ హాలులో శుక్రవారం జరిగిన ఎన్డీయే ఎంపీల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఎన్డీయే పార్లమెంటరీ నేతగా మోదీని టీడీపీ తరఫున సగర్వంగా సమర్థిస్తున్నట్లు తెలిపారు. ఎన్డీయేతో తమ పార్టీకి చిరకాల బంధం ఉందని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మోదీ మూడు సభలు, ఒక భారీ రోడ్‌షోలో పాల్గొని ఎన్డీయే ఘన విజయానికి కారణమయ్యారని చెప్పారు. 'సార్వత్రిక ఎన్నికల్లో మోదీ రాత్రింబవళ్లూ అలుపెరగకుండా విస్తృత ప్రచారం చేశారు. ఉదయం ప్రచారంలో పాల్గొన్నప్పుడు ఎలా ఉన్నారో, రాత్రి ప్రచారం ముగించే ముందు కూడా అలాగే ఉండేవారు. రాష్ట్ర ప్రజలు ఎన్డీయేపై సంపూర్ణ విశ్వాసం చూపారు. 95% సీట్లలో గెలిపించారు. నా మిత్రుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, మేం కలిసికట్టుగా కృషి చేసి ఈ విజయం సాధించాం' అన్నారు.

కీలక ఘట్టంలో ఉన్నాం..

దేశ చరిత్రలో కీలకమైన ఘట్టంలో ఉన్నామని చంద్రబాబు అన్నారు. 'గత పదేళ్లలో మోదీ నాయకత్వంలో ఎన్నో కీలక చర్యలు చేపట్టారు. అంకిత భావంతో ఆయన చేసిన కృషి వల్ల మనం ప్రపంచంలో శక్తిమంతమైన దేశంగా మారాం. నాలుగు దశాబ్దాలుగా నేను రాజకీయాల్లో ఉంటున్నాను. ఎందరో నేతలను చూశాను. కానీ అంతర్జాతీయంగా దేశాన్ని గర్వంతో తలెత్తుకునేలా చేసిన ఘనత మోదీకే దక్కుతుందని చెప్పగలను. ఆయన నాయకత్వంలో భారతదేశం ప్రపంచంలో ఐదో అతి పెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగింది. ఆయన నేతృత్వంలో ప్రపంచంలో ఒకటో లేదా రెండో అతి పెద్ద ఎకానమీగా మారుతుందనే విశ్వాసం నాకుంది. జాతీయ ప్రయోజనాలు, ప్రాంతీయ ఆకాంక్షల మధ్య సమతుల్యం ఉండాలి. అప్పుడే దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతుంది. ఇది నా జీవితంలోనే అత్యంత ప్రకాశవంతమైన ఘట్టం. టీడీపీ వ్యవస్థాపకుడు, మా నాయకుడైన ఎన్టీఆర్ ఒకే మాట చెప్పేవారు. తనకు ఈ ఇజాలు తెలియవని, హ్యూమనిజమే (మానవతావాదమే) తన ఇజమని అనేవారు. ఆ దృక్పథాన్ని మోదీ వాస్తవంగా మారుస్తున్నారు. భారత దేశానికి ఇప్పుడు తాను అనుకున్నది సాధించేందుకు మంచి అవకాశం. ఈ అవకాశం కోల్పోతే మళ్లీ రాదు' అని చంద్రబాబు తెలిపారు. సమావేశంలో ఆయన మోదీ పక్కనే కూర్చుకున్నారు. భేటీ జరుగుతున్నంత సేపూ మాట్లాడుకుంటూ.. నవ్వుకుంటూ కనిపించారు.

జాతికి మోదీ స్ఫూర్తి

ఆయన సారథిగా ఉన్నంతవరకు దేశం ఎవరికీ తలవంచదు : పవన్

భారతజాతి యావత్తుకూ మోదీ స్ఫూర్తి అని జనసేనాని పవన్ కల్యాణ్ అన్నారు. ఆయన సారథిగా ఉన్నంతవరకు దేశం ఎవరికీ తలవంచదని చెప్పారు. ఆయన నాయకత్వంలో పనిచేయడం తమకు గర్వకారణమన్నారు. 'దేశాన్ని ఆయనెంతో ప్రభావితం చేశారు. దేశసేవకు ఆయనే మాకు ప్రేరణ. ఆయన దేశభక్తి, అభివృద్ధి పట్ల అంకిత భావం గొప్పవి. ఆయన మార్గనిర్దేశంలోనే ఆంధ్రలో ఘనవిజయం సాధించాం' అని ఎన్డీయే ఎంపీల సమావేశంలో తెలిపారు. ఎన్డీయే పార్లమెంటరీ సారథిగా మోదీకి పూర్తి మద్దతు ప్రకటించారు. 'ఆయన 15 ఏళ్లు ప్రధానిగా ఉంటారని.. దేశం దిశ-దశ మారతాయని 2014లోనే చంద్రబాబు చెప్పారు. ఇప్పుడా మాట నిజమవుతోంది. ఆయన మూడోసారి ప్రధానిగా బాధ్యతలు తీసుకుంటున్నందుకు ఆనందంగా ఉంది. ఆయన విజన్-2047తో దేశం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిన దేశంగా రూపొందాలని భారతీయులందరి ఆకాంక్ష. ఆయన పాలనలో ఆసేతుహిమాచలం భద్రంగా ఉంది. ఆర్థికంగానూ పరుగులు తీస్తోంది. అన్ని రంగాల్లోనూ అభివృద్ధి ముందుకు సాగుతోంది. ప్రపంచ దేశాల్లో భారత ప్రతిష్ఠను ఆయన ఇనుమడింపజేశారు. ఆంధ్రప్రదేశ్‌కు ఎన్డీయే ప్రభుత్వ సంపూర్ణ సహకారం ఉంటుందని ఆశిస్తున్నాను. మోదీ సూచనలు, సలహాలతో రాష్ట్ర సర్కారుకు ముందుకు సాగుతుంది' అని పవన్ అన్నారు.

నకిలీ ఆధార్‌తో పార్లమెంట్‌లోకి

» యత్నించిన ముగ్గురి అరెస్టు

న్యూఢిల్లీ, జూన్ 7: నకిలీ ఆధార్ కార్డులతో పార్లమెంట్‌లోకి అక్రమంగా ప్రవేశించేందుకు యత్నించిన ముగ్గురు అరెస్టు అయ్యారు. పోలీసుల కథనం ప్రకారం.. డీవీ ప్రాజెక్ట్స్ అనే సంస్థ పార్లమెంట్ భవన సముదాయంలోని ఎంపీల లాంజ్ నిర్మాణ పనులను నిర్వహిస్తోంది. ఈ సంస్థ తరఫున కార్మికులుగా వచ్చిన ఖాసిమ్, మోనిస్, సోయబ్ నకిలీ ఆధార్ కార్డులతో పార్లమెంట్ భవనంలోకి ప్రవేశించేందుకు యత్నించి ఫ్లాప్ గేట్ వద్ద జరిగిన తనిఖీల్లో పట్టుబడ్డారు. తమ గుర్తింపు కోసం వారు తెచ్చిన ఆధార్ కార్డులు అనుమానాస్పదంగా ఉండడంతో సీఐఎస్‌ఎఫ్ అధికారులు వారిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారి ఆధార్ కార్డులు నకిలీవని తేలడంతో పోలీసులకు అప్పగించారు. నిందితుల్లో ఇద్దరి ఆధార్ కార్డులపై ఒకే ఆధార్ నంబర్ ఉండగా ఫొటోలు వేరుగా ఉన్నాయి. నిందితులను అరెస్టు చేసిన ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 2023 డిసెంబరులో ఇద్దరు విజిటర్స్ గ్యాలరీ నుంచి లోక్‌సభలోకి దూసుకొచ్చి పొగ డబ్బాలు తెరిచి అలజడి సృష్టించిన సంగతి తెలిసిందే. ఆ ఘటనకు సంబంధించిన పార్లమెంట్ భద్రత ఉల్లంఘన కేసులో ఆరుగురు నిందితులపై ఢిల్లీ పోలీసులు న్యాయస్థానంలో శుక్రవారం చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ కేసులో అనుబంధ చార్జిషీట్ దాఖలుకు న్యాయస్థానం జూలై 15 వరకు గడువిచ్చింది.

కేజ్రీవాల్‌కు అక్కడ బెయిల్ ఇక్కడ నాకేమో వేధింపులు

» పాక్ సుప్రీంకోర్టుకు ఇమ్రాన్ ఖాన్ ఫిర్యాదు



ఇస్లామాబాద్, జూన్ 7: అక్రమంగా తనను అరెస్టు చేయడమేకాకుండా జైలులో వేధిస్తున్నారని పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేశారు. రాజకీయాల్లో పాల్గొనకుండా ఉండేందుకే తనను అరెస్టు చేశారని తెలిపారు. గురువారం పాక్ సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలోని అయిదుగురు సభ్యుల ధర్మాసనం ఆయన కేసుపై విచారణ జరిపింది. ఈ సందర్భంగా ఇమ్రాన్‌ఖాన్ వాదనలు వినిపిస్తూ 2022 ఏప్రిల్‌లో పదవి నుంచి తొలగించిన దగ్గర నుంచి తన పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఉదంతాన్ని ప్రస్తావించారు. ఎన్నికల్లో ప్రచారం చేయడానికి వీలుగా భారత సుప్రీంకోర్టు ఆయనకు తాత్కాలిక బెయిల్ మంజూరు చేసిందని తెలిపారు. తనను మాత్రం ఫిబ్రవరి 8న ఎన్నికలు జరుగుతాయనగా 5 రోజుల ముందు దోషిగా ప్రకటించి అరెస్టు చేశారని చెప్పారు. దేశంలో అప్రకటిత మార్షల్ లా అమలవుతోందనిఆరోపించారు.

లింగ సమానత్వంపై పిల్లలకు పాఠాలు

» పాఠ్యపుస్తకాల్లో చేర్చిన కేరళ సర్కారు

తిరువనంతపురం, జూన్ 7: విద్యార్థి దశ నుంచే లింగ సమానత్వ భావనను బలంగా నాటేందుకు కేరళ ప్రభుత్వం ముందడుగు వేసింది. పాఠ్యపుస్తకాల్లో లింగ సమానత్వాన్ని పాఠ్యాంశంగా చేర్చింది. వేసవి సెలవుల విరామం అనంతరం సోమవారం నుంచి కేరళలో పాఠశాలలు పునఃప్రారంభంకానున్నాయి. ఈ సందర్భంగా అందుబాటులోకి తెచ్చిన పాఠ్యపుస్తకాల్లో వంట, ఇతర ఇంటి పనుల్లో లింగ భేదానికి తావులేకుండా కుటుంబ సభ్యులంతా కలిసి అన్నిపనులూ చేస్తున్న చిత్రం అందరినీ విశేషంగా ఆకర్షించింది. మళయాళం మీడియం మూడో తరగతి పాఠ్యపుస్తకంలో లింగ సమానత్వాన్ని సూచిస్తున్న పాఠంలోని ఈ చిత్రాన్ని విద్యాశాఖ మంత్రి వి. శివన్‌కుట్టి సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో ఇది వైరల్ అయింది. దీనిలో తండ్రి వంటగదిలో కూర్చుని కొబ్బరి తురుముతుంటే.. తల్లి వంట చేస్తూ కనిపించింది. ఇక ఇంగ్లిష్ కేరళ ప్రభుత్వం ఇలా పాఠ్యపుస్తకాల్లో పొందుపర్చిన లింగ సమానత్వం భావనను ఉపాధ్యాయులు, విద్యార్థులు మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నారు. కాగా విద్యార్థులు రేబిస్ వ్యాధి బారిన పడకుండా నిరోధించేందుకు కేరళ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. పాఠశాల ఆవరణలో వీధి కుక్కలు ఉండకుండా, అక్కడ అవి సంతానోత్పత్తి చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచిస్తూ విద్యాశాఖ మంత్రి వి శివన్‌కుట్టి నేతృత్వంలోని విద్యాశాఖ శుక్రవారం మార్గదర్శకాలు జారీచేసింది.

కంగనను కొట్టిన మహిళా కానిస్టేబుల్ అరెస్టు

చండీగఢ్, జూన్ 7: చండీగఢ్ విమానాశ్రయంలో బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌ను చెంపదెబ్బ కొట్టిన సీఐఎస్‌ఎఫ్ మహిళా కానిస్టేబుల్ కుల్విందర్ కౌర్‌ను శుక్రవారం అరెస్టు చేశారు. ఇప్పటికే ఆమెపై పోలీసులు కేసు నమోదు చేయగా.. విధుల నుంచి సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. సాగు చట్టాలను వ్యతిరేకించిన రైతులపై గతంలో కంగన అనుచిత వ్యాఖ్యలు చేసినందుకే ఆమెపై చేయి చేసుకున్నట్లు కుల్విందర్ కౌర్ వెల్లడించారు. మరోవైపు, కుల్విందర్ కౌర్‌కు పలు రైతు సంఘాలు మద్దతు ప్రకటించాయి. ఈ ఘటనపై సరైన విచారణ జరపాలంటూ పంజాబ్ డీజీపీని కలసి కోరతామని ఆ సంఘాల నేతలు సర్వణ్ సింగ్ పందేర్, జగ్జిత్ సింగ్ దల్లేవాల్ మీడియాకు వెల్లడించారు. ఇదే డిమాండ్‌తో ఈనెల 9వ తేదీన మొహాలీలోని ఎస్పీ కార్యాలయానికి ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు.

'రైల్వే' కుంభకోణంలో లాలుపై సీబీఐ తుది చార్జిషీటు

న్యూఢిల్లీ, జూన్ 7: యజమానుల నుంచి తక్కువ ధరకు భూములు కొనుగోలు చేసి ప్రత్యామ్నాయంగా వారికి రైల్వే ఉద్యోగాలు ఇచ్చారన్న ఆరోపణలకు సంబంధించి ఆర్జేడీ అధినేత లాలు ప్రసాద్‌పై సీబీఐ తుది చార్జిషీటు దాఖలు చేసింది. లాలు రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు అన్ని జోన్లలో జరిగిన ఉద్యోగాల భర్తీపై దర్యాప్తు చేసిన అనంతరం నివేదిక రూపొందించింది. దీన్ని శుక్రవారం ప్రత్యేక కోర్టులో సమర్పించింది. లాలుతో పాటు ఆయన భార్య రబ్రీ దేవి, కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్, కుమార్తె హేమా యాదవ్, వారి మాజీ సహాయకుడు భోలా యాదవ్‌లపై అభియోగాలు మోపింది. దీనిని జులై 6న ప్రత్యేక కోర్టు పరిశీలించనుంది.

ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. ఏడుగురు మావోయిస్టుల మృతి

చర్ల, జూన్ 7: ఛత్తీస్‌గఢ్‌లో మరో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. నారాయణపూర్ జిల్లాలోని ఓర్చా అడవుల్లో శుక్రవారం సాయంత్రం నక్సల్స్ పోలీసులకు మధ్య చోటుచేసుకున్న ఎదురు కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందగా, ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. ఓర్చా అడవుల్లో మావోయిస్టులున్నట్టు పోలీసులకు సమాచారం రావడంతో ఉదయం నారాయణపూర్ జిల్లాకు చెందిన డీఆర్‌జీ, కొండగావ్, దంతెవాడ, బస్తర్ జిల్లాలకు చెందిన ఇండో-టిబెటన్ 45వ బెటాలియన్ బలగాలు సంయుక్త ఆపరేషన్ నిర్వహించాయి. సాయంత్రానికి నక్సల్స్ ఉన్న ప్రాంతానికి పోలీసులు చేరగా.. ఇరువురి మధ్య ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయని ఉన్నతాధికారులు తెలిపారు. ఈ కాల్పుల్లో ఏడుగురు మావోయిస్టులు మృతి చెందారని.. ముగ్గురు డీఆర్‌జీ సిబ్బంది గాయపడ్డారని వెల్లడించారు. ఘటనా స్థలంలో తుపాకులు, మందుగుండు సామగ్రి, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మృతులను ఇంకా గుర్తించాల్సి ఉంది. ఈ ఏడాది ఇప్పటివరకు జరిగిన ఎన్‌కౌంటర్లలో 124 మంది మావోయిస్టులు మృతి చెందారు.

లాభాపేక్ష లేకుండా పుస్తకాలు అమ్ముకోవచ్చు: ట్రస్మా

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలు లాభాపేక్ష లేకుండా పుస్తకాలు, స్టేషనరీ అమ్ముకోవచ్చని, హైకోర్టు సైతం ఈ విషయాన్నే తెలిపిందని తెలంగాణ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల సంఘం (ట్రస్మా) పేర్కొంది. ప్రైవేట్ పాఠశాలల్లో పుస్తకాలు, స్టేషనరీ అవిృతే వాటిని సీజ్ చేస్తామని, పాఠశాల గుర్తింపు రద్దు చేస్తామంటూ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసిందన్న ప్రచారం సరికాదని సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు సాదుల మధుసూధన్, రమేష్ రావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. లాభాపేక్ష లేకుండా ప్రైవేటు పాఠశాలలు పుస్తకాలు, స్టేషనరీ అమ్ముకోవచ్చు కానీ యూనిఫాం, షూస్, టై, బెల్ట్‌లు అమ్మకూడదని విద్యాశాఖ సైతం ఆదేశాలు ఇచ్చిందని తెలిపారు.

మార్కెట్ కమిటీల పాలకవర్గాల నియామకం

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మూడు వ్యవసాయ మార్కెట్ కమిటీ(ఏఎంసీ)లకు పాలకవర్గాలను నియమిస్తూ వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులను జారీ చేశారు. ఈ మేరకు మంచిర్యాల జిల్లాలోని లక్సెట్టిపేట, కాగజ్‌నగర్, మంచిర్యాల మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించారు. కాగజ్‌నగర్ ఏఎంసీ ఛైర్మన్‌గా సిద్దల దేవయ్య, లక్సెట్టిపేట ఏఎంసీ ఛైర్మన్‌గా దాసరి ప్రేమ్‌చంద్, మంచిర్యాల ఏఎంసీ ఛైర్‌పర్సన్‌గా పయ్యావుల పద్మ నియమితులయ్యారు.

వీఆర్వో వ్యవస్థను పునరుద్ధరించండి: వీఆర్వోలు

హైదరాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రద్దయిన గ్రామ రెవెన్యూ అధికారులను రెవెన్యూ శాఖలోకి తిరిగి తీసుకొచ్చి సమానమైన హోదా, సర్వీస్ భద్రతతో కూడిన ప్రమోషన్లు కల్పించాలని పూర్వ వీఆర్వోల సంఘం రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటికి విజ్ఞప్తి చేసింది. శుక్రవారం సంఘం నేతలు మంత్రి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వారి సమస్యలను వివరించారు. త్వరలో సంబంధిత సంఘ నాయకులను పిలిచి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారని వీఆర్వోలు పేర్కొన్నారు. కాగా, ఎన్నికల దృష్ట్యా బదిలీ చేసిన తహసీల్దార్లను, నాయబ్ తహసీల్దార్లను తిరిగి వారి పాత స్థానాలకు బదిలీ చేయాలని మంత్రిని ట్రెసా బృందం కోరింది.

తక్షణమే 2021 పీఆర్సీని అమలు చేయండి

» టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్

హైదరాబాద్,జూన్ 7(ఆంధ్రజ్యోతి): డబుల్ డ్యూటీలకు డబుల్ వేతనం ఇవ్వడంతో పాటు తక్షణం 2021 పీఆర్సీ అమలుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని తెలంగాణ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. శుక్రవారం యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. అనంతరం తమ సమస్యలను పరిష్కరించాలని యాజమాన్యానికి వినతి పత్రం సమర్పించినట్లు యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న తెలిపారు. 2021 ఏప్రిల్ నుంచి 50శాతం ఫిట్‌మెంట్‌తో మాస్టర్ స్కేల్ అమలుచేయాలని, 25శాతం ఐఆర్ ప్రకటించాలని విజ్ఞప్తి చేశామన్నారు.

28లోగా పనులు పూర్తవ్వాలి

మరమ్మతులు ఆలస్యమైతే కఠిన చర్యలు.. మేడిగడ్డ, అన్నారం పనులు సంతృప్తికరం

» సుందిళ్ల బ్యారేజీ పనుల్లో తీవ్ర జాప్యం
» రేయింబవళ్లు పనులు చేయండి
» బ్యారేజీల పరిశీలనలో అధికారులను ఆదేశించిన మంత్రి ఉత్తమ్

(మేడిగడ్డ నుంచి ఆంధ్రజ్యోతి ప్రత్యేక ప్రతినిధి)



మేడిగడ్డ బ్యారేజీ వద్ద పిల్లర్లను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు నిర్ణీత వ్యవధిలోగా మరమ్మతులు చేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. మరమ్మతు పనుల్లో జాప్యం జరిగితే ఉపేక్షించే ప్రసక్తే లేదని, కఠిన చర్యలు తప్పవని అధికారులను హెచ్చరించారు. జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక ప్రకారం మరమ్మతు పనులు జరుగుతున్న తీరును తెలుసుకోవడానికి శుక్రవారం ఆయన సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలను సందర్శించారు. పనులు జరుగుతున్న తీరును, బ్యారేజీల స్థితిగతులను ఆరా తీశారు. హైదరాబాద్ బేగంపేట విమానాశ్రయం నుంచి హెలికాప్టర్‌లో తొలుత సుందిళ్ల చేరుకున్న ఆయన.. బ్యారేజీ వద్ద సీసీ బ్లాకులను ఒకేచోటికి చేరుస్తున్న పనులు పరిశీలించారు. ఈ నెల 28లోగా పనులు పూర్తికావాలన్నారు. సుందిళ్లలో పనుల జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వానాకాలం ముంచుకొస్తున్నందున పనులు వేగిరం చేయాలని ఆదేశించారు. బ్యారేజీల మరమ్మతులపై జిల్లా కలెక్టర్ కూడా దృష్టి పెట్టాలని మంత్రి కోరారు. రేయింబవళ్లు పనులు చేస్తేనే వరదలు వచ్చేలోపు బ్యారేజీల మరమ్మతు, పునరుద్ధరణ పూర్తవుతాయని అధికారులకు స్పష్టం చేశారు.

సిమెంట్ బెంటనైట్ గ్రౌటింగ్‌తో పరిష్కారం

ఏటా వరదల సమయంలో అన్నారం బ్యారేజీలో అప్‌స్ట్రీమ్, డౌన్‌స్ట్రీమ్‌లలో లాంచింగ్ ఆప్రాన్లు, సీసీ బ్లాకులు దెబ్బతింటున్నాయని అధికారులు మంత్రికి నివేదించారు. దీనికి కారణమేంటని మంత్రి ప్రశ్నించగా.. డిజైన్లలో లోపాలేనని అధికారులు చెప్పారు. తగిన డిజైన్లతో పనులు చేయాలని గత ముఖ్యమంత్రికి నివేదించినా పట్టించుకోలేదని, ఫలితంగా ఏటా వరదలు వచ్చే సమయంలో గేట్లు తెరిచేటప్పుడు ప్రవాహ వేగంతో ఈ సమస్య ఉత్పన్నమవుతుందని గుర్తుచేశారు. సిమెంట్ కాంక్రీట్ బ్లాకుల స్థానంలో సిమెంట్ బెంటనైట్ గ్రౌటింగ్‌తో సమస్యకు పరిష్కారం దొరుకుతుందని అఫ్కాన్ ప్రతినిధులు తెలిపారు. ఇక అన్నారం బ్యారేజీపై పార్సన్ సంస్థ నివేదిక తప్పుల తడకగా ఉందని చెప్పిన ఈఎన్‌సీ.. మరమ్మతులన్నీ ఎన్‌డీఎస్‌ఏ సిఫారసుల ప్రకారమే జరగాలని నిర్మాణ సంస్థకు సూచించారు. అన్నారంలో ఎప్పట్లోగా పనులు పూర్తవుతాయని మంత్రి నిర్మాణ సంస్థ ప్రతినిధులను ప్రశ్నించగా.. 15 రోజుల్లోగా పూర్తిచేస్తామని చెప్పారు. బ్యారేజీలో పరీక్షలు ఎక్కడిదాకా వచ్చాయని మంత్రి ఆరా తీయగా.. దీనికి రూ.1.13 కోట్లు కావాలని కేంద్ర విద్యుత్తు, నీటి పరిశోధన సంస్థ(సీడబ్ల్యూపీఆర్ఎస్) అంచనాలు సమర్పించిందని తెలిపారు. ఒక్కరోజులో చెల్లింపులు చేస్తామని, బిల్లులు పంపించాలని మంత్రి వారికి సూచించారు. అన్నారం బ్యారేజీ ఎగువ, దిగువ భాగంలో ఏటా భారీగా ఇసుక మేటలు వస్తున్నాయని అధికారులు చెప్పగా.. ఇసుక తరలింపునకు సంస్థలను ఎంపిక చేయాలని ఉత్తమ్ ఆదేశించారు. ఈ సందర్భంగా సుందర్‌శాల గ్రామస్థులు మంత్రిని కలిసి, అన్నారం వరద నుంచి రక్షణకు కరకట్టలు ఏర్పాటు చేయాలని కోరారు. స్పందించిన ఉత్తమ్.. మంత్రి శ్రీధర్‌బాబును కలిసి, ప్రతిపాదనలు అందించాలని గ్రామస్థులకు సూచించారు.

మేడిగడ్డకు తదుపరి నష్టం జరగకుండా చూసుకోవాలి

అన్నారం బ్యారేజీ పరిశీలన అనంతరం మేడిగడ్డ బ్యారేజీకి చేరుకున్న మంత్రి ఉత్తమ్.. అంబట్‌పల్లి గ్రామంలో నీటిపారుదల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. మేడిగడ్డ బ్యారేజీకి భారీగా వరదలు వచ్చే అవకాశం ఉన్నందున మరింత నష్టం జరగకుండా చూడాలన్నారు. మరమ్మతు పనులు వేగిరం చేయాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులు, అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా బ్యారేజీలోని ఏడో బ్లాకును ఉత్తమ్ పరిశీలించారు. ఏడో బ్లాకులోని పునాది కింద నుంచి భారీగా ఇసుక కొట్టుకుపోయి.. గొయ్యి ఏర్పడిందని, దీన్ని పూడ్చడానికి వీలుగా ఇసుక, సిమెంట్ గ్రౌటింగ్ చేశామని నిర్మాణ సంస్థ తెలిపింది. గ్రౌటింగ్ అనంతరం 16, 17 గేట్లను ఎత్తామని, మిగిలిన గేట్ల కింద గ్రౌటింగ్ జరుగుతోందని, డౌన్‌స్ట్రీమ్‌లో షీట్ పైల్స్(ఉక్కు రేకులు) దించుతున్నామని, సీసీ బ్లాకులను కూడా సరిచేస్తున్నామని వెల్లడించింది. ఇక 20వ నంబర్ గేటును కత్తిరించి ముక్కలు తొలగిస్తామని నిర్మాణ సంస్థ పేర్కొంది. ఇక కుంగిన బ్లాకు కింది నుంచి ఇసుక కొట్టుకుపోయినందున.. గ్రౌటింగ్ శరవేగంగా చేయాలని, వరదలు వచ్చేలోపు గేట్లన్నీ తెరిచి ఉంచి, బ్లాకుల కింద ఉన్న సీపేజీని కట్టడి చేయాలని నిర్దేశించారు. కాగా, మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి ఎన్‌డీఎస్‌ఏ, జ్యుడీషియల్ కమిషన్ ఇచ్చే తుది నివేదికల ప్రకారం బాధ్యులపై చర్యలు ఉంటాయని చెప్పారు. కాగా, మేడిగడ్డ బ్యారేజీలో సీఎస్ఎంఆర్ఎస్ పరీక్షలు జరిగాయి.

రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేసి.. ఎకరాకు నీళ్లివ్వలేదు: ఉత్తమ్

భూపాలపల్లి/మంథని రూరల్, జూన్ 7: గత ప్రభుత్వం రూ.94 వేల కోట్లు వెచ్చించి నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ఎందుకూ పనికి రాకుండా పోయిందని ఉత్తమ్ చెప్పారు. బ్యారేజీల పరిశీలన అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. గత సర్కారు రూ.2 లక్షల కోట్లు ఖర్చు చేసి, ఒక్క ఎకరాకు కూడా నీళ్లివ్వలేదని ఆరోపించారు. మూడింట్లో రెండు బ్యారేజీలు సీరియస్ లీకేజీల సమస్య ఎదుర్కొంటుండగా, కుంగిపోయిన మేడిగడ్డ పనికిరాకుండా పోయిందని తెలిపారు. మేడిగడ్డ బ్యారేజీని వర్షాకాలం ప్రారంభమయ్యే లోపు తాత్కాలిక ఏర్పాట్లు చేసి, రక్షించే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు ప్రాణహిత నదిపై తుమ్మిడిహెట్టి బ్యారేజీని నిర్మించి తీరతామని స్పష్టం చేశారు. లక్ష్మి (కన్నెపల్లి) పంప్‌హౌస్‌లో దెబ్బతిన్న 11 మోటార్లకు కూడా మరమ్మతులు చేయిస్తామని ఉత్తమ్ చెప్పారు. కాళేశ్వరం జాతీయ హోదా విషయంలోనూ గత ప్రభుత్వం ప్రజలకు పూర్తిగా అబద్ధాలు చెప్పిందన్నారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, తాను ప్రధానిని కలిసి పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వాలని కోరగా.. జాతీయ హోదా అనే పద్ధతి లేదని, కేంద్రం నుంచి ఆ ప్రాజెక్టుకయ్యే 60 శాతం ఖర్చును భరిస్తామని హామీ ఇచ్చారని చెప్పారు.

లోక్‌సభ ఎన్నికల ఫలితాలు రెఫరెండమే

» బీఆర్ఎస్ నేతలే బీజేపీకి ఓట్లు వేయించారు: కొండా సురేఖ
» దేశానికి రాజ్యాంగమే శ్రీరామరక్ష: కడియం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

హనుమకొండ సిటీ, జూన్ 7: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తొలుత ప్రకటించినట్లుగా లోక్‌సభ ఎన్నికల ఫలితాలను రెఫరెండంగానే స్వీకరించామని మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ లోక్‌సభ అభ్యర్థిగా కడియం కావ్య విజయం సాధించడాన్ని పురస్కరించుకొని శుక్రవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ఆరు నెలల పాలన పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. దీని ఫలితమే రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో 8 సీట్లు సాధించామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ నేతలు మరీ దగ్గర ఉండి బీజేపీకి ఓట్లు వేయించడం వల్లే ఆ పార్టీకి 8 స్థానాలు లభించాయన్నారు. లేకుంటే కాంగ్రెస్ మరో 3-4 సీట్లు దక్కేవి అని సురేఖ చెప్పారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ.. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే దేశానికి శ్రీరామరక్ష అని అన్నారు. లౌకికవాద పరిరక్షణకు దేశ ప్రజలు కార్యోన్ముఖులయ్యారని, లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఇండియా కూటమికి లభించిన స్థానాలే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. రాబోయే రోజులు కాంగ్రెస్‌వేనని, కానున్న ప్రధానమంత్రి రాహుల్‌గాంధీయే అని ఆయన అన్నారు.

కులగణన చేపట్టాలని మోదీని కోరతా: వీహెచ్

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మూడోసారి ప్రధాని పదవిని చేపట్టబోతున్న మోదీని ఢిల్లీకి వెళ్లి కలుస్తానని, దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని కోరతానని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు వెల్లడించారు. శుక్రవారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఓబీసీ ప్రధానిగా.. దేశంలోని బీసీలకు న్యాయం చేయాలని మోదీకి విజ్ఞప్తి చేస్తానన్నారు. ఎన్డీయేలో భాగస్వాములుగా ఉన్న చంద్రబాబు, నీతీశ్‌లు కూడా కులగణన చేపట్టాలంటూ మోదీని కోరాలని సూచించారు. తెలంగాణలో కులగణన పూర్తయిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. మోదీ.. మూడోసారి అధికారం చేపట్టక ముందే స్టాక్ మార్కెట్లో అల్లకల్లోలం సృష్టించి మదుపరులు రూ.31 లక్షల కోట్ల మేరకు నష్టపోవడానికి కారకులయ్యారంటూ టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్ ఆరోపించారు. ఈ కుంభకోణంపై ఈడీ దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. మే నెలలో మోదీ, అమిత్‌షాలు జాతీయ చానెళ్లకు ఇంటర్వ్యూలిస్తూ జూన్ 4వ తేదీ లోపే షేర్లు కొనుగోలు చేయాలని, ఆ తర్వాత అవి పెరుగుతాయని చెప్పారన్నారు. ఎగ్జిట్ పోల్స్ నిర్వాహకులతో చీకటి ఒప్పందం చేసుకున్న మోదీ, అమిత్‌షా ఈ చర్యలకు పాల్పడ్డారని ఆరోపించారు. అనంతరం భువనగిరి ఎంపీగా గెలిచిన చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని టీపీసీసీ అధికార ప్రతినిధులు సన్మానించి.. అభినందించారు. ఇటు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని ఆమె నివాసంలో పార్టీ ఎంపీలు చామల, రఘువీర్‌రెడ్డి, మెదక్, సికింద్రాబాద్ అభ్యర్థులు నీలం మధు, దానం నాగేందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. వారితో పాటుగా పార్టీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షుడు రోహిణ్‌రెడ్డి తదితరులున్నారు.

ఒక సబ్జెక్టులో ఇచ్చిన 4 ప్రశ్నలు..

మరో సబ్జెక్ట్ ప్రశ్నపత్రంలో రిపీట్

» ఎల్ఎల్‌బీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షల్లో ఘటన
» శాతవాహన వర్సిటీ అధికారుల నిర్లక్ష్యం

కరీంనగర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శాతవాహన యూనివర్సిటీ ఎల్ఎల్‌బీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షల్లో అధికారుల నిర్లక్ష్యం వెలుగుచూసింది. ఒక సబ్జెక్టు పేపర్‌లో వచ్చిన నాలుగు ప్రశ్నలు మరో సబ్జెక్టు పేపర్‌లోనూ వచ్చాయి. యూనివర్సిటీ పరిధిలో మూడు రోజులుగా ఎల్ఎల్‌బీ పరీక్షలు వర్సిటీలోని రెండు పరీక్షా కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. గురువారం ఫ్యామిలీ లా సబ్జెక్టుకు సంబంధించిన పరీక్ష జరిగింది. శుక్రవారం కాన్‌స్టిట్యూషనల్ లా పరీక్ష నిర్వహించారు. ఈ ప్రశ్నపత్రంలో ఫ్యామిలీ లాకు చెందిన మొదటి నాలుగు ప్రశ్నలు మళ్లీ ఇవ్వడంతో విద్యార్థులు అవాక్కయ్యారు. ఈ విషయాన్ని ఇన్విజిలేటర్ల దృష్టికి తీసుకెళ్లగా వారు వర్సిటీ పరీక్షా విభాగం అధికారులకు తెలియజేశారు. అప్పటికే అరగంట గడిచింది. తర్వాత తేరుకున్న యూనివర్సిటీ అధికారులు ఫ్యామిలీ లా పేపర్‌లో వచ్చిన నాలుగు ప్రశ్నలకు బదులుగా కాన్‌స్టిట్యూషనల్ లాకు సంబంధించిన ప్రశ్నలు మార్చి ఇచ్చారు. అప్పటికే ఆ నాలుగు ప్రశ్నలను రాసిన విద్యార్థుల్లో ఆందోళన మొదలైంది. ఆ ప్రశ్నలు తప్పుగా ఇచ్చినందుకు గ్రేస్‌టైమ్ 25 నిమిషాలు ఇచ్చారు.

ఇద్దరు యువతుల ప్రేమకు విషాదాంతం

» ఇన్‌స్టాలో పరిచయం.. హైదరాబాద్‌లో పెళ్లి
» పెద్దలు ఇంటికి తీసుకురావడంతో ఆత్మహత్యాయత్నం
» ఒకరి మృతి, ప్రాణాపాయ స్థితిలో మరొకరు

కురవి, జూన్ 7: ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఇద్దరు యువతులు ప్రేమించుకుని పెళ్లి చేసుకుని గుట్టుగా కాపురం పెట్టారు. దీనిని తీవ్రంగా వ్యతిరేకించిన తల్లిదండ్రులు వాళ్లని తమ ఇళ్లకు తీసుకెళ్లగా.. ఇక, తాము కలిసి జీవించలేమనే ఆవేదనతో ఆ యువతులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. వారం రోజులుగా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆ ఇద్దరిలో ఒకరు శుక్రవారం మరణించగా, మరో యువతి ప్రాణాపాయ స్థితిలో ఉంది. మహబూబాబాద్ జిల్లా కురవి మండలానికి చెందిన ఓ యువతి (21)కి గార్ల మండలానికి చెందిన యువతి(20)కి ఇన్‌స్టాగ్రామ్‌లో ఆరు నెలల క్రితం పరిచయం ఏర్పడింది. స్నేహితుల నుంచి ప్రేమికులుగా మారిన వీరిద్దరూ మూడు నెలల క్రితం హైదరాబాద్ వెళ్లి పెళ్లి చేసుకుని అక్కడే కాపురం పెట్టారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తమ కుమార్తెలను ఇళ్లకు తీసుకువచ్చారు. అయితే, మే చివరి వారంలో ఆ ఇద్దరూ విజయవాడ పారిపోగా.. కురవి మండలానికి చెందిన యువతి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారిని స్వస్థలానికి తీసుకొచ్చిన పోలీసులు.. కౌన్సెలింగ్ ఇచ్చి తల్లిదండ్రులకు అప్పజెప్పారు. నాటి నుంచి ఎడబాటుకు గురైన ఆ యువతులు జూన్ 1న మహబూబాబాద్‌లో కలుసుకుని ఎలుకల మందు తాగారు. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు వారిని మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కురవి మండలానికి చెందిన యువతి శుక్రవారం చనిపోయింది. మరో యువతి ప్రాణాపాయ స్థితిలో ఉంది.

భర్త, పిల్లలను వదిలి.. ఇద్దరు మహిళల సహ జీవనం

» ఊరు విడిచి వెళ్లి.. మరో గ్రామంలో అజ్ఞాతవాసం

కొత్తగూడ(మహబూబాబాద్ జిల్లా), జూన్ 7: పెళ్లయి.. కుటుంబాలతో ఉంటున్న ఇద్దరు మహిళలు.. ఇంటి నుంచి వెళ్లిపోయి సహజీవనం చేస్తుండటం మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని ఓ గ్రామంలో చర్చనీయాంశమైంది. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన 30 ఏళ్ల మహిళకు కొత్తగూడ మండలంలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తితో పదేళ్ల కిందట వివాహమైంది. ఈ దంపతులకు ముగ్గురు సంతానం. అలాగే భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండల పరిసర ప్రాంతానికి చెందిన 26 ఏళ్ల ఓ మహిళకు కొత్తగూడ మండలంలోని అదే గ్రామానికి చెందిన వ్యక్తితో ఆరేళ్ల కిందట వివాహమైంది. వీరికి సంతానం లేదు. అయితే ఒకే గ్రామానికి కోడళ్లుగా వచ్చిన ఆ ఇద్దరు మహిళల మధ్య సాన్నిహిత్యం పెరిగింది. ఈ క్రమంలో మూడు నెలల కిందట ఆ మహిళలు తమ భర్తలు, పిల్లలను వదిలి ఇళ్ల నుంచి వెళ్లిపోయారు. గుండాల మండలంలోని ఓ గ్రామంలో సహజీవనం చేస్తున్నారు. అయితే వారి కోసం తీవ్రంగా వెతుకుతున్న భర్తలకు.. మహిళలిద్దరూ గుండాల మండలంలో ఉన్నట్టు తెలిసింది. దీంతో బుధవారం అక్కడికి వెళ్లిన భర్తలు అసలు విషయం తెలుసుకుని కంగుతిన్నారు. వారిని కొత్తగూడ మండలంలోని తమ స్వగ్రామానికి తీసుకొచ్చి గ్రామపెద్దల ముందుంచారు. ఈ క్రమంలో వారిని గ్రామపెద్దలు ప్రశ్నించగా.. ఆరునూరైనా తాము కలిసే ఉంటామని ఆ మహిళలు చెప్పడంతో వారి కుటుంబసభ్యులు, గ్రామస్థులు విస్మయానికి గురయ్యారు.

కడ్తాల్ జంట హత్యల కేసులో ఏడుగురి అరెస్టు

శంషాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కడ్తాల్‌లో ఇద్దరు యువకుల దారుణ హత్యకు సంబంధించి పోలీసులు ఏడుగురిని అరెస్టు చేశారు. బీజేపీకి చెందిన జల్కం రవి, హత్యలు చేయడంలో అతనికి సహకరించిన స్నేహితులు పల్లె నాగరాజు గౌడ్, తలకొండరాజు, జీలుకుంట విజయ్, నిట్టా ప్రవీణ్, వల్లెపు దాసుశేఖర్, తిరుపతి జగదీష్‌గౌడ్‌ను రిమాండ్‌కు తరలించారు. నిందితులు హత్యకు ఉపయోగించిన కత్తి, ఇన్నోవా కారు, ఎనిమిది సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. వాట్సాప్ గ్రూప్ నుంచి తనను తొలగించారనే ఆగ్రహంతో జల్కం రవి తన స్నేహితులతో కలిసి ఈ హత్యలు చేసినట్టు శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. డీసీపీ కథనం ప్రకారం.. జల్కం రవిని గ్రూప్ నుంచి తొలగించడంతో గుండమోని శివ, శేషగారి శివపై కక్ష పెంచుకున్నాడు. వారిని చంపేందుకు పథకం వేశాడు. తన స్నేహితులతో కలిసి వెళ్లి నగరంలోని గాయత్రీ చౌరస్తా వద్ద ఇద్దరు శివలను బుధవారం సాయంత్రం తన కారులో ఎక్కించుకున్నాడు. అక్కడి నుంచి బటర్‌ఫ్లై సిటీలోని విల్లాకు తీసుకొచ్చి కత్తులతో పొడిచి చంపారు. హత్య అనంతరం విల్లాకు తాళం వేసి పరారయ్యారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

డిగ్రీ సీటు రాలేదని విద్యార్థి ఆత్మహత్య



పెన్‌పహాడ్, జూన్ 7: డిగ్రీ కళాశాలలో సీటు రాలేదనే మనస్తాపంతో సూర్యాపేట జిల్లాకు చెందిన ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి బంధువులు, పోలీసుల కథనం ప్రకారం.. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం మేఘ్యాతండ గ్రామ పంచాయతీ పరిధి రత్యాతండాకు చెందిన భూక్య కృష్ణ-విజయ దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరి పెద్ద కొడుకు రాహుల్(19) నల్లగొండ జిల్లా డిండిలో ఇంటర్ చదివాడు. ఇంటర్మీడియట్‌లో తక్కువ మార్కులు వచ్చినందున డిగ్రీలో సీటు రాకపోవటంతో రాహుల్ కొద్దిరోజులుగా మనస్తాపంతో ఉన్నాడు. ఈ క్రమంలో తల్లిదండ్రులు శుక్రవారం ఉపాధి పనులకు, తమ్ముడు సూర్యాపేటకు వెళ్లడంతో ఇంట్లో ఒంటరిగా ఉన్న రాహుల్ సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. తల్లిదండ్రులు ఇంటికి తిరిగి వచ్చి చూసేసరికి రాహుల్ ప్రాణాలు కోల్పోయి ఉన్నాడు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

మహారాష్ట్ర హెచ్చరిక

కేంద్రంలో భారతీయ జనతాపార్టీకి సొంతబలంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగల అవకాశాన్ని దక్కనివ్వకుండా చేసింది మహారాష్ట్ర. ఆ పార్టీని కనీస మెజారిటీకి దూరంగా నిలిపివేయడంలో ఉత్తర్‌ప్రదేశ్ తరువాత ఈ రాష్ట్రమే ప్రముఖపాత్ర పోషించింది. గత సార్వత్రిక ఎన్నికల్లో ఈ రాష్ట్రం నుంచి 23స్థానాలు గెలుచుకున్న బీజేపీకి ఇప్పుడు 9మాత్రమే వచ్చాయి. ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేనకు ఏడు, అజిత్‌పవార్ నేతృత్వంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీకి ఒకే ఒక్కటి దక్కాయి. మొత్తంగా 48సీట్లలో ఎన్‌డీఏకు వచ్చినవి 17. ఫలితాలు వెలువడగానే, డిప్యూటీ సీఎంగా ఉన్న దేవేంద్రఫడ్నవీస్ పార్టీ అధిష్టానాన్ని బాధ్యతలనుంచి తప్పించాల్సిందిగా కోరారు. మీడియా సమావేశం పెట్టి, ఈ ఫలితాల పాపం తనదే అన్నారు. ఇక, ఒకేఒక్క సీటు గెలుచుకున్న ఎన్‌సిపీ అధినేత అజిత్‌పవార్ గురువారం సమీక్షాసమావేశం నిర్వహిస్తే, 41మంది ఎమ్మెల్యేల్లో ఐదుగురు గైర్హాజరైనారు. ఒకరు విదేశాల్లో ఉన్నారు సరే, మిగతా నలుగురికీ సరిగ్గా అదే రోజు ఆరోగ్యం బాగోలేకపోవడం విశేషం. ముందురోజున ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోదీ మీద భాగస్వామ్యపక్షాలు తమ గౌరవవిశ్వాసాలను ప్రకటించిన ఎన్డీయే సమావేశానికి అజిత్ పవార్ గైర్హాజరైనారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల కారణంగా మహారాష్ట్ర రాజకీయాల్లో రాబోయే రోజుల్లో పలు పరిణామాలు సంభవించబోతున్నాయి.

లోక్‌సభలో 99స్థానాలు నెగ్గి, సెంచరీకి ఒక్కటి తక్కువైన కాంగ్రెస్‌కు మహారాష్ట్రలోని సింగ్లీనుంచి రెబెల్ అభ్యర్థిగా గెలిచిన విశాల్‌పాటిల్ తన మద్దతు ప్రకటించి, తమ పార్టీ బలం నూరుకు చేరినందుకు మహారాష్ట్ర కాంగ్రెస్ సంతోషిస్తోంది. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వసంత్‌దాదాపాటిల్ మనుమడి మద్దతును స్వాగతిస్తూ, వెన్నుపోటుదారులకు, ద్రోహులకు వ్యతిరేకంగా తమ పార్టీ ఎంతో అద్భుతంగా పోరాడిందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఓ సుదీర్ఘమైన ప్రకటన చేశారు. గత రెండు ఎన్నికల్లో సింగిల్ డిజిట్‌కు పరిమితమైన కాంగ్రెస్ ఈమారు డబుల్ డిజిట్ చేరినందుకు ఆ పార్టీ నాయకులు సంతోషంగా ఉన్నారు. మహారాష్ట్ర ఫలితాలు అనూహ్యమైనవేమీ కావు. ప్రజలు ఎటున్నారో కొంతకాలంగా సూచనలు వెలువడుతూనే ఉన్నాయి. చీలినవారిని కాక, ఏలినవారిని ప్రజలు గుర్తుపెట్టుకున్నారు. నెత్తినపెట్టుకున్నారు.

రెండేళ్ళక్రితం నలభైమంది ఎమ్మెల్యేలతో ఉద్ధవ్‌ఠాక్రేమీద తిరుగుబాటు చేసి, బీజేపీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన ఏక్‌నాథ్‌షిండేకు రాష్ట్ర ప్రజలు తాము ఎటువైపో ఈ ఎన్నికల్లో తేల్చిచెప్పారు. వెన్నుపోట్లకు, చీలికలకు పర్యాయపదంగామారి, దేశవ్యాప్తంగా బీజేపీ నేతలు విపక్షపాలిత రాష్ట్రాల్లో షిండేలను సృష్టిస్తాం అంటూ ఒక అస్త్రంగా వాడిన ఏక్‌నాథ్‌కు ప్రజలు గుణపాఠం చెప్పారు. అలాగే, బాబాయ్ శరద్‌పవార్‌ను కాదని, బీజేపీతో జట్టుకట్టి, ఉపముఖ్యమంత్రి అయిన అజిత్‌పవార్‌కు సైతం భవిష్యత్తు భయం కలిగించారు.

మరాఠా కోటా వివాదం చాలా స్థానాల్లో మహాయుతి విజయావకాశాలమీద ప్రభావం చూపింది. కానీ, ముందుగా ఏక్‌నాథ్‌షిండేనీ, ఆ తరువాత అజిత్‌పవార్‌నీ చీల్చి రాష్ట్రంలో బీజేపీ ఆడిన నాటకం ప్రజలకు నచ్చలేదు. పైగా, అప్పటివరకూ తాము అవినీతిపరులుగా చిత్రీకరించిన అజిత్‌పవార్, అశోక్‌చవాన్ వంటి వారినే బీజేపీ చేర్చుకొని కీలకమైన పదవులు ఇవ్వడం ప్రజలు మెచ్చలేదు. ఈడీ, సీబీఐలను ప్రయోగించి, అధికారపక్ష ఎమ్మెల్యేలను వెంటతరిమి, భయపెట్టి, వెన్నుపోట్లకు ప్రోత్సహించి, తమ పార్టీలో చేరగానే వారిని పరిశుద్ధులుగా ప్రకటిస్తున్న బీజేపీ 'వాషింగ్‌మెషీన్' విధానాన్ని ప్రజలు అర్థంచేసుకున్నారు. రాష్ట్రం తీవ్ర వ్యవసాయసంక్షోభాన్ని చవిచూస్తున్నది. ఉల్లిపాయలమీద నలభైశాతం పన్నువేయడం, ఎగుమతులను నిలిపివేయడం కూడా రైతులకు కోపం తెప్పించింది. పదిశాతానికి పైగా దళిత జనాభాతో దళిత చైతన్యం అధికంగా ఉన్న మహారాష్ట్రలో రాజ్యాంగానికి సంబంధించి కాంగ్రెస్ చేసిన హెచ్చరికలు కూడా బాగా పనిచేసినట్టున్నాయి. బీజేపీ ఈమారు బలంగా వస్తే అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం మారిపోతుందని, రిజర్వేషన్లకు ముప్పు ఏర్పడుతుందని వారు భయపడినట్టు ఉంది. మహాయుతి దెబ్బతినడానికి ఏయే కారణాలు పనిచేశాయన్నది అటుంచితే, మహావికాస్ అగాడీకి మంచిరోజులు వచ్చాయని ఈ ఫలితాలు తేల్చేశాయి. న్యాయస్థానాలు, ఎన్నికల సంఘం న్యాయం చేయకపోయినా, తాము ఉన్నామని ఉద్ధవ్‌ఠాక్రేకు, శరద్‌పవార్‌కు ప్రజలు భరోసా ఇచ్చారు.

సకల జనుల స్వప్నం 'తెలంగాణ'

దేశంలో అత్యున్నత స్థానమైన పార్లమెంటులో తెలంగాణ ఎంపీలపై పెప్పర్ స్ప్రే దాడులకు పాల్పడినప్పటికీ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటు బిల్లు ఆమోదం పొంది దేశంలో 29వ రాష్ట్రంగా 2014 జూన్ 2న తెలంగాణ ఆవిర్భవించింది. నీళ్లు, నిధులు, నియామకాలు అనే ప్రధాన ఎజెండాతో ముందుకు వెళ్లిన టీఆరఎస్ ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకొని తెలంగాణ రాష్ట్ర ప్రథమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి తొలి ముఖ్యమంత్రిగా కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు బాధ్యతలు చేపట్టారు.

తెలంగాణ మొదటి ప్రభుత్వంపై ప్రజలు ఎన్నో ఆశలు, ఆకాంక్షలు పెట్టుకున్నారు. ఆ దిశగా ప్రభుత్వం కొంత ప్రయత్నం చేస్తుందని భావించారు. రైతులకు సాగునీరు అందించేందుకు గత పాలకులు మొదలుపెట్టిన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కొంత ముందుకు వచ్చినా ప్రాజెక్టుల రీ డిజైన్ పేరుతో అంచనాలకు మించి ప్రాజెక్టుల సామర్థ్యం పెంచడం, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడం, అవినీతి పరాకాష్ఠకు చేరడంతో రైతుల ఆశలు అడియాశలు అయ్యాయి. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను 10 సంవత్సరాలలో 7 లక్షల కోట్ల రూపాయల అప్పుల్లోకి కేసీఆర్ ప్రభుత్వం తీసుకెళ్లింది. ఎన్నో ఏళ్లుగా రైతుల భూ సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. వీటి పరిష్కారం కోసం సమగ్ర భూ సర్వే చేయలేదు. కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్‌లో అనేక లొసుగులు ఉన్నాయి.



ప్రజలకు కనీస మౌలిక సదుపాయాలైన కూడు, గుడ్డ, నీడ కల్పించలేదు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకపోవడం, ఈ పదేళ్ల కాలంలో నిరుద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలన కొనసాగకపోవడం, రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరుల కుటుంబాలను గుర్తించినా ఆదుకోకపోవడం, తెలంగాణ అమరవీరుల స్మారక స్తూపం ఆవిష్కరణ సందర్భంగా కనీసం తెలంగాణ కోసం ఉద్యమించిన గద్దర్‌ను ఆహ్వానించలేదు. అమరుల కుటుంబాలను కూడా పిలువకపోవడం వంటివి టీఆరఎస్ ప్రభుత్వ వైఫల్యాలుగా ప్రజలు భావించి వారి పరిపాలనకు చరమగీతం పాడి కేసీఆర్‌ను ఇంటికి సాగనంపారు.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అటు పార్లమెంటులోను, ఇటు బయట ప్రత్యక్ష ఉద్యమాలు నిర్వహించింది భారతీయ జనతా పార్టీ. గత పది సంవత్సరాలుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టంలో పేర్కొన్న హామీలను ఏ ఒక్కటీ కూడా అమలుపరచలేదు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, గిరిజన యూనివర్సిటీ, ప్రాజెక్టులకు జాతీయ హోదా కల్పించలేదు. తెలంగాణ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి ఇవ్వాల్సిన నిధులు ఇవ్వకుండా రాష్ట్రాన్ని చిన్న చూపు చూసింది. 'తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకై పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా తలుపులు వేసుకొని ఏకపక్షంగా బిల్లును ఆమోదింప చేసుకున్నారని ఏకంగా దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఇటీవల పార్లమెంటు ఎన్నికల బహిరంగసభలో తీవ్ర అభ్యంతరకర వ్యాఖ్యలు చేయడం తెలంగాణ ప్రజలను అవమానించినట్లే. ఇలా కేంద్రంలోను, రాష్ట్రంలోను అధికారంలో ఉన్న ప్రభుత్వాలు ఉద్యమించి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్ర ఆశయాలను తీర్చలేకపోయాయి. ముఖ్యంగా కేసీఆర్ అహంకారపూరిత, ప్రజావ్యతిరేక వైఖరి, కుటుంబ ప్రమేయ పాలన ప్రజలందరికీ అభ్యంతరకరమైంది.

గడిచిన ఎన్నికల్లో కేసీఆర్ పట్ల వ్యతిరేకతతో రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఉత్సాహవంతుడైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని వర్గాలను కలుపుకొని తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చాల్సిన ఆవశ్యకత ఉంది. ప్రజాపాలన కొనసాగాలంటే ముఖ్యమంత్రి, మంత్రులు నిత్యం ప్రజలను, ప్రజా సంఘాలను, ప్రతిపక్షాలను కలవాలి, వారి నుంచి వచ్చే వినతులు స్వీకరించి, పరిశీలించి పరిష్కరించాలి. ప్రజాస్వామ్య పరిరక్షణకై ముఖ్యమంత్రి ముందుండాలి. ముందుగా భూ సమస్యను పరిష్కరించాలి. ధరణి సమస్యలను పరిష్కరించడంతో పాటు రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను అధ్యయనం చేయాల్సి ఉంది. కేసీఆర్ ఎక్కడ వైఫల్యం చెందారో గమనించి, రాష్ట్ర ప్రజల సంక్షేమం దిశగా ప్రజాపాలన సాగించాలి. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందంటే 1969 ఉద్యమకారుల స్వప్నం నుంచి వచ్చిన అనేక రకాల ఉద్యమాలు, పోరాటాల జ్వాల కొనసాగడం సకల జనులు ఆ ఉద్యమాన్ని నడపడం, అన్ని రాజకీయ పక్షాలు ముందుండడం వల్లనే రాష్ట్రం సిద్ధించింది. ప్రజల ఆకాంక్షల కోసం పోరాడి తెచ్చుకున్న తెలంగాణ మానవీయంగా నిలవాలి.


– చాడ వెంకటరెడ్డి

చరిత్రను నడిపించిన ఓయూ విద్యార్థి

భారత సామాజిక ఉద్యమాల చరిత్రలో ముఖ్యంగా విద్యార్థి ఉద్యమ చరిత్రలో తెలంగాణ విద్యార్థి ఉద్యమం గుర్తుండిపోతుంది. నిజానికి విద్యార్థి ఉద్యమానికి పరిమితులున్నా, సామాజిక మార్పుకు దోహదపడే సమూహాల్లో విద్యార్థి సమూహం ఒక్కటి. తెలంగాణ విద్యార్థి ఉద్యమంపై చేసిన ఈ పరిశోధన కేవలం విద్యార్థులకు సాధారణంగా ఉండే లక్షణాన్నే కాకుండా సామాజిక ఉద్యమాల్లో వాళ్లు పోషించిన పాత్రనూ విశ్లేషిస్తుంది. ఈ పరిశోధన ఉస్మానియా యూనివర్సిటీలో 2009 నుంచి జరిగిన విద్యార్థి ఉద్యమ వెలుగులో నడుస్తుంది. ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమానికి ఉన్న పోరాటాల చరిత్ర వలన అది వివిధ భావజాలాలకు వేదికగా ఉంటూ తెలంగాణ ఉద్యమానికి భిన్న దృక్పథాలను ఇచ్చింది. విశాల ప్రజారాశులను ప్రభావితం చేసి తెలంగాణ ఉద్యమంలో కలుపుకుని పోవడం ద్వారా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి ఉద్యమం తెలంగాణ పది జిల్లాల్లో వివిధ యూనివర్సిటీల్లో, కాలేజీల్లో చదువుతున్న విద్యార్థుల దాక తన నెట్‌వర్క్‌ని విస్తరించుకుంది. నిజానికి అన్ని సామాజిక వర్గాల సమూహంగా విద్యార్థులు ఉన్నప్పటికీ విద్యార్థి వర్గాన్ని పెటీ బూర్జువా వర్గంగా భావిస్తారు. కాని, తెలంగాణ విద్యార్థులు, ముఖ్యంగా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు, విద్యార్థులకు ఉండే ఈ సాధారణ లక్షణానికి భిన్నంగా ఉన్నారు. ఈ విద్యార్థులు దాదాపుగా తెలంగాణలోని వ్యవసాయ కూలీల కుటుంబాల నుంచి వచ్చినవాళ్లే. అందులో 90 శాతం విద్యార్థులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత మైనారిటీ వర్గాలకు చెందినవాళ్లే ఉన్నారు. తెలంగాణ ఉద్యమం ఇంత సుదీర్ఘంగా నిలబడగలిగింది అంటే ఈ ప్రత్యేక లక్షణం వలనే. ఈ లక్షణం వల్లే వాళ్లు తమ చుట్టూ ఉన్న సమాజంలో నెలకొని ఉన్న వివిధ రాజకీయ, సామాజిక సమస్యలపై స్పందించారు. వాళ్లు సమాజంలో జరిగే ప్రతి వివక్ష, దోపిడిపై సున్నితంగా ఉండడమే గాక, సమాజహితం కోసం ఏదైనా చేయడానికి ముందుకు వస్తారు.

* * *

అంచెలంచెలుగా ప్రజలు సమూహంగా ఆధిపత్యాలకు వ్యతిరేకంగా చేసే కార్యాచరణే రాజకీయ మార్పుకు కారణమవుతుందని చెప్పేందుకు తెలంగాణ ఉద్యమం ఒక ఉదాహరణ. 1969 ఉద్యమం నుంచి బలమైన విద్యార్థి నాయకత్వం సమాజానికి అందివచ్చింది. ఆ నాయకత్వమే తరువాత ఇక్కడ వచ్చిన



అనేక సామాజిక విప్లవ ఉద్యమాలకు నాయకత్వం వహించింది. బ్రాహ్మణీయ, భూస్వామ్య పెట్టుబడిదారి విధానాల సంకెళ్ల నుంచి ప్రజలను విముక్తం చేసేందుకు వారు దారులు వేశారు. తెలంగాణ జిల్లాలోని ప్రతి గ్రామంలో వారు నాడు వేసిన ప్రభావం ఇంకా ఉంది. పైగా అదే నాయకత్వం దేశంలోని అనేక రాష్ట్రాల్లో నక్సలైట్ ఉద్యమాన్ని ముందుండి నడిపిస్తోంది. అనేక సామాజిక, సాంస్కృతిక, రాజకీయ కారణాల వల్ల 1969 ఉద్యమంతో పోలిస్తే ఇప్పటి విద్యార్థి ఉద్యమానికి పరిమితులున్నాయి. రాజ్య నిర్బంధానికి వ్యతిరేకంగా ప్రత్యామ్నాయ రూపాలను ప్రస్తుత ఉద్యమం తీసుకోలేకపోతోంది. కొన్ని సందర్భాలలో రాజ్యంపై ఆధారపడటమో లేదా రాజ్యంతో చర్చలు చేయడమో చేస్తుంది తప్ప, పోరాటం చేయడం లేదు. అనేక సందర్భాలలో వర్గ, కుల ప్రయోజనాలు నీరుగారిపోయాయి. నిజానికి డిసెంబర్ 2009 నుంచి పూర్తిగా ఉద్యమం విద్యార్థుల నియంత్రణలో నడిచింది. ఆ విద్యార్థుల సమూహంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ నేపథ్యం నుంచి వచ్చిన నాయకత్వమే ఉంది. ఇదే కారణం చేత అగ్రకుల, బూర్జువా వర్గం రాజకీయ జేఏసీని ఏర్పాటు చేసింది.

కుల – వర్గ వైరుధ్యం, ఐక్యత ఉద్యమంలో అనేక సందర్భాల్లో కనిపిస్తుంది. విద్యార్థులు కూడా కులం, ఉపకులం ఆధారంగా విడిపోయారు. దీనికి అన్ని అస్థిత్వాలకన్నా కుల అస్థిత్వం బలంగా ఉండటమే కారణం.

రాజకీయ పార్టీల అవకాశవాదాన్ని, ఎన్నికల ప్రచార రాజకీయాలను సరైన సమయంలో జేఏసీ బహిర్గతం చేయలేకపోయింది. కొన్ని సందర్భాల్లో తమ వ్యక్తిగత ప్రయోజనాల కోసం సంబంధాలను నెరిపింది. జేఏసీ నాయకత్వం, పాల్గొన్న విద్యార్థులు సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన మొదటితరం వాళ్లు కావడం ఇందులో ప్రధాన పాత్ర పోషించింది. కోస్తాంధ్ర మధ్యతరగతి వర్గం ఆక్రమించుకున్న జీవనోపాధి అవకాశాలు తెలంగాణ వస్తే తమకు దక్కుతాయని వెనుకబడిన విద్యార్థులు అనుకున్నారు. అమాయక ఆంధ్ర సెటిలర్లను, బతుకుదెరువు కోసం వచ్చిన సీమాంధ్ర ప్రాంతం వారిని విద్యార్థులు ఏనాడూ ఏమీ అనలేదు. ఆధిపత్య దోపిడీ వర్గం, సీమాంధ్రకు చెందిన పెట్టుబడిదారులపై మాత్రమే దృష్టి సారించారు. బ్రాహ్మణీయ సంస్కృతికి వ్యతిరేకంగా కుల వ్యతిరేక ఉద్యమాన్ని ప్రచారం చేయడంపై ఉస్మానియా విద్యార్థులు ప్రత్యేక దృష్టి పెట్టారు. సైద్ధాంతికంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ అనేది ఒక పెటీ బూర్జువా డిమాండ్. అయితే, వివిధ రకాల సమస్యలు, వివిధ సెక్షన్ల ప్రజల ఆకాంక్షలు ఇందులో మిళితమై ఉండడం వలన ఇతర ప్రాంతీయ పోరాటాలతో పోల్చినప్పుడు భిన్నమైన కోణం కనిపిస్తుంది. ఎందుకంటే, ఇది విభిన్న భావజాలాల ద్వారా వివిధ సామాజిక సమూహాల ఆకాంక్షలు, అవసరాలకు ప్రాతినిధ్యం వహించడానికి ప్రయత్నించింది. ప్రజలు హృదయపూర్వకంగా ఇంత సుదీర్ఘకాలం పనిచేయడానికి గల కారణం అదే. ఒక పరిశోధన అంశంగా తెలంగాణ ఉద్యమాన్ని అర్థం చేసుకోవడంలో ఉస్మానియా విద్యార్థి ఉద్యమం ముఖ్యమైన భాగంగా ఉంటుంది.

– నలమాస కృష్ణ

("ఉస్మానియా వెలుగులో తెలంగాణ విద్యార్థి ఉద్యమం" పుస్తకంలోని కొన్ని భాగాలు ఇవి. 'ఛాయ' ప్రచురించిన ఈ పుస్తకం ఆవిష్కరణ నేటి ఉదయం 11 గంటలకు ఓయూ ఆర్ట్స్ కాలేజీలో జరుగుతుంది.)

నరేంద్రుని కొత్త అంకం

ప్రపంచమొక రంగస్థలం. పురుషులు, స్త్రీలు అందరూ నటీనటులు. వారి ప్రవేశాలు, నిష్క్రమణలు వారికున్నాయి. ఏడు అంకాల నాటకంలో ప్రతి మనిషి తన జీవిత కాలంలో అనేక పాత్రలు ధరిస్తాడు.

– విలియం షేక్స్పియర్



■ పి. చిదంబరం

'పళని' పలుకు



akbar

> అనేక రాజకీయ పక్షాలు భాగస్వాములుగా ఉన్న ఒక సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహించనుండడం మోదీకి పూర్తిగా కొత్త అనుభవమే. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రచారక్‌గా, భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శిగా, గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధాన మంత్రిగా మోదీ తన 55 సంవత్సరాల ప్రజా జీవితంలో సొంత పార్టీకి మెజారిటీ లేని ఒక సంకీర్ణ ప్రభుత్వానికి అధినేత పాత్ర వహించేందుకు ఎన్నడూ సిద్ధం కాలేదు. తనకు తెలియని ఒక ఆటలో ఆయన ఆడనున్నారు!

భారతదేశ గౌరవనీయ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేయనున్న తరుణంలో నేనీ కాలమ్‌ను రాస్తున్నాను; మీరు చదవబోతున్నారు. అయితే నరేంద్ర మోదీ ఇంకెంత మాత్రం ఇదివరకటి ప్రధానమంత్రి కారు, కాబోరు. ఏక –పార్టీ ప్రభుత్వ నిరంకుశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిష్క్రమించనున్నారు, ఒక సంకీర్ణ ప్రభుత్వ ప్రధానమంత్రిగా నరేంద్ర మోదీ రంగప్రవేశం చేయనున్నారు. అనేక పార్టీలు భాగస్వాములుగా ఉన్న సంకీర్ణమది (ఈ భాగస్వామ్య పక్షాలలో తెలుగుదేశం పార్టీకి 16 మంది, జనతాదళ్ (యునైటెడ్) పార్టీకి 12 మంది ఎంపీలు ఉన్నారు). ఇటువంటి సంకీర్ణ ప్రభుత్వానికి నాయకత్వం వహించనుండడం మోదీ మహాశయునికి పూర్తిగా కొత్త అనుభవమే. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ప్రచారక్‌గా, భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శిగా, గుజరాత్ ముఖ్యమంత్రిగా, భారత ప్రధాన మంత్రిగా మోదీ తన 55 సంవత్సరాల ప్రజా జీవితంలో తన సొంత పార్టీకి మెజారిటీ లేని ఒక సంకీర్ణ ప్రభుత్వానికి అధినేత పాత్ర వహించేందుకు ఎన్నడూ సిద్ధం కాలేదు. తనకు తెలియని, స్వీయ స్వభావానికి అనుగుణం కాని ఒక ఆటలో ఆయన ఆడనున్నారు!

సరే, ఇటీవలే ముగిసిన 18వ లోక్‌సభ ఎన్నికలలో భారతీయ ఓటర్లు, కొద్ది వారాల క్రితం వరకు అసాధ్యమైనవిగా కన్పించిన, అనూహ్యమైనవిగా అన్పించిన ఎన్నో ఘనమైన ఫలితాలను సాధించారు. అవి: పార్లమెంటు ఉభయ సభలు నియమ నిబంధనల ప్రకారం నడవనున్నాయి. సభాపతి, సభానాయకుడి విచక్షణ మేరకు కాకుండా ఏకాభిప్రాయంతో సభా నిర్వహణ జరగనున్నది; వివిధ సభా సంఘాల కూర్పు మరింత సమతౌల్యంగా జరగనున్నది. ఆ సంఘాల సారథ్య బాధ్యతలను అన్ని రాజకీయ పార్టీలకు మరింత సమరీతిలో అప్పగించడం జరగనున్నది; లోక్‌సభలో గుర్తింపు పొందిన ప్రతిపక్ష నాయకుడు ఉంటారు, ప్రతిపక్షంలో తగినంత సంఖ్యలో ఎంపీలు ఉన్నారు; పార్లమెంటులోని ప్రభుత్వ, ప్రతిపక్ష సభ్యుల మధ్య ఏకాభిప్రాయం లేనిపక్షంలో రాజ్యాంగ సవరణలు అసాధ్యమవుతాయి; కేబినెట్ లేదా మంత్రిమండలి సమావేశాలు కేవలం ప్రధానమంత్రి నిర్ణయాలను లాంఛనప్రాయంగా ఆమోదించేందుకే ఇంకెంత మాత్రం జరగవు. ప్రధానమంత్రి నిర్ణయాలు కేబినెట్ సమావేశంలో చర్చకు వచ్చేటప్పటికే అవి అమలులో ఉండడం ఇటీవలి సంవత్సరాలలో ఒక పరిపాటిగా ఉన్నది. పెద్దనోట్ల రద్దు లాంటి 'కఠోర ' నిర్ణయాలను 'తెలియజేసేందుకు మాత్రమే' కేబినెట్ సమావేశాలు ఇంకెంత మాత్రం జరగబోవు; రాష్ట్రాల హక్కులను అంగీకరించి, వాటిని కాపాడతారు; కేంద్రం నుంచి రాష్ట్రాలకు నిధుల సంక్రమణ, మంత్రిత్వ శాఖలు/ విభాగాలకు నిధుల కేటాయింపు, పథకాల రూపకల్పన, ఆమోదం నిర్హేతుకంగా జరగవు. అవి విధిగా ప్రభుత్వ భాగస్వామ్య పక్షాల ఆమోదం, సంతృప్తి మేరకు జరిగి తీరుతాయి; ప్రధానమంత్రి ఇకముందు మరింత తరచుగా ఉభయ సభలకు హాజరై సభ్యుల ప్రశ్నలకు సమాధానమిస్తారు, ముఖ్యమైన చర్చలలో పాల్గొంటారు.

ప్రజా తీర్పు నుంచి నేర్చుకోవలిసిన పాఠాలు ఏమిటి? భారత ప్రజలు తమ మనసులోని మాటను ఓటు ద్వారా చెప్పారు. స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు వారు అమిత విలువనిస్తున్నారు. వాక్‌స్వాతంత్ర్యాన్ని, భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు వారు ఎనలేని ప్రాధాన్యమిస్తున్నారు. గోప్యతా హక్కు, నిరసన తెలిపే హక్కును వారు ప్రగాఢంగా కోరుకుంటున్నారు. 'దేశ ద్రోహం', 'పరువు నష్టం' పేరిట బూటకపు కేసులు మోపే ప్రవృత్తిని పాలకులు విడనాడాలి. 'ఎన్‌కౌంటర్', 'బుల్‌డోజర్ న్యాయం'కు స్వస్తి చెప్పాలి (ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు ఇదొక పాఠం). రామమందిరం రాజకీయాలకు అతీతమైనది. రాజకీయ ప్రయోజనాలకు మతపరమైన అంశాలను మళ్లీ ఉపయోగించుకోకూడదు (ఇదెంత ముఖ్యమో, అయోధ్య భాగంగా ఉన్న ఫైజాబాద్ నియోజకవర్గం నుంచి సమాజ్‌వాది పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన 77 సంవత్సరాల అవదేశ్ ప్రసాద్‌ను అడగండి. అలాగే శ్రావస్తి నియోజకవర్గంలో ఓడిపోయిన బీజేపీ అభ్యర్థి సాకేత్ మిశ్రా (ప్రధానమంత్రి మాజీ ప్రధాన కార్యదర్శి, ఆలయ నిర్మాణ ట్రస్ట్ చైర్మన్ నృపేంద్ర మిశ్రా కుమారుడు) మరింత ముఖ్యంగా, మరింత బాగా చెబుతారు). అంకుశ లేని పత్రికా స్వేచ్ఛను ప్రజలు కోరుకుంటున్నారు. బూటకపు ఎగ్జిట్‌పోల్స్ గతించిన విషయమైపోవాలి; ప్రధానమంత్రి అనుక్షణ కదలికలను విసుగెత్తేలా చూపించే పద్ధతిని ఎలక్ట్రానిక్ మీడియా విడనాడాలి; పాలకుల ప్రతి మాటను సమర్థించే వైఖరిని ప్రింట్ మీడియా ఇంకెంత మాత్రం అవలంబించకూడదు; మంత్రులకు ఇబ్బంది కలిగించని రీతిలో ప్రశ్నలు వేయడం శాసన నిర్మాతలకు తగదు; ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐలు అందించిన ప్రకటనలను విధేయపూర్వకంగా వల్లించడాన్ని మానుకోవాలి.

ప్రాంతీయ పార్టీలు తమ ప్రధాన సిద్ధాంతాలు, విశ్వాసాలకు చిత్తశుద్ధితో నిబద్ధమవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ఢిల్లీలో ఒక మాట, రాష్ట్ర రాజధానిలో మరొక మాట చెప్పడాన్ని వారు హర్షించరు. అటువంటి ప్రాంతీయ పక్షాలను అసోం గణపరిషత్, శిరోమణి అకాలీదళ్, జేజేపీ, భారత రాష్ట్రసమితి, జనతాదళ్ (సెక్యులర్)ను శిక్షించిన విధంగా శిక్షించి తీరుతారు. బిజూ జనతాదళ్, వైసీపీల విషయంలో వలే చెంపపెట్టుగా వ్యవహరిస్తారు. ఇటీవలి ఎన్నికలలో ఈ ప్రస్తావిత పార్టీలకు ఎదురైన అనుభవాల నుంచి తెలుగుదేశం పార్టీ, జనతాదళ్ (యునైటెడ్)లు పాఠాలు నేర్చుకోవాలి.

ప్రతిపక్షాల ఎజెండా ఏమిటి? ఒక పార్లమెంటరీ ప్రతిపక్షంగా ప్రవర్తించేందుకు ప్రతిపక్షాలకు పది సంవత్సరాల అనంతరం ఒక అవకాశం లభించింది. పార్లమెంటు లోపలా, బయటా ప్రతిపక్షాలు తమ ఎజెండాకు కట్టుబడాలి. ప్రజలు ఆమోదించి, పలువురు ఇండియా కూటమి అభ్యర్థులను ఎన్నుకోవడానికి కారణమైన కొన్ని భావాలు: దేశ వ్యాప్తంగా సామాజిక– ఆర్థిక సర్వే, కులాల వారీ జనగణన; 106వ రాజ్యాంగ సవరణను వెన్వెంటనే అమలుపరిచి, ప్రజలు ఎన్నుకునే చట్ట సభలలో మహిళలకు రిజర్వేషన్లు సమకూర్చడం; గ్రామీణ ఉపాధి హామీ పథకంతో సహా ప్రతి ఉపాధి కార్యక్రమంలోనూ కనీస దినసరి వేతనాన్ని రూ.400గా నిర్ణయించి అమలుపరచడం; వ్యవసాయ రుణగ్రస్తతపై ఒక శాశ్వత కమిషన్‌ను నియమించి, దాని సిఫారసుల ప్రకారం వ్యవసాయ రుణాలను రద్దు చేయాలి; ప్రభుత్వంలోను, ప్రభుత్వ నియంత్రిత సంస్థలలోను 30 లక్షల ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి; అప్రెంటిసెస్ చట్టానికి, అవసరమైతే సవరణలు చేసి, వెన్వెంటనే అమలుపరచాలి. అప్రెంటిస్‌లను నియమించేలా లాభదాయకంగా నడుస్తున్న ప్రతి వ్యాపార, పారిశ్రామిక సంస్థపై ఒత్తిడి తేవాలి; అప్రెంటిస్‌లకు ఇచ్చే స్టైపెండ్‌ల భారాన్ని ప్రభుత్వమూ పంచుకోవాలి; అగ్నివీర్ పథకాన్ని రద్దు చేయాలి; పౌరసత్వ సవరణ చట్టం రాజ్యాంగబద్ధతను సుప్రీంకోర్టు నిర్ణయించేంతవరకు దాని అమలును నిలిపివేయాలి; సీబీఐ, ఈడీ, ఎనఐఏ, ఎస్ఎఫ్ఐఓ, ఎన్‌సీబీ మొదలైన దర్యాప్తు సంస్థలను ఒక సంయుక్త పార్లమెంటరీ సంఘం పర్యవేక్షణలో ఉంచాలి.

జూన్ 9న ఒక కొత్త ఆట ఆరంభమవనున్నది. కొత్త ఆటగాళ్లు అగ్రభాగంలో ఉన్నారు. ఆటగాళ్ల నిష్క్రమణలు, ప్రవేశాలను గమనిస్తూ ఉండండి.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

రాష్ట్ర సాధనలో ఆది నుంచీ కాంగ్రెస్సే కీలకం!

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం జరిగిన సుదీర్ఘ పోరాటం మూడు దశల్లో జరిగింది: మొదటిదశ– 1956లో విశాలాంధ్రలో విలీనానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటం; రెండవ దశ– 1969లో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం; మూడవ దశ– 2013కు ముందు జరిగిన తుది దశ పోరాటం. ఈ మూడు దశల్లోనూ పార్టీలకతీతంగా అందరూ పాల్గొన్నా, కాంగ్రెస్ పార్టీ నాయకులదే కీలక పాత్ర. ప్రతి దశలోనూ ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటును వివిధ కారణాలతో వాయిదా వేస్తూ వచ్చినదీ కాంగ్రెస్ పార్టీయే అయినప్పటికీ, చివరకు కాంగ్రెస్ పార్టీ వల్లనే, శ్రీమతి సోనియా గాంధీ దృఢ సంకల్పంతోనే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది.

1969 జూన్ 4వ తేదీన ఉద్యమ ఉధృతికి చలించి రాత్రికి రాత్రి హైదరాబాద్‌కు హుటాహుటిన వచ్చిన నాటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ డాక్టర్ చెన్నారెడ్డి, కె.వి. రంగారెడ్డి, నరోత్తమరెడ్డి, ఎ. మదన్‌మోహన్, ఎమ్. మాణిక్‌రావు, జి. రాజారామ్, అచ్యుతరెడ్డి, శ్రీమతి శాంతాబాయి, శ్రీమతి ఈశ్వరీబాయి, విద్యార్థి నాయకులు మల్లికార్జున్‌లతో సమావేశమై వాస్తవ పరిస్థితులు తెల్సుకుని, ఒక దశలో ప్రత్యేక రాష్ట్రాన్ని ఇవ్వాలని భావించినా, ఆమె దౌత్య సలహాదారులలో ఒకరు, నిజాం నవాబ్ ఐక్యరాజ్యసమితి సెక్యూరిటీ కౌన్సిల్‌లో వేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉన్నదనే విషయాన్ని తెలిపినందునే వెనక్కి తగ్గారు.

హైదరాబాద్ రాష్ట్రంలో 9 తెలంగాణకు చెందిన జిల్లాలు, 4 కన్నడ జిల్లాలు, 4 మరాఠి జిల్లాలు ఉండేవి. 1953లో దేశంలో భాషా ప్రాతిపదికపై రాష్ట్రాల పునర్ వ్యవస్థీకరణకు ఒక కమిషన్ వేయగా అది ఇక్కడి కన్నడ ప్రాంతాలను మైసూరు రాష్ట్రంలోను, మరాఠా ప్రాంతాలను బొంబాయి రాష్ట్రంలోను కలపాలని, తెలంగాణ జిల్లాలతో హైదరాబాద్ రాష్ట్రాన్ని యథాతథంగా ఉంచాలని సిఫారసు చేసింది. హైదరాబాద్ స్టేట్ అసెంబ్లీలో దీనిపై చర్చ జరిగినప్పుడు అసెంబ్లీలోని 40 మంది కాంగ్రెస్ శాసనసభ్యులలో 25 మంది ఆంధ్రతో కలవడాన్ని వ్యతిరేకించారు. అప్పటి ప్రధాని నెహ్రూ కూడా తెలంగాణ ప్రజలు అమాయకులు అని సానుభూతి వ్యక్తం చేసినా చివరకు తెలంగాణ, ఆంధ్ర ఒకటి కాక తప్ప లేదు.

అప్పటి కేంద్ర హోం మంత్రి గోవింద వల్లబ్ పంత్ సమక్షంలో 1956 ఫిబ్రవరి 20 నాడు ఒక పెద్ద మనుషుల ఒప్పందం (gentlemen agreement) జరిగింది. ఈ ఒప్పందంపై తెలంగాణ తరఫున సంతకం చేసిన నలుగురూ కాంగ్రెస్ నాయకులే కావడం గమనార్హం.

హైదరాబాద్ రాష్ట్రంలో బయట వారికి కీలక ఉద్యోగాలు ఇస్తున్నారని, ముల్కీ నిబంధనలు అమలు చేయాలని 1952లో పెద్ద ఎత్తున ఆందోళనలు చెలరేగాయి. నలుగురు ప్రాణాలు కూడా కోల్పోయారు. తెలంగాణ ప్రజల అసంతృప్తి 1968లో ఖమ్మంలో రవీంద్రనాథ్ అనే విద్యార్థి నిరవధిక నిరాహారదీక్ష రూపంలో మరోసారి బయటపడింది. పెద్ద మనుషుల ఒప్పందంలో ఇచ్చిన సేఫ్ గార్డ్‌లను అమలు చేయాలని కోరుతూ మొదలైన ఉద్యమం తెలంగాణ ప్రాంతమంతా ప్రాకి, ప్రత్యేక రాష్ట్రం కావాలనే మహోద్యమంగా మారింది. సుమారు 369 మంది బలయ్యారు.

ఈ ఉద్యమాన్ని విస్తృతం చేయడానికి మొదట్లో ప్రముఖ న్యాయవాది ఎ. మదన్‌మోహన్ అధ్యక్షుడిగా తెలంగాణ ప్రజాసమితి ఆవిర్భావం జరిగింది. ఆ తర్వాత డాక్టర్ మర్రి చెన్నారెడ్డి అధ్యక్షులయ్యారు. తెలంగాణ అంతటా నిరాహారదీక్షలు, సత్యాగ్రహాలు, జైల్ భరోలతో అట్టుడికిపోయింది. ఈ దశలో సిద్దిపేట, ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానాలకు ఉపఎన్నికలు జరగగా తెలంగాణ ప్రజా సమితి తరఫున పోటీ చేసిన ఎ. మదన్‌మోహన్, నాగం కృష్ణారావులు ఘనవిజయం సాధించడం ప్రత్యేక రాష్ట్ర వాదులలో

> లగడపాటి పెప్పర్ స్ప్రే ఘటన తరువాత సభ వాయిదా పడి, బయటకు వచ్చిన అద్వానీని మీడియా ప్రతినిధులు తెలంగాణ బిల్లు సంగతేమిటని ప్రశ్నిస్తే, ఇంకెక్కడి బిల్లు అని ఆయన చెప్పినా, తిరిగి స్పీకర్ మీరా కుమార్‌ను బతిమాలి, ఒప్పించి, సభను సమావేశం కావించి బిల్లును పాస్ చేయించిన ఘనత కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులది, కేంద్రమంత్రి ఎస్.జైపాల్‌రెడ్డిది కాదా? కాంగ్రెస్ సభ్యులు సభలో లేకుంటే ఇది సాధ్యమయ్యేదా?



మరింత ఉత్సాహాన్ని నింపింది. బ్రహ్మానందరెడ్డి మంత్రివర్గంలో మంత్రిగా ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ మంత్రివర్గం నుంచి రాజీనామా చేసి ఉద్యమంలో కీలక పాత్ర వహించారు. ఈ ఉధృత వాతావరణం దృష్ట్యా బ్రహ్మానందరెడ్డి ప్రభుత్వం చెన్నారెడ్డి, మదన్‌మోహన్, కొండా లక్ష్మణ్ బాపూజీ, టి. అంజయ్య తదితరులను పిడి చట్టం క్రింద అరెస్టు చేసి రాజమండ్రి జైలుకు తరలించింది.

1971లో లోక్‌సభకు మధ్యంతర ఎన్నికలు నిర్వహించగా దేశమంతా ఇందిరా ప్రభంజనం కొనసాగినా, తెలంగాణలోని 14 సీట్లలో పోటీ చేసిన తెలంగాణ ప్రజాసమితి పది సీట్లను గెలిచి ఉద్యమ కీర్తిని ప్రపంచానికి చాటింది. ఇంత గొప్ప ఉద్యమం, ప్రాణ త్యాగాల తర్వాత కూడా ఇందిరాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇవ్వడానికి సుముఖంగా లేరని అర్థమయ్యాక తెలంగాణ ప్రజా సమితి కాంగ్రెస్‌లో విలీనం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

తెలంగాణ ప్రజలను సంతృప్తిపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం 6 సూత్రాల పథకాన్ని ప్రకటించింది. ముఖ్యమంత్రిగా బ్రహ్మానంద రెడ్డిని తప్పించి పి.వి. నర్సింహారావుకు 1971 సెప్టెంబర్‌లో ముఖ్యమంత్రి బాధ్యతలు అప్పగించారు. అలా తెలంగాణ ప్రాంతం నుంచి పి.వి. తొలి ముఖ్యమంత్రి అయ్యారు. తర్వాత కొన్నాళ్ళకే 1972లో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కావాలని జై ఆంధ్ర ఉద్యమం మొదలైంది. కాకాని వెంకటరత్నం, బివి సుబ్బారెడ్డి, బసిరెడ్డి తదితర నాయకులు ముందు ఉండి జై ఆంధ్ర ఉద్యమాన్ని నడిపారు. ఆంధ్ర ప్రాంతం వారు ప్రత్యేక రాష్ట్రం కావాలని ఉద్యమం చేస్తుండటంతో తెలంగాణ కాంగ్రెస్ నాయకులలో తిరిగి ఆశలు చిగురించి డాక్టర్ చెన్నారెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ఫోరం ఫర్ సపరేట్ తెలంగాణను ఏర్పాటు చేసి మరోసారి ఉద్యమించడానికి పూనుకున్నారు. ఈ సారి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం రెండు ప్రాంతాలలో ఉధృతంగా సాగి చివరకు రాష్ట్రపతి పాలన విధించడం జరిగింది. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ ద్వారా 6 పాయింట్స్ ఫార్ములాను రూపొందించి ఇరు ప్రాంతాల ప్రజలను సంతృప్తిపరిచే ప్రయత్నం చేసింది.

తదనంతర కాలంలో అడుగడుగునా వివక్షలతో తెలంగాణ ప్రజలు ప్రత్యేక తెలంగాణ రాష్ట్రమే శరణ్యమనే నిర్ణయానికి వచ్చారు. కాంగ్రెస్ శాసనసభ్యుల ఫోరం జి.చిన్నారెడ్డి కన్వీనర్‌గా ఏర్పడి తెలంగాణ ఏర్పాటుకు సహకరించాలని 41 మంది కాంగ్రెస్ శాసనసభ్యుల సంతకాలతో కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి సోనియా గాంధీకి ఒక మెమోరాండం సమర్పించారు.

2001లో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఒక తీర్మానం చేసి రెండవ స్టేట్స్ రీ ఆర్గనైజేషన్ కమిటీ వేసి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అంశాన్ని పరిశీలించాలని ఎన్డీఏ ప్రభుత్వానికి పంపితే, అప్పటి హోంమంత్రి ఎల్.కె. అద్వానీ చిన్న రాష్ట్రాలు దేశ ఐక్యత పరంగాను, ఆర్థికంగాను అనుకూలం కావని చెప్పారు.

చంద్రబాబు నాయుడుతో విభేదించి తెలుగుదేశం పార్టీని వీడిన కె. చంద్రశేఖరరావు తెలంగాణ రాష్ట్ర సమితి (టీఆర్ఎస్)ని ఏర్పాటు చేశారు. 2004లో జరిగిన రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్, టీఆర్ఎస్ కలిసి పోటీ చేయడం, రాజశేఖర్ రెడ్డి మంత్రివర్గంలో ఆరుగురు టీఆరఎస్ మంత్రులు ఉండటం, కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వంలో కేసీఆర్, ఎ.నరేంద్ర చేరడం ప్రత్యేక తెలంగాణకు కాంగ్రెస్ అనుకూలం అనడానికి నిదర్శనం.

తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు జరుగుతున్న ఆందోళనల నేపథ్యంలో శ్రీమతి సోనియాగాంధీ జన్మదినమైన 9 డిసెంబర్ 2009న కేంద్ర హోంమంత్రి చిదంబరం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు కీలకమైన ప్రకటన చేశారు. 2010 ఫిబ్రవరి 3న జస్టిస్ శ్రీకృష్ణ కమిటీ ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటైంది. మరోపక్క, డిసెంబరు 9 ప్రకటనతో రాష్ట్రం వస్తుందని ఆశించిన విద్యార్థులు, యువకులు ఈ ఆలస్యానికి ఆవేదన చెంది ఆత్మహత్యలు చేసుకుంటున్న సంఘటనలు జరిగాయి.

తదనంతరం లోక్‌సభలో, రాజ్యసభలో బీజేపీ మద్దతు ఇచ్చినా తెలంగాణ బిల్ పాస్ కావడంలో కాంగ్రెస్ పార్లమెంటు సభ్యుల పాత్ర అమోఘం. లగడపాటి రాజగోపాల్ సభలో పెప్పర్ స్ప్రేతో గందరగోళం సృష్టిస్తే అడ్డుపడ్డది కాంగ్రెస్ సభ్యులే! లగడపాటి పెప్పర్ స్ప్రే ఘటన తరువాత సభ వాయిదా పడి, బయటకు వచ్చిన అద్వానీని మీడియా ప్రతినిధులు తెలంగాణ బిల్లు సంగతేమిటని ప్రశ్నిస్తే, ఇంకెక్కడి బిల్లు అని ఆయన చెప్పినా, తిరిగి స్పీకర్ మీరా కుమార్‌ను బతిమాలి, ఒప్పించి, సభను సమావేశం కావించి బిల్లును పాస్ చేయించిన ఘనత కాంగ్రెస్ పార్లమెంటు సభ్యులది, కేంద్రమంత్రి ఎస్. జైపాల్‌రెడ్డిది కాదా? కాంగ్రెస్ సభ్యులు సభలో లేకుంటే ఇది సాధ్యమయ్యేదా?

చివరకు శ్రీమతి సోనియాగాంధీ కృతనిశ్చయంతో తెలంగాణ ప్రజల కల సాకారమైనది. పదేళ్ళు ఆలస్యమైనా సోనియమ్మను కృతజ్ఞతాపూర్వకంగా సన్మానించుకోవడాన్ని యావత్ తెలంగాణ ప్రజలు హర్షిస్తున్నారు.

■ జి. నిరంజన్

సీనియర్ ఉపాధ్యక్షులు, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ



కౌంటింగ్ కేంద్రం వద్ద విజయానందంలో తీన్మార్ మల్లన్న

పట్టభద్రుల ఎమ్మెల్సీగా మల్లన్న విజయం!

- అధికారిక ప్రకటన కోసం అర్ధరాత్రి వరకు ఎదురుచూపు
- అన్ని రౌండ్లలోనూ తీన్మార్ మల్లన్నదే ఆధిక్యత
- చివరి వరకు ఉత్కంఠగా సాగిన లెక్కింపు
- మూడో ప్రయత్నంలో దక్కిన విజయం

నల్లగొండ, జూన్ 7 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన శాసనమండలి నల్లగొండ, వరంగల్, ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గ ఉపఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న విజయం దాదాపు ఖాయమైంది. కానీ ఎన్నికల సంఘం అనుమతితో ఆయన గెలుపును ప్రకటించేందుకు అధికారులు శుక్రవారం అర్ధరాత్రి వరకు ఎదురుచూశారు. ద్వితీయ ప్రాధాన్యత ఓట్ల లెక్కింపు అనంతరం సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగు రాకేష్‌రెడ్డి కంటే మల్లన్నకు ఎక్కువ ఓట్లుండడంతో మల్లన్నను విజేతగా ప్రకటించేందుకు ఎన్నికల అధికారులు ఎన్నికల సంఘానికి లేఖరాశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఉన్నతాధికారుల నుంచి అనుమతి తీసుకొని అధికారికంగా ప్రకటించడమే మిగిలింది. మూడు రోజుల పాటు సాగిన ఓట్ల లెక్కింపులో ప్రతీ రౌండ్‌లోనూ మల్లన్న ఆధిక్యతను చాటితే రాకేష్‌రెడ్డి కూడా సత్తా చాటుతూ వచ్చారు. చివరి వరకు కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థుల మధ్య పోటాపోటీ నెలకొనడం ఉత్కంఠను రేపింది. ఇక స్వతంత్రుల్లో అశోక్‌కుమార్ మినహా మిగిలిన 48మందికి వచ్చిన ఓట్లను ఎలిమినేషన్‌లో పద్ధతిలో చేయగా.. తీన్మార్ మల్లన్న, రాకేశ్‌రెడ్డికి దాదాపు సమానంగా ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు వచ్చాయి. మొత్తం 57 మంది అభ్యర్థుల్లో రాత్రి పదిగంటలవరకు అధికారికంగా ప్రకటించిన ప్రకారం మొదటి 47 మంది స్వతంత్ర అభ్యర్థుల బ్యాలెట్ల నుంచి వచ్చిన ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను కలుపుకొని కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 124899 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి 1,05,524 ఓట్లు వచ్చాయి. బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 43,956, స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ పాలకూరికి 30,461 ఓట్లు వచ్చాయి. ఈ ఎలిమినేషన్ల తర్వాత కూడా కోటా ఓటు రాకపోవడంతో మిగిలిన స్వతంత్ర అభ్యర్థులు జడ్సన్, పాలకూరి అశోక్‌కుమార్‌తో పాటు, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేషన్ కూడా రాత్రి పదిలోపు పూర్తయింది. అప్పటికీ మల్లన్నకే ఆధిక్యత ఉన్నప్పటికీ కోటా ఓటుకు చేరకపోవడంతో ఎన్నికల సంఘం అనుమతి మేరకు ఆయన్ను విజేతగా ప్రకటించే ప్రక్రియను

మిగతా 8వ పేజీలో..

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు వేళాయే..

- షెడ్యూల్‌ను ప్రకటించిన ప్రభుత్వం
- నేటి నుంచే ప్రక్రియ ప్రారంభం

వివరాలు : 7లో..

'చెరువుల చెర'కు చరమగీతం

- పరిరక్షణకు నడుంబిగించిన రాష్ట్ర ప్రభుత్వం
- మున్సిపాలిటీలకు బాధ్యత అప్పగించిన సర్కారు
- మార్గదర్శకాలు జారీ.. పట్టణ పరిధిలో కొనసాగుతున్న సర్వే
- లేక్ కమిటీల ఏర్పాటుకు చర్యలు



కబ్జాకోరల్లో బెస్తం చెరువు

హనుమకొండ, జూన్ 2 (ఆంధ్రజ్యోతి): పురపాలికల పరిధిలోని చెరువులకు త్వరలోనే మహర్దశ పట్టనున్నది. వాటి పరిరక్షణపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. వీటిని రక్షించే బాధ్యతను మున్సిపాలిటీలు, మహానగర పాలక సంస్థలకే అప్పగించాలని నిర్ణయించింది. ఇందుకు కావలసిన వనరులను ప్రభుత్వం సమకూరుస్తోంది. నీటిపారుదల శాఖ పరిధిలో ఉన్న ఈ చెరువులను ఆ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. ఇటు మునిసిపాలిటీలు కూడా వాటి రక్షణ బాధ్యత మాదికాదన్నట్టు వ్యవహరిస్తూ వచ్చాయి. దీంతో చెరువులు కబ్జా కోరల్లో చిక్కుకొని క్రమంగా అదృశ్యమవుతున్నాయి, దీని వల్ల పట్టణప్రాంతాల్లో భూగర్భజల మట్టాలు తగ్గిపోయి తాగునీటికి కటకట ఏర్పడుతోంది. దీనిని దృష్టిలో పెట్టుకొని పట్టణాల్లోని చెరువులు, కుంటలపై ప్రభుత్వం తాజాగా దృష్టిసారించింది. వీటిని అభివృద్ధి చేయాలని, కబ్జాలకు గురికాకుండా అడ్డుకట్ట వేయాలని నిర్ణయించింది.

చెరువుల రక్షణ పురపాలికలకు..

చెరువుల పునరుద్ధరణ, పరిరక్షణ బాధ్యతను ప్రభుత్వం పురపాలిక శాఖకు అప్పగించింది. గతంలో చెరువులతో పాటు కుంటలు పురపాలికల్లోని ప్రజల అవసరాల నీటి అవసరాలను తీర్చాయి. కాలక్రమేణా చెరువుల రూపు రేఖలు మారుతున్నాయి. చెరువులను కాపాడే దిశగా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తోంది. ఆనవాళ్లు కోల్పోతున్న చెరువులు, కుంటలను పునరుద్ధరించడానికి డైరెక్టర్ ఆఫ్ మునిసిపల్ అడ్మినిస్ట్రేషన్ (డీఎంఏ) ఇటీవల పురపాలక సంఘాల కమిషనర్లతో వర్క్‌షాపు ఏర్పాటు చేశారు. పురపాల సంఘాల పరిధిలోని చెరువుల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకునే విషయమై చర్చించారు. నీటిపారుదల, రెవెన్యూ, పురపాలక శాఖలకు చెందిన ఇంజనీర్లు, అధికారులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని మౌఖిక ఆదేశాలు జారీ చేశారు.

చెరువులపై సర్వే

మునిసిపాలిటీల పరిధిలోని చెరువులకు పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు వాటి ప్రస్తుత పరిస్థితిపై ప్రత్యేకంగా సర్వే చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం చెరువులు పరిస్థితి ఎలా ఉంది? నీటి సామర్థ్యం ఎంత? బఫర్ జోన్ పరిధి ఎంత? ఎఫ్‌టీఎల్ ఏ మేరకు ఉన్నది? అక్రమణలు జరిగాయా? చెరువుల్లో కాలుష్య పరిస్థితి ఏమిటీ? పునరుద్ధరించడానికి అయ్యే వ్యయం, వాటిని అభివృద్ధి చేయడానికి ఎలాంటి విధానం అనుసరించాలి? తదితర అంశాల ప్రాతిపదకగా సర్వే నిర్వహిస్తారు. చెరువుల్లో మురుగు వ్యర్థాలు ప్రవహిస్తే వాటిని శుద్ధి చేసిన తర్వాతే మళ్లించేందుకు ఏర్పాటు చేయాల్సిన వ్యవస్థపై ప్రత్యేకంగా కమిషనర్లు దృష్టి సారించాలని సమావేశంలో డీఎంఏ ఆదేశించారు. కాగా, చెరువుల అభివృద్ధికి సంబంధించిన పూర్తి మార్గదర్శకాలు త్వరలోనే జారీ కానున్నాయి. వరంగల్ నగరంలోని భద్రకాళి చెరువు బండ్‌ను స్మార్ట్‌సిటీ పథకం కింద సుందరీకరించారు. కేయూ 100 ఫీట్ల రోడ్డును ఆనుకొని ఉన్న వడ్డేపెల్లి చెరువును రూ.26కోట్ల వ్యయంతో సుందరీకరిస్తున్నారు. బందం చెరువులను అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గణపతి విగ్రహాలను నిమజ్జనం చేసే వినాయక్ సాగర్ (చిన్నవడ్డెపెల్లి) చెరువును సుందరీకరించేందుకు ప్రణాళికలను సిద్ధం చేసినా ఆచరణలోకి రాలేదు.

లేక్ కమిటీలు

గతంలో చెరువుల పరిరక్షణ కమిటీలు ఉండేవి. కలెక్టర్ అధ్యక్షతన గల ఈ కమిటీలో నీటిపారుదల, రెవన్యూ, పోలీసు, మున్సిపాలిటీ శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సభ్యులుగా ఉండేవారు. ప్రస్తుతం కొన్నిచోట్ల మాత్రమే ఇవి నామమాత్రంగా ఉన్నాయి. అవి చెరువుల గురించి పెద్దగా పట్టించుకోవడం లేదు. ఈ దృష్ట్యా తాజాగా లేక్ కమిటీలను వేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

లోకాయుక్తలో ఫిర్యాదు

ఖిలా వరంగల్ మండల పరిధిలోని సర్వే నెంబర్ 241లో 105.29 ఎకరాల విస్తీర్ణంలో గల బెస్తం చెరువు కబ్జాకు గురవుతోంది. ఈ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో రైస్‌మిల్లులు, డైయిరీ ఫామ్‌లు, ఫర్నిచర్ తయారీ షాపులు వెలిశాయి. విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం 18ఎకరాలు ఇందులో నుంచే ఇచ్చారు. ఈ చెరువును సర్వే చేయించి ఎఫ్‌టీఎల్ హద్దులు పాతి, ఆక్రమణకు గురికాకుండా చూడాలని వినియోగదారుల మండలి ప్రతినిధులు సాంబరాజు చక్రపాణి, కాకతీయ వారసత్వ సంపద పరిరక్షణ కన్వీనర్ చీకటి రాజు సర్వే సెటిల్‌మెంట్ అండ్ ల్యాండ్ రికార్డు కమిషనర్‌కు ఇటీవల విజ్ఞప్తి చేశారు. నగరంలోని చెరువుల కబ్జాపై లోకాయుక్తలో ప్రస్తుతం విచారణ జరుగుతోంది. చెరువుల స్థితిగతులను మార్చడానికి ప్రభుత్వం నిర్ణయానికి రావడంతో వాటి అభివృద్ధిపై ఆశలు రేకెత్తుతున్నాయి.

కబ్జాకోరల్లో చెరువులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక మహానగర పాలక సంస్థతోపాటు తొమ్మిది మున్సిపాలిటీలు ఉన్నాయి. జనగామ, మహబూబాబాద్, నర్సంపేట, తొర్రూరు, పరకాల, డోర్నకల్ వర్ధన్నపేట, మరిపెడ, భూపాలపల్లి వీటిలో ఉన్నాయి. ఈ మునిసిపాలిటీల పరిధిలో 200కుపైగా చిన్న, పెద్ద చెరువులు ఉన్నాయి. ఒక్క వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోనే 56 చెరువులు ఉండగా, వీటిలో 20 చెరువులు మాయమైపోయాయి. ప్రస్తుతం 36 చెరువులు ఉన్నట్టు ఇటీవల గుర్తించారు. ఇవన్నీ ప్రస్తుతం కబ్జాకోరల్లో చిక్కుకొని చిక్కిశల్యమౌతున్నాయి. ములుగురోడ్‌లోని కోట చెరువు 30 ఎకరాలు, మామునూరు పెద్ద చెరువు 40 ఎకరాలు, దేశాయిపేటలోని చిన్నవడ్డెపెల్లి చెరువు 20 ఎకరాలు, హంటర్‌రోడ్డులోని న్యూశాయంపేట చెరువు 20 ఎకరాలు, హసన్‌పర్తి పెద్ద చెరువు 30 ఎకరాలు, అమ్మవారిపేట దామెర చెరువు 20 ఎకరాలు, ఉర్సు రంగ సముద్రం చెరువు 26 ఎకరాలు, కాజీపేట బంధం చెరువు 25 ఎకరాలు, హనుమకొండ వడ్డెపెల్లి చెరువు 30 ఎకరాలు తిమ్మాపూర్ చెస్తం చెరువు 30 ఎకరాలు, కబ్జాకు గురయ్యాయి. వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో 36 చెరువులు ఉన్నాయి. స్తంభంపల్లి పెద్ద చెరువు, హసన్‌పర్తి, ముచ్చెర్ల, పలివేల్పుల, పెగడపల్లి, వంగపహాడ్ ఊరచెరువులు, మట్టెవాడ చింతాలి చెరువు, దేశాయిపేట కోట చెరువు, ఎనుమాముల చిన్నవడ్డెపెల్లి చెరువు, మొగిలిచెర్ల కోట చెరువు, పోతరాజుపల్లి చెరువు, ఖిలా వరంగల్ పెద్ద చెరువు వసంతాపూర్ గుండం, గాడిపెల్లి ఊరచెరువు, సింగారం పెద్ద చెరువు, రంగశాయిపేట చెరువు, అమ్మవారిపేట దామెర చెరువు, ఉర్సు చెరువు, భద్రకాళి చెరువు, కాజీపేట కోట చెరువు, కడిపికొండ దంతాల చెరువు, మండికొండ బతుకమ్మ చెరువు, కాజీపేట ఊర చెరువు, కాజీపేట సింగిపల్లి చెరువు, సోమిడి బంధం చెరువు, బీమారం, మునిపల్లి చెరువు వీటిలో ఉన్నాయి.



బ్యారేజీ దిగువన మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్

వరదలు రాకముందే పనులు పూర్తవ్వాలి

- ఎన్‌డీఎస్‌ఏ సూచనలు పాటిస్తూ వేగం పెంచాలి
- నిర్మాణ సంస్థల ఖర్చులతోనే టెస్టులు, తాత్కాలిక మరమ్మతులు
- మేడిగడ్డ బ్యారేజీ పర్యటనలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- పార్వతీ బ్యారేజీ నిర్మాణ సంస్థ తీరుపై అసహనం

7



బ్యారేజీని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న జస్టిస్ పినాకి చంద్ర ఘోష్

పనుల్లో వేగం పెంచండి

- అన్నారం బ్యారేజీ సందర్శనలో జస్టిస్ పినాకి చంద్ర ఘోష్



100 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్న క్రీడాకారులు

ముగిసిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

- ఓవరాల్ చాంపియన్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా
- బాలురలో హనుమకొండ, బాలికలలో భద్రాద్రి కొత్తగూడెం ప్రథమ స్థానం
- పురుషులలో కరీంనగర్, మహిళలలో ఖమ్మం ప్రథమ స్థానం
- విజేతలకు ట్రోఫీ, సర్టిఫికెట్ల ప్రదానం

6

నైతిక విజయం బీజేపీదే..

- కాంగ్రెస్ మద్యం, డబ్బు పంచి గెలిచింది..
- రాబోయే రోజుల్లో బీజేపీదే అధికారం
- బీజేపీ నేత అరూరి రమేశ్



మీడియాతో మాట్లాడుతున్న అరూరి రమేశ్

హనుమకొండ టౌన్, జూన్7: వరంగల్ లోక్‌సభ ఎన్నికల్లో నైతిక విజయం బీజేపీ పార్టీదేనని ఆ పార్టీ నేత, వరంగల్ లోక్‌సభ అభ్యర్థి అరూరి రమేశ్ అన్నారు. శుక్రవారం హంటర్‌రోడ్డులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన గెలుపు కోసం అహర్నిశలు పని చేసిన కార్యకర్తలు, పార్టీ నాయకులకు ధన్య వాదాలు తెలుపుతున్నానని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలతో పోల్చుకుంటే బీజేపీకి లోక్‌సభ ఎన్నికలో ఓటు శాతం పెరిగిందన్నారు. కాంగ్రెస్ అధికార దుర్వినియోగానికి పాల్పడి మద్యం, మందు పంపిణీ చేసి గెలిచిందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల్లో వచ్చిన ఓట్లను చూస్తే రాబోయే రోజుల్లో బీజేపీని గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నట్లు అర్థమైపోతుందన్నారు. కేంద్రంలో మోదీ నాయకత్వంలో రాష్ట్రంలో గెలిచిన 8 మంది ఎంపీలు, జిల్లా నాయకత్వం సహకారంతో వరంగల్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానన్నారు. రాబోయే స్థానిక సంస్థ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల విజయం కోసం సమిష్టిగా కృషిచేస్తామన్నారు. ఇండియా కూటమిగా జట్టుకట్టి బీజేపీని ఓడించాలని కుట్రచేసినప్పటికీ ప్రజలు బీజేపీని గెలిపించారని అరూరి అన్నారు. రిజర్వేషన్లు, రాజ్యాంగం రద్దు పేరుతో బీజేపీపై మోసపూరిత ప్రచారం చేసిన కాంగ్రెస్ కొన్ని స్థానాల్లో గెలిచిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలుచేసేలా ప్రజల పక్షాన కొట్లాడుతానన్నారు. మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడైనా రావొచ్చని జోస్యం చెప్పారు. సొంత జిల్లాలో ఎమ్మెల్సీ ఎంపీతోపాటు మల్కాజీగిరిలో ఎంపీని గెలిపించుకోలేని రేవంత్‌రెడ్డి సిగ్గుమాలిన మాటలు మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. ప్రభుత్వ చిహ్నంలో కాకతీయ కళాతోరణాన్ని తొలగించాలని చూస్తే ప్రజాప్రతినిధుల గేట్లకు తాళాలు వేస్తామని హెచ్చరించారు. ఆగస్టు 15 లోపు రైతు రుణాలు మాఫీ చేయకపోతే జిల్లాలోని మంత్రులను రోడ్డుకీడుస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు రావు పద్మ, గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్, మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు, విజయ్‌చందర్‌రెడ్డి, శ్రీరాములు, కుమారస్వామి, సంతోష్‌రెడ్డి, రాంబాబు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి కావ్య తోడ్పడాలి

- ఎన్నికల ఫలితాలను రెఫరెండంగానే స్వీకరించాం
- బీఆర్ఎస్ నేతలే బీజేపీకి ఓట్లు వేయించారు..
- లేకుంటే మరో 3, 4 సీట్లు మాకే దక్కేవి
- మీడియా సమావేశంలో మంత్రి కొండా సురేఖ



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

హనుమకొండ సిటీ, జూన్ 7: వరంగల్ నగరాభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉన్న ఆలోచనలకు ఎంపీగా కడియం కావ్య బాధ్యతలు తోడవ్వాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. శుక్రవారం హనుమకొండలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ.. ఎంపీగా కేంద్రం నుంచి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి బాటలు నిర్మించాలన్నారు. తండ్రి కడియం శ్రీహరి వల్లే ప్రజాసేవలో గొప్పగా పేరు తెచ్చుకోవా లన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించనట్లుగా లోక్‌సభ ఎన్నికల ఫలితాలను రెఫరెండంగానే స్వీకరించామన్నారు. కాంగ్రెస్ ఆరు నెలల పాలన పట్ల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. దీని ఫలితమే రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల్లో 8 సీట్లు సాధించామన్నారు. బీఆర్ఎస్ నేతలు మరీ దగ్గర ఉండి బీజేపీకి ఓట్లు వేయించడంవల్లే ఆ పార్టీకి 8 స్థానాలు లభించాయన్నారు. లేకుంటే కాంగ్రెస్ మరో 3, 4 సీట్లు దక్కేవి అని సురేఖ వివరించారు

దేశానికి రాజ్యాంగమే శ్రీరామరక్ష : కడియం శ్రీహరి

బీఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగమే దేశానికి శ్రీరామరక్ష అని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఉద్ఘాటించారు. లౌకికవాద పరిరక్షణకు దేశ ప్రజలు కార్యోన్ముఖులయ్యారని వెల్లడించారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో ఇండియా కూటమికి లభించిన స్థానాలే ఇందుకు నిదర్శనంగా పేర్కొన్నారు. దేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కరిష్మా తగ్గిందన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికలతో పోలిస్తే ఈసారి బీజేపీకి 63 స్థానాలు తగ్గడమే ఉదంతంగా పేర్కొన్నారు. మరోవైపు కాంగ్రెస్‌కు 47 స్థానాలు పెరిగాయని చెప్పుకొచ్చారు. మోదీ రాజకీయాలు రామాలయం చుట్టే తిరిగాయే తప్ప.. దేశాభివృద్ధి, ప్రజాసంక్షేమం విషయంలో ఆలోచనే చేయలేదని విమర్శించారు. రాబోయే రోజులు కాంగ్రెస్‌వేనని, కానున్న ప్రధానమంత్రి రాహుల్‌గాంధీయే అని చెప్పారు. ఎన్నికల సమయంలో తమ వ్యక్తిగత విషయాలపై కొందరు సన్నాసులు, వెధవలు నోరు పారేసుకున్నారని కడియం శ్రీహరి మండిపడ్డారు. వారికి ప్రజలే బుద్ధి చెప్పారన్నారు.

నీచ రాజకీయ సంస్కృతి కేసీఆర్‌ది : రేవూరి

ప్రతిపక్షాలనే నిర్మూలన చేయాలనే నీచ రాజకీయ సంస్కృతి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ది అని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల సమయంలో కడియం శ్రీహరి, కావ్యలపై వ్యక్తిగత విమర్శలు చేయడం విచారకరమన్నారు. ఊహించిన దాని కంటే కడియం కావ్య రెండు లక్షలకు పైగా ఓట్ల మెజారిటీతో విజయం సాధించి విమర్శకుల నోళ్లు మూయించారన్నారు. వరంగల్ నగరానికి అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ తీసుకువచ్చేలా కావ్య కృషి చేయాలని వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ సూచించారు. వరంగల్ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని ఎంపీ డాక్టరు కడియం కావ్య పేర్కొన్నారు. సమావేశంలో కడియం కావ్యను ఎమ్మెల్యేలు ఇతర కాంగ్రెస్ నేతలు సన్మానించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, టీపీసీసీ నాయకులు నమిండ్ల శ్రీనివాస్, కూచన రవళి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళాతో పాటు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఈవీ శ్రీనివాస్, మార్క విజయ్, బంక సంపత్‌యాదవ్, మోజెస్ ఆనంద్, వీసం సురేందర్‌రెడ్డి, నాయిని లక్ష్మారెడ్డి, పుప్పాల ప్రభాకర్ తదితర నాయకులు పాల్గొన్నారు.

తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి

- ప్రతీ గ్రామంలో పంచాయతీ అధికారులు ఇంటింటి సర్వే చేపట్టాలి
- కలెక్టర్ సిక్తా పట్నానాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నానాయక్

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 7: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల అవసరాల నిమిత్తం తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు అమలుపరుస్తోందని హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నానాయక్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ మందిరంలో జరిగిన సమీక్ష సమావేశంలో మిషన్ భగీరథ ద్వారా తాగునీరు సరఫరాపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తాగునీటి ఇబ్బందులపై జిల్లాలోని అన్ని గ్రామాల్లో సర్వే చేపడుతున్నట్లు తెలిపారు. ప్రతీ ఇంటికి వెళ్లి నల్లా ఉందా.. లేదా అనే విషయం తెలుసుకోవడంతో పాటు ఎన్ని రోజులకోసారి నీరు అందుతుందో, స్వచ్ఛమైన నీరు అందుతుందా తదితర విషయాలను తెలుసుకోవాలన్నారు. ప్రతీ మనిషికి రోజుకు 40 లీటర్ల నీటిని అందించడం సర్కారు లక్ష్యం కావడంతో సర్వే అనివార్యమైందని స్పష్టం చేశారు. ఈ సర్వే ద్వారా క్షేత్రస్థాయి పరిస్థితులు తప్పనిసరిగా తెలుస్తాయన్నారు. జీపీ కార్యదర్శుల నేతృత్వంలో సిబ్బంది సర్వే చేపట్టాలని, విస్తీర్ణం పెద్దగా ఉన్న గ్రామాల్లో సర్వే చేసేందుకు అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తల సహకారం తీసుకోవాలన్నారు. సర్వే పూర్తి వివరాలు ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో పొందుపరచాలని ఆదేశించారు. ఈ సర్వే పది రోజుల్లో పూర్తయ్యేలా అధికారులు ప్రణాళికలు తయారు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్డీవో పీడీ నాగ పద్మజ, జడ్పీ సీఈవో వేదవతి, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

వరంగల్ స్పోర్ట్స్, జూన్ 7: తెలంగాణ రాష్ట్ర స్థాయి యూత్ బాలుర, కిడ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన అథ్లెట్లు అత్యధిక పతకాలను కొల్లగొట్టి సత్తాచాటారు. హనుమకొండ జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా రెండు రోజులుగా నిర్వహిస్తున్నా రాష్ట్ర స్థాయి యూత్ బాలుర, కిడ్స్ అండర్- 8, 10, 12, 14, 16, 20 బాలబాలికల, మెన్ అండ్ ఉమెన్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఉమ్మడి పది జిల్లాల నుంచి 971మంది పాల్గొన్న అథ్లెట్ల మధ్య హోరాహోరీగా జరిగిన అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో అత్యధిక పతకాలు సాధించి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అథ్లెట్లు ఓవరాల్ చాంపియన్‌షిప్‌గా నిలిచారు. అండర్-18 బాలుర విభాగంలో ఆతిథ్య హనుమకొండ జిల్లా క్రీడాకారులు ప్రథమ స్థానం, బాలికల విభాగంలో భద్రాద్రి కొత్తగూడెం క్రీడాకారుల పోటీతత్వాన్ని ప్రదర్శించి సత్తాచాటారు. అదే విధంగా మెన్ విభాగంలో కరీంనగర్ ప్రథమ స్థానం, ఉమెన్ విభాగంలో ఖమ్మం జిల్లాలకు చెందిన అథ్లెట్లు రాణించారు.

కాగా, జేఎన్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల ముగింపు వేడుకలకు ద్రోణాచార్య అవార్డు గ్రహీత, ఇండియా జూనియర్ అథ్లెటిక్స్ చీఫ్ కోచ్ నాగపురి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు ట్రోఫీ, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తల్లిదండ్రులు చిరు ప్రాయం నుంచే వారి పిల్లలను మైదానాలకు పంపించి అథ్లెటిక్స్‌లో శిక్షణ ఇప్పించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. చిన్నారులకు చదువు ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని గుర్తు చేశారు. చిన్నారులను 8వ యేడు నుంచే క్రీడా మైదానాలకు పంపించి అనుభవజ్ఞులైన కోచ్‌ల పర్యవేక్షణలో శిక్షణ ఇప్పించడంతో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడల్లో పాల్గొని అనుకున్న గమ్యాన్ని చేరే అవకాశం ఉంటుందన్నారు. చైనా దేశంలో అక్కడి చిన్నారులను 8ఏళ్ల ప్రాయం నుంచే క్రీడా మైదానాలకు పంపిస్తారన్నారు. రాష్ట్రంలోని ప్రతీ జిల్లా కేంద్రంలో అథ్లెట్ల కోసం సింథటిక్‌ట్రాక్‌లు నిర్మాణం చేపట్టేలాగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు.



అండర్-18బాలుర విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన ఆతిథ్య హనుమకొండ జిల్లా జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న అతిథులు

అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొదురుపాక సారంగపాణి మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ముగింపు రోజు 20కిలోమీటర్ల రేస్‌వాక్, 200, 1500 మీటర్ల పరుగు పందెం, హ్యామర్‌త్రో, డిస్కస్‌త్రో, 4ఇంటూ100రిలే, మిడ్‌లే రిలే, 10వేల మీటర్ల పరుగు పందెం, లాంగ్‌జంప్, విభాగాల్లో పోటీలు నిర్వహించామన్నారు. ఇక్కడ రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ స్థాయిలో ప్రతిభ కనబర్చిన యూత్ అథ్లెట్లు జూన్ 15నుంచి17 వరకు చత్తీస్‌గడ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు. అదే విధంగా సీనియర్స్ అథ్లెటిక్స్ విభాగంలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన అథ్లెట్లు జూన్ 27నుంచి 30 వరకు హరియాణా రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయ స్థాయి సీనియర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొంటారన్నారు.

ఈ కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు స్టాన్‌లీజోన్స్, బాధ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీరాజు, జగన్, రజనీకాంత్, చంద్రశేఖర్‌రెడ్డి సీలం సురేష్, రాజుగౌడ్, నాగరాజు, కోచ్‌లు శ్రీమన్నారాయణ, పీఈటీలు పాల్గొన్నారు.



గ్రూప్ -1 ప్రిలిమినరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ కలెక్టరేట్, జూన్ 7: ఈనెల 9న ఆదివారం జరిగే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పరీక్ష రోజు ఉదయం 9 గంటల నుంచి అభ్యర్థులను పరీక్ష హాల్లోకి పంపించాలని, 10 గంటలకు పరీక్ష కేంద్రం గేట్లను మూసివేయాలని, సెకన్ ఆలస్యమైనా అనుమతించకూడదని ఆదేశించారు. అభ్యర్థులు హాల్ టికెట్‌తోపాటు కలర్ ఫొటో, ఒరిజినల్ ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఉద్యోగి గుర్తింపు కార్డు, ఓటర్ గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు. హాల్ టికెట్‌లో ఫొటో సరిగ్గా కనిపించకపోయినట్లయితే 3 కలర్ ఫొటోలు తీసుకుని హాల్ టికెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకం చేయించుకుని రావాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రానికి ముందస్తుగా చేరుకుని హాల్ టికెట్ నంబర్లను చెక్ చేసుకోవాలన్నారు. పరీక్ష రాయడానికి (బబ్లింగ్) బ్లాక్ లేదా బ్లూ బాల్ పెన్నులను మాత్రమే అనుమతిస్తారని తెలిపారు. పరీక్ష హాల్లోకి మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, క్యాలిక్యులేటర్, వైట్ పేపర్స్, పెన్‌డ్రైవ్, టాబ్లెట్, హియరింగ్ సొల్యూషన్స్ సంబంధించిన ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించడం జరగదన్నారు. అభ్యర్థులు బూట్లు కాకుండా చెప్పులు వేసుకుని రావాలన్నారు. పరీక్ష పూర్తయిన తర్వాత మధ్యాహ్నం 1 గంట వరకు ఎవరినీ బయటకు పంపించడం జరగదని, అభ్యర్థులు పరీక్ష రాసిన తర్వాత ప్రశ్నాపత్రం తమతోపాటు తీసుకెళ్లేందుకు వీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థులు ఎవరైనా మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, చిత్రంలో సీపీ అంబర్ కిషోర్ ఝా

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, జూన్ 7: గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో 76 సెంటర్లలో 35వేల మంది అభ్యర్థులు పరీక్ష రాస్తున్నారన్నారు. అభ్యర్థులు ఉదయం 10గంటలలోపు పరీక్షా కేంద్రానికి హాజరు కావాలని సూచించారు. ఒక్క నిమిషం ఆలస్యం అయినా పరీక్షా కేంద్రంలోనికి అనుమతించబడదని తెలిపారు. పరీక్షను సజావుగా నిర్వహించేందుకు పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 6గంటల నుంచి 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పోలీస్ అధికారుల అనుమతి లేకుండా ఆదివారం సభలు, సమావేశాలు నిర్వహిస్తే చర్యలు తప్పవని అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు.

పరీక్షా కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా

ఎస్ఈలకు సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ఆదేశాలు



హనుమకొండ టౌన్, జూన్7: గ్రూప్- 1 పరీక్షా కేంద్రాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని విద్యుత్‌భవన్ నుంచి ఉమ్మడి ఐదు జిల్లాల ఎస్ఈలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ.. ప్రతీ సెంటర్‌కు ఏఈ స్థాయి అధికారిని నోడల్ అధికారిగా నియమించాలన్నారు. ఈ నెలలో జరిగే సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్స్‌కు కూడా విద్యుత్ అంతరాయం లేకుండా అన్ని సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్స్ సదర్‌లాల్, వి.మోహన్‌రావు, సీజీఎం కె.కిషన్, డీఈ (టి) కె.అనిల్‌కుమార్ పాల్గొన్నారు.











అనుమానాస్పద స్థితిలో నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి

కాజీపేట, జూన్ 7: అనుమానాస్పద స్థితిలో నిట్ అసిస్టెంట్ ప్రొఫెసర్ మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. సిద్ధిపేటకు చెందిన రంగాచారి (45) నిట్‌లో మెటలర్జీ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తూ కాజీపేట ప్రశాంత్‌నగర్‌లో నివాసం ఉంటున్నాడు. కొన్నిరోజుల కిందట కుటుంబకలహాలతో భార్య, బిడ్డను తీసుకుని వెళ్లి పుట్టింట్లో ఉంటోంది. గురువారం రాత్రి స్విగ్గీలో డిన్నర్ ఆర్డర్ చేసుకుని భోజనం అనంతరం నిద్రపోయాడు. తెల్లవారేసరికి మృతి చెంది ఉన్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం ఫోన్‌చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో శుక్రవారం ఉదయం ఇంటికి వచ్చి తలుపులు పగలకొట్టి చూసే సరికి మృతి చెంది ఉన్నాడు. మృతుడికి అప్పుడప్పుడు ఫిట్స్ వస్తుందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అనారోగ్యంతో నిద్రలో మృతి చెందాడా, లేకుంటే ఆత్మహత్యకు పాల్పడ్డడా అనే విషయాలు తెలియాల్సి ఉంది. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది.







వరదలు రాకముందే పనులు పూర్తవ్వాలి

మేడిగడ్డ బ్యారేజీ పర్యటనలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ● పార్వతీ బ్యారేజీ నిర్మాణ సంస్థ పనితీరుపై అసహనం


అంబట్‌పల్లి ఎల్‌అండ్‌టీ కాంపు కార్యాలయంలో ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

మహదేవపూర్ రూరల్, జూన్ 7: వానాకాలం వరదలు ప్రారంభం కాకముందే పనులు పూర్తిచేసి మేడిగడ్డ బ్యారేజీ గేట్లన్నీ తెరిచి ఉండేలా చూడాలని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మంత్రి ఉత్తమ్ శుక్రవారం లింక్-1లో ప్రధానమైన మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించారు. తొలుత సుందిళ్ల బ్యారేజీ ఆతర్వాత అన్నారం బ్యారేజీని పరిశీలించిన అనంతరం మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో మేడిగడ్డ చేరుకున్నారు. హెలిప్యాడ్ నుంచి అంబట్‌పల్లిలోని ఎల్‌అండ్‌టీ క్యాంపు కార్యాలయానికి చేరుకుని మధ్యాహ్నభోజనం అనంతరం మీడియాతో మాట్లాడారు. బ్యారేజీలో లోపాల అంశం కేవలం అధికారుల స్థాయిలో మాత్రమే చర్చించారని.. ముఖ్యమంత్రి, మంత్రి స్థాయిలో దీనిపై సమీక్ష జరగలేదన్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో మూడు బ్యారేజీల వాస్తవ పరిస్థితులను పరిశీలించేందుకే బ్యారేజీలను సందర్శించామని, నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ మధ్యంతర ఉత్తర్వుల్లో సూచించిన విధంగా జరిగే పనుల పురోగతిని పరిశీలించేందుకే వచ్చానని అన్నారు. గత ప్రభుత్వం రూ.94వేల కోట్లు అప్పుతెచ్చి కడితే అందులో భాగమైన అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో లీకేజీలు అధికమయ్యాయని, మేడిగడ్డ బ్యారేజీ ప్రక్కరే కుంగిపోయిందని అన్నారు. దీంతో ప్రాజెక్టు కుంగిపోయి నిరుపయోగంగా మారితే ఇప్పుడు ఆ ప్రాజెక్టుకు చేసిన అప్పులకు మనమంతా వడ్డీ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు. బ్యారేజీల పరిస్థితిపై తమ ప్రభుత్వం ఎన్‌డీఎస్‌ఏకు లేఖ రాయడం వల్లే సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ ఆధ్వర్యంలో నిపుణుల కమిటీ ఏర్పాటై బ్యారేజీలను సందర్శించడం జరిగిందని తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనల మేరకే ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులు జరుగుతున్నాయని, బ్యారేజీ కుంగిన రోజే నీటిని దిగువకు విడుదల చేస్తే కుంగుబాటు తీవ్రత తగ్గి ఉండేదన్నారు. ప్రస్తుతం బ్యారేజీల్లో తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నప్పటికి లింక్-1లో ఉన్న సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల గేట్లను వరదలు పూర్తయ్యే వరకు ఎత్తే ఉంచనున్నట్లు ఎన్‌డీఎస్‌ఏ మధ్యంతర ఉత్తర్వుల్లో పేర్కొన్న విషయాన్ని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం ద్వారా ఏర్పాటైన ఎన్‌డీఎస్‌ఏ సూచనలను పట్టించుకోకుండా నీటిని నిల్వ చేసి ఎత్తిపోయాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పలు మార్లు ప్రస్తావించడం విడ్డూరంగా ఉందన్న ఆయన తన పరిశీలనలో మేడిగడ్డ, అన్నారం బ్యారేజీల్లో జరుగుతున్న పనులు సంతృప్తి ఇచ్చాయని, సుందిళ్లలో పనులు వేగవంతంగా జరగడం లేదన్నారు. ఈ సందర్భంగా బ్యారేజీ నిర్మాణ సంస్థ నవయుగ కంపెనీ అధికారులను హెచ్చరించామని తెలిపిన మంత్రి.. పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ జనరల్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. బ్యారేజీలను పునరుద్ధరించడానికి తాత్కాలిక, శాశ్వత మరమ్మతులపై ఎన్‌డీఎస్‌ఏ సూచించిన పలు అంశాలను ప్రస్తావించారు. ఎన్‌డీఎస్‌ఏ నుంచి తదుపరి ఆదేశాలు వచ్చేంత వరకు మూడు బ్యారేజీల్లో గేట్లన్నీ తెరిచే ఉంచాలని, బ్యారేజీల్లో ప్రధానంగా జియో ఫిజికల్, జియో టెక్నికల్ పరీక్షలతో పాటు జీఆర్‌పీ, ఈఆర్‌టీ టెస్టులు చేయాలని సూచించినట్లు తెలిపారు. వీటితో పాటు బ్యారేజీల ఎగువ, దిగువ ప్రవాహల ముందున్న సీకెంట్ ఫైల్స్‌లో ఏమైనా లోపాలు ఉన్నాయా, ఉంటే ఏంటనేది గుర్తించాలని సూచించినట్లు తెలిపారు. రాబోయే సీజన్‌లో నీటిని ఎత్తిపోసేందుకు ఎన్‌డీఎస్‌ఏ అనుమతితో జియో ట్యూబ్స్ ఏర్పాటు చేసి పంపింగ్ చేస్తామని తెలిపారు. ఎన్‌డీఎస్‌ఏ సూచనలు పాటిస్తే అన్నారంలో 11మీటర్లు, సుందిళ్లలో 9మీటర్ల వరకు నీటిని నిల్వ చేస్తూ ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని పంపింగ్ చేసుకోవచ్చని అన్నారు.ఎల్‌అండ్‌టీ నిర్మాణ సంస్థ ప్రతినిధి సురేష్‌కుమార్ మాట్లాడుతూ.. జీపీఆర్ టెస్టు ఆధారంగా ఇసుక, సిమెంట్ గ్రౌటింగ్ పనులు కొనసాగుతున్నాయని, ఇప్పటి వరకు 90 శాతం పనులు పూర్తయ్యాయని సీసీ బ్లాక్, షీట్‌ఫైల్స్ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అనంతరం విలేకరులు అడిగిన ప్రశ్నలకు బదులిచ్చిన మంత్రి ఉత్తమ్ జ్యుడీషియల్ కమిషన్ విచారణ పూర్తయ్యాక బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో విజిలెన్స్ విచారణ ఆధారంగా అప్పటి ఈఎన్‌సీని సర్వీస్ నుంచి తొలగించామని, ఇరిగేషన్ ఈఎన్‌సీ మురళీధర్‌రావును ఎక్స్‌టెన్షన్‌ను టర్మినేట్ చేశామని అన్నారు. అన్నారం, కన్నెపల్లి పంప్‌హౌస్‌లో పంపులన్నీ సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టుపై ఏ నిర్ణయం తీసుకుంటారని విలేకరులు అడిగిన మరో ప్రశ్నకు మంత్రి బదులిస్తూ.. తప్పకుండా ఆ ప్రాజెక్టును నిర్మిస్తామని అన్నారు. తమ మేనిఫేస్టోలోను ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ఉందని గుర్తుచేశారు. గత ప్రభుత్వం రూ.94వేల కోట్లు అప్పు చేసి కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల లక్ష ఎకరాల కొత్త ఆయకట్టు సృష్టించలేదన్నారు. ఐదేండ్లలో 65టీఎంసీల నీటిని ఎత్తిపోసిన ఈ ప్రాజెక్టు ద్వారా పాత ఆయకట్టు ఎలా స్థిరీకరించబడిందో తెలపాలన్నారు. పాలమూరు రంగారెడ్డికి రూ.23,500కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరం ఆయకట్టు లేదని, సీతారామ ప్రాజెక్టుకు రూ.7,500 కోట్లు ఖర్చు చేసినా ఒక్క ఎకరం ఆయకట్టు రాలేదని తెలిపారు. చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టు గ్రావిటీ ద్వారా 16లక్షల ఎకరాలకు సాగునీరందిస్తే సంవత్సరానికి వచ్చే ఎలక్ట్రిసిటీ బిల్లు రూ.వెయ్యి కోట్లయితే కాళేశ్వరం ప్రాజెక్టులోని పంప్‌లు నడిస్తే సంవత్సరానికి రూ.10వేల కోట్లు ఖర్చు అవుతుందని అన్నారు. ఎల్‌అండ్‌టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ అనంతరం మంత్రి నేరుగా మేడిగడ్డ బ్యారేజీ దిగువన, ఎగువన జరుగుతున్న పనులను పరిశీలించారు. ఇసుక, సిమెంట్ గ్రౌటింగ్, షీట్‌ఫైల్స్ అమరిక పనులను పరిశీలించారు. అనంతరం బ్యారేజీ నుంచి నేరుగా హెలిప్యాడ్‌కు చేరుకుని తిరిగి హైదరబాద్‌కు వెళ్ళిపోయారు. ఆయన వెంట ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, భూపాలపల్లి, రామగుండం ఎమ్మెల్యేలు గండ్ర సత్యనారాయణరావు, రాజ్‌ఠాకూర్, ధర్మపురి ఎమ్మెల్యే లక్ష్మణ్, ఈఎన్‌సీ నాగేందర్‌రావు, సీఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ తిరుపతిరావులతో పాటు ఎంపీపీ బన్సోడ రాణిబాయి, జడ్పీటీసీ గుడాల అరుణ తదితరులున్నారు.


మేడిగడ్డ బ్యారేజీ వద్ద పగుళ్లు తేలిన పిల్లర్లను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి

అన్నారం బ్యారేజీ పనుల్లో వేగం పెంచండి

మహదేవపూర్ : మహదేవపూర్ మండలంలోని అన్నారం బ్యారేజీకి హెలికాప్టర్‌లో చేరుకున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బ్యారేజీ వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. బ్యారేజీలో పనులు జరుగుతున్న ప్రదేశానికి వెళ్ళిన మంత్రి పనుల్లో వేగం పెంచి వానాకాలం లోపు పనులు పూర్తిచేసి గేట్లన్నీ తెరిచి ఉంచాలని అన్నారు. పరిశీలన అనంతరం మేడిగడ్డ బ్యారేజీకి బయలుదేరి వెళ్లిపోయారు.

పనుల్లో వేగం పెంచండి

అన్నారం బ్యారేజి సందర్శనలో జస్టిస్ పినాకి చంద్ర ఘోష్


మహదేవపూర్, జూన్ 7: అన్నారం బ్యారేజీ మరమ్మతు పనులను వేగంగా పూర్తిచేయాలని జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ అధికారులకు సూచించారు. మహదేవపూర్ మండలంలోని అన్నారం సరస్వతి బ్యారేజీని శుక్రవారం సాయంత్రం 4.30 గంటలకు ఆయన సందర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన బ్యారేజీల లోపాలపై రాష్ట్ర ప్రభుత్వం జ్యుడీషియల్ ఎంక్వైరీ కమిషన్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఇప్పటికే మేడిగడ్డ బ్యారేజీని పరిశీలించి వివరాలు సేకరించగా, శుక్రవారం అన్నారం బ్యారేజీని సందర్శించి 35, 48 పిల్లర్ల వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు నిర్వహిస్తున్న ఆప్కాన్ సంస్థ ప్రతినిధులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. 2019, 2020లో లీకేజీల సమస్య, సీసీ బ్లాకులు కొట్టుకపోవడం లాంటి సమస్యలు ఏర్పడినప్పుడు చేసిన మరమ్మతు పనులను పీసీ ఘోష్ అడిగి తెలుసుకున్నారు. ఎంతో అనుభవం కలిగిన సంస్థ నిర్మాణం సందర్భంగా ఇలాంటి సమస్యలను ముందుగా ఎందుకు అంచనా వేయలేదని ప్రశ్నించినట్లు తెలుస్తోంది. వర్షాకాలం ఆరంభమైన దృష్ట్యా వరదలు వచ్చేలోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు. ఆయన వెంట బ్యారేజీ అధికారులు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యాదిగిరి, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.


బ్యారేజీని పరిశీలించి వివరాలు తెలుసుకుంటున్న జస్టిస్ పినాకి చంద్ర ఘోష్


ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ కాజీపేట తిరుమలయ్య


రేపటి నుంచి పోతన విజ్ఞాన పీఠంలో నాటకోత్సవాలు

వడ్డెపల్లి, జూన్ 7: వరంగల్ జెమినీ థియేటర్ ప్రాంతంలోని పోతన విజ్ఞాన పీఠంలో ఈ నెల 9, 10, 11 తేదీలలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో వరంగల్ జిల్లా రంగస్థల కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఉభయ రాష్ట్రాల తెలుగు ఆహ్వాన నాటిక పోటీలను నిర్వహిస్తున్నట్లు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కాజీపేట తిరుమలయ్య, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్ఎస్ఆర్ మూర్తి, ఉపాధ్యక్షుడు కళా రాజేశ్వర్‌రావులు తెలిపారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ నెల 9న రాత్రి 7.30 గంటల నుంచి రాత్రి 8.30గంటల వరకు రాత, ప్రక్షాళన, 10న అనూహ్యం, వీలునామా, 11న నిశబ్దమా.. నీ ఖరీదెంత?, ఉన్నది ఒకటే జీవితం అనే నాటికలు ప్రదర్శిస్తారని తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ప్రేక్షకులు, కళాకారులు, కళాభిమానులు, సాహితీ వేత్తలు పాల్గొని ప్రదర్శనలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో జీవీ బాబు, వేముల ప్రభాకర్, ఆకుతోట లక్ష్మణ్, శర్మ, సాదుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



మాల్దీవుల అతిథులకు విస్తృత ఏర్పాట్లు చేయండి

జిల్లా అధికారులతో బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్



వరంగల్ కార్పొరేషన్, జూన్ 7: ఈ నెల 17 నుంచి 19 వరకు మాల్దీవుల నుంచి వరంగల్ నగరంలో పర్యటించనున్న అతిథులకు కావలసిన విస్తృత ఏర్పాట్లు చేయాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్ అధికారులకు సూచించారు. శుక్రవారం బల్దియా కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ.. వరంగల్ నగర పాలక సంస్థ అవలంబిస్తున్న పారిశుధ్య విధానంపై అధ్యయనం, ఇక్కడి పద్ధతులపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్, మాడల్ వైకుంఠ ధామం సందర్శన, ఎఫ్ఎస్‌టీపీ, ఎస్‌టీపీ కేంద్రాల పర్యటన, బయోమైనింగ్ విధానాన్ని అతిథులు వస్తున్నారని అన్నారు. మూడు రోజుల పాటు ఇక్కడి అధికారులు, సిబ్బందికి వారికి పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌వో డాక్టర్ మల్లం రాజేశ్, హెచ్ఓ రమేష్, ఈఈ సంజయ్‌కుమార్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

డీసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 7: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే డీసెట్-2024కు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్ కె.నారాయణరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. జనరల్, బీసీ విద్యార్థులు ఇంటర్‌లో 50 శాతం, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ విద్యార్థులు 45శాతం మార్కులు ఉండాలని పేర్కొన్నారు. జూలై 10న నిర్వహించే డీసెట్‌కు ఈనెల 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. దరఖాస్తు కోసం http://-deecet.cdse.telangana.gov.in వెబ్‌పోర్టల్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులకు వేళాయే..

● షెడ్యూల్‌ను ప్రకటించిన ప్రభుత్వం ● నేటి నుంచే ప్రక్రియ ప్రారంభం

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 7: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఎన్నికల కోడ్ ముగిసిన వెనువెంటనే బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేయడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. శనివారం నుంచే పదోన్నతులు, బదిలీల ప్రక్రియ ప్రారంభం కానుంది. వరంగల్, హనుమకొండ జిల్లాలో వెయ్యి మంది ఉపాధ్యాయులకు వివిధ కేటగిరీల్లో పదోన్నతులు సాధించనున్నారు. మల్టిజోన్ -1లో ఈ ప్రక్రియ జూన్ 8 నుంచి ప్రారంభమై జూన్ 22తో ముగియనున్నది. మొత్తంగా బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను మల్టిజోన్ - 1లో 15 రోజుల్లో, మల్టీజోన్ -2లో 23 రోజుల్లో పూర్తి చేసే విధంగా ప్రభుత్వం షెడ్యూల్‌ను ఖరారు చేసి విడుదల చేసింది.

షెడ్యూల్ ఇలా..

జూన్ 8, 9 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేడర్‌ల తాత్కాలిక పదోన్నతుల జాబితాను ప్రకటించాలి. ప్రస్తుత ఖాళీలతోపాటు స్కూల్ అసిస్టెంట్ల తర్వాత ఏర్పడిన ఖాళీల తాత్కాలిక జాబితాను ప్రకటించాలి. ఎస్జీటీల బదిలీల ప్రక్రియకు సంబంధించిన తాత్కాలిక సీనియారిటీ జాబితాను ప్రదర్శించాలి. ఎస్జీటీల బదిలీలకు సంబంధించిన తాత్కాలిక సీనియారిటీ జాబితాల్లో అభ్యంతరాలను డీఈవోలు స్వీకరించాలి. 10, 11 తేదీల్లో స్కూల్ అసిస్టెంట్ల సీనియారిటీ జాబితాల్లో అభ్యంతరాలను స్వీకరించాలి. అభ్యంతరాలు, ఫిర్యాదులను డీఈవోలు పరిష్కరించాల్సి ఉంటుంది. 12వ తేదీన స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేడర్ల పదోన్నతులు తుది జాబితాను రూపొందించి ఆన్‌లైన్ పోర్టల్‌లో పొందుపరచాలి. 13 నుంచి 16 వరకు స్కూల్ అసిస్టెంట్ల ప్రమోషన్‌కు అర్హత పొందిన ఉపాధ్యాయులు వెబ్ ఆప్షన్లను ఎంపిక చేసుకోవాలి. పదోన్నతి పొందిన స్కూల్ అసిస్టెంట్, తత్సమాన కేడర్‌ల ఉపాధ్యాయులకు పదోన్నతుల ఉత్తర్వులు అందజేస్తారు. 17న ఎస్జీటీల బదిలీల కోసం ఖాళీల జాబితాలను ప్రదర్శించాలి. జాబితాల్లోని అభ్యంతరాలను పరిష్కరించాలి. 18 నుంచి 20 వరకు తుది జాబితాను ప్రదర్శించాలి. వెబ్ ఆప్షన్ల ప్రక్రియను పూర్తి చేయాలి. 21, 22 తేదీల్లో బదిలీల ఉత్తర్వులును సంబంధిత ఉపాధ్యాయులకు అందజేయాలి.

నేడు బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్ల రిలీవ్

గత ఏడాది నిర్వహించిన పదోన్నతులు, బదిలీల ప్రక్రియలో అక్టోబర్ మాసంలో బదిలీలు పొందిన స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయులు శనివారం వారు బదిలీ అయిన స్థానాల్లోకి వెళ్లాల్సిందిగా విద్యాశాఖ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

వరంగల్, హనుమకొండ జిల్లాలో ఇలా..

ప్రభుత్వం ప్రకటించిన పదోన్నతుల ప్రక్రియలో హనుమకొండ జిల్లాలో వివిధ కేటగిరీల్లో సుమారుగా 500 మంది ఉపాధ్యాయులు పదోన్నతులు సాధించనన్నారు. 240 మంది వరకు స్కూల్ అసిస్టెంట్లు, తత్సమాన కేడర్లలో ఉపాధ్యాయులు పదోన్నతులు సాధిస్తుండగా, మరో 260 మంది భాషా పండితులు, పీఈటీలు అప్‌గ్రెడేషన్ పొందనున్నారు. ఇక వరంగల్ జిల్లాలో సుమారు 300 మంది స్కూల్ అసిస్టెంట్లు తత్సమాన కేడర్లలో ఉపాధ్యాయులు పదోన్నతులు పొందుతుండగా, 200 మంది భాషోపాధ్యాయులు, పీఈటీలు అప్‌గ్రేడ్ కానున్నారు.

హనుమకొండ జిల్లాలో యాజమాన్యాల వారిగా ఖాళీలు

కేటగిరి	ప్రభుత్వ యాజమాన్యంలో..		జిల్లా/మండల పరిషత్‌లో..	
	ఖాళీలు	పదోన్నతులు	ఖాళీలు	పదోన్నతులు
ఎస్‌ఏ గణితం	2	1	12	8
ఎస్‌ఏ ఫిజిక్స్(తె)	1	1	5	4
ఎస్‌ఏ బయో(తె)	2	1	0	0
ఎస్‌ఏ సోషల్(తె)	8	6	39	27
ఎస్‌ఏ సోషల్(ఉ)	2	1	0	0
ఎస్‌ఏ తెలుగు	6	4	19	9
ఎస్‌ఏ హిందీ	5	4	7	5
ఎస్‌ఏ ఇంగ్లీష్	4	3	18	13
ఎస్‌ఏ ఉర్దూ	1	1	0	0
ఎస్‌ఏ(పీడీ)(తె)	1	1	6	4
పీఎస్‌హెచ్‌ఎం	4	4	43	43

వరంగల్ జిల్లాలో యాజమాన్యాల వారిగా ఖాళీలు

కేటగిరి	ప్రభుత్వ యాజమాన్యంలో..		జిల్లా/మండల పరిషత్‌లో..	
	ఖాళీలు	పదోన్నతులు	ఖాళీలు	పదోన్నతులు
ఎస్‌ఏ గణితం	5	4	13	9
ఎస్‌ఏ ఫిజిక్స్	2	1	6	4
ఎస్‌ఏ బయో	11	8	28	20
ఎస్‌ఏ ఇంగ్లీష్	3	2	19	13
ఎస్‌ఏ సోషల్	11	8	49	34
ఎస్‌ఏ తెలుగు	7	5	12	8
ఎస్‌ఏ హిందీ	8	6	5	4
ఎస్‌ఏ ఉర్దూ	3	2	0	0
ఎస్‌ఏ పీడీ	0	0	6	4
పీఎస్‌హెచ్‌ఎం	6	6	54	54

అధిక ఫీజులను నియంత్రించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 7: జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలని టీఎస్ఎఫ్ సిటీ ప్రెసిడెంట్ నాగారం అనితేజ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం డీఈవో డాక్టర్ ఎం.డి. అబ్దుల్‌హైని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం అనితేజ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన డీఎఫ్ఆర్సీని జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ అమలు చేయకుండా వారికి ఇష్టం వచ్చినట్టు లక్షల రూపాయలు ఫీజులు వసూలు చేయడాన్ని ఆయన తప్పుబట్టారు. పాఠశాల ఆవరణల్లోనే పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్స్, పెన్నులు, పెన్సిల్ తదితర చిల్లర దుకాణాలు నడుపుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రెటరీ పరికుపల్ల సాంబరాజు, సెక్రెటరీ అంబాల హరికుమార్, కార్యదర్శులు బన్ని తదితరులు పాల్గొన్నారు.

మహిళ హత్య కేసులో వీడిన మిస్టరీ

● నగదు లావాదేవీలు, వివాహేతర సంబంధాలే హత్యకు కారణం ● కరీమాబాద్‌కు చెందిన నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

మడికొండ, జూన్ 7: కాజీపేట మండలం అమ్మవారిపేట శివారులోని వెంచర్‌లో బుధవారం జరిగిన మహిళ దారుణ హత్యకు కారకులైన కరీమాబాద్‌కు చెందిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్టు చూపారు. నగదు లావాదేవీలు, అక్రమ సంబంధాలే హత్యకు కారణంగా తెలిసింది. మడికొండ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ప్రతాప్ వివరాలు వెల్లడించారు.

వరంగల్ ఉర్సు కరీమాబాద్‌కు చెందిన మహ్మద్ ఇంతియాజ్ ఆటోలను కిరాయికి ఇస్తుండేవాడు. అతడు చెడు వ్యసనాలు, తాగుడు నచ్చక అతడి భార్య కొంతకాలం కిందట అతడిని వదిలేసి తల్లిగారింటికి వెళ్లిపోయింది. తర్వాత ఇంతియాజ్ సిద్దిపేటకు చెందిన గుండెబోయిన నాగలత అలియాస్ లతను పరిచయం చేసుకొని సహజీవనం చేస్తున్నాడు. ప్రస్తుతం ఇతడి ఆటో కిరాయికి నడుపుతున్న దిడ్డి మహేశ్, గతంలో ఇతడి ఆటో కిరాయికి నడిపి ప్రస్తుతం సొంత ఆటో నడుపుతున్న అలుపుల వంశీకృష్ణ, ఇంతియాజ్ ముగ్గురు తాగుతూ జల్సాలు చేస్తుండేవారు. ఈక్రమంలో లత ద్వారా కాజీపేట లావుడ్య తండాకు చెందిన లావుడ్య కుమార్ భార్య లావుడ్య కుమారి అలియాస్ రాధికతో ఇంతియాజ్ పరిచయం ఏర్పరచుకున్నాడు. ఆపై లతకు తెలియకుండా కుమారితో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అదే చనువుతో కుమారి ఇంతియాజ్‌ను రూ.లక్ష అడుగగా ఇస్తానని ఒప్పుకున్నాడు. గత నెల 5న ఇంతియాజ్‌ను కాజీపేటకు రమ్మని కుమారి పిలవగా కారులో ఇంతియాజ్


మడికొండ పీఎస్‌లో నిందితుల అరెస్టు చూపుతున్న ఇన్‌స్పెక్టర్ ప్రతాప్, ఎస్సైలు రాజబాబు, దివ్య

వెళ్లాడు. అక్కడ తనకు రూ.లక్ష ఇవ్వాలని కుమారి కోరింది. లేకపోతే మన సంబంధం విషయం లతకు తెలియజేస్తానంది. దీంతో ఇంతియాజ్ కుమారిని కారులో తన ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ కుమారి లతతో తనకు రూ.లక్ష ఇస్తానని ఇంతియాజ్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని, ఇప్పుడు ఇవ్వడం లేదని చెప్పింది. ఈ క్రమంలో లత, కుమారిల మధ్య గొడవ జరిగింది. లత నెట్టి వేయగా కుమారి చేతికి గాయమైంది. అప్పుడే ఇంతియాజ్ ఇంటికి ఆటో డ్రైవర్లు దిడ్డి మహేష్, అలుపుల వంశీక్రిష్ణలు వచ్చారు. దీంతో కుమారిని తీసుకెళ్లి చంపేయండి అని ఇంతియాజ్, లతలు చెప్పగా వారు కుమారిని ఆటోలో అమ్మవారిపేట శివారులోని సాయినాథ్ వెంచర్‌కు తీసుకెళ్లారు. అక్కడ వంశీక్రిష్ణ ఆటోలోని స్పానర్‌తో కుమారి ఎడమ చెవిపై బలంగా కొట్టడంతో కిందపడిపోయింది. దిడ్డి మహేష్ బండరాయిని రెండుసార్లు కుమారి తలపై మోదడంతో తీవ్ర రక్తస్రావమైంది. వంశీక్రిష్ణ మరోసారి బండరాయిన ఎత్తి కుమారి తలపై వేశాడు. చనిపోయిందని నిర్ధారించుకొని ఆమె వద్ద ఉన్న రెండు సెల్‌ఫోన్‌లు, కాళ్లకున్న పట్టీలు తీసుకొని అక్కడి నుంచి వెళ్లిపోయారు.

100 డయల్‌కు ఫోన్ రాగా, సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి అక్కడ లభించిన ఆధారాలతో మృతురాలి భర్తకు సమాచారం అందించినట్లు సీఐ తెలిపారు. మృతురాలి భర్త లావుడ్య కుమార్ ఫిర్యాదు మేరకు ఇంతియాజ్, వంశికృష్ణ, లత, మహేష్‌లపై హత్య కేసు నమోదు చేసి నిందితులను గుర్తించి అరెస్టు చేసినట్లు తెలిపారు. అలాగే నిందితులు హత్యలో వాడిన కారు, ఆటో, స్పానర్, బండరాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సైలు రాజబాబు, దివ్య, ఏఎస్సై చంద్రమౌళి, హెడ్‌కానిస్టేబుల్ జయరాజ్, కానిస్టేబుళ్లు వెంకట్, రాంచందర్, రామ్మూర్తి, అశోక్, గోవర్ధన్, నాగేశ్వర్‌రావు, పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాజీపేట ఏసీపీ తిరుమల్ ఇన్‌స్పెక్టర్, ఎస్సైలు, పోలీస్ సిబ్బందిని అభినందించారు.

కల్తీ పాల విక్రయాలపై చర్యలు తీసుకోండి

కాళోజీ జంక్షన్, జూన్ 7: కల్తీ పాల విక్రయాలపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఆహార కల్తీ నిరోధక శాఖ డైరెక్టర్ సి.శివలీలకు దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడు డాక్టర్ పల్లెపాడు దామోదర్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఆయన హైదరాబాద్ నారాయణగూడలోని తెలంగాణ రాష్ట్ర ఆహార కల్తీ నిరోధక శాఖ కార్యాలయంలో డైరెక్టర్ సి.శివలీలను కలిసి వినతి పత్రం సమర్పించారు. హనుమకొండలో జూన్ 1న నిర్వహించిన పాల టెస్టు చెక్ కార్యక్రమంలో వరంగల్, నల్గొండ, మేడ్చల్, మల్కాజిగిరి, గుంటూరు జిల్లాలోని ప్రైవేటు డెయిరీలలో తయారైన పాలలో అమోనియం సల్ఫేట్ (యూరియా) కలిపి కల్తీ చేస్తున్నారని తేలిందని ఆయన వివరించారు. రాష్ట్రంలో విక్రయాలు జరుగుతున్నా 16 ప్రైవేటు పాల డెయిరీలు సరఫరా చేస్తున్నా కల్తీ జరుగుతుందని టెస్టు చెక్ ద్వారా ధ్రువపడిందని ఆయన డైరెక్టర్‌కు వివరించారు. ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు వెంటనే తగు చర్యలు చేపట్టి కల్తీ పాల అమ్మకాలను నిరోధించాలని కోరారు. వినియోగదారులకు హానీ కలిగిస్తున్న పాల వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు వినియోగదారుల చైతన్య కార్యక్రమాలు ముమ్మరం చేయాలని డైరెక్టర్‌కు విన్నవించుకున్నారు. డైరెక్టర్‌ను కలిసిన వారిలో దామోదర్ వెంట వినియోగదారుల మండలి ప్రతినిధులు జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, క్యాట్‌కో చైర్మన్ శంకర్‌లాల్ చౌరాసియా, సీసీఐ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలి చర్ల సుదర్శన్ తదితరులు ఉన్నారు.

డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డ 18 మంది మైనర్లు

హనుమకొండ టౌన్, జూన్7: డ్రైవింగ్ చేస్తూ పట్టుబడ్డ 18 మంది మైనర్లలో 16 మంది మైనర్లను జువైనల్ హోంకు తరలిస్తూ న్యాయమూర్తి రమేశ్ తీర్పు ఇచ్చినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ షూకూర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. తనిఖీల్లో పట్టుబడ్డ 18 మందిని శక్రవారం కోర్టులో హాజరుపరచగా 16 మందిని జువైనల్ హోంకు తరలించగా, మరో ఇద్దరికి రూ.15,000 జరిమానాను విధించారన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ 5 గురికి రూ.4,000 జరిమానా విధించారన్నారని తెలిపారు.

తెలంగాణ బీజేపీ ఎంపీలకు రైల్వే శాఖ కేటాయించాలి

కాజీపేట, జూన్ 7: తెలంగాణ నుంచి గెలిచిన బీజేపీ ఎంపీలకు కేంద్ర రైల్వే శాఖ ఇవ్వాలని తెలంగాణ రైల్వే ఎంప్లాయీస్ జేఏసీ కన్వీనర్ దేవులపల్లి రాఘవేందర్, చైర్మన్ కోండ్ర నర్సింగరావు డిమాండ్ చేశారు. కాజీపేటలో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కేంద్రంలో కీలక శాఖ అయిన రైల్వే శాఖను ఇంతవరకు తెలంగాణకు ఏ పార్టీ కేటాయించలేదన్నారు. సహాయ మంత్రులుగా మాత్రమే కేటాయించారన్నారు. గత అనుభవాల దృష్ట్యా ఏ రాష్ట్రానికి కేంద్ర రైల్వే శాఖ కేటాయిస్తారో ఆ రాష్ట్రాలకే రైల్వే పరిశ్రమలు తరలిపోతున్నాయన్నారు. ఈ సారి బీజేపీ నుంచి గెలిచిన ఎనిమిది మందిలో ఎవరికైనా రైల్వే శాఖ కేటాయిస్తే తెలంగాణ విభజన చట్టంలో నమోదుచేసిన రైల్వే కోచ్‌ఫ్యాక్టరీ కాజీపేటకు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇదే కాకుండా రైల్వే డివిజన్, రైల్వే లైన్‌లతో పాటు రైల్వేల అభివృద్ధి జరుగుతుందన్నారు. ఈ మీడియా సమావేశంలో జేఏసీ కో- కన్వీనర్లు రేండ్ల రమేశ్, చింత



మాట్లాడుతున్న రైల్వే జేఏసీ నాయకులు

తిరుపతి, కె.ఎస్ రావు, తప్పెట సారయ్య, వైస్ చైర్మన్లు పి. రమేష్, జిట్టా రాజలింగం, జి. భాస్కర్, ఎస్. లక్ష్మీనారాయణ, జి.మాణిక్యం, రమణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల ఏర్పాటు

ఐనవోలు, జూన్ 7: ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులను కల్పిస్తుందని ఉపాధ్యాయులు తెలిపారు. ఐనవోలులో రెండో రోజు శుక్రవారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ బాధ్యులతో కలిసి బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరిగి అంగన్‌వాడీ సెంటర్ల నిర్వాహణ, ప్రభుత్వ పాఠశాల్లో లభిస్తున్న బోధనను తల్లిదండ్రులకు వివరిస్తూ పిల్లలను పాఠశాలకు పంపించాలని కోరారు. శుక్రవారం మండలకేంద్రంలో 13 మంది పిల్లల పేర్లను నమోదు చేసుకున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు. హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు మధుకర్, భీమళ్ల సారయ్య, లక్ష్మయ్య, 2వ అంగన్‌వాడి సెంటర్ టీచర్లు రాజేశ్వరి, సమ్మక్క, రేణుక, యశోద, దీపిక, అనిత పాల్గొన్నారు.

విద్యార్థులను వేధిస్తున్న విద్యా సంస్థలపై చర్య తీసుకోవాలి

వరంగల్ ఎడ్యుకేషన్, జూన్ 7: మార్కులు, ర్యాంకుల కోసం విద్యార్థులను వేధిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని సమాచార హక్కు అవగాహన సాధన సమితి నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈవో డాక్టర్ అబ్దుల్ హైని ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఐఐటీ, నీట్ తదితర పోటీ పరీక్షల పేరుతో విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారన్నారు. ఐఐటీ, డిజీ, కాన్సెప్ట్, గ్లోబల్, పబ్లిక్, మెడికల్ తదితర తోక పేర్లను తొలగించాలని వారు డిమాండ్ చేశారు. భానుప్రకాశ్, అఖిలేష్ పాల్గొన్నారు.

ఎస్టీ కమిషన్ మెంబర్‌ను కలిసిన గిరిజన విద్యుత్ ఉద్యోగులు

కాళోజీ జంక్షన్, జూన్ 7: జాతీయ ఎస్టీ కమిషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్ నాయక్ శుక్రవారం హనుమకొండకు వచ్చిన సందర్భంగా హరిత కాకతీయ హోటల్‌లో ఆయనను కలిసి గిరిజన విద్యుత్ ఉద్యోగులు పుష్పగుచ్చం అందించి స్వాగతం పలికారు. అనంతరం విద్యుత్ సంస్థలో గిరిజనులకు జరుగుతున్న అన్యాయాన్ని ఉద్యోగులు పడుతున్న బాధలను ఆయనకు వివరించారు. ఈ విషయంలో తగు చొరవ తీసుకొని గిరిజన ఉద్యోగులకు న్యాయం చేయాల్సిందిగా వారు ఆయనకు విజ్ఞప్తి చేశారు. ఇందుకు హుస్సేన్ నాయక్ సానుకూలంగా స్పందించి విద్యుత్ ఉద్యోగుల సమస్యలపై చర్చిండానికి తగు సమయం కేటాయిస్తానని తెలిపారు. హుస్సేన్ నాయక్‌ను కలిసిన వారిలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ డి. నందరాథోడ్, కంపెనీ అధ్యక్షుడు బాలు నాయక్, సంఘం నాయకులు కేవీ రాజేందర్, డి.లక్ష్మణ్ నాయక్, డి.రవి ఉన్నారు.

గ్రేటర్ పరిధిలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం

వరంగల్ కార్పొరేషన్, జూన్ 7: గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో రానున్న వర్షాకాలం కారణంగా ముందస్తుగా దోమల నివారణ కోసం ఫ్రైడే డ్రైడే కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం బల్దియా పరిధిలోని 66 డివిజన్‌ల పరిధిలో దోమల నివారణ మందును మలేరియా సిబ్బందితో పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా బల్దియా బయాలజిస్ట్ మాధవరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు దోమల నివారణ కోసం 10 వారాల పాటు మందును స్ప్రే చేస్తామని చెప్పారు. మలేరియా సిబ్బంది కాలనీలలో క్షేత్రస్థాయిలో పర్యటించి ఇండ్లలో నిలువ ఉన్న నీటిని తొలగించడంతోపాటు నీరు నిలువ ఉన్న కుంటలు, గుంతలు, ఖాళీ ప్లాట్లలో నిలిచిన నీటిలో ఆయిల్ బాల్స్ వేయిస్తామన్నారు. ఇప్పటి వరకు 360 ఆయిల్ బాల్స్ వేయడంతోపాటు ఎంఎల్‌వో ఆయిల్ క్రోమోపాస్‌ను పిచికారి చేస్తున్నామన్నారు. హెల్త్ ఇన్‌స్పెక్టర్ రవి, మధుకర్, హెల్త్ అసిస్టెంట్‌లు రమేష్, ప్రకాశ్, సంపత్, శ్యామ్, శివకుమార్, శ్రవన్, మల్లేశం, శ్రీనివాస్, ఫీల్డ్ వర్కర్లు పాల్గొన్నారు.

క్రైస్తవుల ఆస్తులకు రక్షణ కల్పించాలి..



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ దామెర ఐజక్

వడ్డెపల్లి, జూన్ 7: హనుమకొండలోని మిషన్ ఆస్పత్రిని ఆనుకుని ఉన్న క్రైస్తవుల ఆస్తులను, 10 వేల చదరపు గజాల భూమి అన్యాకాంతం కాకుండా రక్షణ కల్పించాలని ట్రైసిటీ క్రిస్టియన్ ఫెలోషిప్ చైర్మన్ డాక్టర్ దామెర ఐజక్, తెలంగాణ క్రిస్టియన్ ఫెల్లోషిప్ ప్రెసిడెంట్ డాక్టర్ జి. జాన్ మార్కండేయలు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హనుమకొండ మిషన్ ఆస్పత్రి ప్రాంతంలోని 10వేల చదరపు గజాల భూమిని ఆల్ సెయింట్స్ పబ్లిక్ స్కూల్ వారు పీఏబీసీ నెల్లూరు వారి వద్ద నుంచి 1998లో లీజుకు తీసుకున్నారని అన్నారు. ఆ భూమిని ఆర్. జాన్సన్ ఇతరులకు విక్రయించడానికి ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. క్రైస్తవ సమాజానికి సంబంధించిన (బాప్టిస్టు సంస్థ) ఆస్తులను విక్రయించకూడదనే నిబంధన ఉందని చెప్పారు. బాప్టిస్టు ఆస్తులను విక్రయించకూడదని, ఎవరు కొనకూడదని సుప్రీంకోర్టు సైతం తీర్పు ఇచ్చిందని తెలిపారు.టీసీఎఫ్ ట్రెజర్ విద్యాకర్, జాయింట్ సెక్రటరి తాళ్లపెల్లి ప్రసంగి, ఆర్గనైజింగ్ సెక్రటరి పోలెపాక ఇమ్మానియల్, పీఆర్‌వో దానం , పాస్టర్లు వినయ్‌కుమార్, కిరణ్, లాజరస్ తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్‌లో ప్రజల గొంతుకనై నిలుస్తా..

వరంగల్ ఎంపీ కడియం కావ్య

బాలసముద్రం, జూన్ 7: పార్లమెంట్‌లో వరంగల్ ప్రజల గొంతుకనై నిలిచి ప్రజల సమస్యలు పరిష్కరిస్తానని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. శుక్రవారం బాలసముద్రంలోని సీపీఐ జిల్లా కార్యాలయాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి సందర్శించారు. ఎన్నికల్లో సీపీఐ నాయకులు సహకరించినందుకు వారికి ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. నూతనంగా ఎంపీగా గెలుపొందిన కడియం కావ్యను సీపీఐ నాయకులు శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. తనను సొంత పార్టీ అభ్యర్థిగా భావించి సీపీఐ కార్యకర్తలు భారీ మెజారిటీతో గెలిపించినందుకు ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో నిరుపేదలు, గుడిసెవాసులకు ఇళ్ల స్థలాలకు పట్టాలు అందించేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని మట్టికరిపించి కాంగ్రెస్ గెలుపు కోసం సీపీఐ కార్యకర్తలు కృషి చేసినట్లు తెలిపారు. నిధులు తీసుకువచ్చి వరంగల్ అభివృద్ధికి కృషి చేయాలని ఎంపీని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర నాయకులు విజయ సారథి, నేదునూరి జ్యోతి, టి. వెంకట్రాములు, పంజాల రమేష్, ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మీ, పి. సుగుణమ్మ, సిరబోయిన కరుణాకర్, ఎస్‌కే. బాషామియా, ఎల్లేష్ పాల్గొన్నారు.



ఎంపీ కడియం కావ్యను శాలువాతో సన్మానిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఎంపీని అర్చక నేతల అభినందనలు

హనుమకొండ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్ ఎంపీగా ఎన్నికైన డాక్టర్ కడియం కావ్యను శుక్రవారం హనుమకొండలోని ఆమె నివాసగృహంలో తెలంగాణ అర్చక ఉద్యోగ జాక్ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, జాక్ ప్రధాన కార్యదర్శి తనుగుల రత్నాకర్, గణపతి శర్మ తదితర అర్చక బృందం కలిసి అభినందనలు తెలిపారు. శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి కూడా హాజరయ్యారు.

ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలి..

వడ్డెపల్లి, జూన్ 7 : రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని దళిత బహుజన ఫ్రంట్(డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండలోని డీబీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యకు రాష్ట్ర బడ్జెట్‌లో 20 శాతం నిధులను కేటాయించి తెలంగాణ సమాజాన్ని విద్యా, వైజ్ఞానిక రంగాల్లో అగ్రగామిగా నిలుపాలని కోరారు. గురుకులాలు, సంక్షేమ హాస్టళ్లల్లో కనీస వసతులను పెంపొందించాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కాస్మోటిక్, మెస్ చార్జీలను పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. సమావేశంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్ పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

కాజీపేట, జూన్ 7: విధినిర్వహణలో ఇటీవల ఆకస్మికంగా మృతిచెందిన జేఈ తరుణ్ కృష్ణ కుటుంబానికి రైల్వే మజ్దూర్ యూనియన్ శుక్రవారం రూ.50 వేల ఆర్థిక సాయం అందజేసింది. ఈ చెక్కును మజ్దూర్ యూనియన్ నాయకులు మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మజ్దూర్ యూనియన్ డివిజనల్ సెక్రటరీ రవీందర్ మాట్లాడారు. యూనియన్ బ్రాంచ్ సెక్రటరీ ఇల్లందుల రాజేందర్, నాయకులు ఎమ్డీ ఇక్బాల్, శైలేష్, సంపత్, తాతారావు, ఇన్‌చార్జి ఎస్ఈఈ ఇమ్రాన్ అహ్మద్, రవికుమార్, సురేశ్ యాదవ్ పాల్గొన్నారు.

'అంగన్‌వాడీ కేంద్ర-ఆనంద నిలయం' పోస్టర్ ఆవిష్కరణ

హనుమకొండ సిటీ, జూన్ 7: 'అంగన్‌వాడీ కేంద్రం - ఆనంద నిలయం' పేరుతో ఉన్న పోస్టర్‌ను జిల్లా సంక్షేమ అధికారి మధురిమ ఆవిష్కరించారు. శుక్రవారం హనుమకొండ హౌసింగ్ బోర్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ కవిత ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. బడిబాట సందర్భంగా పోస్టర్ ఆవిష్కరణ జరిగినట్లు మధురిమ పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, 0-5 ఏళ్ల లోపు పిల్లలకు పౌష్టికాహారం, పిల్లలకు పూర్వ ప్రాథమిక విద్య కల్పన అంశాలపై మరింతగా ప్రచారం చేయాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో టీచర్ సరస్వతీ, హెల్పర్లు స్వప్న, వినోద, ధనలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

ధర్మసాగర్, జూన్ 7 : సీపీఐ జిల్లా స్థాయి శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. శుక్రవారం ధర్మసాగర్ మండల కేంద్రంలో ఆయన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈనెల 15, 16న మండల కేంద్రంలో శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడా వెంకట్‌రెడ్డి వచ్చేస్తున్నట్టు తెలిపారు. సీపీఐ కార్యకర్తలు నాయకులు, కార్మిక సంఘాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హనుమకొండ టౌన్, జూన్7: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా కేయూ సబ్‌స్టేషన్ పరిధిలోని టీబీ ఆస్పత్రి, విద్యారణ్యపురి, కేయూ పోలీస్‌స్టేషన్, సీఆర్‌పీఎఫ్ క్యాంపు ఆఫీస్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, వడ్డెపల్లి పరిధిలోని మైత్రినగర్, పరిమళ కాలనీ, సప్తగిరి, ఆర్‌టీసీ కాలనీ ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు, ఆర్ఈసీ పరిధిలోని దర్గా మెయిన్‌రోడ్డు, పీఎఫ్ ఆఫీస్, భీంనగర్, దర్గాబియాబానీ నగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ, బీజేపీ క్వార్టర్స్ ఏరియాలో ఉదయం 8.30 నుంచి 11 గంటల వరకు, సోమిడి పరిధిలోని బాపూజీనగర్, వెస్ట్‌సిటీ, బాలాజీనగర్, ఇంపిరీయల్ కాలనీ, భవానీనగర్, శాంతినగర్, కాజీపేట మెయిన్‌రోడ్డు, అమీర్ హోటల్, అంబేద్కర్‌నగర్ ఏరియాలో ఉదయం 9 గంటల నుంచి 12 గంటల వరకు, కలెక్టరేట్ పరిధిలోని ఎక్సైజ్ కాలనీ, రైతు బజార్ ఏరియా, భవానీనగర్, వాటర్ ట్యాంక్ ఏరియాలో ఉదయం 8 గంటల నుంచి 10 వరకు, మడికొండ పరిధిలో మడికొండ, కడిపికొండ, కుమ్మరిగూడెం, అయోధ్యపురం ఏరియాలో ఉదయం 10 గంటల నుంచి 1 గంట వరకు విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి. సాంబరెడ్డి తెలిపారు. వరంగల్‌లో ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఏజే మీల్స్ స్టేషన్‌రోడ్డు, ఫోర్ట్ రోడ్డు, గొర్రెకుంట, పోతన, దేశాయిపేట, బొల్లికుంట, ఉర్సు, శంభునిపేట సబ్‌స్టేషన్‌ల పరిధిలో విద్యుత్ సరఫరా జరగదని, అదే విధంగా కేఎంసీ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 7 గంటల నుంచి 8.30 వరకు విద్యుత్ సరఫరా జరగదని డీఈ శెంకేసి మల్లికార్జున్ ఒక ప్రకటనలో తెలిపారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా మల్లన్న విజయం!

(5వ పేజీ తరువాయి)

చేపట్టారు. అధికారిక ప్రకటన ఆలస్యమవుతుండడంతో కౌంటింగ్ కేంద్రం వద్ద నాయకులు పడిగాపులు కాయాల్సి వచ్చింది.

అశోక్, ప్రేమేందర్ ఎలిమినేషన్ తర్వాత కూడా ఎవరికీ రాని కోటా ఓటు

మొదటి ప్రాధాన్యతలో 29,697 ఓట్లు సాధించిన కీలక స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ ఎలిమినేషన్‌లో ఆయనకు వచ్చిన ఓట్లతో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు కూడా ప్రధాన అభ్యర్థుల్లో ఎవరికీ ఏకపక్షంగా రాలేదు. ఈయన ఎలిమినేషన్ తర్వాత బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డిని ఎలిమినేట్ చేసి, ఆయన బ్యాలెట్లలో ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. ఆయనకు వచ్చిన 43,313 బ్యాలెట్లలో ద్వితీయ ప్రాధాన్యతలోనూ ఎవరికీ ఏకపక్షంగా ఓట్లు పడలేదు. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి బీజేపీ కేడర్‌తో సన్నిహిత సంబంధాలుండడం, ఆయన ఇటీవలి వరకు బీజేపీలో క్రియాశీలకంగా పనిచేసి ఉన్న నేపథ్యంలో బీజేపీకి మొదటి ప్రాధాన్యత ఓటేసిన వారిలో సింహభాగం ద్వితీయ ప్రాధాన్యత ఓటు రాకేష్‌రెడ్డికి వేస్తారని భావించినా వారి అంచనాలు తలకిందులయ్యాయి. ఈ ఓట్లలోనూ కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్నకు గణనీయమైన ఓట్లు రావడంతో ఆయనే మంచి మెజార్టీతో ఆధిక్యతలో ఉన్నారు. అయితే బీజేపీ అభ్యర్థి ఎలిమినేషన్ తర్వాత కూడా కోటా ఓటు రాకపోవడంతో ఎన్నికల సంఘం ఉన్నతాధికారుల అనుమతితో సాంకేతిక వెసులుబాటు ద్వారా మల్లన్నను విజేతగా ప్రకటించే ప్రక్రియను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ దాసరి హరిచందన చేపట్టారు.

2021 మాదిరిగానే చివరి వరకు ఉత్కంఠ

2021లో జరిగిన ఎన్నికలోనూ దాదాపు ఇదేరీతిలో తీవ్ర ఉత్కంఠ కొనసాగింది. ఆ ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, నాటి స్వతంత్ర అభ్యర్థి తీన్మార్ మల్లన్న, తెలంగాణ జనసమితి అభ్యర్థి ప్రొఫెసర్ కోదండరామ్, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ అభ్యర్థి రాములు నాయక్, సీపీఐ అభ్యర్థి జయసారథిరెడ్డి, యువతెలంగాణ పార్టీ నుంచి రాణిరుద్రమరెడ్డి పోటీచేశారు. వారిలో ప్రేమేందర్‌రెడ్డి నాలుగో స్థానంలో ఉండగా, ఆయన ఎలిమినేషన్ తర్వాత కూడా మొదటి, రెండో స్థానాల్లో ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తీన్మార్ మల్లన్నల్లో ఎవరికీ కోటా ఓటు రాకపోవడంతో మూడోస్థానంలో ఉన్న ప్రొఫెసర్ కోదండరామ్‌ని ఎలిమినేట్ చేసి ఆయనకు వచ్చిన ద్వితీయ ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. కోటా ఓటుకు పల్లారాజేశ్వర్‌రెడ్డి చేరడంతో ఆయన్ను ఎమ్మెల్సీగా ప్రకటించారు. ఆ ఎన్నికలో స్వతంత్ర అభ్యర్థిగా పోటీచేసిన మల్లన్నే ఈ ఎన్నికలో కాంగ్రెస్ నుంచి బరిలో దిగి, తీవ్ర పోటీలోనూ సంచలన విజయం నమోదు చేశారని చెప్పవచ్చు.

మూడో ప్రయత్నంలో ఎమ్మెల్సీగా మల్లన్న విజయం

జర్నలిస్టుగా, ప్రశ్నించేగొంతుకగా.. తీన్మార్ మల్లన్నగా అందరికీ సుపరిచితుడైన చింతపండు నవీన్ ఎట్టకేలకు మూడో ప్రయత్నంలో ఎమ్మెల్సీగా విజయం సాధించారు. 2015లో ఆయన మొదటిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచి ఓటమిపాలయ్యారు. ఆతర్వాత 2021లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి బీఆర్ఎస్‌కు బలమైన పోటీ ఇచ్చారు. మూడో ప్రయత్నంలో ఈ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉండి విజయం సాధించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో నేరుగా కొట్లాడిన క్రమంలో మల్లన్నపై 59వరకు కేసులు నమోద య్యాయని, ప్రశ్నించే గొంతుకగా పోరాడిన మల్లన్న గెలుపు స్ఫూర్తిదాయకమని కాంగ్రెస్‌నేతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలో జరిగిన అన్ని రౌండ్లలోనూ మల్లన్నకు ఓట్ల ఆధిక్యత వచ్చింది. మొత్తం 4,63,839 ఓట్లకు గాను, 3,36,013 ఓట్లు పోలయ్యాయి. వీటిల్లో 25,824 ఓట్లు చెల్లకుండా పోగా, 3,10,189 ఓట్లు చెల్లాయి. వీటిల్లో కోటా ఓటు 1,55,095 ఓట్లు ఎవరికీ రాకపోవడంతో ద్వితీయ ప్రాధాన్యత ఓట్లను లెక్కించారు. మొదటి ప్రాధాన్యత ఓట్లలో కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 1,22,813 ఓట్లు వస్తే, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేష్‌రెడ్డికి 1,04,248 ఓట్లు వచ్చాయి. బబీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 43,313 ఓట్లు, స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్ పాలకూరికి 29,967 ఓట్లు వచ్చాయి. ద్వితీయ ప్రాధాన్యత ఓట్లలోనూ అశోక్‌కుమార్ సహా స్వతంత్ర అభ్యర్థులందరిఓట్లలో మల్లన్నకే ఎక్కువ ఓట్లు రాగా, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి ఓట్లలోనూ బీఆర్ఎస్ అభ్యర్థికి ధీటుగా ఓట్లు రాబట్టారు.

కర్బూజాతో లస్సీ... తాండ్ర

'మధుర దధీని మద్యే శర్కరాం సన్నియోజ్య శుభ విదలిత ఖండం ప్రక్షిపేత్ ఖర్బూజేయమ్!
కరవిలులితమానైర్వాసితం చాతిగం ధైర్ఘిగమిషు జఠరాగ్నిం స్థాపయత్యేవ నూనమ్!

'ఖర' అంటే గరుకుగా ఉండేదని. 'కొందరి మాట కరకు. మనసు వెన్న' అంటామే... అలాంటిదే ఈ కర్బూజా పండు కూడా. పైన తోలు మాత్రమే గరుకు. లోపలంతా తియ్యని, మెత్తని గుజ్జు. ఒకప్పుడు ఇది వేసవి ఫలం. ఇప్పుడు అన్ని వేళలా మార్కెట్లో దొరుకుతోంది. అన్ని పోషకాలూ ఉన్న చలవనిచ్చే పండు ఇది. మనది ఉష్ణ మండలం కాబట్టి, దీన్ని తినేందుకు అన్ని కాలాలు, అన్ని ఋతువులూ అనుకూలమైనవే. వేడినీ, ఎండనీ తట్టుకునే శక్తి శరీరానికి ఇస్తుంది. ఆలస్యంగా అరిగి, వెంటనే షుగర్ రక్తంలో పెరగకుండా చేస్తుంది.



చర్మానికి మంచిది...

సమాన గుణ ధర్మాలున్న ద్రవ్యాలు సమాన గుణ ధర్మాలపైన పని చేస్తాయని ఓ సూత్రం ఉంది. మెదడు ఆకారంలో ఉండే వాల్నట్స్ మెదడుని సుసంపన్నం చేసినట్టే, గరుకైన తోలు కలిగిన కర్బూజా గరుకుబారిన చర్మాన్ని మృదువు పరుస్తుంది ఎగ్జీమా, సొరియాసిస్, కాలిన పుండ్లు, గాయాలకు ఇది మంచి ఔషధం. చంటి పిల్లలకు పెట్టదగినది. గుండెను, మూత్రాశయ వ్యవస్థను బల పరుస్తుంది. బీపీ, కీళ్లవాతాన్ని తగ్గిస్తుంది. మూత్రం అధికంగా అయ్యేలా చేసి శరీరానికి నీరు పట్టడాన్ని తగ్గిస్తుంది. కేన్సర్‌వల్ల, దాని చికిత్సలవల్ల కలిగే ఉపద్రవాలను తగ్గించి శరీరానికి ఉపశమనాన్నిస్తుంది. శక్తినిస్తుంది.

స్థూలకాయానికి ఔషధం...

ఆధునిక వైద్య శాస్త్రం కర్బూజా పండు లోపలి గుజ్జు గురించి చెప్పింది. దీన్ని తింటే విష దోషాలు హరిస్తాయి, కొవ్వు, వాపులు, నొప్పులు తగ్గుతాయని, థైరాయిడ్ అదుపులోకి వస్తుందని పేర్కొంది. కడుపులో నులిపురుగులు బయటకు పోతాయని, జీవ కణాలు నశించిపోకుండా సంరక్షిస్తుందని తెలిపింది. నెలసరి సమయంలో, మెనోపాజ్ వలన అధిక రక్తస్రావం అవుతున్నప్పుడు స్త్రీలు కర్బూజాని తప్పనిసరిగా తీసుకోవాలనేది చెప్పదగిన సూచన. ఇది ముఖ్యంగా ఎ, సి విటమిన్లు కలిగి ఉంటుంది. తొమ్మిది శాతం మాత్రమే కార్బోహైడ్రేట్లున్నాయి. అందుకని షుగరు రోగులు తీసుకోవచ్చు. దీంట్లో బీటా కెరోటిన్స్... కేరెట్‌తో సమానంగా ఉంటాయి. షుగరు, స్థూలకాయం ఉన్నవారు తినదగిన పండ్లలో కర్బూజా మొదటిదని చెప్పవచ్చు.

కర్బూజా లస్సీ ఇలా...

తియ్యని గడ్డ పెరుగును శుభ్రమైన తెల్లని వస్త్రంలో వేసి నీటిని వడగట్టేయండి. కర్బూజా లోపల దూదిలా ఉండే భాగాన్ని, గింజల్ని తొలగించి, గట్టిగా ఉండే గుజ్జుని చిన్నచిన్న ముక్కలుగా తరగండి. ఈ ముక్కల మీద పంచదార చల్లి, వడగట్టిన పెరుగును కూడా వేసి గరిటెతో కలపండి. దీనిమీద లెమన్ గ్రాస్ లాంటి పరిమళాలను కలిపితే రుచి, కమ్మదనం అధికంగా ఉంటాయి. పిల్లలు కూడా ఇష్టంగా తింటారు. ఇది జీర్ణశక్తిని బలసంపన్నం చేస్తుందన్నాడు క్షేమశర్మ తన 'క్షేమకుతూహలం' గ్రంథంలో. దీన్ని జీర్ణశక్తి పైన పని చేయించటం కోసం కొద్దిగా మిరియాల పొడి, చిటికెడంత పచ్చకర్పూరం, అర చెంచాడు అల్లం ముద్ద కూడా చేర్చటం ఉత్తమం. కఫాన్ని, వేడినీ, వాతాన్నీ తగ్గించటంలో ఈ కర్బూజా లస్సీ తిరుగులేనిది. మూత్రం బాగా అయ్యేలా చేసి వేడిని అదుపు చేస్తుంది.

తాండ్ర ఇలా...

సఖండం ఖర్బూజం ఖండం చంద్రార్ధకవి మండితమ్!
పక్వామ్ర రస సంయుక్త మత్యారాధితవాన్!!

మిరియాల పొడి, పచ్చకర్పూరం, అల్లం ముద్ద కూడా కలిపిన ఈ 'కర్బూజా రసాల' అనే లస్సీలో తగినంత మామిడి పండు రసాన్ని కూడా చేర్చి, అన్నిటినీ బాగా మిక్సీ పట్టి, గుజ్జుగా చేయాలి. దీన్ని ఒక పళ్లెంలో పలుచగా ఆరబోసి, మంచి ఎండలో పెట్టి, గట్టిపడే వరకూ ఎండించండి. అద్భుతమైన, రుచికరమైన, విలువైన ఖర్బూజతాండ్ర తయారౌతుంది. ఓవెన్లు, హీటర్లు అందుబాటులో ఉన్న వాళ్లు వాటి సాయంతో కూడా దీన్ని తాండ్రగా చేసుకోవచ్చు. పిల్లలు బడికి తీసుకెళ్లేందుకు అనువైన, బలకరమైన స్వీటు ఇది!

'సర్వ రసాలేషు ఉత్తమోత్తమమ్' అన్నాడు ఈ మామిడి రసం కలిసిన రసాలను క్షేమశర్మ.

● గంగరాజు అరుణాదేవి

గింజల్లోనూ అవే గుణాలు...

కర్బూజా ముక్కల్ని సలాడ్స్‌లో కలిపి తినవచ్చు. దీని గింజల్ని ఎండించి దంచిన పొడిని కూరల్లోనూ చారు, పప్పుచారుల్లోనూ చిక్కబరిచేందుకు కలుపుతారు. సోయాబీన్ లాగానే దీని గింజల్ని వాడుతుంటారు. దీని గుజ్జుకున్న గుణాలన్నీ ఈ గింజలకున్నాయి. అదనంగా మాంసకృత్తులు వగైరా కూడా లభిస్తాయి. అందుకని కర్బూజా పండుని తరిగేప్పుడే గింజల్ని వేరు చేసి, కడిగి ఆరబెట్టుకుంటే తరువాత మిక్సీ పట్టుకుని వాడుకోవచ్చు.

ఎండలు తగ్గిపోయాయి. వాతావరణం కాస్త చల్లబడింది. ఇలాంటప్పుడు నాన్‌వెజ్ వంటకాలతో దోస్తీ చేస్తే ఆ మజానే వేరు. నాటుకోడి పులుసు, అంకాపూర్ కోడి, కోడి మునగకాయ కూర, కోడి మామిడి కాయ కూర వంటల్ని ఈ వీకెండ్‌లో వండుకోండిలా...

వంటిల్లు

కోడి కూర రుచికరంగా!



నాటుకోడి పులుసు

కావాల్సిన పదార్థాలు

నాటుకోడి- 1 కేజీ, పసుపు- అర టీస్పూన్, ఉల్లిపాయలు- 2 (సన్నగా తరగాలి), కారంపొడి- 2 టీస్పూన్లు, ధనియాల పొడి- 2 టీస్పూన్లు, గరం మసాలా పొడి- అర టీస్పూన్, అల్లం-వెల్లుల్లి పేస్ట్- 2 టీ స్పూన్లు, కొబ్బరి పొడి- 3 టేబుల్ స్పూన్లు, చింతపండు పులుసు- అర కప్పు, ఉప్పు- తగినంత, నూనె- 4 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం

ముందుగా నాటుకోడిని మంట మీద కాల్చి కొంచెం పసుపు రాసి కడిగి ముక్కలు చేసి పెట్టుకోవాలి. మూకుడులో నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి ఎర్రగా అయ్యేంత వరకు వేయించాలి. ఇందులో పసుపు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి రెండు నిముషాలపాటు కలిపిన తర్వాత కోడి ముక్కలు, కారం పొడి, ధనియాల పొడి, తగినంత ఉప్పు వేసి మూడు నిముషాల పాటు కలపాలి. ఆ తర్వాత మూకుడుపై మూత పెట్టి కుక్ చేయాలి. ముక్కలు వేగిన తర్వాత కొబ్బరి పొడి వేసి కలపాలి. ఇందులో కప్పు నీళ్లు పోసి కలిపి చిన్న మంట మీద ఉడికించాలి. ముక్కలు బాగా ఉడికిన తర్వాత గరం మసాలా, చింతపండు పులుసు వేసి మరో ఐదు నిముషాల పాటు ఉడికించాలి. నూనె పైకి తేలిన తర్వాత మూకుడు దింపేయాలి. అన్నం, చపాతీ, రాగి సంగటితో నాటికోడి పులుసును తింటే రుచిగా ఉంటుంది.

అంకాపూర్ కోడి



కావాల్సిన పదార్థాలు

నాటుకోడి- 1 కేజీ, పసుపు- అర టీస్పూన్, ధనియాల పొడి- 3 టీస్పూన్లు, ఉల్లిపాయలు- 3 (సన్నగా తరగాలి), అల్లం, వెల్లుల్లి పేస్ట్- 2 టీస్పూన్లు, కారం పొడి- 2 టీస్పూన్లు, కొబ్బరి పొడి- 2 టేబుల్ స్పూన్లు, లవంగాల పొడి- అర టీస్పూన్, షాజీర- 1 టేబుల్ స్పూన్, కొత్తిమీర- కొద్దిగా, ఉప్పు- తగినంత, నూనె- 4 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం

నాటుకోడిని మంట మీద బాగా కాల్చి పసుపు రాసి కడిగి ముక్కలు చేసుకోవాలి. ఈ ముక్కల్లో కొన్ని ఉల్లిపాయలు, సగం పసుపు, సగం ధనియాల పొడి, సగం అల్లం వెల్లుల్లి పేస్ట్ కొద్దిగా నీళ్ల చల్లి కలిపి మూతపెట్టి అరగంట పాటు ఉంచాలి. ఆ తర్వాత వెడల్పాటి గిన్నె లేదా కడాయిలో నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి ఎర్రగా అయ్యేంత వరకూ వేయించాలి. ఇందులో అల్లం, వెల్లుల్లి పేస్ట్ వేసి కొద్దిగా వేగిన తర్వాత కోడి ముక్కలు వేసి వేయించాలి. చివరగా కారంపొడి, పసుపు, ధనియాల పొడి, కొబ్బరి పొడి, తగినంత ఉప్పు వేసి కలిపి అవసరమైనన్ని నీళ్లు పోసి ఉడికించాలి. కోడి ముక్కలు బాగా ఉడికిన తర్వాత లవంగాల పొడి, షాజీర వేసి కలిపి దింపేయాలి.

కోడి మునగకాయ కూర



కావాల్సిన పదార్థాలు

కోడి- 1 కేజీ, మునగకాయలు- 10, టమాటాలు- 3 (సన్నగా తరగాలి), ఉల్లిపాయలు-2 (సన్నగా తరగాలి), పచ్చిమిర్చి- 3, కరివేపాకు- 2 రెబ్బలు, పసుపు- అర టీస్పూన్, అల్లం వెల్లుల్లి పేస్ట్- 2 టీస్పూన్లు, కారం పొడి- ఒకటిన్నర టీస్పూన్, ధనియాల పొడి- 2 టీస్పూన్లు, గరం మసాలా పొడి- అర టీస్పూన్, ఉప్పు- తగినంత, నూనె- 4 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం

కోడి ముక్కలు శుభ్రంగా కడిగి జల్లెట్లో వేయాలి. మునగకాయలు రెండు లేదా మూడు అంగుళాలంత ముక్కలుగా తరిగి పైన నార తీయాలి. మూకుడులో నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయలు, నిలువుగా చీల్చిన పచ్చిమిర్చి వేసి మెత్తబడే వరకు వేయించాలి. పసుపు, అల్లం వెల్లులి పేస్ట్, కరివేపాకు వేసి కొద్దిగా వేగిన తర్వాత కారంపొడి, ధనియాల పొడి వేసి కలపాలి. ఆ తర్వాత కోడిముక్కలు , తగినంత ఉప్పు వేసి కలిపి మూత పెట్టాలి. ముక్కలు ఉడికిన తర్వాత తరిగిన టమోటా ముక్కలు, మునగకాయలు కూడా వేయాలి. ఉడికిన తర్వాత గరం మసాలా పొడి వేసి దింపేయాలి.

కోడి మామిడికాయ కూర

కావాల్సిన పదార్థాలు

కోడి- 1 కేజీ, మామిడికాయలు- 2 చిన్నవి, ఉల్లిపాయలు- 3, పచ్చిమిర్చి- 4, అల్లం వెల్లుల్లి పేస్ట్- 2 టీస్పూన్లు, పెరుగు- అర కప్పు, కొబ్బరి పొడి- 3 టీస్పూన్లు, గసాలు- 3 టీస్పూన్లు, పసుపు- అర టీస్పూన్, కారంపొడి- ఒకటిన్నర టీస్పూన్, గరం మసాలా పొడి- అర టీస్పూన్, కొత్తిమీర- కొద్దిగా, ఉప్పు- తగినంత, నూనె- 4 టేబుల్ స్పూన్లు

తయారీ విధానం

మామిడికాయలను తురమాలి లేదా చిన్న ముక్కలుగా తరగాలి. ఆ తర్వాత కోడి ముక్కలను శుభ్రంగా కడిగి పక్కన ఉంచుకోవాలి. గసాలు వేయించి కొబ్బరితో కలిపి పొడి చేసి పెరుగు కలిపి పక్కన పెట్టుకోవాలి. గిన్నెలో నూనె వేడి చేసి సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలు వేసి దోరగా వేయించాలి. నిలువుగా చీల్చిన పచ్చిమిర్చి, పసుపు, అల్లం వెల్లుల్లి పేస్ట్,



కారం పొడి, ధనియాల పొడి వేసి కలపాలి. ఆ తర్వాత కోడి ముక్కలు, తగినంత ఉప్పు వేసి కలిపి మూత పెట్టాలి. ముక్కలు బాగా వేగిన తర్వాత మామిడికాయ తురుము వేసి రెండు నిముషాల పాటు వేయించాలి. కొబ్బరి, గసాల ముద్ద, కప్పు నీళ్లు పోసి కలపాలి. ఆ తర్వాత మూతపెట్టి ఉడికించాలి. కోడి ముక్కలు బాగా ఉడికి నూనె తేలుతున్నప్పుడు కొత్తిమీర, గరం మసాలా పొడి వేసి కలిపిన తర్వాత దింపేయాలి.

నవ్య 'స్మార్ట్ పేజీ'లో ఆసక్తికర కథనాల కోసం... ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/5P96QOwలో చదవండి.

అది వ్యసనం కాదు వ్యాధి



తాగుబోతుల కంటే, వాళ్లతో కలిసి జీవించే వాళ్లే ఎక్కువగా దెబ్బ తింటూ ఉంటారు. కానీ మందు మత్తులో కూరుకుపోయిన వ్యసనపరులకు ఈ స్పృహ ఉండదు. ఇలాంటివాళ్ల కళ్లు తెరిపిస్తూ, వారికి బాసటగా నిలుస్తోంది 'ఆల్కహాల్ ఎనానిమస్' సంస్థ. దీని అనుబంధ సంస్థ, ఆల్ అనాన్ మద్దతుతో, గాడిన పడిన తమ కుటుంబాల గురించి కొందరు మహిళలు నవ్యతో పంచుకున్న అనుభవాలివి.

రీహ్యాబ్ సెంటర్లు, కౌన్సెలింగ్ సెంటర్లు, పసరు మందులు.. ఇలా వ్యసనపరుల చేత మద్యాన్ని మాన్పించే మార్గాలు ఎన్నో ఉన్నాయి. ఈ ప్రయత్నాలన్నీ ఫలితాన్నివ్వక, కొత్త మార్గాల కోసం అన్వేషించేవారికి చేయూతగా నిలుస్తోంది 'ఆల్కహాల్ అనానిమస్' సంస్థ. మద్యం వ్యసనం నుంచి బయటపడడంలో కుటుంబ తోడ్పాడు కీలకమని బలంగా నమ్మే ఈ స్వచ్ఛంద సంస్థ ద్వారా, ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 30 లక్షల మంది, దేశవ్యాప్తంగా 50 వేల మంది కోలుకుంటున్నారు. ఈ సంస్థ, ఎలాంటి రుసుములు, ఫీజులతో పని లేకుండా, మందులు, కౌన్సెలింగ్‌ల అవసరం లేకుండా, మీటింగ్‌లకు హాజరయ్యే కుటుంబాల అనుభవాలు, టూల్స్ సహాయంతో వ్యసనపరుల్లో మార్పును తీసుకొస్తోంది.

ఆల్ అనాన్ వేళలు ఇవే!

ఆల్ అనాన్ మీటింగ్స్ వారమంతా జరుగుతాయి. ప్రతి సోమవారం, శుక్రవారం బేగంపేటలోని సెయింట్ ఫ్రాన్సిస్ కాలేజీలో రాత్రి 7 నుంచి 8 గంటల వరకూ, బంజారాహిల్స్‌లోని సెయింట్ ఆల్ఫోన్స్ స్కూల్‌లో ప్రతి ఆదివారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకూ, నారాయణగూడ వైఎమ్‌సిఎలో ప్రతి గురువారం సాయంత్రం ఏడు నుంచి ఎనిమిది గంటల వరకూ, ఈ మీటింగ్స్ జరుగుతాయి. ప్రతి శుక్రవారం సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకూ ఆన్‌లైన్ మీటింగ్ కూడా జరుగుతుంది. ఆల్ అనాన్ టోల్ ఫ్రీ నంబర్: 9666466118, 9666466119

ఆల్ అనాన్
ఆల్(ఆల్కహాల్) అనాన్(అనానిమస్)



16 ఏళ్లుగా సోబర్‌గా...

మా వారు బింజ్ డ్రింకర్. అదే పనిగా తాగకపోయినా, తాగడం మొదలుపెడితే రోజుల తరబడి తాగేవారు. అలాగే రోజులు, నెలల తరబడి ఇంటినే మర్చిపోతూ ఉండేవారు. కాల్ చేస్తే ఫోన్ తీయరు. తానెక్కడున్నారో తెలియనివ్వరు. దాంతో ఆయన ఆచూకీ తెలియక, ఉన్నారో, పోయారో అర్థం కాక, దినపత్రికల్లో సంస్మరణ ప్రకటనలను పరిశీలించేదాన్ని. ఆల్కహాలిక్‌కు భార్యగా నేనెంత ఒత్తిడికి లోనై ఉంటానో దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు. ఆ అలవాటు ఉన్నంత మాత్రాన ఆయనేమీ చెడ్డవారు కారు. మా మధ్య ఎలాంటి గొడవలూ ఉండేవి కావు. మద్యం మత్తులో ఆయన నాతో దురుసుగా ఎప్పుడూ ప్రవర్తించలేదు. నేను కూడా వ్యసనం వంకతో ఆయన్ని తూలనాడిందీ లేదు. కానీ ఎంత ప్రయత్నించినా ఆయన మద్యం ఊబిలో నుంచి బయటకు రాలేకపోతున్నారనే విషయాన్ని గ్రహించాను. ఆ దురలవాటు నుంచి బయట పడడమెలాగో తనకు అర్థం కావడం లేదనీ, నాకు ముఖం చూపించలేకే నెలల తరబడి ఇంటికి దూరంగా ఉండిపోతున్నాననీ ఆయన ఒక సందర్భంలో బయటపడ్డారు. అప్పటికే రీహ్యాబ్ సెంటర్ల లాంటి ప్రత్యామ్నాయాలను ప్రయత్నించి ఉన్నాం. కానీ ఫలితం కనిపించక, ఆ ఊబి నుంచి ఎలా బయటపడాలో తెలియక బాధపడుతున్న సమయంలో, ఆల్కహాల్ ఎనానిమస్ అనుబంధ సంస్థ, 'ఆల్ అనాన్' గురించి తెలిసింది.

అక్కడ కౌన్సెలింగ్, చికిత్సలూ లాంటివి లేకపోవడం ఊరట కలిగించింది. మాలాంటి కుటుంబాలు ఒక చోట చేరి, తమ తమ అనుభవాలను పంచుకునే వేదిక అది. ఆ అనుభవాలు, స్లోగన్లు, టూల్స్ మా వారిలో మార్పుకు సహాయపడ్డాయి. మా ప్రయత్నం ఫలించి, ఆయన మద్యం మానేశారు. గత 16 ఏళ్లుగా ఆయన మద్యం జోలికి వెళ్లలేదు. అయితే ఆల్ అనాన్‌కు దంపతులిద్దరూ ఎందుకు హాజరు కావాలనే ప్రశ్న ఎంతో మందిలో తలెత్తడాన్ని నేను గమనించాను. నిజానికి మద్యం అలవాటును ఒక వ్యసనంగా కాకుండా దాన్నొక జబ్బుగానే చూడాలి. జబ్బుతో బాధపడే వ్యక్తికి మనమెలా చేదోడువాదోడుగా ఉంటూ నయం చేసుకుంటామో, మద్యం వ్యసనపరులకు కూడా జీవిత భాగస్వామి తోడుగా నిలవాలి. భార్యలు, భర్తలను చీదరించుకుని, అవమానించి, చులకన చేసి, గొడవపడితే బంధం మరింత బలహీనపడుతుంది. ఆ ప్రభావం పిల్లల మీద కూడా పడుతుంది. కాబట్టి భర్త, ఆ అలవాటు మూల కారణాన్ని స్వయంగా గ్రహించేలా చేయాలి. మద్యం మానే ప్రయత్నంలో తమ వంతు సహాయసహకారాలను అందించాలి. 'నన్ను ఒంటరిగా వదిలేశావంటే, బయటకు వెళ్లిపోయి తాగేస్తాను' అని మా వారు అనడంతో, ఉద్యోగానికి సెలవు పెట్టేసి, తలుపుకు తాళం వేసి ఆయనతోనే రోజుల తరబడి ఉండిపోయిన సందర్భాలున్నాయి. ఆ వ్యసనాన్ని ఒక రోగం దృష్టితో చూడగలిగాను కాబట్టే, దాన్ని వదిలించుకోవడంలో ఆయనకు తోడ్పడగలిగాను. అలవాటు ఆయనది, కాబట్టి సమస్య కూడా ఆయనదే, ఇలాంటి మీటింగులకు వెళ్లవలసిన అవసరం నాకేముంది? అని భావించకుండా భార్యలు కూడా భర్తలతో పాటు హాజరయినప్పుడే ఫలితం దక్కుతుంది.

పవిత్ర, హైదరాబాద్.

గోప్యతే ప్రధానం

మద్యం వ్యసనం పట్ల ఇప్పటికీ సమాజానిది చిన్న చూపే! భర్తకు ఈ అలవాటు ఉందని చెప్పినప్పుడు చులకనగా చూడడంతో పాటు, భర్త వ్యసనపరుడిగా మారడానికి భార్యలో ఉన్న తప్పుల కోసం వెతికే వాళ్లకు ఈ సమాజంలో కొదవ ఉండదు. ఇలాంటి ధోరణి వల్లే ఈ వ్యసనం పట్ల గోప్యత పాటించక తప్పడం లేదు. ఈ ఇబ్బందిని తొలగించాలనే ముఖ్యోద్దేశంతోనే ఆల్ అనాన్ సపోర్ట్ గ్రూప్, గోప్యతనే ప్రధాన అంశంగా ఎంచుకుంది. ఈ సంస్థను ఆశ్రయించేవారి పేర్లు, వివరాలు, విషయాలు గోప్యంగా ఉంటాయి. హాజరయ్యే వాళ్లందరూ ఈ సూత్రాన్ని కచ్చితంగా పాటిస్తారు. ఎల్ ఎనాన్‌కు వ్యసనపరుల కుటుంబసభ్యులు లేదా భార్యలూ హాజరైతే, ఆల్కహాలిక్స్ ఆల్కహాలిక్ ఎనానిమస్‌కు హాజరవవలసి ఉంటుంది. ఆల్ అనాన్‌లో 12 సూత్రాల ఆధారంగా ఆల్కహాలిక్స్‌తో ప్రవర్తించే విధానం గురించి, వాళ్లలో మార్పుకు తోడ్పడే స్వభావాల గురించి సాటి స్పాన్సర్ల ద్వారా తెలుసుకోగలుగుతాం. ముందు నుంచీ సభ్యులుగా ఉన్నవాళ్లు స్పాన్సర్లుగా మారి, కొత్త వాళ్లకు మార్గనిర్దేశం చేస్తారు. 1:1 నిష్పత్తిలో సాగే ఈ స్పాన్సర్‌షిప్‌లో, ఆల్కహాలిక్స్‌తో మసలుకోవడంలో మనం చేసిన, చేస్తున్న తప్పులు అవగతమవడంతో పాటు, వాళ్లతో ఎలా ప్రవర్తించాలో ఎలా ప్రవర్తించకూడదో నేర్చుకుంటాం. మరో పక్క ఆల్కహాల్ ఎనానిమస్‌కు హాజరయ్యే ఆల్కహాలిక్స్ కూడా అక్కడ నేర్చుకున్న వాటిని ఇళ్ల దగ్గర ఆచరణలో పెట్టడం మొదలుపెడతారు. అలా దంపతులిద్దరూ పరస్పరం సహకరించుకుంటూ సమిష్టిగా ఆ దురలవాటు మీద విజయం సాధించగలుగుతారు.

ఇక నా విషయానికొస్తే, మా వారికి పెళ్లికి ముందే మద్యం అలవాటు ఉంది. సోషల్ డ్రింకింగ్ సర్వసాధారణమే అనే ఉద్దేశంతో పెళ్లికి ఒప్పుకున్నాను. అది అలవాటు కాదు వ్యసనమనే విషయం పెళ్లైన రెండు నెలలకు తెలిసింది. రోజూ రాత్రివేళకే పరిమితమైన మద్యం కాస్తా పగటివేళకు కూడా వ్యాపించింది. రీహ్యాబ్‌లో వేయడం, 'అయ్యో దాని వల్ల ఆయన ఉద్యోగం పోతే, నా బ్రతుకేం కాను?' అని భయపడడం నాకు మామూలైపోయింది. అలా ఒక రీహ్యాబ్‌లో మావారికి ఆల్ అనాన్‌మస్ గురించి తెలిసింది. బయటకు వచ్చాక, ఇద్దరం హాజరు కావాలని నిర్ణయించుకున్నాం. అలా ఏడేళ్ల పాటు ఆల్కహాలిక్‌గా ఉన్న మా వారు పూర్తిగా మద్యం మానేయగలిగారు. ఆయన మద్యం మానేసి ఇప్పటికి ఎనిమిదేళ్లు.

సుష్మ, హైదరాబాద్.
(గోప్యత కోసం పేర్లను మార్చడం జరిగింది)

● గోగుమళ్ల కవిత

మేకప్

వానల్లో చెక్కుచెదరకుండా...



వర్షాకాలంలో మేకప్‌ను కాపాడుకోవడం కాస్త కష్టమే! తేమతో కూడిన వాతావరణం, అకస్మాత్తుగా కురిసే కుండపోత వానలు మేకప్‌ను డిస్టర్బ్ చేసేస్తూ ఉంటాయి. కాబట్టి ఈ కాలంలో కొన్ని మెలకువలు పాటించాలి.

క్రీమ్ బేస్‌డ్ అయితే...

మేపక్‌లో ఉపయోగించే ఉత్పత్తులు క్రీమ్ బేస్‌డ్ అయితే, వాటిని వీలైనంత పరిమితంగా వాడుకోవాలి. వాటిని బాగా బ్లెండ్ చేయడంతో పాటు, చెదిరిపోకుండా ఉండడం కోసం పౌడర్‌తో సెట్ చేసుకోవాలి. ఇలా మేకప్ వేసుకోగలిగితే 'ఎయిర్ బ్రష్' లుక్ సొంతమవుతుంది.

సెట్టింగ్ పౌడర్‌తో...

మేకప్ ఎక్కువ సమయం పాటు చెక్కుచెదరకుండా ఉండడం కోసం సెట్టింగ్ పౌడర్ వాడుకోవాలి. మేకప్ పూర్తయిన తర్వాత పెద్ద బ్రష్ తీసుకుని ముఖం, మెడ మీద పరుచుకునేలా సెట్టింగ్ పౌడర్‌ను అద్దుకోవాలి.

బోల్డ్ లిప్‌స్టిక్

మీ దగ్గర లెక్కలేనన్ని లిప్‌స్టిక్‌లు ఉండి ఉండొచ్చు. కానీ వానాకాలంలో బోల్డ్ కలర్స్‌కే ప్రాధాన్యం ఇవ్వాలి. ఎరుపు, మెరూన్, బ్రౌన్ రంగులు వానాకాలంలో ఎంతో ఆకర్షణీయంగా కనిపిస్తాయి.

మస్కారా ఇలా...

వాటర్ ప్రూఫ్ మస్కారా వానాకాలానికి అనువైనది. అదనపు భద్రత కోసం మస్కారా అప్లై చేసిన తర్వాత, లైట్‌గా పౌడర్ డస్టింగ్ చేసుకొని, రెండో కోట్ వేస్తే కనురెప్పలు చిక్కగా కనిపిస్తాయి.

సింపుల్‌గా....

వానాకాలం వీలైనంత తక్కువ మేకప్ వేసుకోవాలి. ఫౌండేషన్ తక్కువగా వాడుకోవాలి. ఈ కాలంలో వాతావరణంలో తేమ ఎక్కువగా ఉంటుంది కాబట్టి పలుచని మేకప్ ఎక్కువ సమయం పాటు చెదిరిపోకుండా ఉంటుంది. ఒకవేళ వానకు తడిచి, చెదిరిపోయినా, ముఖం కళావిహీనంగా మారిపోకుండా ఉంటుంది.

ఆంధ్రజ్యోతి

నవ్య | చిత్రజ్యోతి

శనివారం • 8 జూన్ 2024

cinema@andhrajyothy.com

అశ్వత్థామ .. యుద్ధానికి సిద్ధం!



ప్రభాస్ హీరోగా నటిస్తున్న భారీ చిత్రం 'కల్కి 2898 ఏడీ' ట్రైలర్ ఈ నెల 10న విడుదల కానుంది. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వైజయంతి మూవీస్ అధినేత అశ్వనీదత్ ప్రతిష్ఠాత్మకంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. సినిమాలో అశ్వత్థామగా నటిస్తున్న అమితాబ్ బచ్చన్ లుక్ పోస్టర్‌ను విడుదల చేశారు. మధ్యప్రదేశ్‌లో నెమావార్‌లోని నర్మదా ఘాట్ దగ్గర ఏర్పాటు చేసిన ఓ మ్యాసివ్ ప్రొజెక్షన్ ద్వారా అమితాబ్ పాత్రను పరిచయం చేశారు. ఇప్పటికీ అశ్వత్థామ నర్మదా మైదానంలో నడుస్తాడనే నమ్మకం ఉండడంతో నర్మాదా ఘాట్‌లో అమితాబ్ లుక్‌ను విడుదల చేయం ప్రాధాన్యం సంతరించుకుంది. యుద్ధభూమి మధ్యలో నిలబడి ఓ అస్త్రాన్ని పట్టుకుని యుద్ధానికి సిద్ధంగా ఉన్నట్టు అమితాబ్ కనిపించారు. ఆయన నుదిటిపై ఉన్న రత్నం మెరుస్తోంది. ఆయన వెనుక ఓ భారీ వాహనం ఉంది, అలాగే ఆయన ముందు కొంతమంది వ్యక్తులు నేలపై పడి ఉన్నారు. ఈ నెల 27న విడుదల కానున్న 'కల్కి' చిత్రంలో కమల్‌హాసన్, దీపికా పదుకొణే, దిశా పటానీ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు.



హిందూపురం ఎమ్మెల్యేగా వరుసగా మూడోసారి గెలుపొందిన నందమూరి బాలకృష్ణను టాలీవుడ్‌కు చెందిన పలువురు సినీ ప్రముఖులు కలసి అభినందనలు తెలిపారు. దర్శకుడు గోపీచంద్ మలినేని, బాబీ, అనిల్ రావిపూడి, నిర్మాత సూర్యదేవర నాగవంశీ తదితరులు బాలకృష్ణను కలసిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.





టాలీవుడ్ అగ్ర నిర్మాత సి. అశ్వనీదత్ శుక్రవారం విజయవాడలో తెదేపా జాతీయ అధ్యక్షుడు, ఏపీ కాబోయే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును మర్యాద పూర్వకంగా కలిశారు. అసెంబ్లీ ఎన్నికల్లో తెలుగు దేశం ఘన విజయం అందుకున్న సందర్భంగా చంద్రబాబు నాయుడుకు అభినందనలు తెలిపారు. టాలీవుడ్ యువ హీరో నిఖిల్ సిద్ధార్థ్ శుక్రవారం తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలిశారు. మంగళగిరి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా లోకేశ్‌కు అభినందనలు తెలిపారు. నిఖిల్ మామయ్య, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకేశ్‌కు నిఖిల్ నటరాజ ప్రతిమను బహూకరించారు.


తమ్ముడూ... నిన్ను చూసి గర్విస్తున్నా





తమిళ హీరో, మక్కల్ నీది మయ్యం పార్టీ అధినేత కమల్‌హాసన్ జనసేనాని పవన్ కల్యాణ్‌ను అభినందనల్లో ముంచెత్తారు. ఆంధ్రప్రదేశ్ శాసన సభ ఎన్నికల్లో జనసేన పార్టీ ఘన విజయాన్ని అందుకున్న సందర్భంగా 'నిన్ను చూసి గర్వపడుతున్నాను తమ్ముడూ అంటూ' పవన్‌పై ప్రశంసలు కురిపించారు. శుక్రవారం ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా పవన్ విజయంపై స్పందించారు. పవన్ కల్యాణ్ ముున్ముందు తన రాజకీయ జీవితంలో మరెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. సేవ చేసేందుకు రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కల్యాణ్ ఈ ప్రయాణంలో విజయం సాధించాలి, ప్రజల ఆశలు, ఆకాంక్షలను సంపూర్ణంగా నెరవేర్చాలి అని ఆకాంక్షించారు.

టీజర్‌తో వస్తున్న కన్నప్ప



మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్ 'కన్నప్ప' చిత్ర నిర్మాణం దాదాపు పూర్తి కావచ్చింది. ఈ సినిమాలో అక్షయ్‌కుమార్, ప్రభాస్, మోహన్‌లాల్, మోహన్‌బాబు, శరత్‌కుమార్ వంటి అతిరథ మహారథులు నటించారు. ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వంలో భారీ బడ్జెట్‌తో మోహన్‌బాబు ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఇటీవల కేన్స్‌లో జరిగిన ఫెస్టివల్‌లో 'కన్నప్ప' టీజర్‌ను విదేశీ చిత్ర ప్రముఖుల కోసం ప్రదర్శించారు. ఇండియన్ ఆడియన్స్ కోసం ఈ నెల 14న ఇక్కడ టీజర్ రిలీజ్ చేయబోతున్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. గుర్రపు స్వారీ చేస్తూ ప్రకృతి అందాలను పరిశీలిస్తున్న కన్నప్పను ఈ పోస్టర్‌లో చూడవచ్చు. విజువల్ వండర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.

నాలుగు విభిన్న గెటప్స్‌లో...



వరుణ్‌తేజ్ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'మట్కా'. ఈ సినిమా కోసం రామోజీ ఫిల్మ్‌సిటీలో ఓ భారీ సెట్ వేశారు. అందులో ఈ నెల 19 నుంచి షూటింగ్ ప్రారంభం కానుంది. 'పలాస' చిత్రంతో అందరినీ ఆకట్టుకున్న దర్శకుడు కరుణకుమార్ దర్శకత్వంలో రజనీ తాళ్లూరి, డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల ఈ సినిమాను నిర్మిస్తున్నారు. యావత్ భారతదేశాన్నీ కదిలించిన ఒక యదార్థ సంఘటన ఆధారంగా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రంలో వరుణ్‌తేజ్ నాలుగు విభిన్న గెటప్స్‌లో కనిపించనున్నారు. నోరా ఫతేహి, మీనాక్షి చౌదరి హీరోయిన్లుగా నటిస్తున్నారు. నవీన్ చంద్ర, అజయ్ ఘోష్, కన్నడ కిశోర్, రవీంద్ర విజయ్, పి.రవిశంకర్ ఇతర ముఖ్య పాత్రధారులు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదలయ్యే ఈ చిత్రానికి సంగీతం: జీవీ ప్రకాశ్‌కుమార్, సినిమాటోగ్రాఫర్: ఎ.కిశోర్‌కుమార్.



కెరీర్‌లో గుర్తుండిపోతుంది

'శుక్ర', 'మాటరాని మౌనమిది' వంటి విభిన్న చిత్రాల తర్వాత దర్శకుడు సుకు పూర్వజ్ అందిస్తున్న సినిమా 'ఎ మాస్టర్ పీస్'. మనీష్ గిలాడ, అరవిండ్ కృష్ణ, జ్యోతి పూర్వజ్, అషు రెడ్డి ప్రధాన పాత్రలు పోషించారు. శ్రీకాంత్ కండ్రేగుల, మనీష్ గిలాడ నిర్మాతలు. శుక్రవారం ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేసిన అనంతరం మనీష్ గిలాడ మాట్లాడుతూ 'ఈ సినిమాలో విలన్‌గా నటించాను. మా అందరి కెరీర్‌లో గుర్తిండి పోయే గొప్ప చిత్రం అవుతుంది' అన్నారు. దర్శకుడు సుకు పూర్వజ్ మాట్లాడుతూ 'భాగవతంలోని జయ, విజయుల పాత్రల నేపథ్యంలో హీరో, విలన్ పాత్రలను డిజైన్ చేశాను. మైథాలజీనీ, సైన్స్ ఫిక్షన్‌ను కలిపేందుకు శివుడి పాత్రను సంధానంగా తీసుకున్నాం. చిన్న ప్రాజెక్ట్‌గా మొదలై నిర్మాణపరంగా ఎక్కడా రాజీ పడకపోవడంతో పెద్ద సినిమా అయింది. సినిమాలో విజువల్ ఎఫెక్ట్స్ అద్భుత అనుభూతినిస్తాయి. క్లైమాక్స్ మినహా చిత్రం పూర్తయింది. పది రోజుల్లో ఆ వర్క్ పూర్తి చేస్తాం' అని చెప్పారు. తెలుగులో ఒక ప్రాపర్ సూపర్ హీరో ప్రాజెక్ట్ చేయాలని ఈ సినిమా తీస్తున్నట్లు నిర్మాత శ్రీకాంత్ చెప్పారు. సీరియల్స్‌లో నటించిన తను 'ఎ మాస్టర్ పీస్'తో సినిమాల్లో అడుగుపెడుతున్నట్లు నటి, దర్శకుడు సుకు సతీమణి జ్యోతి చెప్పారు. ఇది మనం గర్వంగా చెప్పుకొనే సూపర్ హీరో మూవీ అవుతుందని అరవింద్ కృష్ణ చెప్పారు.

తాతా వస్తాడే...



శంకర్ దర్శకత్వంలో కమల్‌హాసన్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'ఇండియన్ 2' (తెలుగులో 'భారతీయుడు 2'). లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ బేనర్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. 'భారతీయుడు' చిత్రానికి ఇది కొనసాగింపు. జూలై 12న పలు భారతీయ భాషల్లో విడుదలవుతోంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. మాస్‌ను అలరించే ఓ గీతాన్ని శుక్రవారం యూనిట్ విడుదల చేసింది. 'తాతా వస్తాడే..అదరగొట్టిపోతాడే' అంటూ సాగే ఈ గీతానికి కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించారు. అరుణ్ కౌండిన్య ఆలపించారు. అనిరుధ్ స్వరాలు సమకూర్చారు. త్వరలో ఈ చిత్రం ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్టు మేకర్స్ తెలిపారు. ఈ చిత్రాన్ని ఏషియన్ సురేశ్ ఎంటర్టైన్‌మెంట్స్ ఎల్‌ఎల్‌పీ, శ్రీలక్ష్మీ మూవీస్ సంస్థలు తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నాయి. ఎస్ జే సూర్య, ప్రియా భవానీ శంకర్, కాజల్ అగర్వాల్, సిద్ధార్థ్, రకుల్ ప్రీత్‌సింగ్ ఈ చిత్రంలో కీలకపాత్రలు పోషించారు.



నా పెళ్లికి రండి

నటి వరలక్ష్మీ శరత్‌కుమార్ త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టనున్నారు. ప్రియుడు నికోలయ్ సచ్‌దేవ్‌తో త్వరలోనే పెళ్లి పీటలెక్కబోతున్నారు. జూలై 2న వీరి వివాహం థాయ్‌ల్యాండ్‌లో ఘనంగా జరగబోతున్నట్లు కోలీవుడ్ టాక్. పెళ్లి పనులు మొదలయ్యాయి. ఇటీవలే వరలక్ష్మి తన తండ్రి శరత్‌కుమార్‌తో కలసి రజనీకాంత్ ఇంటికి వెళ్లారు. తన పెళ్లి పత్రికను రజనీకాంత్‌కు అందించి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. పెళ్లికి రావాల్సిందిగా కోరారు. ఆ సందర్భంలో రజనీకాంత్‌తో దిగిన ఫొటోను వరలక్ష్మి సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఫొటోలో రజనీకాంత్, లతా దంపతులతో పాటు రాధికా-శరత్‌కుమార్ దంపతులు ఉన్నారు.

శుద్ధి అయోధ్య.. ఎనిమిది వసంతాలు!



స్టార్స్‌తో బిగ్ బడ్జెట్ చిత్రాలు తీయడమే కాకుండా కాన్సెప్ట్ బేస్డ్ చిన్న చిత్రాలనూ మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఆ తరహాలో ఈ సంస్థ అందిస్తున్న తాజా చిత్రం 'ఎనిమిది వసంతాలు'. 19 ఏళ్ల వయసు నుంచి 27 ఏళ్ల వరకూ ఎనిమిది సంవత్సరాల వ్యవధిలో ఓ యువతి జీవితంలో పరిచయమయ్యే విభిన్నమైన వ్యక్తులు, ప్రదేశాలు, భావోద్వేగాలను వివరించే చిత్రమిదని దర్శకుడు ఫణీంద్ర చెప్పారు. 'మను' సినిమాతో పలు అవార్డులు, విమర్శకుల ప్రశంసలు పొందారాయన. 'మ్యాడ్' చిత్రంలో నటించిన అనంతిక సనీల్‌కుమార్ ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. శుద్ధి అయోధ్యగా ఆమెను పరిచయం చేస్తూ టైటిల్ పోస్టర్ విడుదల చేశారు. ప్రస్తుతం 'ఎనిమిది వసంతాలు' చిత్రం షూటింగ్ జరుగుతోంది. ఈ సినిమాకు సంగీతం: నరేశ్ కుమారన్, ఛాయాగ్రహణం: విశ్వనాథ్‌రెడ్డి, నిర్మాతలు: నవీన్ యర్నేని, రవిశంకర్.

విజయ్ సేతుపతి 50వ మైలు రాయి



తమిళ నటుడు విజయ్ సేతుపతి 50వ చిత్రం 'మహారాజా' విడుదలకు సిద్ధమైంది. నితిలన్ స్వామినాథన్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అనురాగ్ కశ్యప్ ఓ పవర్‌ఫుల్ పాత్ర పోషించారు. భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్వీఆర్ సినిమా సంస్థ ఈ నెల 14న విడుదల చేస్తోంది. ప్రమోషన్స్‌లో భాగంగా సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ట్రైలర్ చివర్లో విజయ్‌ని ఎదుర్కొనేందుకు అనురాగ్ కశ్యప్ రావడం ఆసక్తి పెంచింది. మమతా మోహన్‌దాస్, భారతీరాజా, నటరాజన్ సుబ్రహ్మణ్యం, సింగంపులి కల్కి కీలక పాత్రలను పోషించారు. ఈ చిత్రానికి దినేశ్ పురుషోత్తమన్ సినిమాటోగ్రఫీ, అజనీశ్ లోకనాథ్ సంగీతాన్ని అందించారు.

మళ్లీ వస్తున్న ఉపేంద్ర 'ఏ'



కన్నడ సూపర్‌స్టార్ ఉపేంద్ర కథానాయకుడిగా నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రాల్లో 'ఏ' కు ప్రత్యేక స్థానం ఉంది. 26 ఏళ్ల క్రితం విడుదలైన ఈ చిత్రం అప్పట్లో ఓ కల్ట్ ఫిల్మ్‌గా నిలిచింది. ఎన్నో రికార్డులు నెలకొల్పింది. త్వరలో ఈచిత్రం మరోసారి తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఉప్పి క్రియేషన్స్, చందు ఎంటర్‌టైన్మెంట్ బ్యానర్లపై 'ఏ' చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ నెల 21న ఈ చిత్రాన్ని రీ రిలీజ్ చేస్తున్నట్లు నిర్మాత లింగం యాదవ్ తెలిపారు. ఈ చిత్రంలో చాందినీ కథానాయికగా నటించారు.

ఇకపై ట్రోల్ చేయకండి

నటుడు ఉపేంద్ర ఆగ్రహం

'నన్ను మేధావి అంటూ ఇకపై ఎవరూ ట్రోల్ చేయకండి' అని ఉపేంద్ర అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఎన్నికల్లో పవన్‌కల్యాణ్ నేతృత్వంలోని జనసేన పార్టీ 21 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసి, అన్నింటా విజయం సాధించింది. దీంతో పవన్ కల్యాణ్‌తో ఉపేంద్రను పోలుస్తూ సోషల్ మీడియాలో పలువురు ట్రోల్ చేస్తున్నారు. ఉపేంద్ర 'ఉత్తమ ప్రజాకీయ పార్టీ'ని ఏర్పాటు చేసి పోటీ చేసినా ఒక్కచోటా గెలవలేకపోయారు. దీంతో ఆయనపై ట్రోల్స్ పెరిగాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం 'ఎక్స్' వేదికగా ఉపేంద్ర స్పందించారు. తన గెలుపోటముల గురించి సుదీర్ఘంగా ఆలోచిస్తున్నానని, తాను గెలవాలనుకున్నప్పుడు ఏదో ఒక రాజకీయ పార్టీలో చేరి విజయం సాధిస్తానని పేర్కొన్నారు. తన రాజకీయ పార్టీ 'ప్రజాకీయ' సిద్ధాంతాలు ప్రజలకు అర్థం కాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

- బెంగళూరు (ఆంధ్రజ్యోతి)



అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి, ఆయన యువ హీరోగా ఎనభై వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆకృతి సంస్థ ఏర్పాటు చేసిన 'అక్కినేని యువ ఎక్సలెన్స్ అవార్డ్' హీరో వరుణ్‌సందేశ్‌కు అందజేశారు సీనియర్ నటుడు మురళీమోహన్. శుక్రవారం నిర్మాతల మండలి హాలులో జరిగిన ఈ కార్యక్రమంలో దర్శకుడు రేలంగి నరసింహారావు, తెలుగు నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, రచయిత్రి కె.వి. కృష్ణకుమారి, ఆకృతి సుధాకర్, ఉప్పల శ్రీనివాస్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

నవ్వించే నాయకుడు



అనిల్, నందిని జంటగా నటిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'బుక్కా పకీర్'. స్వీయ దర్శకత్వంలో అనిల్ వాటుపల్లి నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్, పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది. జులైలో విడుదల కానుంది. ఈ సందర్భంగా టీజర్ విడుదల చేశారు. 'ఇదొక డిఫరెంట్ యాక్షన్ ఎంటర్‌టైనర్. ప్రేక్షకుల్ని నవ్విస్తుంది' అని అనిల్ చెప్పారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: ఎమ్మెస్ కిరణ్‌కుమార్, సంగీతం: లలిత్‌కిరణ్, సహ నిర్మాతలు: కె.పవన్‌కుమార్, నరేంద్ర వాటుపల్లి.

నేటి మ్యాచ్‌లు

న్యూజిలాండ్ x అఫ్ఘానిస్థాన్ (ఉ.5. గం.)
శ్రీలంక x బంగ్లాదేశ్ (ఉ.6. గం.)
నెదర్లాండ్స్ x దక్షిణాఫ్రికా (రాత్రి 8 గం.)
ఆస్ట్రేలియా x ఇంగ్లండ్ (రాత్రి 10.30 గం.)

షూటింగ్ వరల్డ్‌కప్‌లో
సిఫ్ట్‌కు కాంస్యం




మ్యూనిచ్: ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్‌కప్‌లో భారత షూటర్ సిఫ్ట్ కౌర్ సమ్రా కాంస్యం సాధించింది. శుక్రవారం జరిగిన ఈ పోటీల్లోని మహిళల 50 మీటర్ల రైఫిల్ 3పీలో సిఫ్ట్ 452.9 పాయింట్లు స్కోరు చేసి తృతీయ స్థానంలో నిలిచింది. ఇప్పటికే 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో సరబ్‌జోత్ స్వర్ణం నెగ్గిన సంగతి తెలిసిందే. దీంతో ఈ టోర్నీలో మొత్తంగా భారత్ రెండే పతకాలను సాధించింది.

లక్ష్యసేన్ కూడా అవుట్

జకర్తా: ఇండోనేసియా ఓపెన్‌లో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. శుక్రవారం జరిగిన సింగిల్స్ క్వార్టర్స్‌లో లక్ష్యసేన్ 22-24, 18-21తో వరల్డ్ నెంబర్ 5 ఆంటోన్సెన్ (డెన్మార్క్) చేతిలో ఓడాడు.

'టాప్'లో స్కాట్లాండ్

నమీబియాపై గెలుపు
మైకేల్ ఆల్‌రౌండ్ షో
టీ20 వరల్డ్ కప్


మైకేల్ లీస్క్

పాయింట్ల పట్టిక — గ్రూప్-బి

జట్టు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
స్కాట్లాండ్	2	1	0	1	3	0.736
ఆస్ట్రేలియా	1	1	0	0	2	1.950
నమీబియా	2	1	1	0	2	-0.309
ఇంగ్లండ్	1	0	0	1	1	0.000
ఒమన్	2	0	2	0	0	-0.975

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

బ్రిడ్జిటౌన్: మైకేల్ లీస్క్ (35; 1/16) ఆల్‌రౌండ్‌షోతో నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో స్కాట్లాండ్ 5 వికెట్ల తేడాతో నెగ్గింది. ప్రస్తుతం మూడు పాయింట్లతో ఉన్న ఈ జట్టు గ్రూప్ 'బి'లో టాప్‌నకు చేరింది. ఇంతకుముందు ఇంగ్లండ్‌తో జరిగిన తొలి మ్యాచ్ వర్షంతో రద్దు కావడంతో చెరో పాయింట్‌ను కేటాయించారు. గురువారం అర్ధరాత్రి జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నమీబియా 20 ఓవర్లలో 9 వికెట్లకు 155 పరుగులు చేసింది. 55 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయిన వేళ.. కెప్టెన్ గెర్హార్డ్ ఎరాస్మస్ (52) అర్ధసెంచరీతో ఆదుకోగా, గ్రీన్ (28), డేవిన్ (20) పర్వాలేదనిపించారు. పేసర్ బ్రాడ్ వీల్‌కు మూడు, బ్రాడ్లీ కర్రీకి రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో స్కాట్లాండ్ 18.3 ఓవర్లలో 5 వికెట్లకు 157 పరుగులు చేసి నెగ్గింది. ఎరాస్మస్‌కు రెండు వికెట్లు దక్కాయి. నమీబియా బౌలర్లు ఆరంభంలో కట్టడి చేయడంతో బ్యాటర్లు రన్స్ కోసం ఇబ్బందిపడ్డారు. అయితే కెప్టెన్ బెరింగ్టన్ (47 నాటౌట్)కు లీస్క్ జత కలవడంతో జట్టు కోలుకుంది. ముఖ్యంగా లీస్క్ నాలుగు సిక్సర్లతో చెలరేగి 18వ ఓవర్‌లో అవుటయ్యాడు. అప్పటికి ఐదో వికెట్‌కు 74 పరుగులు జత చేరడంతో జట్టు విజయం ఖాయమైంది.

సంక్షిప్త స్కోర్లు: నమీబియా: 20 ఓవర్లలో 155/9 (ఎరాస్మస్ 52, గ్రీన్ 28, డేవిన్ 20; వీల్ 3/33, కర్రీ 2/16); **స్కాట్లాండ్:** 18.3 ఓవర్లలో 157/5 (బెరింగ్టన్ 47 నాటౌట్, లీస్క్ 35, జోన్స్ 26; ఎరాస్మస్ 2/29).



మాజీ చాంపియన్ పాకిస్థాన్‌ను చిత్తు చేయడం ద్వారా ఈసారి టీ20 వరల్డ్ కప్‌లో ఆతిథ్య అమెరికా జట్టు పెను సంచలనం సృష్టించింది. ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన ఆ జట్టు టాప్ బ్యాటర్లు, బౌలర్లతో కూడిన పాకిస్థాన్‌కు షాకివ్వడంతో యూఎస్ఏపై అందరి దృష్టి నిలిచింది. ఇక ఆ జట్టు స్టార్ క్రికెటర్లంతా భారత మూలాలున్న వారే. దీంతో టోర్నీలో ఆడుతోంది 'యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా' జట్టు కాదు.. 'యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ ఇండియా' అంటూ సోషల్ మీడియాలో అభిమానులు కామెంట్లు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో అమెరికా జట్టులోని మనోళ్లపై ఓ లుక్కేద్దాం..

అమెరికా స్టార్లు
మనోళ్లే!

మోనంక్ పటేల్

అహ్మదాబాద్‌లో పుట్టిన మోనంక్ పటేల్ గుజరాత్ తరఫున వివిధ వయస్సు గ్రూపుల క్రికెట్ ఆడాడు. మెరుగైన అవకాశాల కోసం అమెరికాకు వెళ్లిన అతడు..ఆ జట్టుకు ఎంపిక కావడమేకాదు కెప్టెన్‌గానూ నియమితుడయ్యాడు. వికెట్ కీపర్, బ్యాటర్ మోనంక్ పటేల్ పాక్‌తో పోరులో హాఫ్ సెంచరీ చేసి జట్టు విజయంలో కీలక భూమిక పోషించాడు.

సౌరవ్ నేత్రావల్కర్



పాకిస్థాన్‌తో సూపర్ ఓవర్లో నరాలు తెగే ఉత్కంఠను అదిమిపట్టి అద్భుత బౌలింగ్ చేసిన లెఫ్టామ్ పేసర్ సౌరవ్ నేత్రావల్కర్ .. 2010 అండర్-19 వరల్డ్ కప్‌లో కేఎల్ రాహుల్, ఉనాద్కట్, హర్షల్ పటేల్, సందీప్ శర్మతో కలిసి భారత్‌కు ఆడాడు. రంజీల్లో ముంబైకి ప్రాతినిధ్యం వహించాడు. అనంతరం అమెరికాలో ఎమ్మెస్ చేసి ఒరాకిల్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తూనే క్రికెట్ కెరీర్ కొనసాగించి ఆ దేశ జాతీయ జట్టులో చోటు దక్కించుకున్నాడు.

హర్మీత్ సింగ్



ఇతడు యువ భారత్‌కు ఆడిన క్రికెటరే. లెఫ్టామ్ స్పిన్నర్ అయిన హర్మీత్.. 2010, 12 అండర్-19 ప్రపంచ కప్‌లలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. ప్రతిభావంతుడైన బౌలరే అయినా.. క్రమశిక్షణా రాహిత్యంతో అవకాశాలను చేజార్చుకున్నాడు. అనంతరం అమెరికాకు వలస వెళ్లి క్రికెట్ కెరీర్‌ను కొనసాగించాడు.

నోస్తుష్ కెంజిగే



ఆల్‌రౌండర్ కెంజిగే అమెరికాలో పుట్టాడు. వ్యవసాయ పరిశోధకుడైన అతడి తండ్రి భారత్ తిరిగి రావడంతో కెంజిగే క్రికెట్ కెరీర్‌కు భారత్‌లో అడుగులు పడ్డాయి. కర్ణాటకలో ఫస్ట్ డివిజన్ క్రికెట్ పోటీలు ఆడాడు. బయో మెడికల్ ఇంజనీరింగ్ కోర్స్ చదివేందుకు అమెరికా వెళ్లిన కెంజిగే.. ఉద్యోగం చేస్తూనే క్రికెట్ ఆడుతూ జాతీయ జట్టులో స్థానం పొందాడు.

మిలింద్ కుమార్



ఢిల్లీ, సిక్కిం జట్ల తరఫున రంజీలు ఆడిన మిలింద్.. క్రికెటర్‌గా అదృష్టాన్ని పరీక్షించుకొనేందుకు కొవిడ్‌కు ముందు అమెరికా వెళ్లి విజయవంతమయ్యాడు.

నితీష్ కుమార్



టాపార్డర్ బ్యాటర్ నితీష్ కుమార్ కెనడా జాతీయ జట్టు మాజీ కెప్టెన్. 2010 అండర్-19 ప్రపంచ కప్‌లో కెనడాకు ఆడిన అతడు..2011 వన్డే వరల్డ్ కప్‌లోనూ ఆ జట్టు తరఫున పాల్గొన్నాడు. ఆపై అమెరికా వెళ్లి జాతీయ జట్టుకు ఎంపికయ్యాడు.

జస్దీప్ సింగ్



న్యూయార్క్‌లో పుట్టి గ్రామీణ పంజాబ్‌లో పెరిగిన జస్దీప్..తల్లిదండ్రులు తిరిగి అమెరికా వెళ్లడంతో అక్కడే క్రికెట్ ఓనమాలు నేర్చుకున్నాడు. కుడి చేతి వాటం పేసర్ అయిన జస్దీప్ 2015లో అమెరికా జట్టుకు ఎంపికయ్యాడు.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఒలింపిక్ సంఘం ఎన్నికలు వాయిదా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ (టీఓఏ) ఎన్నికలను వాయిదా వేస్తున్నట్టు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర ఫుట్‌బాల్ సంఘం కార్యదర్శి ఫల్గుణ, టీఓఏ కోశాధికారి మహేశ్వర్‌తో పాటు పలు క్రీడా సంఘాలు ఈ ఎన్నికల ప్రక్రియను నిలిపేయాలంటూ హైకోర్టును ఆశ్రయించాయి. ఒలింపిక్ సంఘం ఓటర్ల జాబితా కూర్పులో జరిగిన అక్రమాలు, నిధుల దుర్వినియోగంతో పాటు పలు అంశాలపై పిటిషన్ దాఖలు చేశారు. వీటిపై విచారణ జరగాల్సి ఉండడంతో షెడ్యూల్ ప్రకారం ఈనెల 9న జరగాల్సిన ఎన్నికలపై హైకోర్టు స్టేటస్ కో విధించింది. దీంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది.



కెనడా ఆటగాళ్ల ఆనందం

పాయింట్ల పట్టిక — గ్రూప్-ఎ

జటు	మ్యా	గె	ఓ	ఫ.తే	పా	రన్‌రేట్
అమెరికా	2	2	0	0	4	0.626
భారత్	1	1	0	0	2	3.065
కెనడా	2	1	1	0	2	-0.274
పాకిస్థాన్	1	0	1	0	0	0.000
ఐర్లాండ్	2	0	2	0	0	-1.712

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

కెనడా సంచలనం

● ఐర్లాండ్‌పై విజయం

న్యూయార్క్: టీ20 వరల్డ్‌కప్‌లో వరుసగా రెండో రోజు కూడా సంచలన ఫలితం. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో కెనడా జట్టు తమకన్నా పటిష్ఠమైన ఐర్లాండ్‌ను 12 పరుగులతో ఓడించింది. తద్వారా ఈ మెగా టోర్నీలో తొలి విజయాన్నందుకుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కెనడా 20 ఓవర్లలో 7 వికెట్లకు 137 పరుగులు చేసింది. టాపార్డర్ పూర్తిగా విఫలం కాగా మిడిలార్డర్‌లో నికోలస్ కిర్టన్ (49), శ్రేయాస్ మొవ్వ (37) కీలక ఇన్నింగ్స్‌తో ఆదుకున్నారు. అలాగే ఐదో వికెట్‌కు 75 పరుగులు జోడించడంతో జట్టు ఓ మాదిరి స్కోరందుకుంది. మెక్‌కార్తి, యంగ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. స్వల్ప ఛేదనలో ఐర్లాండ్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 125 పరుగులు చేసి ఓడింది. ఆఖర్లో అడెయిర్ (34), డాక్‌రెల్ (30 నాటౌట్) పోరాటం ఫలితాన్నివ్వలేదు. కెనడా బౌలర్లు ఆరంభం నుంచే కట్టుదిట్టంగా బౌలింగ్ వేయడంతో షాట్లు ఆడేందుకు ఇబ్బందిపడ్డారు. అలాగే ఆరో ఓవర్ నుంచి వరుసగా సాగిన వికెట్ల పతనంతో ఐర్లాండ్ మరిక కోలుకోలేకపోయింది. ఓపెనర్లు స్టిర్లింగ్ (9), బల్బిర్నీ (17), టెక్టర్ (7), టక్కర్ (10), కాంఫర్ (4), డెలాని (3) ఇలా అందరూ చకచకా పెవిలియన్ చేరడంతో 59/6 స్కోరుతో కష్టాల్లో పడింది. అయితే డెత్ ఓవర్లలో డాక్‌రెల్, అడెయిర్ భారీ షాట్లతో బౌండరీలు రాబట్టి విజయంపై ఆశలు రేపారు. దీంతో ఆఖరి ఓవర్‌లో సమీకరణం 17 పరుగులకు మారగా పేసర్ గార్డన్ నాలుగు పరుగులే ఇచ్చి అడెయిర్ వికెట్ తీయడంతో కెనడా సంబరాలు చేసుకుంది.

సంక్షిప్త స్కోర్లు
కెనడా: 20 ఓవర్లలో 137/7 (కిర్టన్ 49, శ్రేయాస్ 37; మెక్‌కార్తి 2/24, యంగ్ 2/32)
ఐర్లాండ్: 20 ఓవర్లలో 125/7 (అడెయిర్ 34, డాక్‌రెల్ 30 నాటౌట్; గార్డన్ 2/16, హేలిగర్ 2/18).

అల్కారజ్ అదరహో



ఫ్రెంచ్ ఓపెన్

మహిళల సింగిల్స్ ఫైనల్ నేడు | సా. 6.30 నుంచి సోనీ నెట్‌వర్క్‌లో


స్వియటెక్ x పావోలిని

ఫైనల్లో స్పెయిన్ స్టార్
సెమీస్‌లో సిన్నర్ ఓటమి

పారిస్: ఒకరు నెం.2 సీడ్..మరొకరు నెం.3..ఒకరు ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్..మరొకరు వింబుల్డన్ విజేత.. దాంతో మ్యాచ్ అనుకున్న విధంగానే రంజుగా సాగింది..ఇద్దరూ తగ్గేదెలే అనేలా ఆడడంతో ఈ ఐదు సెట్ల పోరు ఉత్కంఠ రేపింది..అయితే అంతిమంగా మూడో సీడ్‌దే పైచేయి అయింది..ఇదీ ఫ్రెంచ్ ఓపెన్ పురుషుల సింగిల్స్ తొలి సెమీఫైనల్ జరిగిన తీరు. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో మూడో సీడ్ కార్లోస్ అల్కారజ్ (స్పెయిన్) 2-6, 6-3, 3-6, 6-4, 6-3తో రెండో సీడ్ జానిక్ సిన్నర్ (ఇటలీ)ని చిత్తు చేశాడు. 4 గంటలకుపైగా జరిగిన ఈ హోరాహోరీ పోరులో వింబుల్డన్ చాంపియన్ అల్కారజ్ 8 ఏస్‌లు సంధిస్తే..ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేత సిన్నర్ 7 కొట్టాడు. సిన్నర్ 8, అల్కారజ్ 7 డబుల్ ఫాల్ట్స్ చేశారు. కార్లోస్ 65 విన్నర్లతో ఆధిపత్యం చెలాయిస్తే..జానిక్ 39కే పరిమితమయ్యాడు. అల్కారజ్‌కు రొలాండ్ గారోస్‌లో ఇది తొలి ఫైనల్. 21ఏళ్ల కార్లోస్..మూడు కోర్టులపై టైటిల్ ఫైట్‌కు చేరిన పిన్న వయస్కుడిగా రికార్డు సృష్టించాడు. 2022లో యూఎస్ ఓపెన్ (హార్డ్ కోర్ట్), నిరుడు వింబుల్డన్ (గ్రాస్ కోర్ట్) టైటిళ్లు అందుకున్నాడు.

ఎనిమిదోసారీ అదే రేటు

యథాతథ స్థితికే ఆర్‌బీఐ మొగ్గు.. 6.50 శాతం వద్దే రెపో రేటు

వడ్డీ రేట్ల తగ్గింపునకు ఎంపీసీలో పెరుగుతున్న మద్దతు

అందరి ఊహలకు అనుగుణంగానే భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక రెపో రేటును యథాతథంగా కొనసాగించింది. ఫలితంగా అది 6.50 శాతం వద్ద నిలకడగా ఉంది. రెపో రేటులో యథాతథ స్థితిని కొనసాగించడం వరుసగా ఇది ఎనిమిదో సారి. గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఆర్‌బీఐ రెపో రేటు విషయంలో ఇదే ధోరణి అనుసరిస్తూ వస్తోంది. అయితే రేటు తగ్గింపునకు ద్రవ్య పరపతి విధాన కమిటీ (ఎంపీసీ)లో క్రమంగా బలం పెరుగుతున్న సంకేతాలు మాత్రం కనిపించాయి.

ముంబై: బ్యాంకింగ్ రంగంలో వడ్డీ రేట్ల ధోరణులకు దిక్సూచిగా పరిగణించే రెపో రేటును యథాతథంగా కొనసాగించాలన్న రిజర్వ్ బ్యాంక్ నిర్ణయంతో మరో రెండు నెలల పాటు గృహ, వాహన, రిటైల్ రుణాలపై వడ్డీ భారం ఇప్పుడున్నట్టుగానే కొనసాగనుంది. ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అధ్యక్షతన మూడు రోజుల పాటు సమావేశమైన ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) 4:2 మెజారిటీతో రెపో రేటులో యథాతథ స్థితి కొనసాగింపు నిర్ణయం తీసుకుంది. మార్చితో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఊహాతీతంగా బలమైన 8.2 శాతం వృద్ధి రేటు నమోదు కావడం, ఏప్రిల్ నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం ఆర్‌బీఐ కట్టడి పరిధి కన్నా పై స్థాయిలో 4.83 శాతంగా ఉండడం రెండింటినీ పరిగణనలోకి తీసుకుని ఎంపీసీ ఈ నిర్ణయం తీసుకుంది. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఎంపీసీ నిర్ణయాలను దాస్ ప్రకటించారు.

వృద్ధి రేటు అంచనా 7.2 శాతం


2024-25 ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు అంచనాలను ఆర్‌బీఐ 7.2 శాతానికి పెంచింది. ఆసియాలో మూడో పెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన భారత్ గత ఏడాది అందరి ఊహలను మించి బలమైన వృద్ధి రేటును సాధించినందు వల్ల ఈ ఏడాది వృద్ధి అంచనాలను తాము గతంలో ప్రకటించిన 7 శాతం నుంచి 7.2 శాతానికి పెంచామని దాస్ వెల్లడించారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో వినియోగం, డిమాండ్ పెరిగినట్టు ఆయన చెప్పారు. దీనికి తోడు పట్టణ ప్రాంతాల్లో కూడా విచక్షణాత్మక వ్యయాలు పెరిగాయని, పెరిగిన వినియోగ డిమాండ్‌కు దీటుగా దేశంలో తయారీ రంగం కార్యకలాపాలు కూడా పెరగనున్నాయని ఆయన అన్నారు.

బల్క్ డిపాజిట్ల పరిమాణం రూ.3 కోట్లకు పెంపు

బ్యాంకుల ఆస్తుల నిర్వహణను బలోపేతం చేయడం లక్ష్యంగా బల్క్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల గరిష్ఠ పరిమాణాన్ని ఆర్‌బీఐ రూ.3 కోట్లకు పెంచింది. ప్రస్తుతం ఈ పరిమితి రూ.2 కోట్లుగానే ఉంది. సాధారణ ఎఫ్‌డీలతో పోల్చితే ఇలాంటి డిపాజిట్లపై వడ్డీ రేటు స్వల్పంగా అధికంగా ఉంటుంది. ఈ నిర్ణయానికి అనుగుణంగా ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులు మినహా షెడ్యూల్ వాణిజ్య బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులకు సంబంధించి బల్క్ డిపాజిట్ నిర్వచనాన్ని "రూ.3 కోట్లు, ఆ పైబడిన సింగిల్ రూపీ టర్మ్ డిపాజిట్"గా మార్చినట్టు దాస్ వెల్లడించారు. దీనివల్ల బ్యాంకులు బల్క్, రిటైల్ డిపాజిట్లను వర్గీకరించడం తేలిక అవుతుందన్నారు.

అన్‌సెక్యూర్డ్ రుణాలపై వ్యూహాలకు పదును

దీర్ఘకాలంగా నిలకడగా ఉండిపోయిన రుణాలు, డిపాజిట్ల వృద్ధిలో వ్యత్యాసం పూడ్చుకునేందుకు బ్యాంకులు తమ వ్యూహాల్లో అవసరమైన మార్పులు చేసుకోవచ్చని దాస్ చెప్పారు. అవసరమైతే సెక్యూరిటీ లేని రుణాల్లో వృద్ధిని కట్టడి చేయవచ్చని సూచించారు. అన్‌సెక్యూర్డ్ రిటైల్ రుణాల్లో మితిమీరిన వృద్ధి, బ్యాంక్ రుణాలపై ఎన్‌బీఎఫ్‌సీల అధిక ఆధారనీయత పట్ల గత నవంబరులో ఆర్‌బీఐ ఆందోళన ప్రకటించిన నేపథ్యంలో ఈ సూచనకు ప్రాధాన్యత ఉంది. ఇలాంటి రుణాల పరిమాణం కొంత తగ్గినట్టు తాజా గణాంకాలు తెలుపుతున్నాయన్నారు.



"ద్రవ్యోల్బణ కట్టడికే ద్రవ్య విధానంలో ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉంటుంది. దాన్ని 4 శాతానికి కుదించాలన్న లక్ష్యానికి మేం కట్టుబడి ఉన్నాం. ధరల్లో నిలకడతో కూడిన స్థిరత్వం ఏర్పడినట్టయితే అధిక వృద్ధికి బలమైన పునాది దానికదే ఏర్పడుతుంది. ద్రవ్యోల్బణం ఆశించిన రీతిలోనే తగ్గుతోంది. కాని 4 శాతానికి కట్టడి చేయడం అనేది చాలా కష్టమైన పని అనడంలో సందేహం లేదు. కాని దాన్ని సాధించేందుకు మేం కృషి చేస్తాం"
- శక్తికాంత దాస్, గవర్నర్, ఆర్‌బీఐ

ఇతర ముఖ్యాంశాలు

- విదేశీ వాణిజ్యంలో మారుతున్న ధోరణులకు అనుగుణంగా విదేశీ ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) 1999 కింద వస్తు సేవల ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన మార్గదర్శకాలు హేతుబద్ధం చేయనున్నారు. దీనివల్ల వ్యాపార నిర్వహణ మరింత సరళమై బ్యాంకుల అధీకృత డీలర్లకు మరింత నిర్వహణాపరమైన వెసులుబాటు ఏర్పడుతుంది. వీటికి సంబంధించిన మార్గదర్శకాలు త్వరలో వెలువడనున్నాయి.
- విదేశీ మారక నిల్వలు మే 31వ తేదీతో ముగిసిన వారంలో 483.7 కోట్ల డాలర్ల మేరకు పెరిగి 65,151 కోట్ల డాలర్లకు చేరాయి. ఇది చారిత్రక గరిష్ఠ స్థాయి. అయితే బంగారం నిల్వలు 21.2 కోట్ల డాలర్ల మేరకు తగ్గి 5650.1 కోట్ల డాలర్లుగా నమోదయ్యాయి.
- బ్రిటన్ నుంచి 100 మెట్రిక్ టన్నుల బంగారం నిల్వలను వెనక్కి తీసుకురావడంపై అనవసర ఆందోళన అవసరం లేదు. దేశీయంగా తగినంత నిల్వ సామర్థ్యం ఉన్నందు వల్లనే బంగారం తిరిగి తెచ్చాం. అంతకు మించి ఆలోచించవద్దు. దేశంలో బంగారం నిల్వలు 2024 ఆర్థిక సంవత్సరంలో 27.46 మెట్రిక్ టన్నులు పెరిగి 822 మెట్రిక్ టన్నులకు చేరింది. అందులో అధిక శాతం విదేశాల్లోనే నిల్వ ఉంది.

నలుగురు ఇటు.. ఇద్దరు అటు

ఎంపీసీలో రేట్ల తగ్గింపునకు మద్దతు పెరిగింది. గత సమావేశాల్లో సభ్యుల్లో ఒకరు మాత్రమే రేట్ల తగ్గింపునకు మద్దతు ప్రకటించగా ఈసారి ఆ సంఖ్య రెండుకి పెరిగింది. వెలుపలి సభ్యులైన అషిమా గోయెల్, జయంత్ వర్మ రేట్ల తగ్గింపునకు అనుకూలంగా ఓటు వేశారు. రెపో రేటు కనీసం 0.25 శాతం తగ్గించాలని వారిద్దరూ వాదించారు. కాగా దాస్‌తో పాటు శశాంక్ భిడే, రాజీవ్ రంజన్, మైకేల్ దేవవ్రత పాత్రా యథాతథ స్థితిని బలపరిచారు. కీలక రేట్ల విషయంలో ఆర్‌బీఐ ఎప్పుడూ "అమెరికన్ ఫెడరల్‌నే అనుసరిస్తుంది" అనే అభిప్రాయం పలువురిలో ఉందని, కాని దేశంలో నెలకొన్న విభిన్న పరిస్థితుల ఆధారంగానే ఎంపీసీ నిర్ణయం ఉంటుందని తాను ఎలాంటి గందరగోళానికి తావు లేకుండా స్పష్టం చేస్తున్నానని దాస్ తెలిపారు.

యూపీఐ లైట్ మరింత సరళం

తక్కువ విలువ గల డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించే లక్ష్యంతో ఆన్ డివైస్ వ్యాలెట్ యూపీఐ లైట్‌లో కస్టమర్లు ఈ-మాండేట్ ద్వారా ఆటోమేటిగ్గా నిధులు తిరిగి నింపే వెసులుబాటు కల్పించాలని ఆర్‌బీఐ నిర్ణయించింది. ప్రస్తుతం యూపీఐ లైట్‌లో రోజువారీ గరిష్ఠ పరిమితి రూ.2,000 కాగా సింగిల్ పేమెంట్ గరిష్ఠ పరిమితి రూ.500గా ఉంది. తాజా నిర్ణయం ప్రకారం యూపీఐ లైట్ వ్యాలెట్ వినియోగదారులు తమ ఖాతాలో నిధులు నిర్దేశిత పరిమితి కన్నా తగ్గిపోతే వెనువెంటనే నిధులు నింపేలా తమ బ్యాంకుకు అనుమతి ఇవ్వవచ్చు. తరచుగా చేసే చెల్లింపులకు ఈ-మాండేట్ విధానం నానాటికీ పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీనివల్ల ఫాస్టాగ్, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డ్ (ఎన్‌సీఎంసీ) వంటి ఉపకరణాల్లో ఎలాంటి నిర్దేశిత గడువు ఏదీ లేకుండా అవసరమైనప్పుడల్లా నిధులు నింపే వెసులుబాటు కలుగుతుంది. చెల్లింపులు సరళతరం అవుతాయి. అలాగే డిజిటల్ చెల్లింపులకు సంబంధించిన వాస్తవిక సమాచారం అందచేయడం కోసం డిజిటల్ పేమెంట్స్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ ఒకటి ఏర్పాటు చేయాలని కూడా ఆర్‌బీఐ ప్రతిపాదించింది.

బిజినెస్

మార్కెట్‌కు ఆర్‌బీఐ బూస్ట్

- సరికొత్త ఉన్నత శిఖరాలకు సూచీలు
- 1,618 పాయింట్లు పెరిగిన సెన్సెక్స్
- మళ్లీ 23,000 ఎగువ స్థాయికి నిఫ్టీ
- 3 రోజుల్లో రూ.28.65 లక్షల కోట్ల వృద్ధి

ముంబై: వరుసగా మూడో రోజూ భారీగా లాభపడిన స్టాక్ మార్కెట్ సూచీలు శుక్రవారం సరికొత్త ఉన్నత శిఖరాలను అధిరోహించాయి. ఆర్‌బీఐ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25) జీడీపీ వృద్ధి అంచనాను 7 శాతం నుంచి 7.2 శాతానికి పెంచడం ఇన్వెస్టర్ల ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మరింత మెరుగుపరిచింది. దాంతో మార్కెట్లో కొనుగోళ్లు జోరందుకున్నాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,720.8 పాయింట్లు (2.29%) ఎగబాకి 76,795.31 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి 1,618.85 పాయింట్ల (2.16%) లాభంతో 76,693.36 వద్ద స్థిరపడింది. కాగా, నిఫ్టీ కూడా 498.8 పాయింట్ల (2.18%) వరకు పెరిగి 23,320.20 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. ఆల్‌టైం ఇంట్రాడే రికార్డుకు సూచీ మరో 18.5 పాయింట్ల దూరంలో ఉంది. చివరికి సూచీ 468.75 పాయింట్ల (2.05%) లాభంతో 23,290.15 వద్ద సరికొత్త జీవితకాల గరిష్ఠ ముగింపును నమోదు చేసింది. ఐటీతో పాటు వడ్డీ రేట్ల ప్రభావిత రంగాలైన బ్యాంకింగ్, రియల్టీ, ఆటో షేర్లలో భారీగా కొనుగోళ్లు జరగడం ఇందుకు దోహదపడింది.

దీంతో షేర్‌హోల్డర్ల సంపదగా పరిగణించే బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ మూడు రోజుల్లో రూ.28.65 లక్షల కోట్లు వృద్ధి చెంది రూ.423.49 లక్షల కోట్లకు చేరుకుంది. గడిచిన 3 ట్రేడింగ్ సెషన్లలో నిఫ్టీ 6.42 శాతం పుంజుకుంది. 2021 ఫిబ్రవరి తర్వాత సూచీకిదే అతిపెద్ద మూడు రోజుల లాభం. కాగా, ఈ వారం మొత్తంలో సెన్సెక్స్ 2,732.05 పాయింట్లు (3.69%), నిఫ్టీ 759.45 పాయింట్లు (3.37%) బలపడ్డాయి.

రూ.6,000 కోట్లకు హెరిటేజ్ మార్కెట్ క్యాప్

హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ షేరు గత ఐదు రోజులుగా పరుగు తీస్తోంది. షేరు ధర 5 రోజుల్లో 55 శాతం పెరిగింది. శుక్రవారం 10 శాతం వృద్ధితో సరికొత్త ఏడాది గరిష్ఠ స్థాయి రూ.661.75 వద్దకు చేరుకుంది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.6,140.78 కోట్లకు పెరిగింది. ఐదు రోజుల్లో మార్కెట్ క్యాప్ రూ.2,400 కోట్లకు పైగా పుంజుకుంది.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా త్వరలో ప్రమాణ స్వీకారం చేయనున్న నారా చంద్రబాబు నాయుడును అసోచామ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఛైర్మన్, యాక్సిస్ ఎనర్జీ గ్రూప్ సీఎండీ కే రవి కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి కీలక రంగాల్లో కలిసి పనిచేయటంతో పాటు అభివృద్ధికి తోడ్పాటును అందించేందుకు అసోచామ్ కట్టుబడి ఉందని ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడికి రవి కుమార్ హామీ ఇచ్చారు. చంద్రబాబు సారథ్యంలో ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక, సామాజిక రంగాల్లో గణనీయమైన అభివృద్ధి సాధిస్తుందని ఆశిస్తున్నట్టు రవి తెలిపారు.


టాటా ఆల్ట్రోజ్ రేసర్



టాటా మోటార్స్ మార్కెట్లోకి ప్రీమియం హ్యాచ్‌బ్యాక్ ఆల్ట్రోజ్ రేసర్‌ను విడుదల చేసింది. సరికొత్త స్పోర్టీ లుక్, 1.2 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజన్, 6 స్పీడ్ మాన్యువల్ గేర్ బాక్స్, 6 ఎయిర్‌బ్యాగ్స్ ఈ కారు ప్రత్యేకతలు. ఆర్1, ఆర్2, ఆర్3 వేరియంట్లలో అందుబాటులో ఉండనుంది. ఈ కారు ధరలు వరుసగా రూ.9.49 లక్షలు, రూ.10.49 లక్షలు, రూ.10.99 లక్షలు (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్)గా ఉన్నాయి.

సీడీఎస్ లావాదేవీలకు సెబీ గ్రీన్ సిగ్నల్

దేశంలో రుణ పత్రాల మార్కెట్ అభివృద్ధికి సెబీ మరో చర్య తీసుకోబోతోంది. ఇందుకోసం మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) సంస్థలను క్రెడిట్ డిఫాల్ట్ స్వాప్స్ (సీడీఎస్) అమ్మకం, కొనుగోళ్లకు అనుమతించాలని భావిస్తోంది. దీనికి సంబంధించి ఒక చర్చా పత్రం విడుదల చేసింది. ఈ చర్చా పత్రంపై ఎంఎఫ్‌లు, మదుపరులు జూలైలోగా తమ అభిప్రాయాలు, సూచనలు తెలియజేయాలని కోరింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	73,750 ▲	67,600 ▲	1,00,500 ▲
ముంబై	71,913 ▼	65,872 ▼	90,535 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	440	విజయవాడ	455
వరంగల్	442	గోదావరి	450
చిత్తూరు	513	విశాఖపట్నం	455
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	147	గోదావరి	149
వరంగల్	147	విజయవాడ	149
కరీంనగర్	147	గుంటూరు	149
మహబూబ్‌నగర్	147	ఒంగోలు	149
కర్నూలు	147	చిత్తూరు	152
విశాఖపట్నం	135		

సీఎస్‌గా నీరబ్ కుమార్

- జీఏడీ ఉత్తర్వులు.. వెంటనే బాధ్యతల స్వీకరణ



అమరావతి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరుతున్న వేళ ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నీరబ్ కుమార్ ప్రసాద్ నియమితులయ్యారు. ఆయనను సీఎస్‌గా నియమిస్తూ రాష్ట్ర సాధారణ పరిపాలనశాఖ శుక్రవారం జీవో 1034 జారీచేసింది. ఆ వెంటనే సచివాలయంలోని సీఎస్ చాంబర్‌లో టీటీడీ, విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానాల వేద పండితుల ఆశీస్సుల మధ్య నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సీఎస్‌గా అవకాశం కల్పించిన చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ప్రాధాన్యాలకు అనుగుణంగా సహచర కార్యదర్శులు, శాఖాధిపతులు, ఇతర అధికారులు, సిబ్బంది సహకారంతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకువెళ్లేందుకు తనవంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో జీఏడీ కార్యదర్శి సురేశ్ కుమార్, స్పెషల్ సీఎస్‌లు ద్వివేది, రజత్ భార్గవ, విజయానంద్, పలువురు అధికారులు, ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొని నీరబ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

కేసరపల్లిలో ప్రమాణ స్వీకారం!

- గన్నవరం, తాడేపల్లిలో స్థలాల పరిశీలన
- గన్నవరం మైదానంపై టీడీపీ నేతల మొగ్గు
- 12న ఉదయం 11.27 గంటలకు బాబు ప్రమాణ స్వీకారం

అమరావతి (ఆంధ్రజ్యోతి), గన్నవరం, తాడేపల్లి టౌన్, జూన్ 7: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరేందుకు సిద్ధమవుతోంది. ఈ నెల 12న ముఖ్యమంత్రిగా చంద్రబాబు గన్నవరం వద్ద కేసరపల్లిలో ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ భారీ కార్యక్రమానికి అనువైన ప్రదేశం కోసం తెలుగుదేశం పార్టీ నేతలు, అధికారులు శుక్రవారం స్థలాన్వేషణ చేశారు. రాజ్‌భవన్‌లో కాకుండా బహిరంగ సభలో, ప్రజల సమక్షంలో ప్రమాణ స్వీకారం చేయాలని చంద్రబాబు ఇప్పటికే నిర్ణయం తీసుకొన్నారు. ప్రమాణ స్వీకారానికి ప్రధాని మోదీతోపాటు మరికొన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా హాజరు కానున్నారు. ప్రజలు కూడా భారీగా హాజరయ్యే అవకాశం ఉంది. దీంతో ఈ కార్యక్రమం నిర్వహణ కోసం అనువైన స్థలాన్ని ఎంపిక చేసేందుకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, పార్టీ ముఖ్య నేత టీడీ జనార్ధనరావు, పార్టీ జోనల్ సమన్వయకర్త సత్యనారాయణ రాజుతో పాటు కొందరు అధికారులు శుక్రవారం వివిధ ప్రాంతాలను పరిశీలించారు. గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రికి సమీపంలోని తాడేపల్లి వద్ద సిమెంటు ఫ్యాక్టరీ ఏరియా మైదానంతోపాటు, కృష్ణా జిల్లా గన్నవరంలో కేసరపల్లి వద్ద ఉన్న మరో మైదానాన్ని వారు చూశారు. వాటిలో కేసరపల్లి వద్ద ఉన్న మైదానం జాతీయ రహదారి పక్కన ఉంది. విమానాశ్రయం నుంచి అతి దగ్గరగా ఉండడంతో వీఐపీల రాకపోకలకు అనువుగా ఉంటుందన్న అభిప్రాయం పార్టీ నేతల్లో వ్యక్తమైంది. దీనిపై శనివారం తుది నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది. ఈ నెల 12న ఉదయం 11.27 గంటలకు చంద్రబాబు ప్రమాణ స్వీకారం ఉంటుందని టీడీపీ వర్గాలు తెలిపాయి.

ఆదాయ పెంపునకు మార్గాలు అన్వేషించండి

- రాబడుల శాఖల్లో లీకేజీలు లేకుండా చూడాలి
- ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వేగవంతం చేయండి
- అధికారులతో సమీక్షలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆదాయం పెంపునకు మార్గాలను అన్వేషించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, అధికారులను ఆదేశించారు. ఆర్థిక, రెవెన్యూ, ఎక్సైజ్, రవాణా శాఖలు, ఆరోగ్యశ్రీ విభాగంపై శుక్రవారం సచివాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఇందులో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం గత రెండు ఆర్థిక సంవత్సరాల ప్రగతిని సమీక్షించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోని ఏప్రిల్, మే నెలల రాబడులు, వ్యయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబడుల శాఖల యంత్రాంగం పనితీరును మెరుగుపర్చుకోవాలని, ఎలాంటి లీకేజీలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాన్ని పటిష్టపర్చి బడ్జెట్ అంచనాలను అందుకోవాలని సూచించారు. ఆదాయం పెంపు కోసం వాణిజ్య పన్నుల శాఖలో వేసిన కమిటీ పనితీరును డిప్యూటీ సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ శాఖలో తరచూ సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ ఆదాయ పెంపు కోసం కృషి చేయాలన్నారు. వివిధ బ్యాంకులు, సంస్థలకు చెల్లిస్తున్న రుణాల వడ్డీ రేటును ఆర్థిక సమీక్షించుకుని, తక్కువ వడ్డీకి రుణాలిచ్చే సంస్థలకు అప్పులను బదలాయించుకోవాలని సూచించారు. ఇటీవల సింగరేణిలో చేసిన ఈ ప్రయోగం ద్వారా వందల కోట్ల ప్రయోజనం చేకూరిందని ఆర్టీసీ, రవాణా శాఖ అధికారులకు వివరించారు. లే-అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్‌ఆర్‌ఎస్) దరఖాస్తులు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్నాయని, ఎన్నికల షెడ్యూలుకు ముందే ఈ ప్రక్రియ ప్రారంభమైనా.. ప్రగతి లేకపోవడానికి కారణాలేమిటంటూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ ప్రక్రియను వేగవంతం చేసి ఖజానాకు అదనపు ఆదాయాన్ని సమకూర్చాలని చెప్పారు. పూర్తిగా అర్హమైన స్థలాలకే ఎల్‌ఆర్‌ఎస్‌ను అమలు చేయాలన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేసి, ఈ పథకం కింద ప్రయోజనం పొందే ప్రమాదం ఉందని, ఈ దృష్ట్యా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హౌసింగ్ బోర్డు, రాజీవ్ స్వగృహ పథకాల ద్వారా నిర్మించిన ఇళ్లు, వచ్చిన ఆదాయం వంటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికీ విక్రయించని ఇళ్లు, ఇళ్ల స్థలాల పరిస్థితిని సమీక్షించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా సామాన్యుడు సంతృప్తి చెందడమే ప్రధాన లక్ష్యమని అన్నారు. ఆరోగ్యశ్రీ బకాయిలను నెలవారిగా చెల్లించే పద్ధతిని ఆచరణలో పెడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆయా చికిత్సలకు నిర్దేశించిన రేట్లనే ప్రైవేటు ఆస్పత్రుల్లో అమలయ్యేలా వాటి యాజమాన్యాలను ఒప్పించాలని చెప్పారు.

పోదుర్లే కాస్త ఆగండి..!

వైసీపీ అధికారులకు చెక్

- సెలవులు రద్దు.. రిలీవ్ చేయవద్దు
- ఐపీఎస్ సంజయ్ లీవ్ రద్దు
- డిప్యూటేషన్ రద్దు చేసుకున్న రాజేశ్వరరెడ్డిని వెనక్కి పంపాలని లేఖ
- లెక్క తేలే వరకూ ఏపీలో ఉండాల్సిందే
- గీత దాటిన అధికారులకు స్పష్టీకరణ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

కొత్త ప్రభుత్వం కొలువు తీరకముందే వైసీపీ అధికారుల తాట తీస్తున్నారు. "జగనన్నే సర్వం. ఆయనతోనే మేముంటాం" అంటూ ప్రభుత్వాధికారులమన్న మాటే మరిచిన వారందరినీ మడత పెట్టేస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడకముందే చల్లగా జారుకుందాం అని చూసినవారికి చెక్ పెట్టేశారు. ఇప్పటికే రాష్ట్రం దాటిన వారు తిరిగి వెనక్కి రావాలంటూ సాధారణ పరిపాలన విభాగం తాఖీదులు జారీ చేసింది. చివరకు సెలవుపై వెళ్తున్న వారిని కూడా ఆపేస్తున్నారు. 'పోదుర్లే కాస్త ఆగండి' అంటూ గేట్లు మూసేస్తున్నారు. సీఐడీ చీఫ్‌గా అడ్డగోలు అరెస్టులు సాగించిన అధికారి సంజయ్. ముఖ్యమంత్రిగా జగన్ రాజీనామా చేసిన వెంటనే, సంజయ్ విదేశాలకు వెళ్లిపోవడానికి దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్ రెడ్డి యథావిధిగా ఆయనకు సహకరించారు. సంజయ్‌కు సెలవు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ జీఏడీ అధికారులు ఆయన సెలవును రద్దు చేశారు. ఈ క్రమంలో చంద్రబాబును కలిసి కాస్త ప్రసన్నం చేసుకోవాలన్న సంజయ్ ఆలోచనకు కూడా బ్రేక్ పడింది. చంద్రబాబు నివాసంలోకి ఎంట్రీ దొరకలేదు. ప్రభుత్వ ఆదాయానికి గండిపడేందుకు ఉన్న అవకాశాలను గుర్తించి, వాటిని కట్టడి చేస్తూ, ప్రభుత్వ ఆదాయం పెంచేందుకు స్టేట్ డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ విభాగాన్ని ఏర్పాటుచేశారు. ఆస్మదీయ ఐఆర్ఎస్ అధికారి చిలకల రాజేశ్వరరెడ్డిని తీసుకొచ్చి ఆ విభాగాన్ని జగన్ అప్పగించారు. 2020లో ఆ విభాగానికి హెడ్‌గా నియమితులైన రాజేశ్వరరెడ్డి టీడీపీ నాయకుల వ్యాపారాలపై విరుచుకుపడ్డారు. మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు కుటుంబ సభ్యులకు చెందిన వ్యాపారాలపై దాడులు చేయించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వం ఐదేళ్ల డిప్యుటేషన్‌ను మూడేళ్లకు కుదించింది. దీంతో డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి వచ్చిన ఆయనను తిరిగి వెనక్కి పంపించాలని కేంద్రం..జగన్ సర్కారుకు లేఖ రాసింది. అయితే, ఆయన మాత్రం నేను పోను. ఇక్కడే ఉంటానని కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ మెట్లు ఎక్కి.. రిలీవ్ ఆర్డర్‌ను పక్కన పెట్టేలా చేసుకున్నారు. కానీ ప్రభుత్వం మారబోతుందన్న విషయాన్ని ఆయన ముందుగానే గ్రహించారు. క్యాట్‌లో తాను వేసిన పిటిషన్‌ను ఉపసంహరించుకున్నారు. తనను రిలీవ్ చేయాలని కోరగా, అప్పటి సీఎస్ జవహర్ రెడ్డి ఆయనను రిలీవ్ చేసేశారు. ఇప్పుడు రాజేశ్వరరెడ్డిని వెనక్కి రప్పిస్తున్నారు. ఈ మేరకు ఆయన రిలీవ్ ఆర్డర్‌ను రద్దు చేస్తూ జీఏడీ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనను వెనక్కి పంపాలని కేంద్రానికి లేఖ కూడా రాసింది. అదే కోవలోకి చేరే మరో వైసీపీ అధికారి విజయ్‌కుమార్ రెడ్డి. ఐ అండ్ పీఆర్ కమిషనర్‌గా విజయకుమార్ రెడ్డి వైసీపీ కార్యకర్తలాగే పనిచేశారు. ప్రభుత్వం మారగానే.. వెనక్కి వెళ్లిపోవాలని ఈ డిప్యుటేషన్ అధికారి ప్రయత్నించారు. కానీ, ఆయనను జీఏడీ అధికారులు ఆపేశారు.

'కిక్కు' దించుతున్నారు!

ఏపీ బేవరేజెస్ మాజీ ఎండీపై కేసు.. ఫైళ్లు 'ఎత్తుకెళుతూ' దొరికిన వాసుదేవరెడ్డి

- సామాన్యుడి ఫిర్యాదుతో సీఐడీ కేసు
- హైదరాబాద్‌లోని నివాసంలో సోదాలు
- విచారణ... కీలక సమాచారం లభ్యం
- లిక్కర్ స్కామ్‌లో ఆయనదే కీలక పాత్ర

(అమరావతి - ఆంధ్రజ్యోతి)



నూతన మద్య విధానం పేరుతో వింత బ్రాండ్లు ప్రవేశపెట్టి.. అవినీతి 'కిక్కు'తో వేల కోట్లు వెనకేసుకున్నారు! ఇప్పుడు ఈ అవినీతి తీగ కదలించే ప్రక్రియ మొదలైంది. ఇక.. డొంక కదలడమే మిగిలింది. ఏపీ బేవరేజెస్ ఎండీ హోదాలో మద్యం కొనుగోళ్లు, అమ్మకాల్లో కీలక పాత్ర పోషించిన వాసుదేవ రెడ్డి చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. కీలకమైన ఫైళ్లను తీసుకెళ్లారంటూ ఆయనపై సీఐడీ కేసు నమోదు చేసింది. ఆ వెంటనే.. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో సోదాలు కూడా జరిపింది. ఎన్నికల సమయంలో మద్యం సరఫరాలో అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు రావడంతో... వాసుదేవరెడ్డిని ఈసీ పక్కకు తప్పించింది. అయితే... వైసీపీ ఓటమి తర్వాత, గురువారం ఆయన తన వెంట కొన్ని కీలక ఫైళ్లు తీసుకెళ్లినట్లు ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వ కార్యాలయం నుంచి అనుమానాస్పద రీతిలో ఫైళ్లు తీసుకెళుతుండగా చూశానంటూ.. గద్దె శివకృష్ణ అనే వ్యక్తి విజయవాడలోని నున్న పోలీసులకు సమాచారం అందించారు. వారు స్పందించకపోవడంతో సీఐడీకి ఫిర్యాదు చేశారు. ఆయన కథనం ప్రకారం... గురువారం ప్రసాదంపాడు ప్రాంతంలో ఉన్న ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ముందు నుంచి శివకృష్ణ స్నేహితుడితో కలిసి వాహనంలో వెళుతున్నారు. అక్కడ ఆగిఉన్న ఏపీ 39 ఎన్‌క్యూ 6666 నంబరు గల కారులో కొన్ని ఫైళ్లు, కంప్యూటర్ పరికరాలు, ఇతర పత్రాలను ఎక్కిస్తుండటం గమనించారు. తన స్నేహితుడితో కలిసి కొంత దూరం వాహనాన్ని వెంబడించారు. ఆ తర్వాత... ఫైళ్లు తీసుకెళ్లిన వ్యక్తి వాసుదేవ రెడ్డి అని తెలుసుకుని, నున్న పోలీసులకు తెలియజేశారు. వారు పట్టించుకోక పోవడంతో మంగళగిరి సీఐడీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేశారు. శివకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా గురువారం డీఎస్పీ శ్రీనివాసరరావు ఎఫ్ఐఆర్(17/2024) నమోదు చేశారు. ఐపీసీ 427, 397, రెడ్ విత్ 120(బి) కింద కేసు పెట్టారు. దర్యాప్తునకు ముగ్గురు సీఐల నేతృత్వంలో బృందాలను ఏర్పాటు చేసి రంగంలోకి దించారు.

హైదరాబాద్‌లో సోదాలు...

హైదరాబాద్‌లోని నార్సింగిలోని పౌలోమీ గేటెడ్ టౌన్‌షిప్‌లో ఉంటున్న వాసుదేవరెడ్డి నివాసానికి సీఐడీ ప్రధాన కార్యాలయం నుంచి అధికారుల బృందం వెళ్లింది. 12 మంది సభ్యుల బృందం శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు సోదాలు జరిపారు. ముఖ్యమైన డాక్యుమెంట్లు, ఫైళ్లు, హార్డ్ డిస్కులు స్వాధీనం చేసుకున్నారు. సోదాల సమయంలో తెలంగాణ పోలీసులు గేటెడ్ టౌన్‌షిప్ బయట కాపలా ఉన్నారు. వాసుదేవ రెడ్డిని ప్రశ్నించి కీలక సమాచారాన్ని సేకరించినట్లు తెలిసింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ ఆధ్వర్యంలోనే మద్యం షాపులు నిర్వహించారు. ఈ సమయంలో మద్యంషాపుల్లో డిమాండ్ ఉన్న కొన్ని మద్యం కంపెనీలకు ఆర్డర్లు ఎందుకు ఆపేశారు. పేరుకూడా వినని కొన్ని కంపెనీల మద్యాన్ని భారీ ధరలకు విక్రయించారు. ఎవరి ఆదేశాల మేరకు ఇలాంటి నిర్ణయాలు తీసుకున్నారనే కోణంలో విచారణ జరిగినట్లు తెలిసింది.

డిప్యుటేషన్‌పై రాష్ట్రానికి...

తెలంగాణకు చెందిన వాసుదేవ రెడ్డి రైల్వేలో ఐఆర్‌టీఎస్ అధికారి. అనంతపురం జిల్లా గుంతకల్లులో పనిచేస్తూ వైసీపీ నేతలతో మంచి సంబంధాలు పెంచుకున్నారు. తాను వైఎస్ అభిమాని అంటూ వారికి ఈక్యూ (ఎమర్జెన్సీ కోటాలో రైల్వే టికెట్లు) లాంటివి చేస్తూ వైసీపీ నేతలకు దగ్గరయ్యారు. అదే క్రమంలో జగన్ ఓఎస్డీ కృష్ణ మోహన్ రెడ్డితో సాన్నిహిత్యం బాగా పెరిగింది. 2019 ఎన్నికల్లో ఏపీలో వైసీపీ అధికారంలోకి రాగానే ఏపీకి డిప్యుటేషన్‌పై వచ్చారు. ఆయనకు జగన్ బేవరేజెస్ కార్పొరేషన్ అప్పగించారు. ఎన్నికల సమయంలో వాసుదేవరెడ్డి వైసీపీ నేతలకు పూర్తిస్థాయిలో మద్యం అందుబాటులో ఉంచారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కు ప్రతిపక్షాలు ఫిర్యాదు చేశాయి. దీంతో ఆయనను ఈసీ పదవి నుంచి తప్పించింది.

ఐదేళ్లలో ఎంత అమ్మారు?

వైసీపీ అధికారంలోకి వచ్చాక ఐదేళ్ల కాలంలో 14.38కోట్ల కేసుల లిక్కర్, 5.83కోట్ల కేసుల బీరు రాష్ట్రంలో అమ్ముడైంది. ఇందులో లిక్కర్‌పై రూ.3600 కోట్లు, బీరుపై రూ.900 కోట్లు ప్రభుత్వం నుంచి కంపెనీలకు వెళ్లి, మళ్లీ తిరిగి వైసీపీ నేతలకు చేరాయి. మొదట ఈ నగదు వసూలు కేంద్రాన్ని హైదరాబాద్ కేంద్రంగా నడిపారు. కంపెనీలకు బిల్లులు చెల్లించిన వెంటనే వెళ్లి హైదరాబాద్‌లో కేసుల చొప్పున కమీషన్లు ఇచ్చేవారు. ఈ క్రమంలోనే జగన్‌కు సన్నిహితుడైన ఓ ఫార్మా కంపెనీకి రూ.300 కోట్లు ఇచ్చారు. ఆ కంపెనీపై ఐటీ దాడులు జరిగి మొత్తం సీజ్ కావడంతో దుకాణాన్ని అక్కడినుంచి బెంగళూరుకు మార్చారని కంపెనీల ప్రతినిధులు చెబుతున్నారు. హైదరాబాద్‌లో ఐటీ కంపెనీ నడిపే వైసీపీ సన్నిహితుడు కసిరెడ్డి రాజశేఖరరెడ్డి ఈ వసూళ్లకు కేంద్ర బిందువుగా వ్యవహరించారు.

కేంద్రంలో ఎవరికి చాన్స్!

- రాష్ట్రం నుంచి ఎక్కువ మందికి చాన్స్
- రామ్మోహన్ నాయుడికి అవకాశం?
- బీజేపీ, జనసేన నుంచి ఎవరు?

అమరావతి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి కేంద్ర మంత్రివర్గంలో ఎవరికి అవకాశం లభిస్తుంది? ఎందరికి చాన్స్ దక్కుతుంది? దీనిపై తీవ్ర చర్చ జరుగుతోంది. ఆదివారం మోదీ ప్రధానమంత్రిగా మూడోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతోపాటు పలువురు మంత్రులు ప్రమాణ స్వీకారం చేసే అవకాశముంది. వీరిలో ఏపీ నుంచి ఎంత మంది ఉంటారనేది కీలకంగా మారింది. ఎన్డీయేలో బీజేపీ తర్వాత అత్యధికంగా 16 మంది ఎంపీలతో టీడీపీ రెండో స్థానంలో ఉంది. బీజేపీ నుంచి ముగ్గురు, జనసేన ఎంపీలు ఇద్దరు ఉన్నారు. కేంద్ర కేబినెట్‌లో భాగస్వామి అయ్యేందుకు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కూడా సుముఖంగా ఉన్నారు. అంటే.. రాష్ట్రానికి చెందిన బీజేపీ ఎంపీలతోపాటు టీడీపీ, జనసేన సభ్యులకూ కేంద్ర కేబినెట్‌లో అవకాశం దక్కనుంది. కేంద్రంలో ప్రస్తుతమున్న పరిస్థితుల్లో ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ సంఖ్యలోనే మంత్రి పదవులు వచ్చే అవకాశముందని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. శుక్రవారం కొంతమందికి, ఆ తర్వాత మరో విడతలో కొందరికి పదవులు దక్కే అవకాశముంది. కేంద్రంలో కేబినెట్‌తోపాటు ఇండిపెండెంట్ చార్జి మంత్రులు, సహాయ మంత్రి పదవులు ఉంటాయి. వీటిలో కేంద్ర కేబినెట్ పదవి స్థాయి ఎక్కువ. ప్రస్తుతం అందుతున్న సమాచారం ప్రకారం టీడీపీ నుంచి శ్రీకాకుళం ఎంపీ రామ్మోహన్ నాయుడుకు కేబినెట్ పదవి లభించే అవకాశం ఉంది. ఆ పార్టీ నుంచి పెమ్మసాని చంద్రశేఖర్ (గుంటూరు), వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి (నెల్లూరు), దగ్గుమళ్ల ప్రసాదరావు (చిత్తూరు)కు కూడా అవకాశం దక్కే సూచనలు ఉన్నాయి. జనసేన తరఫున ఇద్దరు ఎంపీలు ఉన్నారు. అందులో బాలశౌరి (మచిలీపట్నం) సీనియర్. ఆ పార్టీ నుంచి ఆయనకే ఎక్కువ అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది. బీజేపీ నుంచి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి (రాజమహేంద్రవరం)కి అవకాశాలు మెరుగ్గా ఉన్నాయని అంటున్నారు. సీఎం రమేశ్ (అనకాపల్లి) కూడా బీజేపీ నుంచి మంత్రి పదవి కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.

సీఎంవోలో ప్రక్షాళన

పూనం, రేవు, భరత్ గుప్తాలకు బదిలీ

- వారికి పోస్టింగ్ ఇవ్వని కొత్త సీఎస్ నీరబ్
- జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశాలు
- 27వరకు జవహర్ సెలవుకు ఆమోదం
- ఆపై జీఏడీలో రిపోర్టు చేయనున్న మాజీ సీఎస్
- తప్పుకోవాలని నామినేటెడ్ పదవుల్లోని వారికీ సంకేతాలు
- వారికి వారుగానే కార్యాలయాలు వదిలేలా చర్యలు



పూనం మాలకొండయ్య, రేవు ముత్యాలరాజు, నారాయణ భరత్ గుప్తా

అమరావతి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వం కొలువు తీరుతున్న వేళ....పాలనా ప్రక్షాళన ముమ్మరమైంది. ముఖ్యమంత్రి కార్యాలయంలో ఈ ప్రక్రియ వేగవంతమైంది. జగన్ హయాంలో సీఎంవోలో పనిచేసిన సీనియర్ ఐఏఎస్ అధికారులు పూనం మాలకొండయ్య, రేవు ముత్యాలరాజు, నారాయణ భరత్ గుప్తాలను బదిలీ చేశారు. వారికి పోస్టింగ్ ఇవ్వలేదు. సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్టు చేయాలంటూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఆదేశాలు జారీచేశారు. కొత్త సీఎస్‌గా బాధ్యతలు తీసుకున్న తొలిరోజే ఆయన ఈ ఆదేశాలు జారీచేశారు. జగన్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పూనం మాలకొండయ్య పనిచేశారు. అప్పట్లో సీఎం సెక్రటరీగా రేవు ముత్యాలరాజు, సీఎం అడిషనల్ సెక్రటరీగా నారాయణ భరత్ గుప్తా ఉన్నారు. మరోవైపు, జగన్ ప్రభుత్వం నామినేటెడ్ పదవుల్లో నియమించిన వారిని సాగనంపే ప్రక్రియ మొదలైంది. చైర్మన్లు, డైరెక్టర్లు, బోర్డు మెంబర్ల నుంచి రాజీనామాలు తీసుకోనున్నారు. ఈ మేరకు ప్రత్యేకకార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులకు ఆదేశాలందాయి. ఈప్రక్రియను వెంటనే ప్రారంభించాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేశారు. కాగా, మాజీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి సెలవును కొత్త సీఎస్ నీరబ్‌కుమార్ ఆమోదించారు. కొత్త ప్రభుత్వం నుంచి అందిన సంకేతాలతో ఆయన సెలవుపై వెళ్లిన విషయం తెలిసిందే. ఈ నెల 27 వరకు ఆయన లీవులో ఉంటారు. ఆ తర్వాత తిరిగి వచ్చి జీఏడీలో జవహర్‌రెడ్డి రిపోర్టు చేస్తారు.

ఏపీ సీఐడీ నుంచి సంజయ్ అవుట్

(మొదటిపేజీ తరువాయి)



రఘురామిరెడ్డి


రిపోర్టు చేయాలని ఆదేశించారు. సిట్ చీఫ్‌గా ఉండి.. కనీసం నోటీసు ఇవ్వకుండా అర్ధరాత్రి చంద్రబాబును అరెస్టు చేసిన విజిలెన్స్- ఎన్‌ఫోర్స్‌మెంట్ ఐజీ కొల్లి రఘురామిరెడ్డిపైనా వేటు పడింది. విజిలెన్స్ నుంచి ఆయన్ను తప్పించి.. డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాల్సిందిగా సీఎస్ ఆదేశించారు. సీఐడీ, విజిలెన్స్ అదనపు బాధ్యతలను డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాకు అప్పగించారు. మరోవైపు.. ఫైబర్‌నెట్ ఎండీగా ఎం.మధుసూదన్‌రెడ్డిని, మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్, ఏపీఎండీసీ ఎండీగా ఉన్న వీజీ వెంకటరెడ్డిని కూడా బదిలీ చేసిన సీఎస్.. సాధారణ పరిపాలనశాఖ(జీఏడీ)లో రిపోర్టు చేయాలని వారిద్దరినీ ఆదేశించారు. ప్రస్తుతం పరిశ్రమల శాఖ కార్యదర్శిగా ఉన్న ఎన్.యువరాజుకు ఆయా బాధ్యతలు అదనంగా అప్పగించారు.

తెలంగాణ సరిహద్దు గ్రామాల్లో పల్నాడు వైసీపీ నాయకుల మకాం!

- అరెస్టు భయంతో బంధువుల ఇళ్లకు...
- మిర్యాలగూడ, హుజూర్‌నగర్, మఠంపల్లి లాడ్జిల్లో తలదాచుకున్న మరికొందరు

నల్లగొండ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని చూసిన వైసీపీ నేతలు తెలంగాణకు మకాం మార్చారు. ఏపీలోని పల్నాడు జిల్లాకు చెందిన నాయకులు, కార్యకర్తలు తెలంగాణ సరిహద్దులోని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో కృష్ణపట్టె గ్రామాలు, సమీప పట్టణాల్లో తిష్టవేశారు. ఎన్నికల సందర్భంగా పల్నాడు జిల్లాలో గొడవలు, ఘర్షణలు జరగడం, గ్రామాల్లో పరస్పర దాడుల నేపథ్యంలో అక్కడ 144 సెక్షన్ అమల్లో ఉంది. పలువురు నాయకులు, కార్యకర్తలపై బైండోవర్ కేసులు, రౌడీషీట్లు కూడా ఉన్నాయి. దీంతో తాము అక్కడే ఉంటే పోలీసులు అరెస్టు చేస్తారనే భయంతో పాటు, ప్రత్యర్థులు దాడిచేసే అవకాశం ఉండటంతో కృష్ణానది దాటి తెలంగాణలోని సరిహద్దు ప్రాంతాల్లోని గ్రామాలు, పట్టణాల్లో ఉన్న బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఉంటున్నారు. అలాగే మిర్యాలగూడ, హుజూర్‌నగర్, నాగార్జునసాగర్, దేవరకొండ, మఠంపల్లి ప్రాంతాల్లోని లాడ్జిల్లో తలదాచుకుంటున్నారు. ప్రధానంగా మాచర్ల, గురజాల నియోజకవర్గాల్లోని పిన్నెల్లి, బ్రాహ్మణపల్లి, మాచవరం, తంగేడ, దాచేపల్లి, రెంటచింతల, వెల్దుర్తి, దుర్గి, కారంపూడి, మాచర్ల టౌన్, పెదగార్లపాడు, కేశానపల్లి, మాదినపాడు, దైద, పుల్లారెడ్డిగూడెం తదితర గ్రామాలకు చెందిన వైసీపీ నాయకులు, కార్యకర్తలు తెలంగాణలోని సరిహద్దు గ్రామాల్లో రెండు రోజుల నుంచి మకాం వేశారు. తర్వాత మిర్యాలగూడ, హుజూర్‌నగర్, మఠంపల్లిలోని లాడ్జిలకు చేరారు. పల్నాడులో పరిస్థితి సద్దుమణిగాక సొంత ఊళ్లకు తిరిగి వెళ్లాలని, లేకపోతే హైదరాబాద్ వెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. సమీప బంధువులు కావడంతో వారికి ఆశ్రయం ఇవ్వకతప్పడం లేదని స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, ఇటీవల పల్నాడు జిల్లా మాచర్లలో జరిగిన ఘర్షణల్లో నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని హాలియాతో పాటు దేవరకొండ నియోజకవర్గంలోని కంబాలపల్లి తదితర గ్రామాలకు చెందిన కొందరి ప్రమేయం ఉందన్న సమాచారంతో ఏపీ పోలీసులు ఈ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక పోలీసులు మాత్రం ఈ విషయాన్ని ధ్రువీకరించడం లేదు. ఈ ప్రాంతం నుంచి వెళ్లి మాచర్ల పట్టణం, పరిసర గ్రామాల్లో స్థిరపడ్డవారు ఎవరైనా గొడవల్లో పాల్గొని ఉండవచ్చని, వారికి ఇక్కడ బంధుత్వాలే తప్ప ఈ ప్రాంతంతో ఇతర సంబంధాలేమీ లేవని స్థానిక నాయకులు, పోలీసులు చెబుతున్నారు.

నీట్‌పై నీలినీడలు



(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నాపత్రం లీకైందంటూ సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున దుమారం చెలరేగింది. లీకైన ప్రశ్నాపత్రం ఇదేనంటూ కొన్ని ఫొటోలు ప్రత్యక్షమయ్యాయి. దీంతో నీట్‌ను మళ్లీ నిర్వహించాలన్న డిమాండ్ అదే రోజున మొదలైంది. అనంతరం దీనిపై సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. ఫలితాలను విడుదల చేయకుండా ఆదేశాలు జారీ చేయాలని, పరీక్షను మళ్లీ నిర్వహించాలని పిటిషన్‌దార్లు కోరారు. ఫలితాల వెల్లడిని నిలిపివేయటానికి సుప్రీంకోర్టు నిరాకరించినప్పటికీ.. ఈ వ్యవహారాన్ని సమీక్షించటానికి అంగీకరించింది. కాగా, నీట్ ఫలితాలను జూన్ 14వ తేదీన విడుదల చేయాల్సి ఉండగా.. ఎన్‌టీఏ హఠాత్తుగా లోక్‌సభ ఫలితాలు వెలువడిన జూన్ 4వ తేదీన అంటే పది రోజుల ముందే విడుదల చేసింది. యావత్ మీడియా, దేశ ప్రజానీకం దృష్టి లోక్‌సభ ఎన్నికల ఫలితాల మీద ఉన్న సమయంలో ఎన్‌టీఏ ఇలా చేయటం లక్షలాది మంది విద్యార్థులను, తల్లిదండ్రులను దిగ్భ్రాంతి పరిచింది. ఎన్నికల ఫలితాల హడావిడిలో ఎవరూ నీట్ పరీక్ష నిర్వహణలో, ఫలితాల్లో జరిగిన అక్రమాలను పట్టించుకోరనే ఉద్దేశంతోనే ఎన్‌టీఏ ఇలా చేసిందన్న ఆరోపణలు వచ్చాయి.

ఫలితాల్లో గందరగోళం

ఇక వెల్లడైన ఫలితాలు కూడా పెద్ద ఎత్తున వివాదాన్ని సృష్టించాయి. ఏకంగా 67 మంది విద్యార్థులు ఈసారి వంద శాతం మార్కులు (720) సాధించి దేశంలో నంబర్ వన్ ర్యాంకును తెచ్చుకున్నారని ఫలితాలు వెల్లడించాయి. నీట్ చరిత్రలోనే ఇంతమంది విద్యార్థులకు నంబర్‌వన్ ర్యాంకు ఎన్నడూ రాలేదు. ఈ 67 మందిలో 8 మంది హరియాణాలోని ఒకే పరీక్షకేంద్రానికి చెందిన వారు కావటం మరో విశేషం. అంతేకాదు, వీరి హాల్‌టికెట్ నెంబర్లు ఒకే సిరీస్‌తో ఉన్నాయి. ఇక 67 మంది టాపర్లకు ఫస్ట్ ర్యాంకు ఇచ్చిన ఎన్‌టీఏ.. కౌన్సెలింగ్ ర్యాంకులను మాత్రం దశాంశ (డెసిమల్) పద్ధతిలో వేర్వేరుగా ఇచ్చింది. దేని ఆధారంగా ఈ ర్యాంకులను కేటాయించారన్నది వెల్లడించలేదు. ఫలితాల్లో చోటు చేసుకున్న మరో విచిత్రం ఏమిటంటే.. కొందరు విద్యార్థులకు 717, 718, 719 మార్కులు వచ్చాయి. నీట్ పరీక్ష మూల్యాంకన పద్ధతి ప్రకారం ఇలా రావటానికి వీల్లేదని విద్యార్థులు అంటున్నారు. ఎందుకంటే, నీట్ పరీక్షలో సరైన జవాబుకు 4 మార్కులు ఇస్తారు. తప్పు జవాబుకు ఒక మైనస్ మార్కు ఉంటుంది. మొత్తం 180 ప్రశ్నలకు సరైన సమాధానాలు రాసిన వారికి 720 మార్కులు (ఒక్కో ప్రశ్నకు 4 మార్కులు చొప్పున) వస్తాయి. ఒక ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా వదిలేసిన విద్యార్థికి 4 మార్కులు తగ్గి, మొత్తం స్కోరు 716 లభిస్తుంది. లేదా ఒక ప్రశ్నకు తప్పు సమాధానం రాస్తే.. మరో మార్కు తగ్గి 715 అవుతుంది. అంతేగానీ 719, 718, 717 వంటి మార్కులు రావటానికి అవకాశం లేదని, నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలకు ఇది పెద్ద ఉదాహరణ అని ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఎన్‌టీఏ గురువారం వివరణ ఇస్తూ.. కొన్ని పరీక్ష సెంటర్లలో విద్యార్థులకు పరీక్ష సమయం వివిధ కారణాల వల్ల వృథా అయినట్లు తమ విచారణలో తేలిందని, దీంతో 1563 మంది విద్యార్థులకు వృథా అయిన సమయం, వారి ప్రతిభ ఆధారంగా అదనపు మార్కులు కలిపామని తెలిపింది. అందువల్లే 719, 718 మార్కులు కొందరికి వచ్చాయని పేర్కొంది. అయితే, ఒక్కో విద్యార్థికి ఎంత సమయం వృథా అయ్యింది అన్నది ఎలా నిర్ణయించారన్న దానిపై స్పష్టత లేదని విద్యార్థులు అంటున్నారు. నిజంగానే, కొందరికి పరీక్ష సమయం వృథా అయి ఉంటే, వారికి అదనపు సమయం కేటాయిస్తే సరిపోయేదని, అదనపు మార్కులు ఎలా కలుపుతారన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఇక 67 మందికి ఫస్ట్‌ర్యాంక్ రావటంపై ఎన్‌టీఏ తన వివరణలో.. గత ఏడాది నీట్ పరీక్షను 20,38,596 మంది రాస్తే ఈసారి 23,33,297 మంది రాశారని, విద్యార్థుల సంఖ్య పెరగటం వల్ల అత్యధిక స్కోరు చేసిన వారి సంఖ్య కూడా పెరిగిందని తెలిపింది. 720 మార్కులు సాధించిన 67 మందిలో 44 మందికి.. ఫిజిక్స్ ఆన్సర్‌కీలో చేసిన రివిజన్ ప్రకారం ఆ మార్కులు లభించాయని పేర్కొంది. ఒకే ప్రశ్నకు రెండు సరైన సమాధాలు ఉన్నాయని నిపుణులు చేసిన సిఫార్సు మేరకు ఈ రివిజన్ జరిగిందని స్పష్టం చేసింది. మరో ఆరుగురు అదనపు మార్కులు కలపటం వల్ల 720 మార్కులను సాధించారని పేర్కొంది. ఫలితాలను పది రోజుల ముందే ప్రకటించటంపై స్పందిస్తూ.. ఆన్సర్ కీ చాలెంజ్ గడువు ముగిసిన తర్వాత వీలైనంత త్వరగా వెల్లడిస్తుంటామని, ఈసారి కూడా అదే విధంగా అన్ని ప్రక్రియలు పూర్తి చేసి నిబంధనల మేరకే ఫలితాలు వెల్లడించామని తెలిపింది.



కేంద్రం స్పందించాలి

న్యూఢిల్లీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నీట్ పరీక్షపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు నిర్వహించాలని విపక్ష కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే శుక్రవారం డిమాండ్ చేశారు. ఉద్యోగ నియామక పరీక్షల్లో కూడా పేపర్‌లీకేజీలు చోటు చేసుకుంటున్నాయని, వారి భవిష్యత్తుతో మోదీ ప్రభుత్వం ఆడుకుంటోందని విమర్శించారు. దేశ యువతను కేంద్రం మోసగిస్తోందన్నారు. నీట్ పరీక్షపై, ఫలితాలపై లక్షలాది మంది విద్యార్థులు అనుమానాలు వ్యక్తం చేస్తుంటే కేంద్రం ఎందుకు సమాధానం ఇవ్వటం లేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ నిలదీశారు. తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ స్పందిస్తూ.. నీట్‌పై తమ వ్యతిరేకతను తాజా పరిణామాలు బలపరుస్తున్నాయని పేర్కొన్నారు. ఇదంతా కేంద్రప్రభుత్వ కేంద్రీకరణ విధానాల ఫలితంగా జరుగుతోందని, ఇప్పటికైనా, ప్రొఫెషనల్ కోర్సుల్లో రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాధికారాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. నీట్ వంటి పరీక్షలు పేదలకు, సమాఖ్య విధానానికి, సామాజిక న్యాయానికి వ్యతిరేకమైనవని.. అందరం కలిసి వీటిని తిప్పికొట్టాలని స్టాలిన్ పిలుపునిచ్చారు. మరోవైపు, నీట్ పరీక్షపై ఓ విద్యార్థి దాఖలు చేసిన పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు ఎన్‌టీఏ వివరణ కోరుతూ శుక్రవారం నోటీసులు జారీ చేసింది.



దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న ప్రజావాణి నోడల్ అధికారి దివ్య

‘ప్రజావాణి’ పునఃప్రారంభం

బేగంపేట, హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల కోడ్ ముగియడంతో ప్రజావాణి కార్యక్రమం శుక్రవారం పునఃప్రారంభమైంది. ప్రజాభవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్, ప్రజావాణి ఇన్‌చార్జి జి.చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యదేవరాజన్‌లు దరఖాస్తులను స్వీకరించారు. ఎన్నికల కోడ్ ముగియడంతో పాలనాపరమైన అడ్డంకులు తొలగాయని, కాబట్టి ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరిస్తామని ఈ సందర్భంగా చిన్నారెడ్డి తెలిపారు. ఎన్నికల కారణంగా మూడు నెలల తర్వాత నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి ప్రజలు పెద్దఎత్తున తరలివచ్చి సమస్యలపై దరఖాస్తులను అందజేశారు. శుక్రవారం మొత్తం 373 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 120, విద్యాశాఖ, మునిసిపల్ శాఖలకు సంబంధించి చెరో 43, హోం శాఖకు సంబంధించి 29, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 18, ఇతర శాఖలకు సంబంధించి 120 దరఖాస్తులు వచ్చినట్లు అధికార వర్గాలు తెలిపారు.

ఆందోల్ నర్సింగ్ కళాశాలకు గ్రీన్ సిగ్నల్

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా ఆందోల్‌లో బీఎస్సీ నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం పాలనపరమైన అనుమతులు మంజూరు చేసింది. ఈ మేరకు శుక్రవారం వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు జీవోను జారీ చేశారు. కాలేజీ నిర్మాణం, యంత్ర పరికరాలు, ఫర్నీచర్ కోసం రూ. 43 కోట్ల నిధులను కూడా మంజూరు చేశారు. కళాశాల ఏర్పాటుకై అత్యవసర ధ్రువీకరణ పత్రంతో పాటు నిరభ్యంతర ధ్రువపత్రాన్ని కూడా జారీ చేశారు. 60 సీట్లతో ఏర్పాటు చేస్తున్న ఈ కాలేజీ కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీకి అనుబంధంగా ఉంటుందని తెలిపారు.

టీజీ న్యాబ్ డైరెక్టర్‌గా సందీప్ శాండిల్య

తెలంగాణ యాంటీ నార్కోటిక్ బ్యూరో(టీజీ న్యాబ్) డైరెక్టర్‌గా సందీప్ శాండిల్యను ప్రభుత్వం తిరిగి నియమించింది. 1993 బ్యాచ్ ఐపీఎస్ అధికారి సందీప్ శాండిల్య టీజీ న్యాబ్ డైరెక్టర్ హోదాలో మే 31న పదవీ విరమణ చేశారు. అయితే శాండిల్యకు ఉన్న విజన్, టీజీ న్యాబ్ డైరెక్టర్‌గా గత కొద్ది నెలలుగా ఆయన చేపట్టిన పనితీరును పరిగణలోకి తీసుకుని తిరిగి బాధ్యతలు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సీఎస్ శాంతి కుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీజీ న్యాబ్ డైరెక్టర్‌గా ఆయన ఏడాది పాటు కొనసాగనున్నారు.

ప్రైవేటుకు దీటుగా హరిత హోటళ్లు: జూపల్లి

కార్వాన్/హైదరాబాద్ సిటీ/హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే హరిత హోటళ్లు, రిసార్ట్‌లను రానున్న కాలంలో ప్రైవేటు హోటళ్లకు దీటుగా తీర్చిదిద్దుతామని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి గోల్కొండ ఫెస్ట్, తారామతి ఫెస్ట్‌లతోపాటు ఇతర కార్యక్రమాలు నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. శుక్రవారం నార్సింగ్ సమీపంలోని తారామతి బారాదరి రిసార్ట్‌లో మంత్రి ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రధాన ద్వారం వద్ద ఏర్పడిన గుంతలను తక్షణమే పూడ్చాలని, పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఏడెకరాల విస్తీర్ణంలో ఉన్న తారామతి రిసార్ట్‌లో నిర్వహణ లోపాలు, సరైన నిర్ణయాలు తీసుకోలేకపోవడం వల్లే తగిన ఆదాయం రావడం లేదని తెలిపారు. తారామతి రిసార్ట్ ద్వారా ఏడాదికి రూ.2 కోట్ల ఆదాయం మాత్రమే వస్తోందని, సరైన నిర్వహణ ఉంటే ఈ ఆదాయం 5 రెట్లు పెరుగుతుందని చెప్పారు. మూడు నాలుగు నెలల్లో రాష్ట్రంలోని పర్యాటక హోటళ్లను ప్రైవేటు హోటళ్లకు దీటుగా తీర్చిదిద్దుతామన్నారు.

బీటెక్ లేటరల్ ఎంట్రీకి నేటి నుంచి కౌన్సెలింగ్

హైదరాబాద్ సిటీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): టీజీఈసెట్‌లో ర్యాంకులు పొందిన అభ్యర్థులు బీటెక్‌లో నేరుగా సెకండియర్ (లేటరల్ ఎంట్రీ)లో ప్రవేశాలకు శనివారం నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభంకానుంది. అర్హత పొందిన వారు కౌన్సెలింగ్ నిమిత్తం శనివారం నుంచి టీజీఈసెట్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. తర్వాత తమ అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ కేంద్రాల్లో ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్లు బుక్ చేసుకోవచ్చు. ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ ఈ నెల 10 నుంచి 12వరకు ఉంటుందని జేఎన్‌టీయూ అడ్మిషన్ల విభాగం ఇన్‌చార్జ్ డైరెక్టర్ జి.కృష్ణ మోహనరావు తెలిపారు.

మరమ్మతులు త్వరగా పూర్తి చేయండి

» అధికారులకు సూచించిన జస్టిస్ ఘోష్

భూపాలపల్లి, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వరదలు వచ్చేలోపు అన్నారం బ్యారేజీ మరమ్మతు పనులను పూర్తి చేయాలని కాళేశ్వరం ప్రాజెక్టులపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన జ్యుడీషియల్ విచారణ కమిషన్ చైర్మన్ జస్టిస్ పీసీ ఘోష్ ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఆయన శుక్రవారం సాయంత్రం భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని అన్నారం బ్యారేజీ వద్దకు చేరుకున్నారు. నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి బ్యారేజీలో సీపేజీ, సీసీ బ్లాకులు దెబ్బతిన్న పిల్లర్లను పరిశీలించారు. అలాగే ఆఫ్కాన్ సంస్థ చేపట్టిన మరమ్మతు పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సాంకేతికంగా ఏయే పనులు చేపడుతున్నారో సంస్థ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా పనులు పూర్తిచేసి మరింత నష్టం జరగకుండా చూడాలని సూచించారు.

ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజాతో జాగ్రత్త: సర్కారు

హైదరాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): కేరళ, ఝార్ఖండ్ రాష్ట్రాలతో పాటు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర రాష్ట్రాల్లోనూ ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజా (హెచ్5ఎన్1) వైరస్ ప్రబలుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ రవీంద్రనాయక్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన పేరున డీహెచ్ కార్యాలయం శుక్రవారం సూచనలు జారీ చేసింది. కోళ్లు, బాతులు, పావురాలు, ఇతర పక్షుల ద్వారా ఈ వైరస్ మనుషులకు సోకుతుందని అందులో తెలిపింది. కాబట్టి చికెన్, గుడ్లు ముట్టుకున్నప్పుడు జాగ్రత్తగా చేతులు కడుక్కోవాలని, పూర్తిగా ఉడికించిన తర్వాతే వాటిని తినాలని, జలుబు, దగ్గు, జ్వరం ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. మాస్కులు ధరించాలని కోరింది. రోడ్ల మీద, బహిరంగ ప్రదేశాల్లో ఉమ్మి వేయొద్దని హెచ్చరించింది. వైరస్ లక్షణాలు ఉంటే సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని కోరింది. ఇప్పటివరకు తెలంగాణలో ఈ వైరస్ కేసులు నమోదు కాలేదు.

బీఎస్సీలో బయోమెడికల్ సైన్స్(ఆనర్స్) కోర్సు

హైదరాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా బీఎస్సీ(బయోమెడికల్ సైన్స్)(ఆనర్స్) కోర్సు సిలబస్‌ను రాష్ట్రంలోని వర్సిటీల్లో అండర్ గ్రాడ్యుయేట్ స్థాయి విద్యార్థుల కోసం ప్రవేశపెట్టినట్లు ఉన్నత విద్యామండలి వెల్లడించింది. ఈ మేరకు తెలంగాణ ఉన్నత విద్యామండలి కార్యదర్శి శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉన్నత విద్యామండలి కార్యాలయంలో శుక్రవారం చైర్మన్ లింబాద్రి నేతృత్వంలో పలు ఫార్మా సంస్థలు, ఆస్పత్రుల వైద్యులు, కాలేజీల ప్రిన్సిపాళ్లతో సమావేశం జరిగిందని ఆయన వెల్లడించారు. కోర్సు పూర్తయిన తర్వాత కార్పొరేటు ఆస్పత్రులు, బయో ఫార్మాస్యూటికల్ పరిశ్రమలు, డయాగ్నస్టిక్ సెంటర్లలో విద్యార్థులు శిక్షణ పొందేందుకు ఎంఓయూ చేసుకున్నట్లు పేర్కొన్నారు.

పరువు నష్టం కేసులో కోర్టుకు దీపాదాస్ మున్షీ

అఫ్జల్‌గంజ్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ శుక్రవారం నాంపల్లి కోర్టుకు హాజరయ్యారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీజేపీ నేత ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ చేసిన ఫిర్యాదు మేరకు ఆమెపై బేగంబజార్ పోలీస్‌స్టేషన్‌లో పరువు నష్టం కేసు నమోదైంది. కేసు విచారణ సందర్భంగానే ఆమె కోర్టుకు వచ్చారు.

కొలిక్కి వచ్చిన స్థానికత!

ఒకటి, రెండు రోజుల్లో జీవో విడుదల.. ఎంబీబీఎస్ అడ్మిషన్లపై వైద్యశాఖ కసరత్తు

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): నీట్ ఫలితాలు వెల్లడైన నేపథ్యంలో వైద్య విద్య ప్రవేశాల కోసం చేపట్టాల్సిన కార్యాచరణపై వైద్య, ఆరోగ్య శాఖ దృష్టి సారించింది. ఎంబీబీఎస్ అడ్మిషన్ల ప్రక్రియలో కీలకమైన స్థానికత అంశాన్ని కొలిక్కి తీసుకొచ్చింది. ఇందుకు సంబంధించిన జీవోను ఒకటి, రెండు రోజుల్లో విడుదల చేసే అవకాశం ఉందని వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. ఇప్పటిదాకా ఇంజనీరింగ్, మెడికల్ అడ్మిషన్లలో 15 శాతం అన్‌రిజర్వ్‌డ్ సీట్లు ఏపీ విద్యార్థులకు దక్కేవి. అదే తీరులో ఏపీలోని ఉన్నత విద్యాసంస్థల్లో తెలంగాణ విద్యార్థులు చేరేందుకు అవకాశం ఉండేది. అయితే, రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏర్పాటైన కొత్త మెడికల్ కాలేజీల్లో 15 శాతం అన్‌రిజర్వ్‌డ్ కోటాను గత బీఆర్ఎస్ సర్కారు రద్దు చేసింది. కేవలం విభజన సమయానికి ఉన్న మెడికల్ కాలేజీల్లోని సీట్లకే ఆ 15 శాతం కోటా వర్తిస్తుందని జీవో తీసుకువచ్చింది. దీనిపై కొందరు ఏపీ విద్యార్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించినప్పటికీ, తెలంగాణ ప్రభుత్వానికి అనుకూలంగానే తీర్పు వచ్చింది. దాంతో పాత మెడికల్ కాలేజీల్లోని సీట్లకే 15శాతం అన్‌రిజర్వ్‌డ్ కోటా ఇప్పటి వరకూ వర్తించింది. కాగా, విభజన చట్టంలోని పదేళ్ల గడువు ఈ నెల 2వ తేదీన ముగిసిన నేపథ్యంలో ఇకపై రాష్ట్రంలోని ఉన్నత విద్యాసంస్థల్లో ఉమ్మడి ప్రవేశాలకు అవకాశం ఉండదు. ఈ మేరకు స్థానికులు ఎవరన్న అంశంపై సర్కారు స్పష్టత ఇవ్వాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన జీవో ఒకటి, రెండు రోజుల్లో విడుదల చేసేందుకు వైద్య శాఖ సిద్ధమవుతోంది. అయితే, ఏ ప్రాతిపదికన స్థానికతను నిర్ధారించారన్న అంశాలు మాత్రం ఇంకా బయటకు రాలేదు. జీవో విడుదలైతే గానీ ఆ విషయాలపై స్పష్టత రాదని వైద్య వర్గాలు తెలిపాయి. మొత్తంగా 280 సీట్లు తెలంగాణ విద్యార్థులకు దక్కుతాయని వెల్లడించాయి.

హెల్త్ వర్సిటీ వీసీ పోస్టుకు నోటిఫికేషన్

వైద్య విద్య ప్రవేశాలకు సమయం దగ్గర పడటంతో హెల్త్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పోస్టు భర్తీ ప్రక్రియను సర్కారు వేగవంతం చేసింది. వీసీ పోస్టుకు శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేసింది. రాష్ట్ర ఏర్పాటు తర్వాత హెల్త్ వర్సిటీ వీసీ పోస్టు కోసం నోటిఫికేషన్ జారీ చేయడం ఇదే తొలిసారి. అర్హులైన అభ్యర్థులు ఈనెల 22 తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది. తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి నేటి వరకు వీసీగా కరుణాకర్ రెడ్డినే కొనసాగుతూ వచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో అన్ని యూనివర్సిటీలకు కొత్తగా వీసీలను నియమిస్తోంది. అందులో భాగంగా హెల్త్ వర్సిటీ వీసీ పోస్టును కూడా భర్తీ చేస్తోంది.

టీపీసీసీ కొత్త చీఫ్ ఎవరో?

(మొదటిపేజీ తరువాయి)



ఇందుకు కారణమని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, ఎంపీ సురేష్ షెట్కార్ పేర్లు అధిష్ఠానం పరిశీలనలో ఉన్నట్టు చెబుతున్నారు. అలాగే, రాష్ట్రంలో ఎస్టీ జనాభా పది శాతానికి పైగా ఉన్న నేపథ్యంలో అధ్యక్ష పదవిని ఆ వర్గానికి కేటాయిస్తే ఎలా ఉంటుందనే చర్చ కూడా జరుగుతుందని చెబుతున్నారు. దీంతో మంత్రి సీతక్క లేదా ఎంపీ బలరాంనాయక్‌కు పదవి కేటాయించే ప్రతిపాదనపై చర్చ జరుగుతోందని సమాచారం. టీపీసీసీ చీఫ్ పదవిని ఎస్టీకి కేటాయిస్తే, బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి కార్యనిర్వాహక అధ్యక్ష పదవి ఇస్తారని అంటున్నారు. మరోపక్క, అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల టికెట్ల కేటాయింపుల్లో తమకు అన్యాయం జరగడంతో ప్రభుత్వ, పార్టీ పదవుల్లో న్యాయం చేయాలని మాదిగ సామాజికవర్గ నేతలు కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. దీంతో ఆ వర్గానికి చెందిన ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ అధ్యక్ష పదవి కోసం ప్రయత్నిస్తున్నారు. అధ్యక్ష పదవి రేసులో జగ్గారెడ్డి పేరు కూడా పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. జగ్గారెడ్డి మంచి ఆర్గనైజర్ అంటూ రాహుల్ గాంధీ ప్రశంసించడమే ఇందుకు కారణం.

ఒకరికి ఒకే పదవి నిబంధన అమలైతే...!

ప్రభుత్వ, పార్టీ పదవుల్లో ఎక్కువ మందికి ప్రాతినిధ్యం కల్పించడం కాంగ్రెస్ అధిష్ఠానం ఆలోచనగా తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఒకరికి ఒకే పదవి నిబంధనను అమలు చేసే అవకాశం ఉంది. అదే జరిగితే మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క.. ఏ పదవిని ఎంచుకుంటారు అనే చర్చ జరుగుతోంది. ఇక, ఎన్నికల్లో వరుసగా ఓటమిపాలవ్వడం మధుయాష్కీగౌడ్‌కు అధ్యక్ష పదవి రేసులో లోపం కాగా.. రాహుల్ గాంధీ కుటుంబం, అధిష్ఠానం, రేవంత్ రెడ్డితో ఉన్న సాన్నిహిత్యం సానుకూల అంశాలు. టీపీసీసీ చీఫ్‌గా బీసీతో పాటు ఎంపీ పోస్టునూ అధిష్ఠానం పరిగణనలోకి తీసుకుంటే సురేష్ షెట్కార్‌కు కలిసి రావొచ్చు. అయితే లింగాయత్ సామాజికవర్గం రాష్ట్రంలో ప్రభావితం చూపే స్థాయిలో లేకపోవడం ఆయనకు ప్రతికూలాంశం. మంత్రి పదవిని వదులుకునేందుకు సీతక్క విముఖత ప్రదర్శిస్తే ఎస్టీ లంబాడా కింద బలరాం నాయక్‌ను పదవి వరించే అవకాశం ఉందని పార్టీ వర్గాలు అంటున్నాయి. సీఎం రేవంత్‌కు సన్నిహితుడు కావడం బలరాంనాయక్‌కు సానుకూలాంశం.

ఆ నియామకం తర్వాతే విస్తరణ

టీపీసీసీ చీఫ్ నియామకం తర్వాతే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ చేపడతారని పార్టీ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. బడ్జెట్ సమావేశాలకు కొద్ది రోజుల ముందు లేదా సమావేశాల తర్వాత విస్తరణ చేపడతారని అంటున్నారు. కార్పొరేషన్ చైర్మన్ల నియామకమూ మంత్రివర్గ విస్తరణతో పాటే ఉంటుందనీ చెబుతున్నారు. టీపీసీసీ చీఫ్‌గా మంత్రుల్లో ఒకరిని తీసుకుంటే.. ఆ స్థానానికి మరొకరిని ఎంపిక చెయ్యాలి. అలాగే సామాజిక వర్గ సమకూర్పులో టీపీసీసీ చీఫ్ సామాజిక వర్గాన్నీ పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. గ్రేటర్ హైదరాబాద్ నుంచి ఒకరికి మంత్రివర్గంలో ప్రాతినిధ్యం కల్పించాలంటే దానికీ కసరత్తు చేయాల్సి ఉంటుంది. అలాగే బీఆర్ఎస్ నుంచి పెద్ద ఎత్తున ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉందనే ప్రచారం జోరుగా సాగుతోంది. అలా వచ్చే వారిలో కొందరికి మంత్రి వర్గంలో చోటు కల్పించాల్సి ఉంటుంది. ఈ సమీకరణాల నేపథ్యంలో టీపీసీసీ చీఫ్ నియామకం తర్వాతే మంత్రివర్గ విస్తరణ ఉంటుందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

కాంగ్రెస్‌లోకి రండి..!

» బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు మాజీ మంత్రి దానం పిలుపు

» సీఎంతో మాట్లాడి గౌరవం దక్కేలా చూస్తానని హామీ

బంజారాహిల్స్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు రాజకీయ మనుగడ సాధించేందుకు కాంగ్రెస్‌లో చేరాలని మాజీ మంత్రి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పిలుపినిచ్చారు. ఆత్మాభిమానం చంపుకొని బీఆర్ఎస్‌లో ఉండే కన్నా కాంగ్రెస్‌లోకి వచ్చి గౌరవంగా ఉండాలన్నారు. ‘పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు బీఆర్ఎస్‌ను వ్యతిరేకించారు. ఎమ్మెల్యేలు ఎంత పనిచేసినా ప్రజలు ఓటేయలేదు. సికింద్రాబాద్‌లో పద్మారావుగౌడ్‌కు కనీసం డిపాజిట్ దక్కలేదు. ఇలాంటి తరుణంలో రాజకీయంగా ఎదగడానికి, ప్రజాసేవ చేసేందుకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. కాంగ్రెస్‌లో చేరే అంశంపై ఆలోచించుకోవాలి. కాంగ్రెస్‌లో చేరాలనుకునే ప్రతి శాసనసభ్యుడికి తగిన గౌరవం దక్కేలా సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడే బాధ్యతను తీసుకుంటా..’ అని వ్యాఖ్యానించారు.



తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

» కోకాకోలా గ్రూప్ డైరెక్టర్‌ను కోరిన మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): అమెరికా పర్యటనలో ఉన్న మంత్రులు శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అట్లాంటాలోని కోకాకోలా హెడ్ క్వార్టర్స్‌లో ఆ కంపెనీ అంతర్జాతీయ ప్రభుత్వ సంబంధాల విభాగ గ్రూప్ డైరెక్టర్ జోనథన్ రీఫ్‌తో సమావేశమయ్యారు. శుక్రవారం జరిగిన ఈ సమావేశంలో తెలంగాణలో పెట్టుబడులు పెట్టాల్సిందిగా కోకాకోలా యాజమాన్యాన్ని మంత్రులు ఆహ్వానించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అనువైన పరిస్థితులను విజువల్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎక్కడ ప్లాంట్ స్థాపించినా అందుకు ప్రభుత్వం తరఫున సంపూర్ణ సహకారం అందేలా చర్యలు తీసుకుంటామని కోకాకోలా ప్రతినిధులకు మంత్రులు హామీ ఇచ్చారు. పెట్టుబడులకు తెలంగాణ స్వర్గధామంగా మారిందని జోనథన్‌కు వివరించారు. తెలంగాణ ప్రభుత్వం ఆహ్వానంపట్ల సానుకూలంగా స్పందించిన జోనథన్ హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నట్లు తెలిపారు. కాగా, మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలో తెలంగాణ పరిశ్రమల బృందం శుక్రవారం అట్లాంటాలో డెల్టా ఎయిర్‌లైన్స్ సీఈవో నారాయణన్ కృష్ణకుమార్‌తో సమావేశమైంది. ఈ సందర్భంగా తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు అవకాశాలున్నాయని, ప్రభుత్వం అన్ని రకాలుగా సౌకర్యాలూ కల్పిస్తుందని శ్రీధర్‌బాబు వివరించారు. ప్రజెంటేషన్‌పై సంతృప్తి వ్యక్తం చేసిన కృష్ణకుమార్, డెల్టా ఏవియేషన్ టీమ్.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు సుముఖత వ్యక్తం చేసింది. హైదరాబాద్ నుంచి అట్లాంటాకు నేరుగా విమానం నడపాలంటూ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోరగా.. డెల్టా ఎయిర్‌లైన్స్ యాజమాన్యం సానుకూలంగా స్పందించింది.

సాగునీరు, జల వనరుల ప్రభుత్వ సలహాదారుగా ఆదిత్యనాథ్



హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రిటైర్డు ఐఏఎస్ అధికారి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి(సీఎస్) ఆదిత్యనాథ్ దాస్‌ను నీటిపారుదల, జల వనరుల సలహాదారుగా తెలంగాణ ప్రభుత్వం నియమించింది. ఈమేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఆదిత్యనాథ్ దాస్ జలయజ్ఞం పథకంలోని తెలంగాణ ప్రాజెక్టులకు ఇన్‌చార్జిగా, రిటైర్డ్ ఐఏఎస్ శైలేంద్ర కుమార్ జోషి ఆంధ్రప్రదేశ్ ప్రాజెక్టులకు ఇన్‌చార్జిగా ఉండేవారు. రాష్ట్ర విభజన అనంతరం దాస్‌ను ఏపీకి కేటాయించగా, ఎస్కే జోషిని తెలంగాణకు కేటాయించారు. ఆ తర్వాత ఎస్కే జోషి తెలంగాణ సాగునీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. రిటైర్ అయిన తర్వాత జోషిని సాగునీటి పారుదల శాఖ సలహాదారుగా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం నియమించింది. ఆదిత్యనాథ్ దాస్ ఏపీ సాగునీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పని చేశారు. ఆ తర్వాత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పని చేసి రిటైర్ అయ్యారు. ప్రస్తుతం ఖాళీగా ఉన్న ఆయన్ను ఇక్కడి జల వనరుల సలహాదారుగా ప్రభుత్వం నియమించింది. తెలంగాణలో నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టిన ప్రభుత్వం పాలమూరు-రంగారెడ్డి, ఇందిరమ్మ వరద కాలువ, ముక్తేశ్వర్(చిన్న కాళేశ్వరం), ప్రాణహిత-చేవెళ్ల, శ్రీశైలం లెఫ్ట్‌బ్యాంకు కెనాల్(ఎస్ఎల్‌బీసీ) వంటి ప్రాజెక్టులను ప్రాధాన్య జాబితాలో చేర్చింది. తక్కువ వ్యయంతో అత్యధిక ఆయకట్టును అందించే ప్రాజెక్టులను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. దీంతో నీటి పారుదల ప్రాజెక్టులపై అపార అనుభవం ఉన్న దాస్ సేవలు రాష్ట్రానికి అవసరమని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

జితేందర్‌కు విజిలెన్స్ అదనపు బాధ్యతలు

» హోంశాఖ ముఖ్య కార్యదర్శిని నియమిస్తూ సీఎస్ ఉత్తర్వులు

తెలంగాణ హోంశాఖ ముఖ్య కార్యదర్శి డా. జితేందర్‌కు ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీజీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రభుత్వ నిర్ణయం మేరకు సీఎస్ శాంతి కుమారి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు జితేందర్ విజిలెన్స్ డీజీగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు. విజిలెన్స్ డీజీగా ఉన్న రాజీవ్ రతన్ ఆకస్మిక మృతితో ఆ పోస్టు ఇప్పటి వరకు ఖాళీగా ఉంది. ఎన్నికల కోడ్, ఇతర కారణాల వల్ల విజిలెన్స్ బాధ్యతలను ప్రభుత్వం ఎవ్వరికీ కేటాయించలేదు. కాగా, కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలపై విజిలెన్స్ విచారణ కీలక దశలో ఉన్న విషయం తెలిసిందే.

సీఎంఆర్ఎఫ్.. ప్రక్షాళన!

(మొదటిపేజీ తరువాయి)

ఆస్పత్రులకు మాత్రమే లాగిన్ ఐడీలు ఉండగా.. ఇకపై మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు లాగిన్ ఐడీలు ఇవ్వనున్నారు. ప్రజాప్రతినిధుల వద్ద పని చేసే సిబ్బంది ఎవరైనా అవకతవకలకు పాల్పడినా, లబ్ధిదారులను కమీషన్లు అడిగినా.. వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను రేవంత్ ఆదేశించారు. మొత్తంగా సీఎంఆర్ఎఫ్‌పై రేవంత్‌రెడ్డి ప్రత్యేకంగా దృష్టి సారించారు. అర్హులైన పేదలకే సాయం అందేలా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు.

ఆరోగ్య శ్రీకి అనుసంధానం

సీఎంఆర్ఎఫ్ చెక్కులతోపాటు లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్‌వోసీ) జారీలోనూ మరింత పారదర్శకత తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయించింది. సీఎంఆర్ఎఫ్, ఎల్‌వోసీ రెండింటినీ సదరు పేషంట్ల ఆధార్ నంబర్ ఆధారంగా ఆరోగ్యశ్రీకి అనుసంధానం చేయనున్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని జబ్బులతో ఇబ్బంది పడుతూ, చికిత్స తీసుకునేవారికి ముఖ్యమంత్రి విచక్షణ మేరకు లెటర్ ఆఫ్ క్రెడిట్ (ప్రభుత్వం తరఫున చెల్లిస్తామని ఆస్పత్రికి గ్యారెంటీ) ఇస్తారు. కొన్ని జబ్బులు ఆరోగ్య శ్రీ పరిధిలోకి వచ్చినా.. పేషంట్లు కూడా కొంత ఖర్చు పెట్టాల్సి ఉంటుంది. అలాంటప్పుడు సదరు పేషంట్లు చికిత్స కోసం ఖర్చు చేసిన మొత్తాన్ని ఆస్పత్రుల దగ్గర బిల్లులు తీసుకుని సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకుంటుంటారు. ఒక్కోసారి బిల్లులు సరిగా లేకపోతే కొన్ని దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యేవి. ఆ విధానానికి ప్రస్తుత ప్రభుత్వం స్వస్తి పలకనుంది. దరఖాస్తులను పరిశీలించి.. ఆరోగ్య శ్రీ ద్వారా ఎంత మేర నిధులు చికిత్సకు పొందారు? ఎంత మేర సొంతంగా ఖర్చు చేశారనేది తేల్చి.. ఆర్థిక సాయం అందించనుంది.

ఇక నుంచి ఐడీ నంబరే కీలకం..

గత ప్రభుత్వం హయాంలో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ పకడ్బందీగా జరగలేదన్న విమర్శలున్నాయి. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీల దగ్గర పని చేసే సిబ్బంది... లబ్ధిదారుల దగ్గర కమీషన్ల కోసం కక్కుర్తి పడేవారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇకపై అలాంటి అవకతవకలు, కమీషన్లకు ఆస్కారం లేకుండా ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించింది. ఇందుకోసం ప్రజాప్రతినిధుల స్థాయిలోనే ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టనుంది. ప్రజాప్రతినిధులకు ఒక లాగిన్ ఐడీని ఇచ్చి.. వారి దగ్గరకు వచ్చే పేషంట్ల వివరాలను సీఎంఆర్ఎఫ్ పోర్టల్‌లో నమోదు చేయించనున్నారు. దాంతో దరఖాస్తు నమోదు ప్రక్రియ పూర్తవ్వగానే అటు పేషంట్‌కు, ఇటు ప్రజాప్రతినిధి ఇద్దరి ఫోన్ నంబర్లకు ఒక ఐడీ నంబర్ మెసేజ్ వస్తుంది. అలా వచ్చిన ఐడీ నెంబరే.. లబ్ధిదారులకు చెక్కు అందే వరకు కీలకం. పోర్టల్‌లో ఐడీ నెంబర్ ఎంటర్ చేయగానే దరఖాస్తు ఏ స్థాయిలో ఉందనే వివరాలు తెలుసుకోవచ్చు. తద్వారా పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. కాగా, రాష్ట్రంలో మూడు నెలల నుంచి ఎన్నికల కోడ్ అమల్లో ఉండడంతో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ ప్రక్రియ నిలిచిపోయింది. ఇప్పుడు కోడ్ ముగియడంతో మంజూరైన చెక్కులను పంపిణీ చేయనున్నారు. దాదాపు 65వేల చెక్కులు అన్ని రకాల విచారణలను పూర్తి చేసుకుని లబ్ధిదారులకు అందించేందుకు సిద్ధంగా ఉండగా, 25వేల చెక్కులు ఆస్పత్రుల దగ్గర విచారణలో, మరో 25వేల చెక్కులు వివిధ స్థాయిల్లో ప్రాసెస్‌లో ఉన్నాయి.

కవిత పాత్రపై సీబీఐ సప్లిమెంటరీ చార్జిషీట్

» పరిగణనలోకి తీసుకునే అంశంపై జూలై 6న విచారణ

» జ్యుడీషియల్ కస్టడీ 21 వరకూ పొడిగింపు

న్యూఢిల్లీ, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పాత్రపై సీబీఐ సప్లిమెంటరీ ఛార్జిషీట్ దాఖలు చేసింది. ఢిల్లీ మద్యం కుంభకోణంలో కవిత పాత్ర, అందుకు సంబంధించిన సాక్ష్యాలతో కూడిన సప్లిమెంటరీ చార్జిషీట్‌ను దాఖలు చేసినట్టు సీబీఐ శుక్రవారం రౌస్‌అవెన్యూ కోర్టుకు తెలిపింది. దానిని పరిగణనలోకి తీసుకోవాలని న్యాయస్థానాన్ని కోరింది. ఈ అంశంపై జూలై 6న విచారణ చేపడతామని న్యాయమూర్తి కావేరి భవేజా తెలిపారు. ఢిల్లీ మద్యం విధానం కేసులో కవితను మార్చి 15న హైదరాబాద్‌లోని ఆమె నివాసంలోనే ఈడీ అరెస్టు చేసింది. 16న ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరిచింది. కవిత తిహాడ్ జైలులో ఉండగానే ఏప్రిల్ 11న సీబీఐ అరెస్టు చేసినట్టు ప్రకటించింది. ఆ తర్వాత కవిత బెయిల్ పిటిషన్ దాఖలు చేయగా రౌస్‌అవెన్యూ కోర్టు తిరస్కరించింది. ట్రయల్ కోర్టు తీర్పును కవిత హైకోర్టులో సవాల్ చేశారు. ఇరు వర్గాల వాదనలు విన్న న్యాయస్థానం తీర్పును రిజర్వ్‌లో పెట్టింది. అయితే ఢిల్లీ మద్యం కేసులో కవితను ముందు సాక్షిగా మాత్రమే దర్యాప్తు సంస్థలు విచారించాయి. ఆ తర్వాత ఆమెను నిందితురాలిగా పేర్కొంటూ ఇటీవలే ఈడీ సప్లిమెంటరీ ఛార్జిషీట్ దాఖలు చేయగా ఈ నెల 3న పరిగణనలోకి తీసుకుంటున్నట్టు న్యాయస్థానం తెలిపింది. ఇప్పుడు సీబీఐ దాఖలు చేసిన సప్లిమెంటరీ చార్జిషీట్‌ను కూడా పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. గతంలో విధించిన కస్టడీ ముగియడంతో శుక్రవారం కవితను జైలు అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరుపరిచారు. సీబీఐ విజ్ఞప్తి మేరకు కవిత జ్యుడీషియల్ కస్టడీని జూన్ 21 వరకు పొడిగిస్తున్నట్టు న్యాయమూర్తి కావేరి భవేజా వెల్లడించారు.

18,495 పదోన్నతులు.. 12,472 బదిలీలు!

(మొదటిపేజీ తరువాయి)



ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి శుక్రవారం విద్యాశాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం, ఇతర ఉన్నతాధికారులతో సచివాలయంలో సమావేశమయ్యారు. సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశంలో బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. నిరుడు పలు అంశాలపై అభ్యంతరాలు వ్యక్తమైన నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పూర్తి పారదర్శకంగా చేపట్టాలని అధికారులను సీఎం ఆదేశించారు. కాగా ఈ ప్రక్రియలో మొత్తంగా 12,472 మంది ఉపాధ్యాయులను బదిలీ చేయనున్నారు. ఇందులో 1,788 గ్రేడ్-2 గెజిటెడ్ హెడ్ మాస్టర్లు, 10,684 స్కూల్ అసిస్టెంట్, తత్సమాన హోదాగల ఉపాధ్యాయులు (మల్టీజోన్-1, 2, ప్రభుత్వ యాజమాన్య మల్టీజోన్-1 పరిధిలోని ఎంపీపీ, జెడ్పీపీ యాజమాన్య ఉపాధ్యాయులు ఉన్నారు. ఈ బదిలీలతో మల్టీజోన్-1, 2 పరిధిలోని ప్రభుత్వ, ఎంపీపీ, జెడ్పీపీ యాజమాన్యాల మొత్తం 1250 మంది గ్రేడ్-2 గజిటెడ్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతులపై ప్రభావం పడనుంది. 18,495 ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వనున్నారు. ఇందులో 763 గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులు, 5,123 స్కూల్ అసిస్టెంట్లు, 2,130 ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, 10,479 భాషాపండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్ భాషా పండితులు, స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ ఉపాధ్యాయులుగా ప్రమోషన్ పొందనున్నారు.

నేటి నుంచి 23 రోజుల పాటు..

బదిలీలు, పదోన్నతులకు సంబంధించిన షెడ్యూల్‌ను విద్యాశాఖ విడుదలచేసింది. స్కూల్ అసిస్టెంట్, తత్సమాన హోదా ఉన్న ఉపాధ్యాయుల పదోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితా, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ ఖాళీల వివరాలు, బదిలీల పాయింట్ల వివరాలను ఈనెల 8, 9న ప్రదర్శించాలని విద్యాశాఖ కమిషనర్ జారీచేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 10, 11 తేదీల్లో అభ్యంతరాల స్వీకరణ, పరిష్కరణ, 12న పదోన్నతులకు సంబంధించిన సీనియారిటీ జాబితా ప్రదర్శిస్తారు. 13-16న ఆన్‌లైన్‌లో వెబ్ ఆప్షన్లు పూర్తి చేసి పదోన్నతుల ఉత్తర్వులు అందజేస్తారు. బదిలీలతో ఖాళీ కానున్న ఎస్జీటీ, తత్సమాన ఖాళీల వివరాలను 17న, బదిలీలకు సంబంధించిన తుది జాబితా 18-20లోపు ప్రకటిస్తారు. 21-22లోపు మల్టీజోన్-1 పరిధిలోని జెడ్పీ, ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని ఎస్జీటీలు, తత్సమాన హోదాగలఉపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు అందిస్తారు. మల్టీజోన్ పరిధిలోని ఈ ప్రక్రియ అంతా 15 రోజుల్లో పూర్తి చేయనున్నారు. మల్టీజోన్-2కి సంబంధించిన ప్రక్రియ శనివారంతో ప్రారంభమై 23 రోజుల పాటు కొనసాగి ఈనెల 30న ముగియనుంది. కాగా, బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను పునః ప్రారంభించడం పట్ల టీఎస్ యూటీఎఫ్ హర్షం వ్యక్తం చేసింది. ఈ షెడ్యూల్ సజావుగా సాగడానికి ఉపాధ్యాయులు సహకరించాలని కోరింది. ఈ మేరకు శుక్రవారం ఓ ప్రకటనలో టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. జంగయ్య, చావ రవి పేర్కొన్నారు.

హోమియోపతి కళాశాలలో ఊడిన స్లాబ్ పెచ్చులు

» వైద్య విద్యార్థిని, నర్సుకు స్వల్ప గాయాలు

రామంతాపూర్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): రామంతాపూర్ ప్రభుత్వ హోమియోపతి ఆస్పత్రి పురుషుల వార్డులో శుక్రవారం అకస్మాత్తుగా స్లాబ్ పెచ్చులు ఊడి పడ్డాయి. ఈ ఘటనలో హోమియో పీజీ వైద్య విద్యార్థిని స్నేహిత తలకు గాయమై రక్తస్రావం కావడంతో చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా కుట్లు వేశారు. స్వల్ప గాయాలపాలైన హెడ్‌నర్సు సునీతకు ప్రాథమిక చికిత్స అందించారు. ప్రస్తుతం ఇద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని ఆస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మీదేవి వెల్లడించారు. ఆయుష్ విభాగం అధికారుల నిర్లక్ష్యం, పట్టింపు లేని ధోరణి కారణంగా ఆస్పత్రిలో ఈ ఘటన చోటు చేసుకుందని పలువురు హోమియో వైద్య విద్యార్థులు ఆరోపించారు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని విధులు నిర్వహిస్తున్నామని పీజీ వైద్య విద్యార్థులు, నర్సింగ్ సిబ్బంది వాపోయారు. ఆయుష్ అధికారులు ఇకనైనా స్పందించి పురాతన ఆస్పత్రి భవనం పునరుద్ధరణ కోసం వెంటనే చర్యలు చేపట్టాలని విద్యార్థులు, సిబ్బంది కోరుతున్నారు.


హోమియోపతి కళాశాలలో ఊడి పడిన స్లాబ్ పెచ్చులు

నేడు చేప ప్రసాదం పంపిణీ

అఫ్జల్‌గంజ్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): మృగశిర కార్తెను పురస్కరించుకొని హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో శనివారం ఉదయం 11 గంటలకు చేప ప్రసాదం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. 32 కౌంటర్ల ద్వారా చేప ప్రసాదం పంపిణీ చేసేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మత్స్య శాఖ అధికారులు చేప పిల్లలను ఒక్కొక్కటి రూ.40 చొప్పున విక్రయిస్తున్నారు. ఇందుకోసం ముందుగా టోకెన్లు ఇస్తున్నారు. ఈ చేప ప్రసాదం కోసం రెండు రోజుల ముందే ఎగ్జిబిషన్ మైదానంలో పలు రాష్ట్రాల నుంచి వేలాది మంది ఆస్తమా రోగులు తరలివచ్చారు.

రాధాకిషన్‌రావుకు ఎస్కార్ట్ బెయిల్

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి) : ఫోన్ ట్యాపింగ్ కేసులో నిందితుడిగా ఆరోపణలు ఎదుర్కొంటున్న టాస్క్‌ఫోర్స్ మాజీ డీసీపీ(ఓఎస్డీ) రాధాకిషన్ రావుకు నాంపల్లి కోర్టు ఐదు రోజుల పాటు ఎస్కార్ట్ బెయిల్ మంజూరు చేసింది. రాధాకిషన్‌రావు తల్లి సరోజినీ దేవి గత సోమవారం మృతి చెందిన విషయం తెలిసిందే. తల్లి దశదినకర్మ, ఇతర కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉన్నందున 5 రోజులు బెయిల్ మంజూరు చేయాలని రాధాకిషన్ రావు తరఫు న్యాయవాది కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇరు పక్షాల వాదనల అనంతరం కోర్టు.. రాధాకిషన్‌రావుకు 10 నుంచి 14 వ తేదీ వరకు ఎస్కార్ట్ బెయిల్‌ను మంజూరు చేసింది.

మహాకవి శ్రీశ్రీ కుమారుడు కన్నుమూత

హైదరాబాద్ సిటీ, గుంటూరు(తూర్పు), జూన్ 7: మహాకవి శ్రీశ్రీ కుమారుడు శ్రీ రంగం వెంకటరమణ(59) అనారోగ్య కారణాలతో కన్నుమూశారు. ఈమేరకు ఆయన బంధువు రమణ యశస్వి గుంటూరులో శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీ రంగం వెంకటరమణ కుటుంబం పాతికేళ్ల క్రితం అమెరికాలో స్థిరపడింది. అక్కడి ఫైజర్ కంపెనీలో వెంకటరమణ పరిశోధన విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడికి శ్రీనివాసరావు(శ్రీ శ్రీ), కుమార్తెకు శ్రీశ్రీకి ఇష్టమైన 'కవిత' పేరును పెట్టుకున్నారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న వెంకటరమణ న్యూలండన్‌లోని లారెన్స్ అండ్ మెమోరియల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు. న్యూలండన్‌లోని ఓ స్మశాన వాటికలో జూన్ 6న ఆయన అంత్యక్రియలు పూర్తయ్యాయి. వెంకటరమణ మరణం పట్ల శ్రీశ్రీ అభిమానులు, సాహితీవేత్తలు విచారం వ్యక్తం చేశారు.


శ్రీ రంగం వెంకటరమణ (ఫైల్)

గ్రూప్-1 పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్(టీజీపీఎస్సీ) ఈ నెల 9న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు పోలీస్ శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ఈ పరీక్ష నిర్వహణకు భద్రతాపరంగా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు అధికారులు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాల వద్ద ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి పరీక్ష కేంద్రంలోకి అభ్యర్థుల్ని అనుమతిస్తారు. ఉదయం 10 గంటల తర్వాత ఒక్క సెకను ఆలస్యమైనా అభ్యర్థుల్ని పరీక్ష కేంద్రంలోకి అనుమతించరు. హాల్‌టికెట్‌తోపాటు ఒక కలర్ ఫొటో, ఏదో ఒక గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకురావాలని అధికారులు సూచించారు. హాల్ టికెట్‌లో ఫొటో స్పష్టంగా కనిపించని అభ్యర్థులు 3 కలర్ ఫొటోలు తీసుకురావడంతోపాటు హాల్ టికెట్‌పై గెజిటెడ్ అధికారి సంతకం చేయించాలని లేదంటే తనిఖీల సమయంలో పోలీసులు అభ్యర్థుల్ని పరీక్ష కేంద్రంలోకి అనుమతించరని అధికారులు స్పష్టం చేశారు.

అన్నంలో వ్యర్థాలు...పురుగులు

» గతంలో గర్ల్స్ హాస్టల్‌లో...ఇప్పుడు బాయ్స్ హాస్టల్‌లో

» నిరసనకు దిగిన మల్లారెడ్డి వర్సిటీ విద్యార్థులు

మేడ్చల్ టౌన్, జూన్ 7: తినే అన్నంలో వ్యర్థాలు.. పురుగులు వచ్చాయంటూ మల్లారెడ్డి యూనివర్సిటీ బాలుర హాస్టల్ విద్యార్థులు నిరసనకు దిగారు. రెండు నెలల క్రితం బాలికల హాస్టల్‌లో అన్నంలో పురుగులు వచ్చాయంటూ విద్యార్థినులు ఆందోళన చేసినప్పటికీ తీరు మారలేదని, లక్షల రూపాయలు వసూలు చేస్తూ నాణ్యత లేని ఆహారం పెడుతున్నారంటూ విద్యా యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా గుండ్లపోచంపల్లి పరిధిలోని మల్లారెడ్డి యూనివర్సిటీ బాయ్స్ హాస్టల్‌లో గురువారం రాత్రి విద్యార్థులు ఆందోళనకు దిగారు. అన్నంలో ప్లాస్టిక్ ముక్కలు, రబ్బర్ బ్యాండ్‌లు, పురుగులు రావటంతో హాస్టల్ సిబ్బందిని నిలదీశారు. యాజమాన్యం స్పందించక పోవటంతో రాత్రి 9 గంటలకు హాస్టల్ ఎదుట బైఠాయించి ఆందోళకు దిగారు. శుక్రవారం ఉదయం మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని వర్సిటీ అధికారులు హామీ ఇవ్వటంతో విద్యార్థులు శాంతించారు. కానీ శుక్రవారం యాజమాన్యం స్పందించక పోవడంతో విద్యార్థులు తిరిగి హాస్టల్ ముందు ఆందోళన చేపట్టారు. కాగా, కొందరు కావాలని యూనివర్సిటీని అప్రతిష్ట పాలు చేయటానికి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నారని యాజమాన్యం ఆరోపించింది.

వ్యవసాయ శాఖలో నలుగురిపై సస్పెన్షన్ వేటు

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ శాఖలోని నలుగురు అధికారులపై సస్పెన్షన్ వేటు పడింది. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండల వ్యవసాయాధికారి (ఏవో) కె.సోమకుమార్ యాదవ్‌తో పాటు తొర్రూరు, అమ్మాపురం, హరిపిరాల క్లస్టర్ల ఏఈవోలు ఎం.జమున, అజ్మీరా దీపిక, సిహెచ్.అరవింద్‌లను సస్పెండ్ చేస్తూ శాఖ డైరెక్టర్ బి.గోపి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రైతులకు సబ్సిడీపై అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలు ఏవోల బ్లాక్ మార్కెట్ దందా కారణంగా పక్క రాష్ట్రానికి తరలుతున్న వ్యవహారంపై 'ఏపీ వ్యాపారులతో.. ఏవోల మిలాఖత్' శీర్షికన జూన్ 4న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఆ కథనాన్ని పరిగణనలోకి తీసుకున్న శాఖ ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. దీనిపై దర్యాప్తు జరిపిన విచారణాధికారి ఓ నివేదికను ప్రభుత్వానికి సమర్పించారు. రహస్యంగా ఉంచాల్సిన శాఖ పోర్టల్‌కు (ఓఎస్ఎస్‌డీఎస్) సంబంధించిన లాగిన్ ఐడీని మండల వ్యవసాయాధికారి సోమకుమార్ ఏఈవోలకు ఇచ్చారని ఆ నివేదికలో పేర్కొన్నారు. ఆ లాగిన్ ఐడీని సాయంతోనే ఏఈవోలు పచ్చిరొట్ట విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించారని వివరించారు. ఆ నివేదికను పరిశీలించిన శాఖ ఉన్నతాధికారులు సంబంధిత వ్యవసాయాధికారులను సస్పెండ్ చేశారు.

3-4 రోజుల్లో రాష్ట్రమంతా 'నైరుతి'!

» నేడు, రేపు మోస్తరు వర్షాలు..

» వనపర్తి జిల్లా రేవల్లిలో 9.8 సెం.మీ.

» పిడుగుపాటుకు ముగ్గురి మృతి



(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్): వచ్చే మూడు, నాలుగు రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రమంతటా విస్తరించే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. శుక్రవారం మెదక్, భద్రాచలం గుండా రుతుపవనాలు వ్యాపించినట్లు తెలిపింది. ఒక రెండు రోజుల్లో మరికొన్ని ప్రాంతాలకు విస్తరించడానికి పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని పేర్కొంది. గురువారం రాయలసీమ, దాని పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైన ఉన్న ఉపరితల ఆవర్తనం.. శనివారం తెలంగాణ దాని పరిసర ప్రాంతాల్లో సగటు సముద్ర మట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో కేంద్రీకృతమై ఉందని వెల్లడించింది. శని, ఆదివారాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో వీచే ఈదురుగాలులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశముందని వివరించింది.

అక్కడక్కడ వర్షాలు.. పిడుగులు

ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్‌తో పాటు పలు ప్రాంతాల్లో శుక్రవారం మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. పిడుగులు పడి ముగ్గురు మృతి చెందారు. వనపర్తి జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం గంట పాటు వాన దంచికొట్టింది. ఆ జిల్లాలోని అమరచింత, వనపర్తి, రేవల్లి, పాన్‌గల్ మండలాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. రేవల్లిలో 9.8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. వికారాబాద్ జిల్లా తాండూరు ఏఆర్ఎస్ ప్రాంతంలో 4.8 సెం.మీ., అదే జిల్లా బషీరాబాద్‌లో 4.2 సెం.మీ.రికార్డయింది. పరిగి సబ్ డివిజన్‌లో చెట్లు విరిగిపడి విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడింది. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం విఠలాపూర్‌లో పొలంలో పత్తి విత్తనాలు నాటుతుండగా పిడుగు పడగా.. బోరబండ ఆశన్న (58), ఆయన మరదలు బోరబండ కౌసల్య (54) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటనలో ఆశన్న భార్య సైదమ్మ, ఆయన మనుమరాలు శ్రావణికి గాయాలయ్యాయి. నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలోని దుర్గానగర్ తండాలో జాదవ్ కృష్ణ (14) పొలం వద్ద పనులు చేస్తుండగా.. పిడుగు పడటంతో అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు.

పట్టభద్రుల ఎమ్మెల్సీగా మల్లన్న

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా ఉన్న పల్లా రాజేశ్వర్‌రెడ్డి.. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున జనగామ ఎమ్మెల్యేగా గెలవడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ స్థానానికి మే 27న పోలింగ్ జరగ్గా.. బుధవారం ఉదయం కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. మొత్తం 4,63,839 ఓట్లకు 3,36,013 ఓట్లు పోలయ్యాయి. ఇందులో 25,824 ఓట్లు చెల్లకుండా పోయాయి. మొదటి ప్రాధాన్య ఓట్ల లెక్కింపు పూర్తయ్యేటప్పటికి కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్నకు 1,22,813 ఓట్లు దక్కగా, బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి 1,04,248, బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డికి 43,318, స్వతంత్ర అభ్యర్థి పాలకూరి అశోక్‌కు 29,697 ఓట్లు వచ్చాయి. మొదటి ప్రాధాన్యంలో ఎవరికీ 'కోటా' ఓటు 1,55,095 రాకపోవడంతో ఎలిమినేషన్ పద్ధతిలో ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు చేపట్టారు. శుక్రవారం రాత్రి వరకు మూడో స్థానంలో ఉన్న ప్రేమేందర్ రెడ్డి ఎలిమినేషన్ ప్రక్రియ కొనసాగగా.. కాంగ్రెస్ అభ్యర్థి తీన్మార్ మల్లన్న దాదాపు 18వేల ఓట్లతో ముందంజలో ఉన్నారు. కోటా ఓటు రాకపోవడంతో ఎన్నికల నిబంధనల ప్రకారం మల్లన్నను విజేతగా ప్రకటించేందుకు ఎన్నికల కమిషన్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి(సీఈవో)ని కోరుతూ రిటర్నింగ్ అధికారి దాసరి హరిచందన లేఖ పంపారు. చివరకు సీఈవో అనుమతితో ఎమ్మెల్సీగా మల్లన్న గెలుపొందినట్లు ఆర్వో ప్రకటించారు.


ఎమ్మెల్సీగా గెలిచిన మల్లన్నకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న ఆర్వో హరిచందన

బీఆర్ఎస్ ఆశలు గల్లంతు

స్వతంత్ర అభ్యర్థి అశోక్‌కుమార్, బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఎలిమినేట్ అయితే.. వారి బ్యాలెట్లలో తమకు ద్వితీయ ప్రాధాన్యత ఓట్లు అధికంగా వస్తాయని భావించిన బీఆర్ఎస్ ఆశలు గల్లంతయ్యాయి. బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డికి బీజేపీ క్యాడర్‌తో సన్నిహిత సంబంధాలు ఉండడం, ఆయన ఇటీవలి వరకు బీజేపీలో క్రియాశీలకంగా పని చేసి ఉన్న నేపథ్యంలో బీజేపీకి మొదటి ప్రాధాన్య ఓటేసిన ఓటర్లలో సింహభాగం ద్వితీయ ప్రాధాన్య ఓటును రాకేశ్‌రెడ్డికి వేస్తారని భావించారు. అయితే, ఆ ఓట్లు రాకేశ్‌కు ఏకపక్షంగా పడలేదు. రాకేశ్‌తో సమానంగా మల్లన్నకు ఓట్లు దక్కాయి. చివరి వరకూ ఆధిక్యంలో ఉన్న మల్లన్ననే విజయం వరించింది.

మూడో ప్రయత్నంలో ఎమ్మెల్సీగా ఎన్నిక


జర్నలిస్టుగా, ప్రశ్నించే గొంతుకగా చిరపరిచితుడైన తీన్మార్ మల్లన్న ఎట్టకేలకు మూడో ప్రయత్నంలో ఎమ్మెల్సీగా విజయం సాధించారు. 2015లో మొదటిసారి కాంగ్రెస్ అభ్యర్థిగా ఆయన బరిలో నిలిచి ఓటమిపాలయ్యారు. ఆతర్వాత 2021లో స్వతంత్ర అభ్యర్థిగా బరిలో దిగి బీఆర్ఎస్‌కు బలమైన పోటీ ఇచ్చారు. మూడో ప్రయత్నంలో ఇప్పుడు కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో ఉండి విజయం సాధించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంతో నేరుగా కొట్లాడిన క్రమంలో మల్లన్నపై 59వరకు కేసులు నమోదయ్యాయి.

ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు : మల్లన్న

విజయం ఖాయం కావడంతో రాత్రి పది గంటల సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి మల్లన్న కౌంటింగ్ హాల్ బయటకు వచ్చి విజయసంకేతం చూపారు. ద్వితీయ ప్రాధాన్య ఓట్ల లెక్కింపు తర్వాత కూడా తాను 18వేల పైచిలుకు మెజార్టీతో ఉన్నానని, లాంఛనాలు పూర్తయ్యాక అధికారికంగా ప్రకటిస్తారని వెల్లడించారు. తన గెలుపునకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రకటన రాకముందే ఉమ్మడి జిల్లాలో కాంగ్రెస్ శ్రేణులు సంబరాలు జరుపుకోగా, సోషల్‌మీడియాలో శుభాకాంక్షల వెల్లువ కొనసాగింది.

నైతిక విజయం నాదే: రాకేశ్‌రెడ్డి

తాను సాంకేతికంగా ఓడినా, నైతికంగా తనదే గెలుపని బీఆర్ఎస్ అభ్యర్థి రాకేశ్‌రెడ్డి పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ చట్టసభలో అడుగుపెట్టలేకపోయినా ప్రజల తరుపున ప్రభుత్వంతో పోరాడుతూనే ఉంటానని ప్రకటించారు. తన గెలుపుని అన్ని రాజకీయ పార్టీలు కోరుకున్నాయని, జేడీలక్ష్మీనారాయణవంటి మేధావులు తనకు మద్దతు ఇచ్చారని తెలిపారు. వారందరికీ కృతజ్ఞతలు చెప్పారు. 12ఏళ్లుగా ప్రజల కోసం పనిచేస్తున్నానని, బీఆర్ఎస్ శ్రేణులు ఎన్నికల్లో పోరాటపటిమ చూపారని కొనియాడారు.



రామోజీరావుకు వెంటిలేటర్‌పై చికిత్స

» బీపీ పెరిగి తీవ్ర అస్వస్థతకు లోనైన ఈనాడు సంస్థల అధినేత

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): ఈనాడు సంస్థల అధినేత చెరుకూరి రామోజీరావు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. కొద్ది రోజులుగా అస్వస్థులుగా ఉండటం, బీపీ నియంత్రణ లేకపోవడంతో ఆయన్ను హైదరాబాద్ నానక్‌రామ్ గూడలోని స్టార్ ఆస్పత్రికి తరలించారు. గురువారం ఆయన గుండెకు స్టెంట్ వేశారు. రక్తపోటు నియంత్రణలోకి వచ్చినప్పటికీ ఇతర సమస్యలు తలెత్తడంలో ఆయన్ను వెంటిలేటర్‌పై ఉంచి వైద్యులు చికిత్స అందిస్తున్నారు. కొన్నేళ్ల క్రితం ఆయన కోలన్ క్యాన్సర్ బారినపడి చికిత్స తీసుకొని కోలుకున్నారు. ఆ తర్వాత విధులకు కూడా హాజరవుతున్నారు. రామోజీ రావు వయసు 88 సంవత్సరాలు. వయసు రీత్యా పలు అనారోగ్య సమస్యలను ఆయన ఎదుర్కొంటున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ఆయన నాలుగు రోజుల క్రితం వరకు మామూలుగానే ఉన్నట్లు సమాచారం.

10న జయశంకర్ వర్సిటీ స్నాతకోత్సవం

హైదరాబాద్, జూన్ 7(ఆంధ్రజ్యోతి): ఈనెల 10న ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయ స్నాతకోత్సవం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ కార్యదర్శి, ఇన్‌చార్జి వీసీ రఘునందన్‌రావు తెలిపారు. తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ అధ్యక్షతన ఆ కార్యక్రమం జరగనుందని ఆయన చెప్పారు. ఆ సందర్భంగా 587 మంది విద్యార్థులకు అండర్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు, 165 మంది విద్యార్థులకు పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు, 11 మంది పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులు, 8 మంది యూజీ విద్యార్థులకు బంగారు పతకాలను అందిచనున్నట్లు రఘునందన్‌రావు తెలిపారు.

విదేశాల్లో ఉపాధి.. పేదరికంతో సమాధి!

» రైలుకు ఎదురెళ్లి యువకుడి ఆత్మహత్య

» రష్యా వెళ్లేందుకు రెండుసార్లు చాన్సొచ్చినా అడ్డొచ్చిన పేదరికం

» తండ్రి ఆటో డ్రైవర్.. పుట్టని అప్పు

» ఆవేదనతో సోదరికి మెసేజ్ పెట్టి ఆత్మహత్య

» నల్లగొండ జిల్లా లో విషాద ఘటన

నల్లగొండ టౌన్, జూన్ 7: జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని భావించిన తన ఆకాంక్షలకు పేదరికం అడ్డొచ్చిందని.. విదేశాల్లో శిక్షణ, ఉపాధి కోసం అవసరమైన డబ్బును సమకూర్చుకోలేకపోయానన్న ఆవేదనతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. రష్యాలో శిక్షణ పొందేందుకు రెండుసార్లు అవకాశం వచ్చినా ఆ రెండుసార్లు కేవలం డబ్బు లేక అవకాశం చేజారిందన్న ఆవేదనతో దూసుకొస్తున్న రైలుకు ఎదురువెళ్లాడు. రైలు ఢీకొట్టడంతో ముఖం ఛిద్రమై అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. నల్లగొండ జిల్లా కేంద్రం సమీపంలోని ఐటీ టవర్స్ వద్ద ఈ విషాద ఘటన జరిగింది. మృతుడు 20 ఏళ్ల కొడిదల శివమణి చందనపల్లి గ్రామ వాస్తవ్యుడు. తండ్రి శంకర్ ఆటో డ్రైవర్. శంకర్‌కుశివమణితో పాటు ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తెకు పెళ్లయింది. శివమణి వికారాబాద్‌లో అగ్రికల్చర్ డిప్లొమా పూర్తిచేశాడు. మూడు నెలలుగా శంకర్‌పల్లిలోనే ఉంటూ సమీపంలోని వ్యవసాయ సంబంధిత పరిశ్రమలో పనిచేస్తున్నాడు. హైదరాబాద్‌కు చెందిన టాంకాం కంపెనీ ద్వారా బీఎస్సీ నర్సింగ్‌లో ఉపాధి శిక్షణ కూడా పొందాడు. ఆ శిక్షణ ద్వారా రష్యాలో ఉపాధి అవకాశం కల్పించడం కోసం నోటిఫికేషన్ వెలువడింది. శివమణి దరఖాస్తు చేసుకోగా అందులో సెలెక్ట్ అయ్యాడు. శిక్షణతో పాటు వీసాకు రూ.3.5లక్షల నుంచి రూ.4 లక్షల వరకు అవసరపడ్డాయి. కుమారుడి కోసం డబ్బు సమకూర్చేందుకు తల్లిదండ్రులు ప్రయత్నించినా ఎక్కడా అప్పు పుట్టలేదు. ఆరు రోజుల క్రితం శివమణి సొంతూరొచ్చాడు. తండ్రి శంకర్ డబ్బుల కోసం నాలుగు రోజులుగా ప్రయత్నం చేసినా ఎక్కడా అప్పు పుట్టలేదు. ఆరు నెలల క్రితం కూడా రష్యాలో బీఎస్సీ నర్సింగ్ చేసేందుకు శివమణి ప్రయత్నించగా సీటు లభించింది. ఆ సమయంలోనూ డబ్బులు అందకపోవడంతో వెళ్లలేకపోయాడు. ఇలా రెండుసార్లు విఫలమవటంతో మనోవేదనకు గురైన శివమణి శుక్రవారం ఇంట్లోంచి బయటకు వెళ్లాడు. నల్లగొండ-శేరాంపురం మధ్యలో ఐటీ టవర్స్ వద్ద గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నాడు. అంతకుముందు 'అక్కా.. క్షమించు. నేను చనిపోతున్నా' అంటూ తన సోదరి సెల్‌ఫోన్‌కు మెసేజ్ పెట్టాడు. ఆత్మహత్య చేసుకుంటున్న లోకేషన్‌ను షేర్ చేశాడు. ఆమె వెంటనే తండ్రికి సమాచారమివ్వటంతో ఆయన ఆటోలో అక్కడికి వెళ్లగా అప్పటికే శివమణి పట్టాల పక్కన విగతజీవిగా పడి ఉన్నాడు. కుమారుడి మృతితో ఆ ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి.


శివమణి (ఫైల్)

వరి సాగులో దేశంలో అగ్రగామిగా తెలంగాణ!

» ఇక్కడి ధాన్యానికి ఇతర దేశాల్లో మంచి డిమాండ్

» గ్లోబల్ రైస్ సమ్మిట్‌లో మంత్రి తుమ్మల

» రాష్ట్రంలో అత్యుత్తమ రకాల ధాన్యం ఉత్పత్తి: మంత్రి ఉత్తమ్

హైదరాబాద్, జూన్ 7 (ఆంధ్రజ్యోతి): వరిసాగులో దేశంలో తెలంగాణ అగ్రగామిగా ఉందని, వరి విస్తీర్ణం కొంతకాలంగా గణనీయంగా పెరుగుతోందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. నిరుడు 12 మిలియన్ ఎకరాల్లో రైతులు వరి సాగుచేయగా 26 మిలియన్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయిందని తెలిపారు. రాష్ట్రంలో వరిసాగుకు అనుకూల వాతావరణ పరిస్థితులున్నాయని, 220 రకాల విత్తనాలు రాష్ట్రంలో సాగులో ఉన్నాయని, ఇందులో 60 శాతం ముతక రకాలు, 40 శాతం ఫైన్, సూపర్ ఫైన్ వెరైటీలు ఉన్నాయని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకాల వరిసాగును ప్రోత్సహించేందుకు ఈ సీజన్ నుంచి క్వింటాకు రూ. 500 బోనస్ ప్రకటించిందని వెల్లడించారు. ఇంటర్నేషనల్ కమోడిటీ ఇనిస్టిట్యూట్ (ఐసీఐ) ఆధ్వర్యంలో హైదరా బా ద్ లో శుక్రవారం నిర్వహించిన గ్లోబల్ రైస్ సమ్మిట్-2024లో పాల్గొని మంత్రి తుమ్మల మాట్లాడారు. తెలంగాణ నుంచి ఫిలిప్పైన్స్ అమెరికా, బంగ్లాదేశ్, యూఏఈ, ఉత్తర కొరియా దేశాలకు బియ్యం ఎగుమతి అవుతోందని చెప్పారు. సోనామసూరి, సాంబ మసూరి, హెచ్‌ఎంటీ, ఎంటీయూ- 1010, ఐఆర్- 64, జేజీఎల్ వెరైటీలకు ఇతర దేశాల్లో మంచి డిమాండ్ ఉంద న్నారు. తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉండే సూపర్ ఫైన్ రకమైన తెలంగాణ సోనా (ఆర్ఎన్ఆర్- 15048) దేశావ్యాప్తంగా ఆదరణ పొందిందని, 6 మి.మీ కంటే ఎక్కువ పొడవు ఉన్న విత్తనాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉందని చెప్పారు. దేశీయ, విదేశీ మార్కెట్‌కు అనువైన రకాలను అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషిచేస్తోందని చెప్పారు. స్వాతంత్ర్యానంతరం మన దేశంలో బియ్యం ఉత్పత్తి సుమారు 8 రెట్లు పెరిగి 14 కోట్ల మెట్రిక్ టన్నులకు చేరుకుందని, ప్రపంచ మార్కెట్లో 45 శాతం వాటాను భారతదేశం కలిగిఉందని అన్నారు. ధాన్యం ఉత్పత్తికి అవసరమైన వనరులు, టెక్నాలజీ ఉన్నప్పటికీ.. వ్యవసాయ సంక్షోభం నేటికి పెద్ద సవాలుగా మారిందని, ధరను నిర్ణయించటంలో కూడా మార్కెటింగ్ సమస్యలు ఉన్నాయని తుమ్మల ఆందోళన వ్యక్తంచేశారు. మెరుగైన మార్కెట్ ధర, రైతులకు ప్రయోజనం కలిగించటానికి కేంద్ర ప్రభుత్వం కూడా ముందుకు రావాలని కోరారు. బియ్యం ఎగుమతిదారులు, దిగుమతిదారులు, వరి శాస్త్రవేత్తలను ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చేందుకు, ఎగుమతి మార్కెట్‌ను విస్తృతం చేయటానికి ఈ గ్లోబల్ సమ్మిట్ దోహదపడుతుందని తుమ్మల పేర్కొన్నారు. శాస్త్రవేత్తలు, మిల్లర్లు, ప్రగతిశీల రైతులు... ఇతర దేశాల్లో అనుసరించే విధానాలు ధాన్యం ఉత్పత్తి, మిల్లింగ్ పద్ధతులు, స్టోరేజీ టెక్నాలజీ, కాలుష్య నియంత్రణ తదితర అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు.


గ్లోబల్ రైస్ సమ్మిట్ 2024 కార్యక్రమంలో మంత్రులు తుమ్మల, ఉత్తమ్

ఎరువులు, సబ్సిడీలకు ప్రోత్సాహం: ఉత్తమ్

రైతుల ప్రయోజనాలకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని విత్తనాలు, ఎరువులు, సబ్సిడీలు అందిస్తూ పంటల సాగును ప్రోత్సహిస్తోందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో రైతులు ఏడాదిలో 2 పంటలు, కొన్నిచోట్ల 3 పంటలు కూడా పండిస్తారని తెలిపారు. దేశంలో వరి ఉత్పత్తిలో తెలంగాణ రెండో స్థానంలో ఉందని రైస్‌బౌల్ ఆఫ్ ఇండియా'గా గుర్తింపు పొందిందని అన్నారు. ఈ ఏడాది 265 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అయితే 94 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే సేకరించిందని ఉత్తమ్ తెలిపారు. రాజ్యాంగంలో పొందుపరిచిన జీవించే హక్కుతో పాటు ఆహారభద్రతను కూడా హక్కుగా పరిగణిస్తారని మంత్రి అన్నారు. పేదలకు ఉచిత బియ్యం, సబ్సిడీపై ఆహారధాన్యాల పంపిణీ ఇందులో భాగమేనని అన్నారు. రక్తహీనత ఇతరత్రా సమస్యలకు పరిష్కారంగా ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ జి. చిన్నారెడ్డి, టీఎస్ఎస్‌డీసీ ఛైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి, వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణకు 2 కేంద్ర మంత్రి పదవులు?

పరిశీలనలో సంజయ్, ఈటల, కిషన్ రెడ్డి, డీకే అరుణ పేర్లు

న్యూఢిల్లీ, జూన్ 7(ఆంధ్రజ్యోతి): దేశంలో మూడోసారి ఎన్‌డీయే కూటమి అధికారం చేపట్టబోతోంది. ఆదివారం సాయంత్రం ప్రధానిగా మోదీతో పాటు కొద్దిమంది కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో మంత్రి పదవుల కేటాయింపుపై ఢిల్లీలో ముమ్మర కసరత్తు జరుగుతోంది. గురువారమే ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా నివాసంలో బీజేపీ, సంఘ్ పెద్దలు భేటీ అయ్యారు. బీజేపీ నాయకులకు, మిత్రపక్షాలకు కేటాయింపులపై చర్చించారు. సొంతంగా మ్యాజిక్ మార్కు దాటని బీజేపీకి దక్షిణాదిలో అత్యధిక స్థానాలు వచ్చిన రాష్ట్రం తెలంగాణ. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నా ఆ పార్టీతో సమానంగా బీజేపీ 8 స్థానాలు సాధించింది. అందుకే తెలంగాణకు కీలకమైన మంత్రి పదవులు దక్కుతాయని పార్టీ రాష్ట్ర నాయకత్వం ఆశిస్తోంది. రాష్ట్రంలో బీజేపీని మరింత బలోపేతం చేయాలంటే, మూడు నుంచి నాలుగు కేంద్ర మంత్రి పదవులు ఇవ్వాలని రాష్ట్ర నాయకత్వం అధినాయకత్వాన్ని కోరుతున్నట్టు తెలిసింది. అయితే ఎన్డీయే కూటమిలోని భాగస్వామ్య పార్టీలకు ఈసారి తప్పనిసరిగా మంత్రి పదవులు ఇవ్వాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తెలంగాణకు రెండు మంత్రి పదవులు మాత్రమే ఇచ్చే అవకాశం ఉన్నట్టు తెలిసింది. దీనికి బండి సంజయ్, కిషన్ రెడ్డి, డీకే అరుణ, ఈటల రాజేందర్ పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో బీజేపీని పల్లెపల్లెకు పరిచయం చేసిన వ్యక్తి బండి సంజయ్ అనే ప్రచారం ఉంది. దీంతో ఆయనకు క్యాబినెట్‌లో స్థానం దక్కుతుందన్న సంకేతాలు అందుతున్నట్టు చెబుతున్నారు. అయితే ఆయన పేరు పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవికి కూడా పరిశీలనలో ఉన్నట్టు సమాచారం. గత లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి నలుగురు ఎంపీలు గెలవగా కిషన్ రెడ్డిని కేంద్ర మంత్రి పదవి వరించింది. ఈసారి కూడా తనకే మంత్రి పదవి వస్తుందని ఆయన విశ్వాసంతో ఉన్నారు. సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా మహబూబ్ నగర్‌లో కాంగ్రెస్ పార్టీపై విజయం సాధించారు డీకే అరుణ. ఆమె బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కూడా ఉన్నారు. దక్షిణాది నుంచి మహిళా కోటా కింద ఆమెకు మంత్రి పదవి వస్తుందనే చర్చ కూడా జరుగుతోంది. తెలంగాణలో బీఆర్ఎస్‌ను ఎదుర్కోవడంలో ఈటల రాజేందర్ తనదైన పాత్ర పోషించారు. అతి పెద్ద లోక్‌సభ నియోజకవర్గమైన మల్కాజిగిరి నుంచి విజయం సాధించారు. బీసీ కోటాలో తనకు మంత్రి పదవి వస్తుందని ఆయన ఆశిస్తున్నారు. పదవి కోసం ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.



మీటింగ్‌లకు ఏఐ అవతార్!



ఏఐ కాలంలో మరో కొత్త విషయం అనుభవంలోకి రాబోతోంది. అదేమిటంటే, వ్యక్తులకు బదులు ఏఐ అవతార్ పనులు చక్కబెట్టబోతోంది. జూమ్ మీటింగ్ వంటివాటికి ఏఐ అవతార్ హాజరవుతుందని జూమ్ సీఈఓ ఎరిక్ యువాన్ చెబుతున్నారు. సంబంధిత సాంకేతికత వాస్తవరూపం ధరించేందుకు అయిదారేళ్ళు పడుతుందని కూడా ఆయన తెలిపారు. 'ద వెర్జ్' మేగజైన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఇదే ఆచరణలోకి వస్తే కార్పొరేట్ టాస్క్‌లకు అనువుగా ఉంటుంది. మనిషి ఎక్కడున్నా, అర్జెంట్‌గా పిలిచే సమావేశాలకు తనకు బదులు అవతార్‌ను పంపుకోవచ్చు. అయితే ఎంత అభివృద్ధి జరిగినప్పటికీ అది మనిషి స్థానాన్ని ఏఐ ఆక్రమించుకోలేదని జూమ్ సీఈఓ తెలిపారు. అటు పని, ఇటు జీవితం మధ్య సమతుల్యానికి ఇలాంటి సాంకేతిక పురోగతి దోహదపడుతుందని చెప్పవచ్చు. జూమ్ విషయానికి వస్తే, ఏఐ పవర్డ్ ఫ్యూచర్‌తో ఏర్పడే గ్యాప్‌ని సరిదిద్దేవిధంగా సాంకేతికను అభివృద్ధి పర్చే పనిలోనే ఉంది. ఇలాంటివి కొంత ఉత్సుకతను కల్పిస్తున్నప్పటికీ భవిష్యత్తులో వీటితో జరిగే విపరిణామాలపైనా సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది.

న్యాయ సేవల్లో చాట్ జీపీటీ వద్దు

ఇటీవల ప్రతీదానికీ చాట్ జీపీటీ సేవలు వాడుకోవడం కామన్‌గా మారింది. అయితే న్యాయ సేవల కోసం చాట్ జీపీటీని ఉపయోగించవద్దని నిపుణులు చెబుతున్నారు. ఎందుకు వద్దంటున్నామో కూడా సాధికారికంగా వివరిస్తున్నారు. అసలు విషయానికి వెళ్ళే ముందు మరికొన్నింటిని తెలుసుకోవాలి. వాస్తవానికి ఒక సర్వే ప్రకారం 52 శాతం మంది మాత్రమే ప్రొఫెషనల్స్ నుంచి న్యాయ సేవలు అందుకుంటున్నారు. పదకొండు శాతం మంది తమ స్నేహితులు, బంధుమిత్రుల సలహాలు తీసుకుంటున్నారు. మిగిలిన వారికి న్యాయ సేవలు అందటం లేదు, నిస్సహాయులుగా ఉండిపోతున్నారు. లా సొసైటీ, లీగల్ సర్వీసెస్ బోర్డు, యువగవ్ ఉమ్మడిగా నిర్వహించిన సర్వేలో ఈ విషయం తేలింది. గడచిన నాలుగేళ్ళ కాలంలో ప్రతి ఒక్కరికీ ఏదో ఒక లీగల్ సమస్య ఎదురైంది. నిరుద్యోగం, ఫైనాన్స్, సంక్షేమం, ప్రయోజనం, వినియోగదారుల సమస్యలు లీగల్‌కు సంబంధించిన వాటిలో ముఖ్యమైనవిగా ఆ సర్వే తేల్చింది. అలాగే అందరికీ న్యాయ సహాయం ప్రొఫెషనల్స్ నుంచి తీసుకోవడం సాధ్యం కాదని కూడా తెలిపింది.



ఈ నేపథ్యంలోనే లీగల్ అంశాలకు సంబంధించి ఎక్కువ మంది ఇంటర్నెట్ సహకారం తీసుకుంటున్నారు. చాట్‌జీపీటీ, గూగుల్ బార్డ్, మైక్రోసాఫ్ట్ కోపైలట్, క్లాడేని అడిగి తెలుసుకుంటున్నారు. ఈ టూల్స్ అన్నీ జనరేటివ్ ఏఐ పవర్‌ని కలిగి ఉంటున్నాయి. ప్రధానంగా ఈ చాట్‌బోట్స్ అందిస్తున్న న్యాయ సహాయంపై ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ క్లినికల్ లీగల్ ఎడ్యుకేషన్ ఒక స్టడీని ఇటీవల నిర్వహించింది. అడిగిన ప్రశ్న, ఇస్తున్న సమాధానం అవసరానికి తగ్గట్టు లేవని తేల్చింది. ముఖ్యంగా...

- సమాధానాలు అమెరికా న్యాయ చట్టాలకు లోబడి ఉంటాయి. అయితే ప్రశ్న అడిగిన వ్యక్తి తనుంటున్న ప్రదేశంలో అది వర్తిస్తుందనే భావిస్తారు. ఒక ప్రాంతానికి వేరే చోటుకు మధ్య తేడా ఉంటుందన్నది చాట్‌బోట్ తెలియజేయదు. యూకేలో ఇది మరింత క్లిష్టంగా ఉంటుంది. ఇంగ్లండ్ - వేల్స్, స్కాట్లాండ్ - నార్త్ ఐర్లాండ్ మధ్య తేడా ఉంటుంది. ఉదాహరణకు ఇంటి అద్దెకు సంబంధించే చట్టాలు వేర్వేరు. విడాకులు, సివిల్ భాగస్వామ్యంలోనూ ఇదే ఇబ్బంది.
- కాలక్రమంలో కొత్త చట్టాలను వివిధ దేశాలు రూపొందిస్తూ ఉంటాయి. ఉదాహరణకు ఇంగ్లండ్, వేల్స్‌లో 2002 ఏప్రిల్‌లో విడాకుల చట్టాన్ని మార్చారు. మన దేశంలోనూ గడచిన ఏడాది చట్టపరంగా కొన్ని మార్పులు చేశారు. అప్డేట్ అయిన చట్టాలను అనుసరించి ఇక్కడ సలహాలు ఉండవు.
- కుటుంబం, ఉద్యోగ సంబంధిత విషయాల్లో తప్పుడు సలహాలు ఇస్తూ ఉంటుంది. అవి మనల్ని తప్పుదోవ పట్టిస్తాయి. కొన్నింటిలో సలహాలు బాగుంటాయి. అయినప్పటికీ ఇంకా స్పందనలో గ్యాప్స్ అలానే ఉంటున్నాయి. కొన్ని సార్లు ముఖ్యమైన పాయింట్లు సమాధానంలో ఉండటం లేదు. చాలా బాగా రాసి ఉన్నప్పటికీ లీగల్ పాయింట్లు అందులో కనిపించడం లేదు.
- పూర్తిగా జనరిక్‌గా ఉంటుంది. అంటే కొన్ని సందర్భాల్లో అక్కడ ఉన్న సమాచారాన్ని ఇవ్వడం తప్ప లీగల్‌గా అడిగిన నిర్దిష్ట ప్రశ్నకు తగ్గ సమాధానం సూటిగా ఉండటం లేదు. ప్రాక్టికల్ అయినప్పటికీ అందులో లీగల్ యాంగిల్ ఉండటం లేదు. అలాంటివి ప్రస్తావించి చట్టపరమైన ఆదేశాలు పొందడం కష్టమనే చెప్పాలి.
- ఇప్పుడు అందుబాటులో ఉన్న ఏఐ తరహా సమాధానాల్లో చాట్‌జీపీటీ4 అంటే పెయిడ్ వెర్షన్ బెటర్ అని చెప్పవచ్చు. మొత్తమ్మీద ఈ సమాధానాలను పరిగణనలోకి తీసుకుంటే రిస్క్ ఉంటుందని చెప్పకతప్పదు. చాట్‌బోట్స్ అన్నీ అడిగిన వాటికి తగ్గ సమాధానాలు ఇస్తాయి. అయితే ప్రొఫెషనల్ హెల్ప్ తీసుకునే ముందుకు వెళ్ళాల్సి ఉంటుందన్న అభిప్రాయం ఈ సర్వేలో వెల్లడైంది.

మూడేళ్ళలో యువతకు చేరువ

ఫేస్‌బుక్ అనతికాలంలోనే అంటే ఆరంభించిన ఇరవై సంవత్సరాల్లోనే అన్ని వర్గాల ఆదరణ పొందింది. మరీ ముఖ్యంగా గడచిన మూడేళ్ళలో యువతకు మరింత చేరువైంది. ఈ విషయాన్ని ఫేస్‌బుక్ స్వయంగా ప్రకటించింది. అమెరికా, కెనడాలోనే 18-29 మధ్యవయస్కులైన నాలుగుకోట్ల మంది యువత రోజూ ఫేస్‌బుక్‌ని ఉపయోగిస్తున్నారు.



గడచిన అయిదు క్వార్టర్లలో ఆరోగ్యకరమైన అభివృద్ధి సాధించామని మెటా ప్రకటించింది. మొదటిసారి ఇలాంటి వివరాలతో డెమోగ్రాఫిక్ సమాచారాన్ని మెటా విడుదల చేసింది. టిక్‌టాక్ వైపు మరలిన యువతను ఆకట్టుకునేందుకు ఈ మూడేళ్ళూ కృషి చేసింది. ఆ ప్రయత్నాలు ఫలించాయి. యువత చేరిన కొత్తలో మార్కెట్స్, గ్రూప్స్, డేటింగ్‌పైనే దృష్టి పెడతారు. తమ జీవితానికే ప్రాధాన్యం ఇస్తారని తెలిపింది. నిజానికి ఆరంభించిన మూడేళ్ళలోనే అయిదు కోట్ల మందిని ఆకట్టుకున్న ఘనత ఫేస్‌బుక్‌కు ఉంది. గత ఏడాది 'ప్యూ గ్రూప్' నిర్వహించిన సర్వే ప్రకారం అమెరికా యువతలో మూడో వంతుమంది ఫేస్‌బుక్ ఉపయోగిస్తున్నారు.

ఇక ఉబర్ రైడ్‌లో గేమ్స్ ఆడొచ్చు



ఆడుతు, పాడుతు పనిచేయడం కాదు, ప్రయాణిస్తే ఎంతో బాగుంటుంది. ఉబర్ సరిగ్గా అదే పని చేయనుంది. ఉబర్ తన ప్రయాణికులను ఆకట్టుకునేందుకు వీలుగా రైడ్ సమయంలో మినీగేమ్స్‌ను పరిచయం చేసే పనిలో ఉంది. అందుకుగానే యాప్‌లోనే మినీ గేమ్స్‌ను అభివృద్ధిపరుస్తోంది. నెట్ కనెక్షన్ ఉంటేనే ఈ గేమ్స్‌ని ఫ్రీగా ఆడుకునే సౌలభ్యం ఉంటుంది. అయితే అధికారికంగా దీనిపై సమాచారం వెలువడలేదు. ఇదే వస్తే ఉబర్ వాహనంలో కూర్చుని ఇకపై దారిలో ఉన్న గోడలు, మిద్దెలు, భవంతులూ చూస్తూ ఉండనవసరం లేదు. ఇటీవలే ఉబర్ యాప్ లేటెస్ట్ వెర్షన్‌ని విడుదల చేసింది. అందులో చాలా గేమ్స్ రిఫరెన్స్‌లు ఉన్నాయి. ఇంటర్నెట్ కనెక్షన్ ఉండాలని ఒక కోడ్ చెబుతోంది. అంతకుమించిన అధికారిక వివరాలు ఏవీ లేవు. ఆ గేమ్స్ ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తాయి, అవి ఉచితమా, కొనుగోలు చేయాలా అన్న వివరాలు కూడా లేవు. గత నెలలోనే యూట్యూబ్ కొన్ని చిన్నపాటి గేమ్స్‌ను ఐఫోన్ యాప్‌లో అందుబాటులోకి తెచ్చింది. దాన్నే ఉబర్ కూడా ఫాలో అవుతున్నట్టుంది. దీంతో అటు ప్రయాణం, ఇటు ఆనందాన్ని జోడించే యత్నంలో ఉబర్ ఉందని మాత్రం అర్థం అవుతోంది.

స్మార్ట్‌ఫోన్ ఓవర్ హీట్

ఇలా చేస్తే బెస్ట్



వేడి ఏ రూపంలో ఉన్నప్పటికీ కొన్ని ఇబ్బందులు తప్పవు. స్మార్ట్ ఫోన్‌కూ వర్తిస్తుంది. ఎండలనే కాదు, గేమ్స్ తదితరాలతో ఎక్కువగా ఉపయోగించినా ఫోన్ వేడెక్కుతుంది. ఫలితంగా ఇబ్బందులకూ అవకాశం ఉంటుంది. దరిమిలా ఫోన్ వేడెక్కకుండా ఉండేందుకు కింది జాగ్రత్తలు తీసుకోవాలి.

- ఎండాకాలమనే కాదు, బైటి వాతావరణం బాగా వేడిగా ఉన్నప్పుడు స్మార్ట్ ఫోన్ కేసును మొదట తొలగించాలి. ఇప్పుడు వస్తున్న ఫోన్లు ఎక్కువగా ఫాస్ట్-చార్జింగ్ టెక్నాలజీతో వస్తున్నాయి. ఆ నేపథ్యంలో కేసును తొలగించడం ద్వారా ఫోన్‌ను వేడిమి నుంచి రక్షించుకోవచ్చు.
- కనీస స్థాయిలో డిస్‌ప్లే బ్రైట్‌నెస్‌ని ఉంచుకోవాలి. అది ఎక్కువగా ఉంటే ఫోన్ వేడెక్కుతుంది. ఆ కారణంగా, అవసరమైన మేరకు బ్రైట్‌నెస్‌ను అడ్జెస్ట్ చేసుకోవాలి.
- బైట అంటే రోడ్డుపై ఉన్నప్పుడు స్మార్ట్‌ఫోన్‌పై సూర్యకాంతి నేరుగా పడకుండా చూసుకోవాలి. అందుకోసం ఏదో ఒక అడ్డును ఏర్పాటు చేసుకోవాలి. వాహనంలో లేదంటే పైన ఏదో ఒక అడ్డు ఉండేలా చూసుకుంటే మంచిది.
- వేడి వాతావరణంలో ఎక్కువ సేపు స్మార్ట్ ఫోన్ వినియోగం లేదంటే దాంట్లో ఆటలు అంత మంచిది కాదు. భారీ స్థాయిలో ఉండే గేమ్స్ ఆడేటప్పుడు హార్డ్‌వేర్‌ని బాగా ఉపయోగించుకోవాల్సి ఉంటుంది. ఫలితంగా వేడెక్కుతుంది. అందువల్ల అదేపనిగా ఆడకూడదు.
- స్మార్ట్‌ఫోన్లను జేబులో ఉంచుకోకూడదు. సహజంగా సాగే ఎయిర్ ఫ్లోని అది నిరోధిస్తుంది. అలా కూడా వేడెక్కే ప్రమాదం ఉంది. సహజంగా సాగే గాలి ప్రక్రియకు అవకాశం కల్పించాలి.

మైక్రోసాఫ్ట్ విండోస్ 10కి కొత్త ఫీచర్లు



మైక్రోసాఫ్ట్ ఇప్పటికే విండోస్ 10కి వచ్చే ఏడాది అక్టోబర్ 10 నుంచి సపోర్ట్‌ని ఆపేస్తున్నట్టు ప్రకటించింది. అయితే అనూహ్యంగా విండోస్ 10కి బేటా ప్రోగ్రామ్‌ని తిరిగి ఆరంభించింది. తద్వారా కొత్త ఫీచర్లను టెస్ట్ చేస్తోంది. విండోస్ 11కి ప్రత్యేకంగా తెచ్చిన ఏఐ కోపైలెట్‌ని విండోస్ 10 ఇప్పటికే పొందింది. విండోస్ 10 కోసం బేటా చానల్‌ని ఆరంభించినట్టు మైక్రోసాఫ్ట్ ఒక బ్లాగ్‌పోస్ట్‌లో వెల్లడించింది. విండోస్ 10కి సంబంధించి కొత్త ప్రణాళికలను మైక్రోసాఫ్ట్ ఇంకా బైటపెట్టలేదు. అయితే విండోస్ ఇన్‌సైడర్స్ బేటా చానల్‌ని ఆప్ట్ చేసుకుంటే ఫీచర్లను పొందే అవకాశం ఉంటుంది. విండోస్ 10ని ఉపయోగించే వాళ్ళ కోసం పెయిడ్ సెక్యూరిటీ అప్డేట్స్‌ని ఆఫర్ చేసింది. బిజినెస్ సముదాయాలు అందుకోసం ఏడాదికి 61 డాలర్లు చెల్లించాలి. రెండో ఏడాదికి రెండింతలు అవుతుంది. మూడో ఏడాదికి మళ్ళీ రెట్టింపు అంటే 122, 244 డాలర్లుగా ఫీజు ఉంటుంది. వ్యక్తిగత వినియోగదారులు ఎంత చెల్లించాలన్నది మాత్రం మైక్రోసాఫ్ట్ ఇంకా వెల్లడించలేదు. యూజర్లు 11కి షిఫ్ట్ అయ్యేలా మైక్రోసాఫ్ట్ యత్నిస్తోంది. అయితే హార్డ్‌వేర్ రిక్వైర్‌మెంట్స్ కారణంగా ఆ పని జోరందుకోవడం లేదు. 2018 తరవాత విడుదలైన సీపీయూ మాత్రమే విండోస్ 11ని సపోర్ట్ చేస్తుంది. డివైజ్ కాస్తా టీపీఎం సెక్యూరిటీ చిప్స్‌ను సపోర్ట్ చేస్తుంది. 2015లోనే విండోస్ 11ని విడుదల చేశారు. తొమ్మిది సంవత్సరాలు పూర్తయినప్పటికీ ఇంకా 68 శాతం మంది విండోస్10నే ఉపయోగిస్తుండటం విశేషం.

ఏఐ ఓవర్‌వ్యూస్ 15 శాతానికే జవాబు!



గూగుల్‌కు చెందిన ఏఐ ఓవర్‌వ్యూస్ - వివిధ ప్రశ్నలకు స్పందించడంలో తప్పులు చోటుచేసుకుంటున్నాయి. పూర్తిగా తప్పు లేదంటే ఉపకరించని రీతిలో సమాధానాలను ఇస్తోంది. ప్రస్తుతం దాన్ని సరిదిద్దే పనుల్లో గూగుల్ ఉంది. అడిగిన దానిలో పదిహేను శాతానికే సమాధానం ఇస్తోందని సరికొత్త నివేదకలో వెల్లడైంది. ఎస్ఈఓ వేదిక 'బ్రైట్ఎడ్జ్' ఈ ధోరణిని ఏప్రిల్ మధ్య నుంచే కనుగొంది. సమాధానం ముక్కలు ముక్కలుగా కనిపిస్తోందని కూడా తెలిపింది. ఏఐ ఓవర్‌వ్యూస్ అంటే సెర్చ్ జనరేటెడ్ ఎక్స్‌పీరియెన్స్(ఎస్‌జీఈ) ఇచ్చే సమాధానం విజిబిలిటీ 84 శాతానికి పరిమితమై ఉండేది. అమెరికాలోని యూజర్లు అందరికీ మే నెల మొదట్లో ఏఐ ఓవర్‌వ్యూస్‌ని అందించారు. అయితే కొంతమంది యూజర్లు అది చేస్తున్న తప్పులను ఎత్తి చూపుతూ ఎక్స్‌లో స్పందించారు. సమాధానాలకు సంబంధించి స్క్రీన్‌షాట్లను పోస్ట్ చేశారు. ఈ ఫిర్యాదులకు గూగుల్ వెంటనే స్పందించింది. సమస్యలను పరిష్కరించే పనిలో ఉన్నట్టు కూడా తెలిపింది. తమ అల్గోరిథమ్స్‌ను మెరుగుపర్చుకోవడం లేదా తమ పాలసీకి విరుద్ధంగా ఉన్న స్పందనలను ప్రత్యేక ప్రక్రియల ద్వారా తొలగించడం చేస్తామని కూడా ప్రకటించింది. వెబ్ ద్వారా అడిగిన సందేహాలకు స్పందించకుండా గూగుల్ మాన్యువల్‌గా టర్నింగ్ ఆఫ్ చేస్తోందంటూ ఈలోపు మరో నివేదిక బైటపడటం గమనార్హం.



టైమ్‌లైన్‌గా లొకేషన్ హిస్టరీ

గూగుల్ - మ్యాప్స్ లొకేషన్ హిస్టరీ ఇకపై క్లౌడ్‌లో కాకుండా ఫోన్‌లోనే స్టోర్ కానుంది. లొకేషన్ డేటా గూగుల్ సెర్వర్లలో ఉంటే జియోఫెన్స్ వారెంట్‌లకు లోనుకావాల్సి వస్తోంది. ఈ మార్పుతో ఇకపై గూగుల్‌కు రెస్పాండ్ అయ్యే ఇబ్బంది తప్పుతుంది. అలాగే లొకేషన్ హిస్టరీని ఇకపై టైమ్‌లైన్ అంటారు. 'యువర్ టైమ్‌లైన్' ఫీచర్‌లో ఉంటుంది. అదే ఒక వ్యక్తి ఎక్కడికి ఎన్నిసార్లు విజిట్ చేశారన్నది తెలియజేసేది. అదిఇప్పుడు ట్రిప్స్, ప్లేసెస్, సిటీస్ అంటే గ్రూపులుగా డేటా విభజించి ఉంటుంది. ఆండ్రాయిడ్, ఐఓఎస్‌లో గూగుల్ మ్యాప్స్ ఫీచర్ ఎప్పటిలానే అంటే టైమ్‌లైన్ ఫీచర్ పనిచేస్తుంది. ఇటీవలి కాలంలోనే ఈ ఫీచర్ విడుదలైంది. ఇంకా అందరికీ చేరువ కావాల్సి ఉంది. ఒకసారి ఇది పొందితే ఆటోమేటిక్‌గా టైమ్‌లైన్‌కు రావచ్చు. డివైజ్‌ల మధ్య స్విచ్ కావచ్చు.

హెల్త్ కనెక్ట్ ఉపయోగించుకోండి ఇలా



గూగుల్ హెల్త్ కనెక్ట్‌తో ఆరోగ్య సంబంధ డేటాను ఎలాంటి అవాంతరాలు లేకుండా ఉపయోగించుకోవచ్చు. ఇష్టమైన హెల్త్ యాప్‌లతో అనుసంధానం అయ్యేందుకు ఇది తోడ్పడుతుంది. అవసరమైన హెల్త్ డేటాను ఎలాంటి ఇబ్బందులు లేకుండా దీంతో పొందవచ్చు. నిజానికి వివిధ హెల్త్ ఫిట్‌నెస్ యాప్‌ల నుంచి సమాచారాన్ని తీసుకుని క్రోడీకరించుకోవడం సమస్యే. అయితే గూగుల్ అందుకు పరిష్కారంగా గూగుల్ హెల్త్ కనెక్ట్‌కు రూపకల్పన చేసింది. శాంసంగ్‌తో కలిసి ఈ పని చేపట్టింది. ఇది వివిధ ప్లాట్‌ఫారాల్లో ఉన్న సమాచారాన్ని క్రోడీకరిస్తుంది. అవసరమైన డేటా ఇస్తుంది. వివిధ డివైజ్‌లు, ప్లాట్‌ఫారమ్‌ల మధ్య సానుకూలతను కుదురుస్తుంది. ప్రస్తుతానికి ఇది బేటా దశలో ఉంది. గత ఏడాది మార్చిలో చోటుచేసుకున్న పిక్సెల్ అప్డేట్‌తో ఇది ప్రీ ఇన్‌స్టాల్డ్‌గా మారింది. ఆండ్రాయిడ్ 14తో ఇంటిగ్రేట్ అయింది. మొదట్లో ఇది కొన్నింటితోనే అనుసంధానమైంది. ఫిట్‌బిట్, శాంసంగ్ హెల్త్, గూగుల్ ఫిట్, మైఫిట్‌నెస్‌పాల్ వంటి వాటితో కలిసింది. ఆ క్రమంలో హెల్త్ ట్రాకింగ్ మెట్రిక్స్, డేటా టైప్స్, న్యూట్రిషన్ అలాగే నిద్రకు సంబంధించిన కార్యకలాపాలపై కీలక సమాచారం తదితరాలను కలిపింది. ఈసీజీ వంటి వాటిని సపోర్ట్ చేయడం లేదు. వివిధ డివైజ్‌లను ఉపయోగించే యూజర్లకు ఇది అనువుగా ఉంటుంది. సమాచారాన్ని ఒక గొడుగు కిందకు తెచ్చుకునే సౌలభ్యాన్ని కల్పిస్తోంది. పిక్సెల్ యూజర్లు దీన్ని చాలా సులువుగా, సూటిగా సెట్ చేసుకోవచ్చు. సెట్టింగ్స్‌లో యాప్స్ అక్కడి నుంచి హెల్త్ కనెక్ట్‌ను ఎనేబుల్ చేసుకోవచ్చు. నాన్ పిక్సెల్ యూజర్లు దీన్ని గూగుల్ ప్లే స్టోర్ నుంచి డైన్‌లోడ్ చేసుకోవాలి. అక్కడ కూడా దీన్ని ఎనేబుల్ చేసుకోవడం సులువే.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
diksuchi@andhrajyothy.com
హైదరాబాద్ ● శనివారం 8 జూన్ 2024

పీజీఐఎంఈఆర్‌లో బీఎస్సీ పారామెడికల్, బీపీహెచ్

చండీగఢ్‌లోని పోస్ట్ గ్రాడ్యుయేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (పీజీఐఎంఈఆర్)- బీఎస్సీ పారామెడికల్, బ్యాచిలర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ (బీపీహెచ్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. స్పాన్సర్డ్ అభ్యర్థులకు కనీసం అయిదేళ్ల అనుభవం ఉండాలి. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, కౌన్సెలింగ్, మెడికల్ ఎగ్జామినేషన్‌ల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ఎంట్రెన్స్ టెస్ట్ సమయం గంటన్నర. ఇందులో మొత్తం 100 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఇస్తారు. కోర్సుకు నిర్దేశించిన అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. వీటి వివరాలను వెబ్‌సైట్‌లో చూడవచ్చు. మొత్తం 123 సీట్లు ఉన్నాయి.



బ్యాచిలర్స్ ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ సైన్స్: కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇందులో 18 సీట్లు ఉన్నాయి. ఇంటర్(బయాలజీ)/ఒకేషనల్ కోర్సు (ఎంఎల్ఎస్/ఎంఎల్‌టీ)/మూడేళ్ళ డిప్లొమా(ఎంఎల్‌టీ) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 సెప్టెంబరు 1 నాటికి 17 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.

బీఎస్సీ మెడికల్ రేడియాలజీ & ఇమేజింగ్ టెక్నాలజీ: కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇందులో 12 సీట్లు ఉన్నాయి. ఇంటర్(బైపీసీ)/రెండున్నరేళ్ల డిప్లొమా(మెడికల్ రేడియాలజీ అండ్ ఇమేజింగ్ టెక్నాలజీ) ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

బీఎస్సీ రేడియోథెరపీ టెక్నాలజీ: కోర్సు వ్యవధి మూడున్నరేళ్లు. ఇందులో 8 సీట్లు ఉన్నాయి. ఇంటర్(సైన్స్ సబ్జెక్టులు)/డిప్లొమా(రేడియోథెరపీ టెక్నాలజీ)ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు 17 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

బీఎస్సీ ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ: కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇందులో 3 సీట్లు ఉన్నాయి. ఇంటర్(ఎంపీసీ/బైపీసీ) లేదా డిప్లొమా(ఆపరేషన్ థియేటర్ టెక్నాలజీ) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులకు 17 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

బీఎస్సీ మెడికల్ టెక్నాలజీ(పర్‌ఫ్యూజనిస్ట్): కోర్సు వ్యవధి మూడేళ్లు. ఇందులో 2 సీట్లు ఉన్నాయి. ఇంటర్(బైపీసీ) పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

బీఎస్సీ ఎంబామింగ్ అండ్ మార్చురీ సైన్సెస్: కోర్సు వ్యవధి మూడేళ్లు. ఇందులో 6 సీట్లు ఉన్నాయి. ఇంటర్(సైన్స్) ఉత్తీర్ణతతోపాటు జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్‌లో పరిజ్ఞానం ఉండాలి. అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

బ్యాచిలర్ ఆఫ్ ఆడియాలజీ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజీ: కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇందులో 10 సీట్లు ఉన్నాయి. ఇంటర్(ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/మేథమెటిక్స్/కంప్యూటర్ సైన్స్/స్టాటిస్టిక్స్/ఎలక్ట్రానిక్స్/ సైకాలజీ) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

బీఎస్సీ మెడికల్ టెక్నాలజీ(డయాలసిస్ థెరపీ టెక్నాలజీ): కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇందులో 2 సీట్లు ఉన్నాయి. ఇంటర్(ఎంపీసీ/బైపీసీ) లేదా డిప్లొమా(డయాలసిస్ థెరపీ టెక్నాలజీ) ఉత్తీర్ణులు అర్హులు.

బ్యాచిలర్ ఆఫ్ ఆప్టోమెట్రీ: కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇందులో 10 సీట్లు ఉన్నాయి. ప్రథమ శ్రేణి మార్కులతో ఇంటర్(ఎంపీసీ/బైపీసీ)/డిప్లొమా(ఆప్టోమెట్రీ) ఉత్తీర్ణులు అర్హులు.

బ్యాచిలర్ ఆఫ్ ఫిజియోథెరపీ: కోర్సు వ్యవధి నాలుగున్నరేళ్లు. ఇందులో 15 సీట్లు ఉన్నాయి. ఇంటర్ (ఎంపీసీ/బైపీసీ)/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 సెప్టెంబరు 1 నాటికి 17 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి.

బీఎస్సీ(హెల్త్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్): కోర్సు వ్యవధి మూడున్నరేళ్లు. ఇందులో 10 సీట్లు ఉన్నాయి. ఇంటర్(బైపీసీ)/డిప్లొమా(హెల్త్ ఇన్ఫర్మేషన్ మేనేజ్‌మెంట్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 17 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి.

బీఎస్సీ (మెడికల్ యానిమేషన్ అండ్ ఆడియో-విజువల్ క్రియేషన్): కోర్సు వ్యవధి మూడేళ్లు. ఇందులో పది సీట్లు ఉన్నాయి. ఇంటర్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థులకు 17 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

బ్యాచిలర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్: కోర్సు వ్యవధి నాలుగేళ్లు. ఇందులో 15 సీట్లు ఉన్నాయి. ఇంటర్/యాగ్జిలరీ నర్స్ మిడ్‌వైఫ్/మేల్ హెల్త్ వర్కర్/ఫిమేల్ హెల్త్ వర్కర్/మల్టీపర్పస్ హెల్త్ వర్కర్/లేడీ హెల్త్ విజిటర్/హెల్త్ ఇన్‌స్పెక్టర్/శానిటరీ ఇన్‌స్పెక్టర్/ ఫుడ్ ఇన్‌స్పెక్టర్/డ్రగ్ ఇన్‌స్పెక్టర్/ల్యాబొరేటరీ టెక్నీషియన్ కోర్సులు పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. 2024 సెప్టెంబరు 1 నాటికి అభ్యర్థులకు 17 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, స్పాన్సర్డ్ అభ్యర్థులకు రూ.1500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులకు ఫీజు మినహాయింపు వర్తిస్తుంది.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 5
- **ఎడిట్ విండో ఓపెన్:** జూలై 7, 8
- **కంప్యూటర్ బేస్డ్ ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 2
- **ఫలితాలు విడుదల:** ఆగస్టు 13
- **మొదటి కౌన్సెలింగ్:** ఆగస్టు 28
- **వెబ్‌సైట్:** www.pgimer.edu.in

ఐజీహెచ్‌జీడీలో ఎమ్మెస్సీ

ఉస్మానియా యూనివర్సిటీ బేగంపేటలో నిర్వహిస్తున్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ అండ్ హాస్పిటల్ ఫర్ జెనెటిక్ డిసీజెస్ (ఐజీహెచ్‌జీడీ)- ఎమ్మెస్సీ మాలిక్యులర్ అండ్ హ్యూమన్ జెనెటిక్స్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది రెండేళ్ల వ్యవధి గల సెల్ఫ్ ఫైనాన్స్ ప్రోగ్రామ్. ఇందులో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా ఇంటర్న్‌షిప్ కూడా ఉంటుంది. మొత్తం 10 సీట్లు ఉన్నాయి. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఇంజనీరింగ్/టెక్నాలజీ/లైఫ్ సైన్సెస్-బయాలజీ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గ్యాట్-బీ 2024 అర్హత ఉన్నవారు ఈ-మెయిల్ ద్వారా దరఖాస్తు పంపుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.2,20,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జూన్ 21
- **దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** ప్రోగ్రామ్ కోఆర్డినేటర్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స్ అండ్ హాస్పిటల్ ఫర్ జెనెటిక్ డిసీజెస్, ఉస్మానియా యూనివర్సిటీ, బేగంపేట్, హైదరాబాద్-500016
- **ఈ-మెయిల్:** mscmhgig2022@gmail.com
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

బాసర ఆర్‌జీయూకేటీలో ఇంటిగ్రేటెడ్ బీటెక్

నిర్మల్ జిల్లా బాసరలోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్(ఆర్‌జీయూకేటీ)- ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. తెలంగాణ విద్యార్థుల కోసం 85 శాతం సీట్లు ప్రత్యేకించారు. మిగిలిన సీట్లకు తెలుగు రాష్ట్రాల విద్యార్థులు పోటీపడవచ్చు. ఇతర రాష్ట్రాల విద్యార్థుల కోసం గ్లోబల్ కేటగిరీ కింద అదనంగా అయిదు శాతం సూపర్ న్యూమరీ సీట్లు; విదేశీ విద్యార్థుల కోసం రెండు శాతం సూపర్ న్యూమరీ సీట్లు నిర్దేశించారు. పదోతరగతిలో సాధించిన మెరిట్ గ్రేడ్ పాయింట్ యావరేజ్ (జీపీఏ), రిజర్వేషన్ నిబంధనలు, కౌన్సెలింగ్ ప్రకారం అడ్మిషన్స్ ఇస్తారు. జిల్లా పరిషత్, మున్సిపల్ పాఠశాలలు సహా నాన్ రెసిడెన్షియల్ గవర్నమెంట్ స్కూళ్లలో చదివిన విద్యార్థులకు నిబంధనల ప్రకారం వెయిటేజీ ఇస్తారు.

ప్రోగ్రామ్ వివరాలు: మొదటి రెండేళ్లు ప్రీ యూనివర్సిటీ కోర్సు ఉంటుంది. ఇందులో మేథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, లైఫ్ సైన్సెస్, హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సబ్జెక్టులు ఉంటాయి. తరవాత నాలుగేళ్లపాటు బీటెక్ కోర్సు ఉంటుంది. ఇందులో కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాల్లో ఒకదాన్ని ఎంచుకోవాలి. మైనర్ సబ్జెక్టు కింద బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎకనామిక్స్ మేథమెటిక్స్, సోషల్ సైన్సెస్, స్టాటిస్టిక్స్‌లలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు.

అర్హత: తెలుగు రాష్ట్రాల్లో గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/ తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్ఐఓఎస్/టీఓఎస్ఎస్/ఏపీఓఎస్ఎస్/సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ అభ్యర్థులు కూడా అర్హులే. సప్లిమెంటరీ అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు. విద్యార్థుల వయసు 2024 జూన్ 1 నాటికి 18 ఏళ్లు మించకూడదు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులను 21 ఏళ్ల వరకు అనుమతిస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, బీసీ అభ్యర్థులకు రూ.500; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.450; ఇతర రాష్ట్రాల విద్యార్థులకు రూ.1500; గ్లోబల్ కేటగిరీలో మిగిలిన సీట్లకు పోటీ పడే విద్యార్థులకు రూ.1500; విదేశీ విద్యార్థులకు 100 యూఎస్ డాలర్లు
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 22
- **స్పెషల్ కేటగిరీ (పీహెచ్/సీఏపీ/ఎన్‌సీసీ/స్పోర్ట్స్) విద్యార్థుల దరఖాస్తు ప్రింట్ కాపీలు స్పీడ్/రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా చేరేందుకు చివరి తేదీ:** జూన్ 29
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 3 నుంచి
- **ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్:** జూలై 8 నుంచి 10 వరకు
- **చిరునామా:** కన్వీనర్, యూజీ అడ్మిషన్స్, రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్, బాసర, నిర్మల్ జిల్లా - 504107
- **వెబ్‌సైట్:** www.rgukt.ac.in



గ్రామీణ బ్యాంకుల్లో ఆఫీసర్, ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులు



వివిధ రీజనల్ రూరల్ బ్యాంకు(ఆర్ఆర్‌బీ)ల్లో కింద పేర్కొన్న గ్రూప్-ఎ-ఆఫీసర్ (స్కేల్-1,2,3), గ్రూప్ బి-ఆఫీస్ అసిస్టెంట్(మల్టీపర్పస్) పోస్టుల భర్తీకి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంకింగ్ పర్సనల్ సెలెక్షన్(ఐబీపీఎస్) నోటిఫికేషన్ విడుదల చేసింది.

గ్రామీణ బ్యాంకులు: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, కర్ణాటక గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్, తెలంగాణ గ్రామీణ బ్యాంక్, విదర్భ కొంకణ్ గ్రామీణ బ్యాంక్ తదితరాలు.

1. ఆఫీస్ అసిస్టెంట్(మల్టీపర్పస్): **5,585 పోస్టులు**
2. ఆఫీసర్ స్కేల్-1: **3499 పోస్టులు**
3. ఆఫీసర్ స్కేల్-2(అగ్రికల్చర్ ఆఫీసర్): **70 పోస్టులు**
4. ఆఫీసర్ స్కేల్-2(లా): **30 పోస్టులు**
5. ఆఫీసర్ స్కేల్-2(సీఏ): **60 పోస్టులు**
6. ఆఫీసర్ స్కేల్-2(ఐటీ): **94 పోస్టులు**
7. ఆఫీసర్ స్కేల్-2(జనరల్ బ్యాంకింగ్ ఆఫీసర్): **496 పోస్టులు**
8. ఆఫీసర్ స్కేల్-2(మార్కెటింగ్ ఆఫీసర్): **11 పోస్టులు**
9. ఆఫీసర్ స్కేల్-2(ట్రెజరీ మేనేజర్): **21 పోస్టులు**
10. ఆఫీసర్ స్కేల్-3: **129 పోస్టులు**

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బ్యాచిలర్స్ డిగ్రీ, సీఏ, ఎంబీఏ ఉత్తీర్ణులై ఉండాలి.

వయోపరిమితి: 2024 జూన్ 1 నాటికి ఆఫీసర్ స్కేల్-1(అసిస్టెంట్ మేనేజర్)18-30 ఏళ్లు; ఆఫీసర్ స్కేల్-2(మేనేజర్) 21-31 ఏళ్లు; ఆఫీసర్ స్కేల్-3(సీనియర్ మేనేజర్) 21-40 ఏళ్లు; ఆఫీస్ అసిస్టెంట్లకు(మల్టీపర్పస్) 18-28 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: పోస్టును అనుసరించి ప్రిలిమ్స్ రాత పరీక్ష, మెయిన్స్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఉంటుంది.

దరఖాస్తు రుసుము: ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగ అభ్యర్థులకు రూ.175; మిగతా వారందరికీ రూ.850.

తెలుగు రాష్ట్రాల్లో ప్రిలిమినరీ పరీక్ష కేంద్రాలు: అనంతపురం, గుంటూరు/విజయవాడ, కాకినాడ, కడప, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమహేంద్రవరం, శ్రీకాకుళం, తిరుపతి, విశాఖపట్నం, విజయనగరం, హైదరాబాద్/ సికింద్రాబాద్, కరీంనగర్.

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: జూన్ 27

ఆన్‌లైన్ ప్రిలిమినరీ పరీక్ష: 2024 ఆగస్టు

ఆన్‌లైన్ మెయిన్స్: 2024 సెప్టెంబరు

వెబ్‌సైట్: www.ibps.in/index.php/rural-bankxiii/

హిందుస్థాన్ ఏరోనాటిక్స్‌లో ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. సీఎంఎం ఇంజనీర్: **4 పోస్టులు**
2. మిడిల్ స్పెషలిస్ట్: **8 పోస్టులు**
3. జూనియర్ స్పెషలిస్ట్: **8 పోస్టులు**

అర్హత: టెక్నాలజీ ఇంజనీరింగ్‌లో డిగ్రీ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: సీఎంఎ ఇంజనీర్ పోస్టుకు రూ.60,000, మిడిల్ స్పెషలిస్ట్‌కు రూ.50,000, జూనియర్ స్పెషలిస్ట్ పోస్టుకు 35 ఏళ్లు మించరాదు.

దరఖాస్తు విధానం: రూ.500. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగ అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక విధానం: షార్ట్‌లిస్ట్, రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూన్ 17

రాత పరీక్ష తేదీ: జూన్ 17

వెబ్‌సైట్: hal-india.co.in/home

ఎన్ఐఎన్‌లో ఖాళీలు

హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్‌కు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్(ఎన్ఐఎన్)... కింద పేర్కొన్న ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

ఖాళీలు: 15

1. లోయర్ డివిజన్ క్లర్క్: **6**
2. అప్పర్ డివిజన్ క్లర్క్: **7**; 3. లైబ్రరీ క్లర్క్: **1**
4. లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్: **1**

అర్హత: పోస్టును అనుసరించి టెన్త్, ఇంటర్మీడియట్, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు టైపింగ్ స్కిల్స్, పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: లోయర్, అప్పర్ డివిజన్ క్లర్క్ పోస్టులకు 27 ఏళ్లు; లైబ్రరీ క్లర్క్ పోస్టుకు 28 ఏళ్లు; లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ పోస్టుకు 30 ఏళ్లు మించకూడదు.

ఎంపిక: కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష ద్వారా

దరఖాస్తు ఫీజు: ఎస్సీ, ఎస్టీ, ఎక్స్ సర్వీస్‌మన్, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు రూ.1000. ఇతరులకు రూ.1200.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జూలై

వెబ్‌సైట్: www.nin.res.in/

కొంకణ్ రైల్వేలో ప్రాజెక్ట్ ఇంజనీర్లు

నవీ ముంబయిలోని కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్... కింద పేర్కొన్న ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

ఖాళీలు: 11

1. సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్: **1**
2. ప్రాజెక్ట్ ఇంజనీర్: **8**, 3. సీఏడీ/డ్రాఫ్ట్స్‌మ్యాన్: **1**
4. అసిస్టెంట్ ఇంజనీర్: **1**

అర్హత: ఐటీఐ/డిప్లొమా, సివిల్ ఇంజనీరింగ్ లేదా తత్సమాన విద్యార్హతతో పాటు పని అనుభవం ఉండాలి.

జీతం: సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్, ప్రాజెక్ట్ ఇంజనీర్ పోస్టులకు నెలకు రూ.44,900, సీఏడీ/డ్రాఫ్ట్స్‌మ్యాన్ పోస్టుకు రూ.35,400, అసిస్టెంట్ ఇంజనీర్ పోస్టుకు రూ.58,100.

ఇంటర్వ్యూ తేదీలు: జూన్ 15, 20, 24, 25, 27

వేదిక: ఎగ్జిక్యూటివ్ క్లబ్, కొంకణ్ రైల్ విహార్, కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్, సీవుడ్స్ రైల్వే స్టేషన్ దగ్గర, సెక్టార్-40, సీవుడ్స్(వెస్ట్), నవీ ముంబయి.

వెబ్‌సైట్: https://konkanrailway.com/

లిటిల్స్



ప్రత్యుపకారం

ఒక అడవిలో చిక్కూ అనే కుందేలు ఉండేది. దనాకా వాళ్ల అమ్మ నీతి కథలు మంచి మంచి విష యాలు చెబుతూ ఉండేది. ఒక రోజు చిక్కూకి వాళ్లమ్మ ఎవరైనా ఆపదలో ఉంటే చేతనైన సాయం చేయాలని, తిరిగి వారు మనకు ఏమీ సాయం చేయలేక పోయినా మనం మాత్రం మన సాయపడే గుణాన్ని వదలకూడదని మన వల్ల సాయం పొందిన వారే కాకుండా ఎక్కడో ఒక చోటనుండి మనకు సహాయం లభిస్తుందని చెప్పింది. తల్లి మాటలు జాగ్రత్తగా విన్న చిక్కూ ఎవరైనా ఇబ్బందిలో ఉంటే చేతనైన సాయం చేసి ఆదుకోవడం మొదలు పెట్టింది. అడవిలో ఒక మేకకు .బ్బు చేసి ఆహారం వెతుక్కునే ఓపిక లేక అలాగే ఉండిపోతే చిక్కూ వెళ్లి ఆ మేకకు విశ్రాంతి తీసుకోమని చెప్పి తన చిన్నారి నోటితో మోయగలిగినంత మేత తీసుకొచ్చి పెట్టి మేకకు సాయం చేసింది. ఒక గుర్రం కాలిలో ముల్లు గుచ్చుకుని నడవలేక పోతుంటే తన పదునైన పళ్లతో దాని కాలిలో నుండి ముల్లును పెకలించివేసింది. ఒక డేగ రెక్కలకు దెబ్బ తగిలి ఎగరలేక పోతుంటే, ఏ మందు వేయాలో వాళ్ల అమ్మను అడిగి తెలుసుకుని, ఆ ఆకు పసరు తెచ్చి పూసి డేగ గాయాన్ని మాన్పింది తర్వాత ఒక రోజు చిక్కూ వెంట ఒక వేట కుక్క పడి తరమడం మొదలు పెట్టింది. చిక్కూ తాను అంత క్రితం ఆదుకున్న మేకను, గుర్రాన్ని పిలిచి సాయం అడిగింది, అవన్నీ మేము పనిలో ఉన్నాము. ఇపుడు నిన్ను కాపాడలేము అన్నాయి. ఈలో గా ఎక్కడినుండో వేట కుక్క కుందేలును తరమడం గమనించిన ఒక పెద్ద గద్ద వేగంగా ఎగురుతూ వచ్చి కుందేలును ఉన్నపళంగా ఎత్తుకుపోయి మరొక చోట దింపేసింది. వెంటనే చిక్కూ వాళ్లమ్మ దగ్గరికి వెళ్లి నువ్వు చెప్పింది నిజం అమ్మా మనం ఎదుటి వారికి చేతనైన సాయం మానకుండా చేస్తూ ఉంటే వారు కాకున్నా ఎవరో ఒకరు మనల్ని ఆదుకుంటారు అని ఇవాళ తెలుసుకున్నాను అని చెప్పింది.


సరైన నీడ ఏది?




10 తేడాలు గుర్తించండి



ఎన్ని రోబోలు ఉన్నాయి



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 327

8		1				5		2
				8		9		
2					1			4
			6				5	
5			8		2			3
	4				9			
6			3					9
		4		7				
1		3				8		6

సుడోకు - 326 సమాధానం

5	1	3	2	6	4	7	9	8
9	8	4	5	1	7	3	6	2
7	2	6	9	8	3	5	1	4
4	9	8	7	2	6	1	3	5
1	5	2	8	3	9	6	4	7
6	3	7	1	4	5	8	2	9
8	6	9	4	7	1	2	5	3
2	4	1	3	5	8	9	7	6
3	7	5	6	9	2	4	8	1

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.